సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 340


శుక్రవారం 2-3-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

గోరంత విషం



కొండంత కష్టం వచ్చినప్పుడు
గోరంత విషం
తీర్చేస్తుందనుకోవడం తప్పు.
కష్టాన్నే గోరంతగా తీసిపడేయాలి.
- ఫ్యామిలీలో

సాక్షి స్పోర్ట్స్
శుక్రవారం 2-3-2018



ముంబై టి20 లీగ్ నుంచి తప్పుకొని...

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ ముంబై టి20 లీగ్ నుంచి తప్పుకున్నాడు. తండ్రి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నాడు. అతుల్ గైక్వాడ్ శిక్షణలో బౌలింగ్ శైలికి తుది మెరుగులు దిద్దుకుంటున్న అర్జున్ టెండూల్కర్ ఇప్పుడప్పుడే పోటీ క్రికెట్‌లో అడుగుపెట్టొద్దని సచిన్ సూచించడంతో ఈ లీగ్ నుంచి తప్పుకున్నాడు. సచిన్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న ఈ లీగ్‌లో ఆరుజట్లు పాల్గొంటాయి. వాంఖెడే వేదికగా ఈ నెల 11 నుంచి 21 వరకు ఈ లీగ్ మ్యాచ్‌లు జరుగనున్నాయి.

పేస్ దళాన్ని పటిష్టం చేయడమే లక్ష్యం

భారత బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్

న్యూఢిల్లీ: భారత సీమర్ల సత్తా పెంచిన బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ ఇప్పుడు రిజర్వ్ బెంచ్ బలగాన్ని పెంచే పనిలో పడ్డారు. వచ్చే ఏడాది ఇంగ్లండ్ ఆతిథ్యమిచ్చే వన్డే ప్రపంచకప్ నాటికి పటిష్ట బౌలింగ్ దళాన్ని అందుబాటులో ఉంచడమే తన లక్ష్యమని అరుణ్ చెప్పారు. ప్రధాన కోచ్ రవిశాస్త్రి, విరాట్ కోహ్లిలు కూడా ప్రత్యామ్నాయాలపైనే దృష్టిపెట్టారని తెలిపారు. ప్రస్తుతం వన్డేల్లో భువనేశ్వర్, బుమ్రాలతో భారత పేస్ విభాగం పటిష్టంగానే ఉందన్నారు. అయితే ఇప్పుడు శ్రీలంకకు వెళ్లనున్న సిరాజ్, శార్దుల్ ఠాకూర్, ఉనాద్కట్‌లకు నిరూపించుకునేందుకు చక్కని అవకాశం లభించిందని భరత్ చెప్పుకొచ్చారు. శార్దుల్ దక్షిణాఫ్రికాలో ఆకట్టుకున్నాడని... ఉమేశ్ యాదవ్, మహ్మద్ షమీలు దేవధర్ ట్రోఫీలో ఆడుతుండటం వాళ్లకు మంచి ప్రాక్టీస్ కాగలదని తెలిపారు. 'ఇప్పుడు సక్సెస్ అయిన వీళ్లందరు బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో మెరుగులు దిద్దుకున్నవారే. తమ బౌలింగ్‌లో లైన్ అండ్ లెంత్‌తో పాటు నిలకడగా రాణిస్తుండటం శుభపరిణామం. ఎంత మెరుగైన ప్రదర్శన చేసినా టెస్టుల్లో తమ బౌలర్లు 20 వికెట్లు తీసినపుడే ఆ కోచ్‌కు పూర్తి సంతృప్తి కలుగుతుంది' అని అరుణ్ అన్నారు. క్రికెట్ బాక్సింగ్ లాగే ఉంటుందని... రింగ్‌లో పంచ్‌లకు, ప్రత్యర్థులకు భయపడితే ఎప్పటికీ ఎదురీదలేమన్నారు. 'క్రికెట్ కూడా బాక్సింగ్‌లాగే! భయాన్ని పక్కనబెట్టి విజయంపైనే దృష్టి పెడితే ముందడుగు వేస్తాం. మా కోచింగ్ బృందం నుంచి కేవలం సూచనలు, సలహాలే వెళతాయి. కానీ బరిలో వాటిని ఆచరించి విజయవంతమవడం ఆ బౌలర్ల చేతిలోనే ఉంటుంది' అని అరుణ్ పేర్కొన్నారు.



పాండ్యా బ్యాటింగ్‌లో మెరుగుపడాలి

కపిల్ దేవ్ సూచన

మొనాకో: ప్రస్తుత టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా బ్యాటింగ్‌లో ఇంకా మెరుగుపడాలని మాజీ ఆల్‌రౌండర్, భారత క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ సూచించారు. 'పాండ్యాలో ప్రతిభ, సామర్థ్యాలకు కొదవలేదు. కొన్ని మ్యాచ్‌ల్లో వాటిని చూపించాడు కూడా. వేరొకరితో పోల్చినపుడు అతడిపై ఒత్తిడి పెరుగుతుందనే మాట నిజమే. దానికి బదులు అతడు సహజ సిద్ధమైన ఆట ఆడితే బాగుంటుంది. బ్యాటింగ్‌పై దృష్టి పెట్టి మరింత మెరుగుపడితే మంచిది. ఆల్‌రౌండర్లు కూడా రెండింటిలో ఏదైనా ఒక విభాగంలో అత్యుత్తమంగా ఉండాల్సిందే ఎందుకంటే నా దృష్టిలో పాండ్యా బ్యాటింగ్ ఆల్‌రౌండర్. నేను అతడిని అలాగే చూడాలనుకుంటున్నా.' అని అన్నారు. పాండ్యా నుంచి ఎక్కువ ఆశిస్తున్నామా అనే ప్రశ్నకు బదులిస్తూ... 'మనం అతడి నుంచి ఎక్కువగా ఆశిస్తున్న మాట వాస్తవమే... కానీ ఆ సామర్థ్యం పాండ్యాలో ఉంది. ప్రస్తుత జట్టులో అతడో ఉత్తమ అథ్లెట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు' అని అన్నారు. మరో వైపు 2019 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు విజయావకాశాల గురించి మాట్లాడుతూ...'కోహ్లి దూకుడు, ధోని ప్రశాంతత కలగలిస్తే మన జట్టుకు మంచి చాన్స్ ఉంటుంది' అని కపిల్ అభిప్రాయపడ్డారు.





వినేశ్ ఫోగట్‌కు రజతం

ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్

(బిష్కెక్) కిర్గిస్తాన్: ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి వినేశ్ ఫోగట్ రజత పతకం సాధించింది. కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం సాధించిన వినేశ్ ఈ మెగా ఈవెంట్‌లో తృటిలో ఆ అవకాశాన్ని కోల్పోయింది. 50 కేజీల విభాగంలో పోటీ పడ్డ వినేశ్ ఫైనల్లో 2–3తో చున్ లీ (చైనా) చేతిలో ఓటమి పాలైంది. బౌట్ ప్రారంభంలో 0–1తో వెనుకబడ్డ వినేశ్ ఆ తర్వాత పుంజుకొని రెండు పాయింట్లు సాధించి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. బౌట్ ముగియడానికి మరి కొన్ని క్షణాల ముందు చున్ లీ 2 కీలక పాయింట్లు సాధించడంతో వినేశ్ ఓటమి ఖాయమైంది. అంతకు ముందు జరిగిన సెమీస్‌లో యూకీ రై (జపాన్)పై వినేశ్ విజయం సాధించింది. మరో భారత రెజ్లర్ సంగీత 59 కేజీల విభాగంలో కాంస్య పతకం చేజిక్కించుకుంది. ఫ్రీ స్టైల్ విభాగంలో సంగీత జీన్ ఉమ్ (కొరియా)పై గెలుపొంది కాంస్యం సొంతం చేసుకుంది. దీంతో ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. అంతకుముందు ఈ క్రీడల్లో భారత్‌కు చెందిన ఇద్దరు పురుష రెజ్లర్లు గ్రీకో–రోమన్ విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. హర్‌ప్రీత్ సింగ్ (82 కేజీలు) 11–3తో ఖాశింబెకోవ్ (ఉజ్బెకిస్తాన్)పై; రాజేంద్ర కుమార్ (55 కేజీలు) 3–3తో మిరాఖ్ మెడోవ్ (ఉజ్బెకిస్తాన్) పై గెలిచి కాంస్యాలు సొంతం చేసుకున్నారు.

భారత్‌ను సెమీస్ చేర్చిన అద్వానీ

దోహా: ఐబీఎస్‌ఎఫ్ ప్రపంచకప్ టీమ్ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు సెమీఫైనల్లోకి ప్రవేశించింది. దీంతో భారత్‌కు కనీసం కాంస్య పతకం ఖాయమైంది. బిలియర్డ్స్, స్నూకర్ ప్రపంచ చాంపియన్ పంకజ్ అద్వానీతో పాటు జాతీయ చాంపియన్ మనన్ చంద్ర గెలుపొందడంతో క్వార్టర్స్‌లో భారత్ 3–0తో చైనాను ఓడించింది. సెమీస్‌లో ఇరాన్‌తో భారత్ తలపడనుంది.



స్మిత్

ఆస్ట్రేలియా 225/5

దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు

డర్బన్: ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య గురువారం ప్రారంభమైన తొలి టెస్టులో మొదటి రోజు ఇరు జట్లు సమంగా నిలిచాయి. ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 76 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. కెప్టెన్ స్టీవ్ స్మిత్ (56), డేవిడ్ వార్నర్ (51) అర్ధసెంచరీలు సాధించగా, షాన్ మార్ష్ (40) ఫర్వాలేదనిపించాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా తక్కువ వ్యవధిలో బెన్‌క్రాఫ్ట్ (5), ఉస్మాన్ ఖాజా (14) వికెట్లు కోల్పోయింది. అయితే మూడో వికెట్‌కు వార్నర్‌తో 56 పరుగులు, నాలుగో వికెట్‌కు మార్ష్‌తో 56 పరుగులు జోడించి స్మిత్ జట్టును ఆదుకున్నాడు. యాషెస్ సిరీస్‌లో చెలరేగిన స్మిత్ అదే ఫామ్‌ను కొనసాగిస్తూ అర్ధ సెంచరీ చేశాడు. ఈ క్రమంలో తాను ఆడిన 20 టెస్టు సిరీస్‌లలో ప్రతీదాంట్లో కనీసం ఒక అర్ధ సెంచరీ అయినా సాధించిన ఆటగాడిగా నిలిచాడు. స్మిత్, మార్ష్‌లను 26 పరుగుల వ్యవధిలో అవుట్ చేసి దక్షిణాఫ్రికా పట్టు బిగించే ప్రయత్నం చేసింది. అయితే మిషెల్ మార్ష్ (32), టిమ్ పైన్ (21) ఆరో వికెట్‌కు అభేద్యంగా 48 పరుగులు జత చేసి ఇన్నింగ్స్ కుప్పకూలిపోకుండా కాపాడారు. ఫిలాండర్, మహరాజ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. వెలుతురు లేమి కారణంగా 17 ఓవర్ల ముందుగానే ఆట ముగిసింది.

ధోని ఉండి ఉంటే...


2003లో ఫలితం భిన్నంగా ఉండేదేమో • కోల్‌కతా టెస్టు చిరస్మరణీయం

గంగూలీ ఆత్మకథలో పలు ఆసక్తికర విశేషాలు



నాయకత్వ లక్షణాలకు నిఖార్సైన నిదర్శనం... జట్టుకు ఏం కావాలో పసిగట్టే ఆలోచనాపరుడు... ప్రతిభావంతులను గుర్తించే నేర్పరి... ప్రయోగాలకు వెరవని నైజం... పంతాన్ని సాధించే పట్టుదల... ఈ విశేషణాల కలబోతే సౌరభ్ గంగూలీ. మ్యాచ్ ఫిక్సింగ్ సంక్షోభంతో కుంగిపోయిన భారత క్రికెట్‌ను ముందుగా తన సమర్థ సారథ్యంతో బయటపడేసి, అనంతరం కుర్రాళ్లకు మార్గ నిర్దేశనతో మనం ఏదైనా సాధించగలం అనే ఆత్మవిశ్వాసం నింపి టీమిండియాకు పునర్ వైభవం తెచ్చాడీ కోల్‌కతా రాకుమారుడు. దేనికీ తొందరగా తలొగ్గని స్వభావి అయిన సౌరభ్... ఒక దశలో క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొన్నాడు. వాటికి ఎదురీది మళ్లీ జట్టులోకి వచ్చాడు. ఆటకు హుందాగా వీడ్కోలు పలికాడు. చాపెల్‌తో అనుభవాలు, తండ్రి సూచనను ఆత్మకథ 'ఎ సెంచరీ ఈజ్ నాట్ ఎనఫ్'లో ఇప్పటికే ప్రస్తావించిన గంగూలీ... అప్పట్లో మహేంద్ర సింగ్ ధోనిపై తన అంచనాలు, కోల్‌కతా ఫ్రాంచైజీ యజమాని షారుక్ ఖాన్ సహచర్యం, పాక్ పేసర్ అక్తర్ తీరు, చరిత్రాత్మక కోల్‌కతా టెస్టు విశేషాలు, కెరీర్ ముగింపు, కెప్టెన్సీ గురించి విపులంగా వివరించాడు. ఆ విశేషాలు అతడి మాటల్లోనే...

ఒత్తిడిని చిత్తుచేయగల, మ్యాచ్ మలుపుతిప్పగల ఆటగాడి కోసం ఎన్నో ఏళ్లు ఎదురుచూశా. అలాంటి తరుణంలో ధోని కనిపించాడు. మొదటి రోజు నుంచే అతడు నన్ను ఆకట్టుకున్నాడు. నిజానికి నా సారథ్యంలో 2003 ప్రపంచకప్ ఆడిన భారత జట్టులో ధోని ఉండుంటే ఆ కథే వేరుగా ఉండేది. ఆ సమయంలో అతను రైల్వే టీసీగా ఉద్యోగం చేస్తున్నాడని తెలిసింది. ఏదేమైనా ఆ తర్వాత నా అంచనాలను అతడు అందుకున్నాడు. 2011 ప్రపంచకప్ ఫైనల్‌కు నేను వ్యాఖ్యాతగా ఉన్నా. భారత్ విజయం సాధించబోయే క్షణంలో నన్ను కామెంటరీ బాక్స్‌లో ఉండమని ప్రసారకర్తలు కోరారు. అయితే నేను మాత్రం 'చూడండి... ఇప్పటివరకు మీరు చెప్పిందంతా చేశా. ఇప్పుడు మాత్రం చేయలేను. నో చాన్స్' అనేశా. మన జట్టు కప్ గెలిచిన అనుభూతి, కుర్రాళ్లు ట్రోఫీని అందుకున్న క్షణాలను ఆస్వాదించేందుకే బౌండరీ లైన్ వద్దకు వచ్చేశా. నా కుర్రాళ్లు భాగంగా ఉన్న ధోని సారథ్యంలోని జట్టు ప్రపంచకప్ గెలవడంతో నేను కూడా విజయంలో భాగమైనట్లు భావించా. నేను 2003లో కోల్పోయిన గెలుపును అక్కడ మళ్లీ పొందినట్లనిపించింది.



షారుక్ ఓ అద్భుతం... అక్తర్ అర్థం కాలేదు...

సినిమా హీరోగా షారుక్ ముందే తెలిసినా బీసీసీఐ అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా 2000లో నేరుగా కలిశా. అతడి చురుకుదనం, ఆకర్షణ శక్తికి ప్రభావితమయ్యా. తర్వాత మా ఇద్దరి మధ్య స్నేహం బలపడింది. 2008లో ఆస్ట్రేలియా పర్యటనలో ఉండగా 'కోల్‌కతా' ఫ్రాంచైజీని షారుక్ కొన్నట్లు, నాకే కెప్టెన్సీ ఇచ్చినట్లు లలిత్ మోదీ ఫోన్ చేసి చెప్పాడు. నా అనుభవంతో అతడికి సాయపడమని కోరాడు. స్వశక్తితో పైకెదిగిన షారుక్ చాలా స్ఫూర్తిదాయకంగా కనిపించాడు. నన్నెపుడూ గౌరవంగా చూశాడు. ముఖ్యంగా అతడు బంగ్లా (మన్నత్)ను కొన్న తీరు... మా జట్టు యజమాని కలలను నిజం చేసుకునేవాడని చాటింది. షారుక్ సాహచర్యంలో ఆటగాళ్లు చాలా స్ఫూర్తి పొందారు. జట్టు యాజమాన్యం వద్దంటున్నా షోయబ్ అక్తర్‌ను తీసుకోమని ఒత్తిడి చేసింది నేనే. దానికతడు కొంత న్యాయం చేశాడు. కానీ... ఉన్నట్టుండి చిన్న గాయం సాకుగా చూపుతూ ఆడనని చెప్పేశాడు. చిన్నవాటిని లెక్కచేయొద్దని ఎంతో చెప్పా. అయినా మైదానంలోకి తీసుకురాలేకపోయా.

కోల్‌కతా టెస్టు గురించి...

ఆస్ట్రేలియా 2001 సిరీస్‌లో మనల్ని ముంబై టెస్టులో ఓడించింది. ఆ రాత్రే నేను కోల్‌కతా వెళ్లిపోయా. పిచ్‌ను ముందే అధ్యయనం చేశా. కానీ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 445 చేస్తే, మేం 171 పరుగులకే అవుటయ్యాం. దీంతో మ్యాచ్, సిరీస్, నా కెప్టెన్సీ అన్నీ పోయినట్లే అనుకున్నాం. ఫాలోఆన్ ఆడే ముందు మా అత్తయ్య కలిసింది. క్రికెట్ తప్ప చాలా మాట్లాడుకున్నాం. చివరకు 'సౌరభ్ నువ్వు ఎలాగైనా ఈ మ్యాచ్ గెలవాలి' అని కోరింది. 'మీ అమ్మకు ఇదంతా ఎందుకు?' అని నా భార్యపై మండిపడ్డా. రెండ్రోజుల తర్వాత చూస్తే మేం టెస్టు క్రికెట్‌లో చరిత్రాత్మక విజయం సాధించాం. ఆ తర్వాతెప్పుడూ 'నా మాటలు మర్చిపో' అని మా అత్తయ్య నాకు చెప్పలేదనుకోండి. మ్యాచ్ అనంతరం మా ఇంటికి వెళ్లాం. అప్పుడామె 'ఇలా జరుగుతుందని రెండ్రోజుల క్రితమే చెప్పా' అంటూ ఆటగాళ్లందరికీ వివరించింది. లక్ష్మణ్, రాహుల్ అభినందనలకు అర్హులు. రెండో ఇన్నింగ్స్‌లో వీవీఎస్‌ను ముందుగా బ్యాటింగ్‌కు పంపడం కఠిన నిర్ణయమే. దీనిపై ద్రవిడ్ నొచ్చుకున్నాడు. అయితే... వీరిద్దరూ 281, 180 పరుగులతో చరిత్ర సృష్టించారు. ఈ సిరీస్ కెప్టెన్‌గా, ఆటగాడిగా నాలో మార్పు తెచ్చింది. భారత క్రికెట్‌ను మార్చిన ఈ విజయం నా సారథ్యంలో గొప్పదైతే, 2003 ప్రపంచకప్ గెలవకపోవడం ఇప్పటికీ బాధించే పెద్ద వైఫల్యం. టాస్ గెలిచి ఫీల్డింగ్ తీసుకోవడం సరైన నిర్ణయంగానే భావిస్తా.

వన్డే కెరీర్ అలా ముగుస్తుందనుకోలేదు...

2007లో వన్డేల్లో 1240 పరుగులు సాధించా. టెస్టుల్లో 1106 పరుగులు చేశా. నా ఆఖరి వన్డే సిరీస్ పాకిస్తాన్‌తో గ్వాలియర్‌లో ముగిసింది. తర్వాత టెస్టుల్లో డబుల్ సెంచరీ, సెంచరీ చేశా. ఇదే ఫామ్ ఆస్ట్రేలియా పర్యటనలో చూపా. కానీ అనూహ్యంగా ముక్కోణపు వన్డే సిరీస్‌కు ఎంపిక చేయలేదు. దీంతో భవిష్యత్తు వన్డే ప్రణాళికల్లో లేనని తెలిసిపోయింది.

'చివరి' కెప్టెన్సీ గురించి...

నా చివరి టెస్టు (2008లో ఆస్ట్రేలియాపై నాగ్‌పూర్)లో మర్యాదపూర్వకంగా కెప్టెన్సీ చేయమని ధోని అడిగాడు. ఆశ్చర్యపోయి... మొదట వద్దన్నా. మళ్లీ కోరడంతో అంగీకరించా. కానీ సరిగ్గా దృష్టిసారించలేకపోయా. మూడు ఓవర్ల తర్వాత 'ఇది నీ బాధ్యత' అంటూ అతడికే అప్పగించేశా. దీనికి ఇద్దరం నవ్వుకున్నాం.




ప్రశాంత కర్మాకర్

మహిళల స్విమ్మింగ్‌ను వీడియో తీసి...

- సస్పెన్షన్‌కు గురైన పారా స్విమ్మర్
- ప్రశాంత కర్మాకర్‌పై మూడేళ్ల నిషేధం

న్యూఢిల్లీ: ప్రశాంత కర్మాకర్...పారా స్విమ్మింగ్‌లో అద్భుతాలు చేసిన భారత ఆటగాడిగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఏకంగా వరుసగా 16 సార్లు జాతీయ చాంపియన్‌గా నిలవడంతో పాటు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించి ఈ ఘనత సాధించిన తొలి భారత స్విమ్మర్‌గా రికార్డు సృష్టించడంతో పాటు కామన్వెల్త్ క్రీడల్లో కూడా కాంస్యం గెలిచాడు. 2016 రియో ఒలింపిక్స్‌లో జట్టుకు కోచ్ కూడా. అలాంటి వ్యక్తి తప్పుడు పనికి పాల్పడ్డాడు. ప్రొఫెషనల్ విలువలు మరచి సహచర మహిళా స్విమ్మర్లు పూల్‌లో ఉండగా వీడియోలు షూట్ చేశాడు. తన సన్నిహితుడితో కూడా మరికొన్ని తీయించాడు. గతేడాది జరిగిన ఈ అనూహ్య ఘటనపై పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా (పీసీఐ) ఇప్పుడు స్పందించింది. మహిళా స్విమ్మర్ల తల్లిదండ్రుల ఫిర్యాదుపై విచారణ జరిపి కర్మాకర్‌పై చర్య తీసుకుంది. అతనిపై మూడేళ్ల నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. జైపూర్‌లో జాతీయ చాంపియన్‌షిప్ సందర్భంగా ఈ ఉదంతం చోటు చేసుకుంది. వీడియో షూట్ చేయడంపై తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయడంపై వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పట్టుబడిన తర్వాత కూడా ప్రశాంత నిస్సిగ్గుగా షూట్ చేయడంలో తప్పేమీ లేదంటూ పీసీఐ అధికారులతో వాదనకు దిగాడు. తాను అర్జున అవార్డీనంటూ, తనను ఎలా ఆపుతారంటూ బుకాయించే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో మహిళా స్విమ్మర్ల తల్లిదండ్రులు రాతపూర్వక ఫిర్యాదు ఇవ్వడంతో వ్యవహారం పోలీసుల వరకు వెళ్లింది. దాంతో 37 ఏళ్ల ప్రశాంతను అదుపులోకి తీసుకున్న పోలీసులు... చివరకు కెమెరాలనుంచి అన్ని వీడియోలను తొలగిస్తానని చెప్పడంతో అతడిని వదిలేశారు. ఈ ఘటనతో కర్మాకర్ ఇన్నేళ్ల పేరు, ప్రతిష్టలతో పాటు పరువును కూడా పోగొట్టుకున్నాడు.

ప్రతి మ్యాచ్ గెలవాల్సిందే!



భారత హాకీ కోచ్ మరీనే

(ఇపో) మలేసియా: ప్రపంచకప్‌లో ప్రతి మ్యాచ్‌లో అత్యుత్తమ ఆటతీరు కనబర్చడమే తమ ముందున్న లక్ష్యమని... ప్రత్యర్థి, పూల్‌లతో సంబంధం లేకుండా ముందుకు సాగడమే ముఖ్యమని భారత హాకీ జట్టు ప్రధాన కోచ్ జోయర్డ్ మరీనే అన్నారు. ఈ ఏడాది చివర్లో భారత్ ఆతిథ్యమిస్తున్న ప్రపంచకప్ హాకీ షెడ్యూల్ విడుదల నేపథ్యంలో కోచ్ మరీనే మాట్లాడుతూ... 'ప్రతి జట్టు గెలవాలనే ఈ మెగా టోర్నీకి వస్తుంది. అందువల్ల మన జట్టుకు సులువైన 'డ్రా' లభించిందా... కఠినమైనదా అనేదానితో సంబంధం లేకుండా ప్రత్యర్థులను గౌరవించాల్సిన అవసరం ఉంది. ఇక్కడ ర్యాంకింగ్స్‌తో పనిలేదు. టైటిల్ నెగ్గాలంటే ఉత్తమ ప్రతిభ కనబర్చాల్సిందే. నిర్లక్ష్యానికి తావివ్వకుండా ఆడాల్సిందే. దాని కోసం ఆటగాళ్లను శారీరకంగా మానసికంగా సిద్ధంగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నాం' అని తెలిపారు.



భారత మహిళల టి20 క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ పంజాబ్ పోలీస్ శాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా గురువారం బాధ్యతలు స్వీకరించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సురేశ్ అరోరా ఆమె యూనిఫామ్‌కు బ్యాడ్జిలను అలంకరించి అభినందనలు తెలిపారు.


‘జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 340

శుక్రవారం 2-3-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఫిబ్రవరిలో కారు జోరు

ప్రముఖ కంపెనీల దేశీ విక్రయాల్లో రెండంకెల వృద్ధి

- బిజినెస్‌లో



ఎస్‌బీఐ వడ్డీ రేట్లు పెంపు

రుణాలపై 0.2 శాతం దాకా పెరుగుదల. తక్షణమే అమల్లోకి

- బిజినెస్‌లో

ప్యాకేజీతో మోసం చేయొద్దు..

హోదా మా హక్కు

నినాదాలతో దద్దరిల్లిన ఆంధ్రావని.. కలెక్టరేట్ల ముట్టడి

ప్రత్యేక హోదా డిమాండ్‌తో కర్నూలులో కలెక్టరేట్ ముట్టడికి భారీ ర్యాలీగా వెళుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు



- **వైఎస్సార్‌సీపీ శ్రేణులకు వామపక్షాల సంఘీభావం**
- **స్వచ్ఛందంగా తరలివచ్చిన విద్యార్థులు, ఉద్యోగార్థులు**
- **పలుచోట్ల ధర్నాలకు పోలీసుల ఆటంకాలు**
- **బైక్ ర్యాలీలతో హోరెత్తించిన యువకులు**



సాక్షి, నెట్‌వర్క్

‘ప్రత్యేకహోదా మా హక్కు’ అని ఆంధ్రప్రదేశ్ ముక్త కంఠంతో నినదించింది. ‘ప్యాకేజీతో మోసం చేయవద్దు’ అని కేంద్ర, రాష్ట్ర పాలకులను హెచ్చరించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఆ పార్టీ యావత్తూ కదిలి గురువారం నాడు రాష్ట్రంలోని కలెక్టరేట్లను ముట్టడించింది. పార్టీ నాయకులు, శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కలెక్టరేట్ల వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక హోదా కోసం ఉద్యమించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పలుచోట్ల సీపీఎం, సీపీఐ, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. అనేక చోట్ల విద్యార్థులు, ఉద్యోగార్థులు స్వచ్ఛందంగా తరలివచ్చి ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ధర్నాకు ముందు అనేక పట్టణాలలో యువకులు బైక్ ర్యాలీలతో హోరెత్తించారు. ఉదయానికల్లా పార్టీ కార్యాలయాల వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న నాయకులు, కార్యకర్తలు అక్కడి నుంచి కలెక్టరేట్ల వద్దకు ప్రదర్శనగా బయలుదేరి వెళ్లారు. ‘ప్రత్యేక హోదా సాధించే వరకు ఈ పోరాటం ఆగదు’ అంటూ నినాదాలు చేసుకుంటూ సాగిన ప్రదర్శనలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. పలుచోట్ల ప్రజలు కూడా ఆ ప్రదర్శనలలో చేరడం, పార్టీకి సంఘీభావం ప్రకటించడం కనిపించింది. ‘నీ కేసుల కోసం మా జీవితాలు ఫణంగా పెడతావా.. చంద్రబాబూ డౌన్‌డౌన్’, ‘ప్రత్యేక విమానాలలో తిరిగే చంద్రబాబూ ప్రత్యేక హోదా వద్దా’, ‘ప్రత్యేక హోదా భిక్ష కాదు మా హక్కు’ అని రాసి ఉన్న ప్లకార్డులతో జరిగిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కలెక్టరేట్ల వద్ద జరిగిన ధర్నా కార్యక్రమాలలో నేతల ప్రసంగాలకు కార్యకర్తల నుంచి మంచి స్పందన లభించింది. ప్రత్యేక హోదా ఆవశ్యకతను, హోదా ఉన్న రాష్ట్రాలలో జరిగిన అభివృద్ధిని, హోదాతో జరిగే ప్రయోజనాలను నాయకులు వివరించారు. నాలుగేళ్లుగా చంద్రబాబు పలు సందర్భాలలో ప్రత్యేక హోదాపై ఎన్నిసార్లు ఎన్ని విధాలుగా మాటమార్చారో వివరించారు. పోలవరం కమీషన్ల

మిగతా 6వ పేజీలో ▶



‘హోదా’ వచ్చే వరకు విశ్రమించేదిలేదు

అదే మన శ్వాస, మన ఊపిరి: వైఎస్ జగన్

2లో

కార్తీకి ఐదు రోజుల కస్టడీ



కార్తీ విదేశాలకెళ్లి అక్కడి అకౌంట్లను క్లోజ్ చేశారు: సీబీఐ

ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో అరెస్టయిన కార్తీ చిదంబరంను ఐదురోజుల సీబీఐ కస్టడీకి ఢిల్లీ కోర్టు అనుమతించింది. కార్తీకి సంబంధించి ఈ కేసుల్లో ఆశ్చర్యకర సాక్ష్యాలున్నాయని, వీటిని రాబట్టేందుకు కస్టడీకి ఇవ్వాలన్న సీబీఐ విజ్ఞప్తి మేరకు మార్చి 6 వరకు కార్తీ కస్టడీని పొడిగిస్తూ ప్రత్యేక కోర్టు జడ్జి సునీల్ రాణా ఆదేశాలిచ్చారు.


13లో



విచారణ లిస్టులో చిదంబరం

13లో

నేటి నుంచి థియేటర్లు బంద్



- సినిమా డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల తీరుకు నిరసనగా ఐదు రాష్ట్రాల్లో శుక్రవారం నుంచి సినిమా థియేటర్లను బంద్ చేస్తున్నట్టు దక్షిణాది సినీ నిర్మాతల మండలి ప్రకటించింది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు (క్యూబ్, యూఎఫ్ఓ సంస్థలు) వర్చువల్ ప్రింట్ ఫీజు (వీపీఎఫ్)ను తగ్గించాలని డిమాండ్ చేసింది.

2లో



నేలరాలిన సాహితీ ‘సుమం’

- ప్రముఖ సాహితీవేత్త నాయని కృష్ణమూర్తి కన్నుమూత
- నేడు చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో అంత్యక్రియలు

3లో

పీజీ వైద్య సీట్లకు ఎంసీఐ నిరాకరణ

- నిరాకరణ జాబితాలో దేశవ్యాప్తంగా 140 కళాశాలలు
- ఏపీలో అనంతపురంతో పాటు పలు ప్రైవేటు కళాశాలలు

2లో

అయ్యో.. ఆమె



రాష్ట్రం నుంచి యథేచ్ఛగా మహిళల అక్రమ రవాణా

- దేశంలో రెండవ స్థానంలో ఆంధ్రప్రదేశ్
- స్పష్టం చేస్తున్న సర్వే సంస్థలు, ఎన్జీవోలు
- గుంటూరు, విజయవాడ కేంద్రాలుగా దందా
- ఇతర రాష్ట్రాల్లో వ్యభిచార కూపాల్లో మగ్గిపోతున్న ఏపీ యువతులు
- కఠిన చర్యలు లేక పేట్రేగిపోతున్న ముఠాలు
- బాధితుల్లో మైనర్లే ఎక్కువని వెల్లడి

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో మహిళల అక్రమ రవాణా ఆందోళనకర స్థాయికి చేరింది. గుంటూరు, విజయవాడ ప్రధాన కేంద్రాలుగా ఈ దందా కొనసాగుతోంది. ప్రేమ పేరుతో వంచనకు గురై, పేదరికంతో బతుకు వెళ్లదీసే పరిస్థితి లేక, విలాసవంతమైన జీవనంపై మోజు... ఇలా పలు కారణాలతో అక్రమ రవాణా ముఠాల కబంధ హస్తాల్లో చిక్కుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గోవాలో పని చేస్తున్న సెక్స్ వర్కర్లలో 85 శాతం, ముంబైలో 38 శాతం మంది

మిగతా 2వ పేజీలో ▶



గురువారం ఢిల్లీలో జరిగిన ఇస్లామిక్ సదస్సులో మౌలానా మహమూద్ మదానీ, ఫతేపురి మసీదు షాహి ఇమామ్ ముఫ్తీ ముకర్రమ్‌లతో ప్రధాని మోదీ

ఖురాన్, కంప్యూటర్ పట్టుకోండి

ముస్లిం యువతకు ప్రధాని మోదీ పిలుపు

13లో

జయేంద్ర సరస్వతి మహాసమాధి

మఠంలోని బృందావనంలో ముగిసిన అంతిమ సంస్కారాలు

- వివరాలు 13లో



గురువారం కాంచీపురంలో జయేంద్ర సరస్వతి పార్థివదేహానికి అభిషేకం చేస్తున్న శిష్య బృందం

ఇదండీ వరస



ఇక్కడ ఏదో పార్టీతో పొత్తు ఖరారు చేసుకోవడమే పని..
ఇంకేం పన్లుంటాయ్! ఫోన్ పెట్టెయ్!!



పేదల భూములే టార్గెట్

20,603.65 ఎకరాల అసైన్డ్ భూములకు సర్కారు ఎసరు

- నాలుగు పారిశ్రామిక నోడ్స్‌కు 61,313.38 ఎకరాలు
- అసైన్డ్, పట్టా, ప్రభుత్వ భూములు సేకరించాలని రాష్ట్ర సర్కారు నిర్ణయం
- త్వరగా సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు
- ఎన్నికల హామీకి పాతరేస్తున్న టీడీపీ ప్రభుత్వం
- బలహీన వర్గాల జీవనోపాధిపై దెబ్బ

సాక్షి, అమరావతి

‘‘పేదలకు చెందిన భూముల స్వాధీనంపై గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలను నిలిపివేస్తాం. పేదలకు ఇచ్చిన భూములను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేసే విధానాన్ని రద్దు చేస్తాం. పరిశ్రమల పేరుతో దళితుల దగ్గర నుంచి స్వాధీనం చేసుకున్న అసైన్డ్ భూముల వివరాలను సేకరిస్తాం. దళితులకు న్యాయం చేస్తాం. భూమి లేని గిరిజన కుటుంబాలకు రెండెకరాల చొప్పున కొనుగోలు చేసి పంపిణీ చేస్తాం’’...

- ఇదీ 2014 ఎన్నికల మేనిఫెస్టోలో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీ.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని తెలుగుదేశం ప్రభుత్వం తుంగలో తొక్కుతోంది. పేదల పొట్టకొట్టి పెద్దల జేబులు నింపడమే లక్ష్యంగా పని చేస్తోంది. పరిశ్రమలు, వాణిజ్య అవసరాల కోసం ప్రధానంగా పేదల భూములపైనే సర్కారు

మిగతా 12వ పేజీలో ▶

‘హోదా’ వచ్చే వరకూ విశ్రమించేది లేదు

అదే మన శ్వాస, మన ఊపిరి
- ధర్నాలను విజయవంతంగా నిర్వహించారు.. అభినందనలు
- పాదయాత్ర శిబిరం నుంచే పర్యవేక్షించిన వైఎస్ జగన్

(ప్రజా సంకల్పయాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే వరకు విశ్రమించేదే లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పునరుద్ఘాటించారు. ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న పోరాటం ముమ్ముందు మరింత ఉధృతం చేయాలని.. అదే మన శ్వాస, మన ఊపిరి అని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. హోదా పోరాటంలో భాగంగా గురువారం అన్ని జిల్లా కేంద్రాలలో ధర్నాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రజా సంకల్ప యాత్రకు విరామం ఇచ్చిన వైఎస్ జగన్.. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గం చీమకుర్తి సమీపంలో బస చేసిన శిబిరం నుంచే ఆందోళన కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆయా జిల్లాల పార్టీ బాధ్యులతో మాట్లాడి ధర్నాలు జరిగిన తీరును తెలుసుకున్నారు. అన్ని జిల్లాలలో ధర్నాలు విజయవంతంగా జరిగాయని పార్టీ నేతలు జగన్‌కు వివరించారు. ధర్నాలు విజయవంతం చేసిన అందరికీ జగన్ అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక హోదా సాధించే వరకు ఇదే స్ఫూర్తిని ప్రదర్శించడంతో పాటు కలిసొచ్చే వారందర్నీ సమీకరించి పోరాటాన్ని ఉధృతం చేయాలని పార్టీ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు.

5న ఢిల్లీలో ధర్నాకు ఏర్పాట్లు

ఇదిలా ఉంటే.. ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తూ ఈనెల 5న దేశ రాజధాని ఢిల్లీలో జరిగే ధర్నాకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. 5వ తేదీన పార్టీ కార్యకర్తలు, నాయకులు ఢిల్లీకి బయలుదేరి వెళ్లేలా సన్నాహాలు చేస్తున్నారు. పార్లమెంటు బయట, లోపల ఆందోళనను ఉధృతం చేసేలా ఆందోళనా కార్యక్రమాలను పార్టీ రూపొందించింది. ఈ ఆందోళనలకు దిగి రాకపోతే ఆఖరి అస్త్రంగా పార్టీ పార్లమెంటు సభ్యులు ఏప్రిల్ 6న తమ సభ్యత్వాలకు రాజీనామా చేస్తారని జగన్ ప్రకటించిన విషయం తెలిసిందే.

వైఎస్ జగన్ హోలీ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: రంగుల పండుగైన హోలీ తెలుగు వారి జీవితాలను రంగులమయంగా, సంతోషకరంగా మార్చాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు గురువారం ఆయన హోలీ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు అంతా మంచి జరగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు హోలీ శుభాకాంక్షలు తెలుపుతూ గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రజాసంకల్ప యాత్ర 101 వ రోజు



నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉదయం 8 గంటలకు చీమకుర్తి నుంచి యాత్ర ప్రారంభం

ముఖ్యాంశాలు: చీమలమర్రి, తొర్రగుడిపాడు క్రాస్, బండ్లమూడి కాలనీ, పల్లామల్లిలో జనంతో మమేకం. మంచికలపాడు, బండ్లమూడి, గాడిపర్తివారిపాలెంలో పార్టీ జెండా ఆవిష్కరణలు.

నేటి నుంచి థియేటర్లు బంద్

వీపీఎఫ్ సంస్థల తీరుకు నిరసనగా 5 రాష్ట్రాల్లో సినిమా ప్రదర్శనల నిలిపివేత: నిర్మాత డి.సురేశ్‌బాబు

సాక్షి, హైదరాబాద్: సినిమా డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల తీరుకు నిరసనగా ఐదు రాష్ట్రాల్లో శుక్రవారం నుంచి సినిమా థియేటర్లను బంద్ చేస్తున్నట్టు దక్షిణాది సినీ నిర్మాతల మండలి ప్రకటించింది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు (క్యూబ్, యూఎఫ్ఓ సంస్థలు) వర్చువల్ ప్రింట్ ఫీజు (వీపీఎఫ్)ను తగ్గించాలని డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమ జేఏసీ చైర్మన్ డి.సురేశ్‌బాబు ఈమేరకు వివరాలను వెల్లడించారు. ఏపీ, తెలంగాణ, తమిళ నాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో శుక్రవారం నుంచి సినిమాల ప్రదర్శనను నిలిపి వేస్తున్నామని ప్రకటించారు. ‘‘డిజిటల్ సర్వీసు ప్రొవైడర్లు (క్యూబ్, యూఎఫ్‌వో సంస్థలు) ఏర్పాటు చేసిన కొన్నాళ్ల తర్వాత వర్చువల్ ప్రింట్ ఫీజు (వీపీఎఫ్)ను పూర్తిగా తీసేయాల్సి ఉంది. అమెరికాలో పూర్తిగా తీసేశారు. కానీ మన దేశంలో ఇప్పటికీ వసూలు చేస్తున్నారు. ఈ ఫీజును పూర్తిగా తీసేయాలి’’ అని సురేశ్ బాబు డిమాండ్ చేశారు. ఆంగ్ల సినిమాలకు వీపీఎఫ్ వసూలు చేయని డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు ప్రాంతీయ చిత్రాలకు ఎందుకు వసూలు చేస్తున్నారన్నారు.

ఏమాత్రం పట్టించుకోవడం లేదు: థియేటర్లలో వాణిజ్య ప్రకటనల నిడివిని 8 నిమిషాలకి తగ్గించాలని సురేశ్‌బాబు డిమాండ్ చేశారు. ఫిల్మ్ చాంబర్ నుంచి పంపిన రెండు సినిమా ట్రైలర్లను తప్పకుండా ప్రదర్శించాలని చెప్పినా సర్వీసు ప్రొవైడర్లు వేయడం లేదన్నారు. మార్కెట్‌లో 90శాతం క్యూబ్, యూఎఫ్ఓల వాటా ఉందని, మిగతా పదిశాతం పీఎక్స్‌డీ, రాక్స్, అల్ట్రా, ప్రావిజ్ వంటి సంస్థల చేతిలో ఉందని తెలిపారు. రేట్లు తగ్గించడం సహా పలు అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రాంతీయ భాషా సినిమా ప్రదర్శనలను శుక్రవారం నుంచి నిలిపివేస్తున్నామని.. హిందీ, ఇంగ్లిష్ సినిమాల వాళ్లతోనూ మాట్లాడుతున్నామని చెప్పారు.

పీజీ వైద్య సీట్లకు ఎంసీఐ నిరాకరణ


- ఏపీలో అనంతపురంతో పాటు పలు ప్రైవేటు కళాశాలలు
- నిరాకరణ జాబితాలో దేశవ్యాప్తంగా 140 కళాశాలలు
- తాజా జాబితా విడుదల చేసిన ఎంసీఐ

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా పీజీ వైద్య సీట్ల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి.. ఇప్పటికే అవి ఉన్న పలు కళాశాలల్లో వాటి కొనసాగింపునకు భారతీయ వైద్య మండలి (ఎంసీఐ) నిరాకరించింది. ఇలా నిరాకరించిన కళాశాలల్లో దేశవ్యాప్తంగా 140 వరకూ ఉన్నాయి. ఇలా ఎంసీఐ నిరాకరించిన వైద్య కళాశాలల జాబితాలో ఏపీ, తెలంగాణల్లో పలు ప్రైవేటు, ప్రభుత్వ వైద్య కళాశాలలున్నాయి. 2018–19 విద్యా సంవత్సరానికి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని తెలిపింది. దీంతో ఇప్పటివరకూ పీజీ వైద్య సీట్లకు నోచుకోని అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలకు మరోసారి చుక్కెదురైంది. అలాగే, తెలంగాణలో నిజామాబాద్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలకూ పీజీ సీట్లు మంజూరుకు ఎంసీఐ అనుమతివ్వలేదు. ఏపీలో పీజీ వైద్య సీట్లు నిరాకరించిన వాటిలో ఎక్కువగా ప్రైవేటు కళాశాలలే ఉన్నాయి. అలాగే, ఇప్పటికే పీజీ సీట్లున్న పలు కళాశాలల్లో ఆయా సీట్లకు తగ్గట్టు మౌలిక వసతులు కల్పించలేదన్న కారణంగా సీట్ల కొనసాగింపునకు అవకాశం ఇవ్వలేదని ఎంసీఐ వర్గాలు తెలిపాయి.

ఏ కళాశాలలో ఏ పీజీ సీట్లు నిరాకరించారంటే..

- నారాయణ మెడికల్ కాలేజీ (నెల్లూరు): ఎండీ డీవీఎల్
- నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (తెలంగాణ): ఎండీ ఇమ్యునో హిమటాలజీ అండ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్
- ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ (గుంటూరు) : ఎండీ రేడియోథెరపీ, ఎంఎస్ ఆర్థోపెడిక్, ఎంఎస్ గైనకాలజీ, ఎండీ రేడియో డయాగ్నిసిస్
- ప్రభుత్వ వైద్య కళాశాల (అనంత): ఎండీ జనరల్ మెడిసిన్, ఎండీ ఆర్థోపెడిక్స్, ఎండీ గైనకాలజీ, ఎండీ పీడియాట్రిక్స్, ఎండీ ఫోరెన్సిక్ మెడిసిన్
- ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విశాఖ): ఎండీ జనరల్ మెడిసిన్, ఎండీ రెస్పిరేటరీ మెడిసిన్, ఎండీ డీవీఎల్, ఎండీ సైకియాట్రీ, ఎండీ పీడియాట్రిక్స్, ఎంఎస్ జనరల్ సర్జరీ, ఎంఎస్ ఆర్థోపెడిక్స్, ఎంఎస్ ఆఫ్తాల్మాలజీ, ఎంఎస్ ఈఎన్‌టీ, ఎంఎస్ గైనకాలజీ, ఎండీ అనస్థీషియాలజీ, ఎండీ రేడియో డయాగ్నిసిస్.
- కోనసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (అమలాపురం) : ఎండీ ఆఫ్తాల్మాలజీ
- ప్రభుత్వ మెడికల్ కాలేజీ (నిజామాబాద్) : ఎండీ ఫోరెన్సిక్ మెడిసిన్, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, అనాటమీ, మైక్రోబయాలజీ, పాథాలజీ, కమ్యూనిటీ మెడిసిన్
- ఉస్మానియా మెడికల్ కాలేజీ (హైదరాబాద్–ప్రభుత్వ) : ఎండీ ఇమ్యునో హిమటాలజీ అండ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్, ఎండీ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఎండీ ఎమర్జెన్సీ మెడిసిన్
- గాంధీ మెడికల్ కాలేజీ (సికింద్రాబాద్–ప్రభుత్వ) : ఎండీ ఇమ్యునో హిమటాలజీ అండ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్
- కామినేని అకాడెమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (హైదరాబాద్) : ఎండీ కమ్యూనిటీ మెడిసిన్

అయ్యో.. ఆమె



▶ మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన వారేనని ఇటీవల ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన సర్వేలో తేలడం ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ సంస్థలు, జాతీయ నేర నమోదు సంస్థ (ఎన్‌సీఆర్‌బీ), ఎన్జీవోలు, రాష్ట్ర పోలీసుశాఖ రికార్డులు మహిళల అక్రమ రవాణాను తేటతెల్లం చేస్తున్నాయి. పలు జిల్లాల నుంచి ముంబై, గోవాలకు మహిళల అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. చట్టాలు, పోలీసు వ్యవస్థ ఈ దారుణానికి ఏమాత్రం అడ్డుకట్ట వేయలేకపోతున్నాయి. మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్)పై కఠిన చర్యలు తీసుకోవాలని, అందుకు కారకులైన ముఠా సభ్యులకు జీవిత ఖైదు విధించాలని తాజాగా కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ‘మానవ అక్రమ రవాణా(నివారణ, పరిరక్షణ, పునరవాసం) బిల్లు–2018’కు ఆమోదముద్ర వేసింది. దీంతో రాష్ట్రంలో అక్రమ రవాణాపై చర్చ జరుగుతోంది.

వేశ్యావాటికల్లో విధివంచితులు

రాష్ట్రంలోని తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు, విశాఖపట్నం, ప్రకాశం, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల నుంచి మహిళల అక్రమ రవాణా అధికంగా జరుగుతోందని పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. రాజధాని ప్రాంతంలోని విజయవాడ, గుంటూరుతోపాటు తిరుపతి, విశాఖపట్నం నగరాలు అతివల తరలింపునకు అడ్డాలుగా మారిపోయాయి. ఇక్కడి నుంచి గోవా, మహారాష్ట్ర, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళలు ఇతర రాష్ట్రాలోని వేశ్యావాటికల్లో మగ్గిపోతున్నారని స్వచ్ఛంద సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జాతీయ మానవ హక్కుల సంఘం ఇటీవల కృష్ణా, తూర్పు గోదావరి, అనంతపురం, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, గుంటూరు జిల్లాల్లో అధ్యయనం చేసింది. హైదరాబాద్ తరహాలో గుంటూరు, విజయవాడ ప్రధాన కేంద్రాలుగా మహిళల అక్రమ రవాణా సాగుతున్నట్టు గుర్తించింది.

ఐరాస నివేదికలో రెండో స్థానం

మహిళల అక్రమ రవాణాపై ఐక్యరాజ్యసమితి, జాతీయ నేర నమోదు సంస్థ(ఎన్‌సీఆర్‌బీ), ప్రత్యేక సర్వే సంస్థల పరిశీలనలో బయటపడుతున్న నిజాలు కలవరపరుస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి కార్యాలయ నివేదిక ప్రకారం.. మహిళల అక్రమ రవాణాలో ప్రపంచంలోని 167 దేశాల్లో భారతదేశం నాలుగో స్థానంలో ఉంది. దేశంలో రెండు కోట్ల మంది సెక్స్‌వర్కర్లు ఉండగా వారిలో 40 లక్షల మంది మాత్రమే స్వచ్ఛందంగా ఈ వృత్తిలోకి వచ్చారని, మిగిలిన 1.60 కోట్ల మందిని బలవంతంగా ఈ రొంపిలోకి దింపినట్లు సర్వేలో తేలింది. దేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, రాజస్థాన్, బిహార్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోని వెనుకబడిన ప్రాంతాల నుంచి మహిళల అక్రమ రవాణా ఎక్కువగా సాగుతున్నట్టు ఐక్యరాజ్యసమితి గుర్తించింది. దేశంలో మహిళల అక్రమ రవాణాలో పశ్చిమబెంగాల్ మొదటి స్థానంలో, ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నట్లు ఐక్యరాజ్యసమితి ఒక నివేదికలో స్పష్టం చేసింది. మానవ అక్రమ రవాణాలో 80 శాతం మంది మహిళలు ఉండగా, వారిలో ఏకంగా 60 శాతం మంది మైనర్లే కావడం గమనార్హం. వారిలో 40 శాతం మంది లైంగిక దోపిడీకి గురవుతున్నారు. ఎన్‌సీఆర్‌బీ నివేదిక–2016 ప్రకారం... భారత్‌లో మహిళల అక్రమ రవాణాలో ఆంధ్రప్రదేశ్ ఏడో స్థానంలో నిలిచింది.

సర్కారు ఉదాసీనతే అక్రమార్కులకు వరం

చట్టాలు ఎంత కఠినంగా ఉన్నప్పటికీ మహిళల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. అక్రమ తరలింపు కేసుల్లో పట్టుబడిన వారంతా చిన్నపాటి శిక్షలు, బెయిల్‌పై బయటకొచ్చి మళ్లీ అదే దందా నిర్వహిస్తున్నారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ప్రత్యేక టీమ్ మరుగున పడింది. హ్యూమన్ ట్రాఫికింగ్‌ను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని నియమించి చేతులు దులుపుకుంది.

బాధితుల్లో బాలికలే ఎక్కువ


రాష్ట్రంలో 2016 కంటే 2017లో మహిళల కిడ్నాప్‌లు 17.98 శాతం పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2016లో 665 మంది, 2017లో 700 మంది కిడ్నాప్‌నకు గురైనట్లు ఏపీ పోలీస్ వార్షిక నివేదిక బహిర్గతం చేసింది. కిడ్నాప్‌నకు గురైన వారిలో 12 నుంచి 18 ఏళ్లలోపు బాలికలే ఎక్కువగా ఉండటం గమనార్హం. 2016లో 239 మంది, 2017లో 271 మంది మహిళలు అక్రమ తరలింపునకు(ట్రాఫికింగ్) గురైనట్లు పోలీసుశాఖ నివేదికలు పేర్కొంటున్నాయి. వాస్తవానికి ఈ సంఖ్య అంతకు పది రెట్లు ఎక్కువగా ఉంటుందనేది బహిరంగ రహస్యమే.

వర్షంలో తడిశాయని చెప్పండి

- హోమియో మందులపై కమిషనర్‌కు నివేదిక ఇప్పించిన అధికారులు
- ‘సాక్షి’ కథనంతో హడావుడిగా పాత తేదీ వేసి సంతకాలు

సాక్షి, అమరావతి: హోమియో మందులను కాలం చెల్లే వరకు మురగపెట్టి.. వాటిని రోడ్డుపాలు చేసిన అధికారులు కొత్త పథక రచన చేశారు. వర్షంలో తడవడం వల్ల మందులు పాడయ్యాయంటూ నివేదిక ఇప్పించారు. 2018 ఫిబ్రవరి 22న ‘హోమియో మందులూ రోడ్డుపాలు’ శీర్షికతో ‘సాక్షి’ ఓ కథనాన్ని ప్రచురించింది. దీంతో ఆ ఘటనకు బాధ్యులైన అధికారులు హడావుడిగా తప్పుడు నివేదిక తయారు చేయించినట్లు తెలిసింది. కడప ప్రభుత్వ హోమియో కళాశాలలోనే మందులను ఎక్కువగా పారవేశారు. దీంతో అక్కడ మెడికల్ ఆఫీసర్లను పిలిపించి వర్షానికి శ్లాబు నుంచి నీళ్లు కారడంతో మందులు తడిశాయని నివేదిక ఇప్పించారు. అది కూడా ‘సాక్షి’లో వార్త ప్రచురితమయ్యే నాటికి వారం ముందు పాత తేదీ వేసి ఆ ఇద్దరితో సంతకాలు కూడా చేయించి ఆయుష్ కమిషనర్‌కు నివేదిక ఇచ్చారు. కాగా, కడప హోమియో కాలేజీ ప్రిన్సిపల్ చెబితే విధిలేని పరిస్థితుల్లో నివేదికపై ఆ ఇద్దరు సంతకాలు చేసినట్టు తెలిసింది. దీనిపై పీజీ విద్యార్థులు స్పందిస్తూ.. ఇక్కడ పరిస్థితులు అస్తవ్యస్థంగా ఉన్నాయన్నారు. ఇదిలాఉండగా, కాకినాడలో ఇప్పటికే కొన్ని హోమియో మందులను ‘ఆయుష్’ కమిషనర్ సీజ్ చేశారు.

తెలుగు ప్రజలకు సీఎం హోలీ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: దుష్టశక్తులకు ఓటమి తప్పదని, చెడుపై అంతిమంగా మంచి గెలుస్తుందన్న సందేశాన్ని ఇచ్చే పండుగ హోలీ అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ఆయన హోలీ, వసంతోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరి జీవితం రంగులమయం కావాలనేదే హోలీ పండుగ ఉద్దేశమన్నారు.

శ్రీదేవికి భారతరత్న ఇవ్వాలి: శారద

కొరుక్కుపేట(చెన్నై): 50 ఏళ్ల పాటు సినీ పరిశ్రమకు చేసిన సేవలకు గుర్తింపుగా దివంగత నటి శ్రీదేవికి భారతరత్న ఇవ్వాలని సీనియర్ నటి ఊర్వశి శారద డిమాండ్ చేశారు. చెన్నైలోని ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) ఆధ్వర్యంలో గురువారం మహానటి శ్రీదేవికి అశ్రు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సంస్మరణ సభలో నటి శారద మాట్లాడుతూ శ్రీదేవితో కలసి పని చేసిన గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. శ్రీదేవిని పప్పి అని ముద్దుగా పిలిచేదాన్ని అని తెలిపారు. శ్రీదేవి తన నాలుగో ఏటే సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి దాదాపు 5 దశాబ్దాల పాటు తనదైన అందం, అభినయంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారని కొనియాడారు. ఆమెకు భారత ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలన్నారు.

జాతీయ స్థాయి ఒలింపియాడ్‌లలో ‘నారాయణ’ విద్యార్థుల హవా

సాక్షి, హైదరాబాద్: జాతీయస్థాయి ప్రతిష్టాత్మక పరీక్షల్లో నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు సత్తా చాటారు. హోమీబాబా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ నిర్వహించిన ఇండియన్ నేషనల్ మ్యాథమేటిక్స్ ఒలింపియాడ్ రెండో దశ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి పాఠశాల స్థాయిలో ఒకే ఒక్కరు ఎంపిక కాగా, ఆ ఒక్కరు(వి.వి.సాయికీర్తన) తమ విద్యార్థి కావడం గర్వకారణమని నారాయణ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డా.పి.సింధూర నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఇండియన్ నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ రెండో దశ ఫలితాల్లో సి.యశ్వంత్‌రెడ్డి, జి.సింధూజ, సీహెచ్ తనూజ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో టాప్ మార్కులు సాధించారన్నారు. ఇండియన్ నేషనల్ అస్ట్రానమీ ఒలింపియాడ్‌లోనూ వి.సాయితేజ, ఎం.ఆదర్శ్‌రెడ్డి అత్యుత్తమ మార్కులు సాధించారని పేర్కొన్నారు. వీరంతా ముంబైలో జరిగే ఓరియంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్‌నకు హాజరవుతారని వివరించారు. జాతీయస్థాయి ఒలింపియాడ్‌లలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునీత్ ప్రత్యేకంగా అభినందించారు.

రేషన్ అక్రమ రవాణా వాస్తవమే!

ఒప్పుకున్న మంత్రి ప్రత్తిపాటి



సాక్షి, గుంటూరు: గుంటూరు జిల్లాలో రేషన్ అక్రమ రవాణా జరుగుతోంది వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అంగీకరించారు. గుంటూరులోని ఓ రేషన్ దుకాణంలో కేజీ కందిపప్పు 40 రూపాయిలకు అందించే కార్యక్రమాన్ని గురువారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అధికారులు తనిఖీలు జరుపుతున్నా జిల్లాలో 10% బియ్యం రీసైక్లింగ్ జరుగుతోందని చెప్పారు. మంత్రి సొంత నియోజకవర్గంతో పాటు, సొంత రెవెన్యూ డివిజన్‌లో భారీ స్థాయిలో రేషన్ అక్రమ రవాణా జరుగుతున్న విషయాన్ని విలేకరులు ప్రశ్నించగా ఆయన నిజమేనని ఒప్పుకున్నారు. కొన్ని రేషన్ షాపుల నిర్వాహకులు వేలిముద్రలు పడటం లేదని, కొందరైతే బియ్యం ఇవ్వకుండా డబ్బులు ఇచ్చి పంపివేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఓబులునాయుడుపాలెం వద్ద తన పేరు చెప్పి కొందరు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని టీడీపీ ఎమ్మెల్యే రావెల కిశోర్‌బాబు తనతో చెప్పారని, అలా చేసేవారెవరిని వదిలేదిలేదన్నారు.

18న ప్రభుత్వ వైద్యుల ఛలో అసెంబ్లీ

లబ్బీపేట (విజయవాడతూర్పు): సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ వైద్యులు ఆందోళన బాట పట్టనున్నారు. అందులో భాగంగా ఈ నెల 5వ తేదీ నుంచి దశల వారీగా నిరసనలు తెలుపుతూ 18న ఛలో అసెంబ్లీకి పిలుపిచ్చినట్లు ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎన్.భరత్‌రావు, డాక్టర్ పిడకాల శ్యామ్‌సుందర్‌లు తెలిపారు. గురువారం విజయవాడలో అసోసియేషన్ సమావేశమైంది. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల పదోన్నతుల్లో సీనియారిటీతో నిమిత్తం లేకుండా పాలకులు వారికి కావాల్సిన వారికి కట్టబెడుతున్న తీరును నిరసిస్తున్నట్లు తెలిపారు.

పోలవరం సందర్శనకు ఎస్టీ కమిషన్ సభ్యులు

ఈ నెల 25,26 తేదీల్లో పర్యటన

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు ఈ నెల 25, 26 తేదీల్లో పోలవరం ప్రాంతంలో పర్యటించనున్నారు. గిరిజన ప్రాంతాల్లో భూసేకరణ, పరిహారం, పునరావాస చర్యలను పరిశీలించనున్నారు. పునరావాస చర్యలపై ఏపీ రిహాబిలిటేషన్ కమిషనర్ రేఖా రాణి గురువారం ఎస్టీ కమిషన్ సభ్యులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఎస్టీ కమిషన్ నిర్ణయించింది.

ఏపీలో గ్రేహౌండ్స్ యూనిట్

రాష్ట్రంలో గ్రేహౌండ్స్ యూనిట్ ఏర్పాటుకు కేంద్ర హోంశాఖ ఆమోదం తెలిపిందని ఏపీ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. రూ.219 కోట్లతో దీన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. విభజన చట్టంలోని హామీ మేరకు యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సాహితీ 'సుమం' నేలరాలింది

- ప్రముఖ సాహితీవేత్త నాయని కృష్ణమూర్తి కన్నుమూత
- అనారోగ్యంతో చికిత్స పొందుతూ బెంగళూరులో మృతి
- పలు కథలు, నవలలు, ఆధ్యాత్మిక గ్రంథాలు రచించిన నాయని
- మాబడి, పాఠశాల మాసపత్రికల ద్వారా విద్యార్థులకు తోడ్పాటు
- 'సుమం ప్రతిసుమం సుమం' పాట ద్వారా సినీ ప్రేక్షకుల మనసు గెల్చుకున్న కృష్ణమూర్తి
- నేడు చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో అంత్యక్రియలు



చౌడేపల్లె(చిత్తూరు): ప్రముఖ కవి,సాహితీవేత్త, విజయవాణి ప్రింటర్స్, విజయవాణి విద్యా సంస్థల అధినేత నాయని కృష్ణమూర్తి (67) మరణించారు. గత కొన్ని రోజులుగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న ఆయన బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు.చిత్తూరు జిల్లా నడిమిచెర్లలో 1951లో కృష్ణమూర్తి జన్మించారు. బాల్యం నుంచే సాహిత్యంపై ఆసక్తి పెంచుకున్న నాయని తన 23 ఏళ్ల వయసులో యామినీ కుంతలాలు అనే నవల రాశారు. ఈ నవలకు 1974 ఉగాది నవలల పోటీలో తృతీయ బహుమతి లభించింది. అనంతరం కొంతకాలం బొమ్మరిల్లు, విజయ,నీలిమ పత్రికలకు ఉపసంపాదకులుగా పనిచేశారు. పిల్లల పత్రిక స్నేహబాలను నడిపించారు. సోదరులతో కలిసి మాబడి, పాఠశాల మాసపత్రికలను నిర్వహించారు. తద్వారా గ్రామీణప్రాంత విద్యార్థుల విద్యాభ్యాసానికి తోడ్పడ్డారు. సాక్షరతా సమితి అకడమిక్ కమిటీ చైర్మన్ పదుహేను సంవత్సరాలు పనిచేశారు. నిరంతర విద్యాకేంద్రాలకు వెలుగుబాట వారపత్రికను అందించారు. నాయని మరణవార్త తెలిసిన వెంటనే స్థానికులు, రచయితలు, కవులు, పలువురు నేతలు కన్నీటిపర్యంతమయ్యారు. కృష్ణమూర్తి పార్థివదేహానికి శుక్రవారం మధ్యాహ్నం 12:30కి చౌడేపల్లిలోని విజయవాణి స్కూల్ ఆవరణలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

నాయని రచనలు..

ఏం లేదు, యామినీ కుంతలాలు, మనసు గుర్రంరోరి మనిషి, ప్రలోభం తదితర కథలు, వియోగవిభావరి, మాయామృగం తదితర నవలలు నాయనికి ఎంతో పేరు తెచ్చాయి. ఈకోతి డ్రామాకు పనికొస్తుందా అనే నాటిక అందరినీ అలరించింది. సినీ గీత రచయితగా మహర్షి సినిమా కోసం రాసిన 'సుమం ప్రతిసుమం సుమం' అనేపాట ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. బహుబాషా నిఘంటువుల తయారీ, సచిత్ర నిఘంటువుల ముద్రణ, నూటొక్క కథల రూపకల్పన, వ్యావహారిక భాషలో మహాభారతం, వాల్మీకి రామాయణం, బమ్మెరపోతన భాగవతాలు ఆయన సాహిత్య ప్రతిభకు నిదర్శనాలు.

సీఎం సంతాపం

నాయని కృష్ణమూర్తి మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. మా బడి, పాఠశాల తదితర మాస పత్రికలు నిర్వహించి విద్యార్థులకు కృష్ణమూర్తి మార్గదర్శిగా నిలిచారని ఆయన కొనియాడారు.

అమిత్‌షాతో టీడీపీ నేతల భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సమక్షంలో గురువారం టీడీపీ నేతలు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాను కలిశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలోని హామీలపై చర్చించారు. 15 నిమిషాలు జరిగిన భేటీలో ఎంపీ రామ్మోహన్ నాయుడు, ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ కుటుంబరావు పాల్గొన్నారు. 5 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండడం, పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై అమరావతిలో టీడీపీపీ సమావేశం నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.

చినరాజప్ప కుమారుని పెళ్లి వేడుకలో సీఎం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప కుమారుడు రంగనాథ్, వధువు సృజన వివాహ వేడుకకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ జేఎన్‌టీయుకే క్రీడా మైదానంలో గురువారం రాత్రి 8.30 గంటలకు జరిగిన ఈ వేడుకలో మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నారా లోకేష్‌తోపాటు పలువురు మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.



రంగనాథ్ దంపతులను ఆశీర్వదిస్తున్న సీఎం చంద్రబాబు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'నేను శక్తి' వేడుకలు

'నేను శక్తి'. స్త్రీలు తరతరాల అంతరాలను దాటుకుని, తమలో దాగున్న అనంత శక్తిని యావత్ ప్రపంచానికి చాటాలన్న సమున్నత లక్ష్యంతో రూపుదిద్దుకున్న కార్యక్రమం. అసమానతల్ని అధిగమించి ఇంటా బయటా, సమాజ ప్రగతికి సంబంధించిన ప్రతి మలుపులోనూ తనదైన ముద్రవేసిన మహిళా మణులెందరినో మనసారా స్మరించుకునే ఘట్టం. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా స్త్రీ, పురుష సమానత్వాన్ని కాంక్షిస్తూ, సిసలైన మహిళాభ్యున్నతి భావనను 'సాక్షి' సొంతం చేసుకున్న అపురూప సందర్భం. స్త్రీలు ఆజన్మాంతం ఎదుర్కొంటున్న సవాళ్ళను సవివరంగా చర్చించి, పరిష్కార మార్గాలను అన్వేషించి, మహిళా సాధికారతను మనస్ఫూర్తిగా కాంక్షిస్తూ సాగింది 'సాక్షి'. ఈ క్రతువులో నెల రోజుల పాటు అందించిన, అందిస్తున్న కథనాలు, కథలు, వాస్తవికతలను పాఠకలోకం ఆప్యాయంగా అక్కున చేర్చుకుంది. నిండు మనసుతో సొంతం చేసుకుంది. సమానత్వ సాధనకు 'సాక్షి' చేపట్టిన లింగ వివక్ష వ్యతిరేకోద్యమంలో అశేష పాఠకులు ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. స్త్రీ, పురుషుల మధ్య అసమానతలను నిలదీస్తూ, వారి మధ్య సమానత్వ సాధన దిశగా 'సాక్షి' వేసిన ఈ ముందడుగును మేధావులు, కవులు, రచయిత్రులు, ప్రజాస్వామికవాదులెందరో హృదయపూర్వకంగా అభినందించారు.

'నేను శక్తి' ప్రచారోద్యమంలో మొదట లింగ వివక్ష, గృహ హింస, లైంగిక వేధింపులు, సాధికారత... ఈ నాలుగు అంశాలపై 'సాక్షి' విస్తృతంగా చర్చించింది. తమ అమ్మాయిలను వివక్షను ఎదిరించి నిలిచే ధీరలుగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులను 'సూపర్ పేరెంట్స్'గా సత్కరించుకునేందుకు, సంబంధిత కథనాలతో కూడిన 10 నిమిషాల నిడివి గల 'షార్ట్ ఫిల్మ్'లను ఆహ్వానించింది. ఇందుకు పాఠక లోకం నుంచి విశేష స్పందన లభించింది. అందిన ఎంట్రీల్లోంచి అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేసి, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'నేను శక్తి' ముగింపు వేడుకల్లో సముచితంగా సత్కరించాలని భావిస్తున్నాం. ఈ నెల 7న హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు జరిగే 'నేను శక్తి' అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి మీ అందరికీ ఇదే సాదర ఆహ్వానం. వేడుకల్లో పాల్గొనేందుకు 95055 55020కు ఫోన్ చేసి పేరు నమోదు చేయించుకోగలరు.

ఢిల్లీలో 'హోదా' గర్జనకు వైఎస్సార్‌సీపీ సిద్ధం

- ప్రత్యేక హోదా సాధన కోసం 5న దేశ రాజధానిలో ధర్నా
- హోదాపై చంద్రబాబు తన వైఖరి స్పష్టం చేయాలన్న వైఎస్సార్‌సీపీ నేత పార్థసారథి
- టీడీపీ ఎంపీలతో రాజీనామా చేయించే దమ్ముందా? అని సవాల్

విజయవాడ సిటీ: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం దేశ రాజధాని ఢిల్లీలో గర్జించేందుకు వైఎస్సార్‌సీపీ సర్వసన్నద్ధమైంది. ఈనెల 5న ఢిల్లీలో నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనేందుకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం రాత్రి 9.30కు విజయవాడ నుంచి ప్రత్యేక రైలులో ఢిల్లీ తరలివెళ్లబోతున్నారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. గురువారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హోదా సాధనలో భాగంగా వైఎస్సార్‌సీపీ గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట తలపెట్టిన ధర్నా కార్యక్రమాలు విజయవంతమయ్యాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాగ్రహాన్ని చూసి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని సీఎం చంద్రబాబుకు పార్థసారథి సూచించారు. చంద్రబాబు తన 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని కేవలం రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికే ఉపయోగించారని ఎద్దేవా చేశారు. కేసుల నుంచి తప్పించుకునేందుకు రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం వద్ద తాకట్టు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రత్యేక హోదా సాధించేందుకు పోరాటం చేస్తారో? లేక పారిపోతారో



స్పష్టం చేయాలని చంద్రబాబును ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక హోదా కోసం రాజీనామా చేసే దమ్ము చంద్రబాబుకు ఉందా అని సవాల్ విసిరారు. టీడీపీ ఎంపీలతో రాజీనామా చేయించి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధమేనా అని చంద్రబాబును ఆయన నిలదీశారు. చంద్రబాబు జీవితమంతా కుట్రలు, మోసాలే ఉన్నాయని పార్థసారథి ఎద్దేవా చేశారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు చెప్పగానే.. ప్రజలకు ఇప్పటికీ అనేక సంక్షేమ పథకాలు గుర్తుకు వస్తాయన్నారు. ఆ విధంగా చంద్రబాబు ఒక్కమంచి పనైనా చేశారా? అని ఆయన ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా వైఎస్సార్‌లా ప్రజలకు మేలు చేస్తారని చెప్పారు..

వైఎస్సార్‌సీపీది అలుపెరగని పోరు..

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సంజీవని లాంటిదని.. హోదా ఉంటేనే రాష్ట్రానికి నిధులొస్తాయని.. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అలుపెరగని ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర భవిష్యత్ కోసం వైఎస్సార్‌సీపీ చిత్తశుద్ధితో పోరాటం చేస్తోందన్నారు. హోదా సాధన కోసం మా ఎంపీలతో రాజీనామా చేయించేందుకు, కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కూడా వైఎస్ జగన్ సిద్ధమైన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. గత నాలుగేళ్లుగా వామపక్షాలు, ఇతర ప్రజా సంఘాలతో కలసి వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుంటే.. ఉద్యమాన్ని అణచివేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గురువారం నిర్వహించిన ఆందోళన కార్యక్రమానికి ముందే అనుమతి తీసుకున్నా కూడా.. పామర్రు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కైలే అనిల్‌కుమార్‌ను నిర్బంధించేందుకు పోలీసులు యత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అనేక చోట్ల పోలీసులు ఇదే వైఖరిని అవలంభించారని మండిపడ్డారు. ఒక పక్క చంద్రబాబు ప్రత్యేక హోదా కావాలని మాట్లాడుతూ.. మరో వైపు ఉద్యమాన్ని నీరు గార్చే యత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రత్యేక హోదాను అడ్డుకునేందుకు చంద్రబాబు డ్రామాలు ఆడుతున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని.. తగిన సమయంలో చంద్రబాబుకు బుద్ధి చెబుతారన్నారు.

వైఎస్సార్‌సీపీ ఢిల్లీ ధర్నాకు ప్రత్యేక రైలు

నేడు విజయవాడ నుంచి బయలుదేరనున్న రైలు

సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదా సాధన కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమంలో పాల్గొనే నాయకులు, కార్యకర్తల కోసం విజయవాడ నుండి ఢిల్లీకి ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా పార్టీ అధ్యక్షులు, శాసన సభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, ఇతర ముఖ్య నాయకులు శుక్రవారం (2వ తేదీ) సాయంత్రం 7 గంటలకు విజయవాడ రైల్వే స్టేషన్‌కు చేరుకోవాలన్నారు. రైలు రాత్రి 10 గంటలకు బయలు దేరుతుందని తెలిపారు. 5వ తేదీ ధర్నా కార్యక్రమం ముగిసిన తర్వాత రాత్రి 9 గంటలకు ఢిల్లీ నుండి రైలు తిరిగి బయలుదేరి 7వ తేదీ ఉదయం విజయవాడకు చేరుకుంటుందన్నారు. ధర్నా కార్యక్రమంలో పాల్గొనే పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం ఢిల్లీలో వసతి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

పెన్షనర్లకు డీఏ పెంపు

సాక్షి, అమరావతి: పెన్షనర్లకు గతేడాది జనవరి 1వ తేదీ నుంచి జూన్ వరకు సంబంధించి డీఏను పెంచుతూ ఆర్థిక శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మూల పెన్షన్‌పై 22.008 శాతం నుంచి 24.104 శాతం మేరకు డీఏను పెంచారు. గతేడాది జనవరి నుంచి రావాల్సిన డీఏ బకాయిలను మార్చి నెల పెన్షనతో కలిపి ఏప్రిల్ 1వ తేదీన చెల్లించనున్నట్లు ఆర్థిక శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఆర్టీసీలో ఎన్నికల వేడి

- రేపటితో ముగియనున్న ఎన్ఎంయూ గుర్తింపు హోదా
- వెంటనే ఎన్నికలు జరపాలని కార్మికశాఖకు ఈయూ డిమాండ్

సాక్షి, అమరావతి: ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల వేడి మొదలైంది. గుర్తింపు హోదా సాధించేందుకు అన్ని యూనియన్లు వ్యూహ, ప్రతివ్యూహాల్లో నిమగ్నమయ్యాయి. రెండేళ్లకోసారి నిర్వహించే గుర్తింపు సంఘం ఎన్నికల్లో గతంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) విజయం సాధించింది. ఎన్ఎంయూ గుర్తింపు ఈ నెల 3వ తేదీతో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) నేతలు గురువారం కార్మిక శాఖ కమిషనర్ డి.వరప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో 128 డిపోలు, జోనల్ వర్క్‌షాపుల్లో 50 వేల మంది సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఈ ఎన్నికల్లో గెలుపొందిన యూనియన్‌కు ఆర్టీసీ యాజమాన్యం తీసుకునే విధానపరమైన నిర్ణయాల్లో భాగస్వామ్యంతో పాటు ఆర్టీసీ బోర్డులో సభ్యత్వం కూడా కల్పిస్తారు. కార్మిక శాఖ కమిషనర్‌ను కలసిన అనంతరం ఈయూ నేతలు పద్మాకర్, దామోదరరావు మీడియాతో మాట్లాడుతూ.. ఎన్ఎంయూ గుర్తింపు సమయం ముగుస్తున్నందున ఎన్నికలు జరపాలని కోరామన్నారు. ఎన్ఎంయూ నేతలు కార్మికులకు ఎలాంటి న్యాయం చేయలేకపోయారని విమర్శించారు. వేతన సవరణ గడువు దాటి ఏడాది అవుతున్నా.. ఇంతవరకు పే కమిషన్ వేయించలేకపోయారని ఎద్దేవా చేశారు. ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా గేట్ మీటింగ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరోవైపు గుర్తింపు సంఘం ఎన్ఎంయూ శుక్రవారం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించబోతోంది. ఎన్నికలకు కార్మికులను సిద్ధం చేసేలా కార్యాచరణ రూపొందించనున్నట్లు ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య తెలిపారు. కార్మికుల నుంచి వైద్య సేవలకు రుసుం వసూలు చేస్తున్న యాజమాన్యం.. ఆర్టీసీ ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, దొడ్డిదారిన ఈయూ నేతలకు ఆస్పత్రి కమిటీలో భాగస్వామ్యం కల్పించిందని విమర్శించారు.

గ్రామీణ పశువైద్య కేంద్రాలను ఆధునీకరించాలి

వెటర్నరీ విద్యార్థుల ఆందోళన



తిరుపతి వెటర్నరీ యూనివర్శిటీలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

యూనివర్శిటీ క్యాంపస్(తిరుపతి): గ్రామీణ ప్రాంతాల్లోని పశువైద్య కేంద్రాలను ఆధునీకరించి, పశు వైద్యశాలలుగా మార్చాలని కోరుతూ వెటర్నరీ విద్యార్థులు గురువారం ఆందోళన చేపట్టారు. కృష్ణాజిల్లా గన్నవరం, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు, చిత్తూరు జిల్లా తిరుపతిలోని వెటర్నరీ కళాశాల విద్యార్థులు కాలేజీ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమాలు ప్రభుత్వం హామీ ఇచ్చే వరకు కొనసాగుతాయని విద్యార్థులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వివేకానందరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

సాక్షి
శుక్రవారం, మార్చి, 2

కార్తీ కేసు సందడి!

ఐఎన్ఎక్స్ మీడియా సంస్థకు విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎఫ్ఐపీబీ) నుంచి అనుమతులు ఇప్పించడం కోసం లంచం తీసుకున్నారన్న ఆరోపణపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరాన్ని బుధవారం సీబీఐ అరెస్టు చేసింది. కార్తీని 5 రోజులపాటు సీబీఐ కస్టడీకి అప్పగిస్తూ గురువారం ప్రత్యేక న్యాయస్థానం ఉత్తర్వులిచ్చింది. అధికారంలో ఉండగా రాజకీయ ప్రత్యర్థులపై కక్ష తీర్చుకునేందుకు సీబీఐని ఉపయోగించుకున్నదని ఆరోపణలు ఎదుర్కొన్న కాంగ్రెస్ ఇప్పుడు ఈ కేసు విషయంలో అదే ఆరోపణ చేస్తున్నది. దానిలోని నిజానిజాలు సంగతలా ఉంచి బ్రిటన్ నుంచి వచ్చిన కార్తీని చెన్నై విమానాశ్రయంలో అరెస్టు చేసినప్పుడు చోటుచేసుకున్న హడావుడి మాత్రం అంతా ఇంతా కాదు. ఆ హడావుడి చూస్తే పంజాబ్ నేషనల్ బ్యాంకుకు వేల కోట్లు ఎగ్గొట్టి పరారైన నీరవ్‌మోదీ తరహాలో వేరే దేశానికి కార్తీ పరారవుతున్నాడేమో, దాన్ని నివారించడానికి సీబీఐ వలపన్ని అరెస్టు చేయాలని చూస్తున్నదేమోనన్న అనుమానం కలుగుతుంది. కానీ ఆయన మరో దేశం నుంచి ఇక్కడ అడుగుపెట్టాడు.

ఈ కేసులో నిరుడు మే నెలలో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. ఈ వ్యవహారం యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2007 నాటిది. ఆ సమయంలో చిదంబరం కేంద్ర ఆర్థికమంత్రిగా ఉన్నారు. ఐఎన్ఎక్స్ మీడియా ఆ సంవత్సరం మార్చి 13న ఎఫ్ఐపీబీని ఆశ్రయించగా, రూ. 4.62 కోట్ల మేర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) తెచ్చుకునేందుకు ఆ ఏడాది మే 30న దానికి అనుమతి లభించింది. అయితే అదే సమయంలో తమ అనుబంధ సంస్థ ఐఎన్ఎక్స్ న్యూస్ సంస్థలో పెట్టుబడులు పెట్టేందుకు అనుమతించాలన్న ఆ సంస్థ వినతిని మాత్రం తిరస్కరించింది. అందుకు వేరే దరఖాస్తు చేసుకోవాలని చెప్పింది. ఐఎన్ఎక్స్ మీడియా ఎఫ్ఐపీబీ తనకు విధించిన పరిమితుల్ని ఉల్లంఘించి రూ. 4.62 కోట్లకు బదులు రూ. 305 కోట్ల ఎఫ్‌డీఐలను తీసుకు రావడమేగాక అందులో 26 శాతాన్ని ఐఎన్ఎక్స్ న్యూస్‌కు మళ్లించింది. ఈ వ్యవహారంపై ఎఫ్ఐపీబీ ఐఎన్ఎక్స్ మీడియా నుంచి వివరణ కోరినప్పుడు కార్తీ చిదంబరం జోక్యం చేసుకుని ఆ మండలిలోని కొందరిని ప్రభావితం చేశారన్నది సీబీఐ ఆరోపణ. ఇలా ప్రభావితం చేసినందుకు ఆయన పరోక్షంగా నియంత్రిస్తున్న అడ్వాంటేజ్ స్ట్రాటజిక్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఐఎన్ఎక్స్ మీడియా నుంచి రూ. 10 లక్షలు ముట్టాయని సీబీఐ చెబుతోంది. ఆదాయపు పన్ను విభాగం దర్యాప్తు నుంచి తప్పించేందుకు కార్తీకి మరో మూడున్నర కోట్ల రూపాయలు, భారీయెత్తున షేర్లు అందాయన్నది మరో ఆరోపణ. ఇందుకు సంబంధించిన అనేక ఆధారాలు కార్తీ సీఏ భాస్కరరామన్ కంప్యూటర్లో లభించాయని సీబీఐ అంటోంది. కుమార్తె షీనాబోరాను హత్య చేసిన కేసులో విచారణనెదుర్కొంటున్న దంపతులు ఇంద్రాణి ముఖర్జీ, పీటర్ ముఖర్జీలిద్దరూ కలిసి స్థాపించిన సంస్థ ఐఎన్ఎక్స్ మీడియా.

సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)లు రెండూ ఇప్పటికే ఈ కేసులో కార్తీ చిదంబరం ఇళ్లు, కార్యాలయాలపై దాడులు చేసి సోదాలు నిర్వహించాయి. ఆయనను ఈడీ అనేకసార్లు ప్రశ్నించింది. వివరణకు విదేశాలకు వెళ్లే వీలు లేకుండా లుకౌట్ నోటీసు కూడా జారీ చేసింది. నేరుగా కార్తీ సంస్థకు అందిన రూ. 10 లక్షలు కాక ఇతర ముడుపులు విదేశాల్లో ఆయన పేరున్న ఖాతాల్లోకి చేరాయని ఈడీ ఆరోపించింది. తన కుమార్తెను ఉన్నత చదువుల్లో చేర్పించడం బ్రిటన్ వెళ్లడానికి అవరోధంగా ఉన్న లుకౌట్ నోటీసుకు వ్యతిరేకంగా కార్తీ గత నవంబర్‌లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే అలా వెళ్లనిస్తే విదేశీ ఖాతాలన్నిటినీ ఆయన మాయం చేసే ప్రమాదమున్నదని సీబీఐ వాదించింది. చివరకు న్యాయస్థానం అనుమతితో కార్తీ వెళ్లి వచ్చారు. ఆయన వెళ్లాక బయటపడిన మరిన్ని ఆధారాలతో ప్రస్తుతం కార్తీని అరెస్టు చేయాల్సివచ్చిందని సీబీఐ చెబుతోంది. ఈ కేసు పరిధిని మరింత విస్తృతపరిచి చిదంబరాన్ని అరెస్టు చేస్తారా అన్నది కీలకమైన ప్రశ్న. కేంద్ర ఆర్థికమంత్రి హోదాలో ఎఫ్ఐపీబీకి చిదంబరం ఇన్‌చార్జి. తాము కేంద్ర ఆర్థిక శాఖ కార్యాలయంలో చిదంబరాన్ని కలిసినప్పుడు కార్తీ వ్యాపారానికి సహకరించమని ఆయన తమను కోరారని పీటర్ ముఖర్జీ, ఇంద్రాణి ముఖర్జీ మేజిస్ట్రేట్ ముందు ఇచ్చిన వాంగ్మూలంలో చెప్పారు. ఈ కేసు మాత్రమే కాదు...చిదంబరంపై భారత్‌కు చెందిన ఎయిర్‌సెల్‌ను 2006లో మలేసియా సంస్థ మాక్సిస్ టేకోవర్ చేయడానికి ఎఫ్ఐపీబీ అనుమతి మంజూరు చేసిన వ్యవహారం కూడా ఉంది. ఆ సమయంలో టెలికమ్యూనికేషన్స్ రంగంలో గరిష్టంగా 74శాతం ఎఫ్‌డీఐలకు మాత్రమే అనుమతి ఉండగా మాక్సిస్ 99.9శాతం వరకూ పెట్టింది. పైగా నిబంధనల ప్రకారం ఎఫ్ఐపీబీ సిఫార్సులు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ సంఘం(సీసీఈఏ)కు వెళ్లి అక్కడ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా ఆ ఫైలు అటు పోకుండానే చిదంబరం అనుమతులు మంజూరు చేశారన్నది ఆరోపణ. ఐఎన్ఎక్స్ మీడియాలోగానీ, ఎయిర్‌సెల్-మాక్సిస్ వ్యవహారంలోగానీ పరిమితులకు మించి ఎఫ్‌డీఐలకు అనుమతించడం అనుమానాలను తావిస్తున్నదని బీజేపీ నాయకుడు సుబ్రహ్మణ్యస్వామి గతంలో ఆరోపించారు. ఎయిర్‌సెల్ కేసును 'అన్ని కోణాల్లోనూ' దర్యాప్తు చేస్తున్నట్టు నిరుడు ఏప్రిల్‌లో సుప్రీంకోర్టుకు సీబీఐ తెలిపింది.

అయితే నిరుడు డిసెంబర్‌లో 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణం కేసులో కేంద్ర మాజీ మంత్రి రాజాతోసహా నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ సీబీఐ ప్రత్యేకకోర్టు ఇచ్చిన తీర్పును గుర్తుకు తెచ్చుకోవాలి. నిందితుల అపరాధాన్ని రుజువు చేయడానికి తగిన సాక్ష్యాలను సేకరించడంలో, నిరూపించడంలో సీబీఐ ఘోరంగా విఫలమైందని వ్యాఖ్యానించింది. ప్రస్తుతం కార్తీ కేసులో లభించాయంటున్న ఆధారాలు న్యాయస్థానాల్లో నిలబడేవిధంగా సీబీఐ దర్యాప్తు చేస్తుందా అన్నదే కీలకమైన ప్రశ్న. కార్తీ అరెస్టుకు చేసిన హడావుడి వల్ల కాంగ్రెస్‌కు రాజకీయంగా ఎంత నష్టం కలుగుతుందోగానీ...సరిగా నిరూపించలేకపోతే అప్రదిష్టపాలయ్యేది సీబీఐ మాత్రమే.



ప్రభుత్వ వ్యవస్థలు తమ అధికారాన్ని ఎలా వినియోగిస్తున్నాయన్నదే.. అవి సక్రమంగా పనిచేస్తున్నదీ లేనిదీ తెలుసుకోవడానికి గీటురాయి.

–వలెరీ పామ్
సీఐఏ కోవర్ట్ అధికారిణి

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబినామ సంవత్సరం ఉత్తరాయణం, శిశిర ఋతువు
ఫాల్గుణ మాసం తిథి పౌర్ణమి ఉ.6.33 వరకు తదుపరి బ.పాడ్యమి తె.5.05 వరకు(తెల్లవారితే శనివారం)నక్షత్రం పుబ్బ రా.11.03 వరకు తదుపరి ఉత్తర వర్జ్యం ఉ.7.40 నుంచి 9.12 వరకు దుర్ముహూర్తం ఉ.8.40 నుంచి 9.27 వరకుతదుపరి ప.12.34 నుంచి 1.21 వరకుఅమృతఘడియలు సా.4.55 నుంచి 6.23 వరకు

సూర్యోదయం : 6.22
సూర్యాస్తమయం : 6.02
రాహుకాలం : ఉ 10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

నమాజ్ వేళలు

ఫజర్	5.22	మగ్రీబ్	6.23
జొహర్	12.28	ఇషా	7.35
అసర్	4.44		

ఇలాంటి చదువులు మారాలి



యోగేంద్ర యాదవ్

మన రుగ్మత పట్ల, మన ఇక్కట్లు, సమస్యల పట్ల విశ్వవిద్యాలయాలు స్పందించాలి. మన అవరోధాలను గమనిస్తూనే మన సమస్యలను పరిష్కరించడానికి అవి ఉపకరించాలి. మన విద్యా ప్రావీణ్యాన్ని విదేశీ సంస్థలు అంచనా వేయడం కాదు. దానికి ఆ సంస్థలు కితాబులు ఇవ్వడం కాదు. మన సామాజిక అవసరాల పట్ల, ప్రజలు ఉన్న పరిస్థితులకు ఎలా స్పందించాయి అన్న అంశమే ఆ పరిశోధనలకు గీటురాయి కావాలి. మనవైన పద్ధతులను అవగతం చేసుకోవడానికి ఆ పరిశోధనలు ఎలా సహకరిస్తున్నాయన్నదే ప్రమాణం కావాలి.

విద్యను భారతీయం చేయడమనే విషయం గురించి నాలుగేళ్లలో మనం చాలా చర్చలు జరిపాం. కానీ బధిరుల సంభాషణ మాదిరిగా ఒకరి మాటతో ఒకరికి సంబంధం లేని విధంగా ఆ చర్చలు సాగాయి. ప్రభుత్వంలో ఉన్నవాళ్లలో ఎవరో ఒకరు విద్యను భారతీయం చేయడం గురించే అడపాదడపా ఏదో ఒక ప్రతిపాదన ముందుకు తెస్తూ ఉంటారు. ఆ ప్రతిపాదన తెలిసీ తెలియని వారు చేసినట్టు, తెలివితక్కువగా ఇంకా చెప్పాలంటే వినాశకరంగా కూడా ఉంటుంది. అలాంటి ప్రతిపాదనలను విద్యావేత్తలు, మేధావులు, విధాన రూపకర్తలు సహజంగానే అవహేళన చేస్తూ ఉంటారు. దీనితో ప్రభుత్వం ఏవో పైపై మెరుగులు దిద్ది ఊరుకుంటుంది. అక్కడితో ఆ సంగతి అంతా మరచిపోతారు కూడా. ఆఖరికి విమర్శకులు కూడా అలా మరచిపోయినవారిలో ఉంటారు. చివరికి తేలేదేమిటంటే ఎలాంటి అర్థవంతమైన చర్చకు చోటు ఉండదు.

పడిపోతున్న ప్రమాణాలు

విద్యావంతుడని చెప్పే ఒక వ్యక్తిని కలుసుకుంటే చాలు, విద్యను భారతీయం చేయడం గురించి చర్చించడం ఎంత అవసరమో మనం వెంటనే గ్రహించగలుగుతాం. దేశంలో ఉత్తమ విశ్వవిద్యాలయాలని పేర్గాంచిన వాటి నుంచి బయటకు వచ్చిన ఏ ఒక్క గ్రాడ్యుయేట్ అయినా కూడా ఏ భారతీయ భాషనూ చదవలేడు. ఆ భాషలో రాయలేడు. మన భాషలలో వచ్చిన అపార ఆధునిక సాహిత్యం గురించి వారికి చాలా తక్కువ మాత్రమే తెలుసు. ఇంగ్లిష్ కాకుండా, భారతీయ భాషలలో ఒక పుస్తకం చదవడం, లేదా ఒక వ్యాసం రాయడం ఆఖరిసారిగా ఎప్పుడు జరిగిందని బాగా పేరున్న ఓ మేధావిని అడగండి! అటు నుంచి వచ్చే సమాధానం చాలా ఇబ్బంది పెట్టేదిగా ఉంటుంది. సంస్కృత భాషకు చెందిన ప్రముఖ అధ్యయన కేంద్రాలన్నీ భారతదేశానికి వెలుపలే ఉన్నాయి. ఒక్క భాషల విషయమే కాదు. విద్యావంతుడైన ఆధునిక భారతీయుడు మన పురాణాల మీద చాలా తక్కువ పరిజ్ఞానం మాత్రమే కలిగి ఉంటున్నాడు. ఆయుర్వేదం, యునానీ వైద్య విధానాలు నిరర్థకమని తర్ఫీదు పొందిన ఒక అల్లోపతి వైద్యుడు భావిస్తూ ఉంటాడు. రంగుల అద్దకంలో, నేత కళలో మనకున్న ఘనత గురించి వస్త్ర పరిశ్రమకు చెందిన ఇంజనీర్‌కు కూడా పరిజ్ఞానం ఉండదు. మంచి విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలని మనమంతా చెప్పుకుంటున్న చోట బోధిస్తున్న పాఠ్య ప్రణాళిక ఏది? అదంతా కొన్నేళ్ల క్రితం అమెరికా, యూరప్‌లో ఉపయోగించి వదిలేసిన పనికిమాలిన పాఠాల అనుకరణే. సాంస్కృతికంగా ఉండవలసిన ఆత్మవిశ్వాసం లోపిస్తున్నది. మన విద్యా విధానం సాంస్కృతిక నిరక్షరాస్యులను తయారుచేస్తున్నది. వారి సొంత గడ్డ మీద వారే అపరిచితులు.

కాబట్టి అసలైన చర్చ మనం నిజంగా వాంఛించవలసినది విద్యను భారతీయం చేయడం అనే అంశం గురించి కాదు. మన విద్యా విధానాన్ని ఎలా భారతీయం చేయడం అనేదే అసలు చర్చనీయాంశం కావాలి. కానీ సమస్య ఏమిటంటే, విద్యను భారతీయం చేయాలంటూ ఊరూవాడా ఏకం చేస్తున్నవారు ఎవరూ కూడా ఆ అంశం గురించి మాట్లాడడానికి కనీసం అర్హత ఉన్నవారు కాదు. అటు విద్య గురించి, ఇటు భారతీయ సంస్కృతి గురించి మాట్లాడడానికి కూడా వారు అర్హత ఉన్నవారు కారు. ఇంకా, బోధన విషయంలో వారు మరీ నిరక్షరాస్యులు. మన సంస్కృతి, మేధోపరమైన మన సంప్రదాయాల గురించి కూడా వారికి పైపైన మాత్రమే అవగాహన ఉంది. విద్యను ఎలా భారతీయం చేయకూడదో వారిని చూసి నేర్చుకోవచ్చు. నిజానికి విద్యను భారతీయం చేయడమంటే అర్థం, భారతీయమైనదని చెప్పుకునే ప్రతి అంశాన్ని ఆకాశానికి ఎత్తడం మాత్రం కాదన్నది సుస్పష్టం. భారతీయం అంటే సాధారణంగా భావించే సంప్రదాయాల గురించి, మరీ ముఖ్యంగా గ్రంథస్థమైనదీ, బ్రాహ్మణవాద సంప్రదాయాన్ని చెప్పేదీ మాత్రమే కాకూడదు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చి చేరిన జ్ఞానం గురించి పట్టించుకోకుండా మనకి మనం దూరంగా ఉండిపోవడం కాదు. మన సంప్రదాయంలో ఒక శాఖలా ఉన్న శ్రుత పాండిత్యంతోనే అంతా చెప్పడమూ కాకూడదు.



మన భాషల పట్ల శ్రద్ధ అవసరం

విద్యను భారతీయం చేయడమనే ఎజెండా పట్ల దీక్షతో ఉంటే అందులో మొదట ఉండవలసినది– ప్రాంతీయ భాషల పట్ల శ్రద్ధ. అలా అని ప్రపంచ స్థాయి అవకాశాలకు దగ్గర చేసే ఇంగ్లిష్ భాష నుంచి పిల్లలను దూరం చేయనక్కరలేదు. కానీ మన చిన్నారులకు ఇంగ్లిష్ మాధ్యమంతో విషయాన్ని బోధించే పద్ధతి మాత్రం అశాస్త్రీయం, అవాంఛనీయం. మాతృభాషలో బోధన జరగడమనే మంచి సూత్రాన్నీ, బహు భాషలు నేర్చుకునే అవకాశం కల్పించే త్రిభాషా బోధన సూత్రాన్నీ పునరుద్ధరించాలి. దీనితో పాటు సంస్కృతం, తమిళం, పర్షియన్ వంటి పురాతన హోదా కలిగిన భాషల బోధనకీ, నేర్చుకోవడానికీ జాతీయ స్థాయిలో ప్రాధాన్యం కల్పించాలి. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాలను మన భాషలలోకి అనువదించుకునే కృషిలో మనం వెనకబడిపోకూడదు. ప్రతి భారతీయుడు ఒక భారతీయ భాషలో అనర్గళంగా మాట్లాడేటట్టు, తడబాటు లేకుండా రాయగలిగేటట్టు చేయగలగాలి.

భారతీయ మేధా సంప్రదాయాలను వివరించగలిగే సామర్థ్యాన్ని సాధించుకోవడం కూడా విద్యను భారతీయం చేయడమనే ప్రక్రియలో తప్పనిసరిగా ఉండాలి. దేశంలోని ప్రతి విద్యార్థి అన్ని ప్రాంతాలకూ అన్ని మతాలకూ చెందిన పురాతన గ్రంథాల నుంచి ఎంతో కొంత నేర్చుకోవాలి. గణతంత్ర భారతానికి పునాదిగా ఉన్న గడచిన రెండు శతాబ్దాల నాటి భారతీయ చింతనను కూడా అధ్యయనం చేయాలి. ఈ సాంస్కృతిక, సాహిత్య అంశాలే కాకుండా, ప్రతి శాఖకు చెందిన పరిజ్ఞానం ద్వారా మన మౌఖిక, గ్రాంథిక సంప్రదాయాల నుంచి మనం ఏమి గ్రహించామో ఎవరికి వారు తెలుసుకునేటట్టు ఉండాలి. అంటే తరగతి గదిలో చెప్పే పాఠాలకే పరిమితం కాకుండా, క్షేత్ర స్థాయిలో అనుభవజ్ఞుల ద్వారా కూడా వాస్తవిక అంశాలను తెలుసుకోవడమే దీని వెనుక ఉన్న పరమార్థం. ఇంజనీర్లు కుమ్మరులతో మాటామంతీ జరపాలి. శిల్పులు, బావులూ చెరువులూ తవ్వేవారు, చేనేత పనివారిని కూడా ఇంజనీర్లు కలుసుకోవాలి. ఔషధి గుణాలు కలిగిన మొక్కలను సేకరించేవారితో వైద్యులు ముచ్చటించాలి. సంప్రదాయకంగా ఉండే రోగ నివారణ పద్ధతులను గురించి తెలుసుకోవాలి. దేశవాళీ విత్తనాలను సేకరించేవారి, దేశీయమైన విధానాలను ఆవిష్కరించేవారి అనుభవాల నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు పాఠాలు నేర్చుకోవాలి.

దేశీయమైన ఆలోచనలకు ప్రాధాన్యం

వీటన్నిటితో పాటు విజ్ఞాన కేంద్రాలలో భారతీయమైన వాతావరణాన్ని నెలకొల్పడం కూడా విద్యను భారతీయం చేయడంలో భాగమవుతుంది. ఈ ఆఖరి సందర్భంలో విషయం భాష కాదు. మన ప్రశ్నలకు సమాధానాలను వెతకడం కోసం మనం ఉపయోగిస్తున్న వనరులు కూడా విషయం కాదు. ఇక్కడ విషయం ఏమిటంటే, ఎలాంటి ప్రశ్నలను మనం అడగాలి? ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఎవరి గురించిన ప్రశ్నలు అడగాలి? ఇప్పుడు మన జ్ఞానకేంద్రాలలో పెద్ద సమస్య ఒకటి ఉంది. అది– ఎవరివో అవసరాలకు స్పందిస్తూ, వేరే ఎవరివో ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం. మన మేధాశక్తి అంతా ఇలాగే కాలం గడుపుతోంది. ఇలాంటి ధోరణిని పూర్తిగా మార్చివేయడం కూడా విద్యను భారతీయం చేయడమనే ప్రక్రియలో ప్రధానంగా ఉండాలి.

పరిశోధన, నేర్చుకోవడం, బోధనాంశాల ఎజెండా మార్పులో కూడా ఆ ధోరణి అనివార్యమవుతుంది.ఒక సాధారణ భారతీయుడి అవసరాలు తీర్చడం ఎలాగో నిర్వచించడం గురించే వైద్య, వ్యవసాయ, ఇంజనీరింగ్, లేదా ఐటీ రంగాలలోని సరికొత్త పరిశోధనలన్నీ వాటి ధ్యేయంగా ఎంచుకోవాలి. సామాజిక శాస్త్రాలు, హ్యూమానిటీస్ రంగంలో జరిగే పరిశోధన వర్తమానానికి తగినట్టు ఉండాలి. అమెరికా, యూరప్ దేశాల పరిశోధనల నిబంధనలలో కూరుకుపోకుండా చరిత్రాత్మకమైన మన పరిశోధన పంథాను అర్థవంతం చేయాలి. మన రుగ్మత పట్ల, మన ఇక్కట్ల పట్ల, మన సమస్యల పట్ల విశ్వవిద్యాలయాలు స్పందించాలి. మన అవరోధాలను గమనిస్తూనే మన సమస్యలను పరిష్కరించడానికి అవి ఉపకరించాలి. మన విద్యా ప్రావీణ్యాన్ని విదేశీ సంస్థలు అంచనా వేయడం కాదు. దానికి ఆ సంస్థలు కితాబులు ఇవ్వడం కాదు. మన సామాజిక అవసరాల పట్ల, ప్రజలు ఉన్న పరిస్థితులకు ఎలా స్పందించాయి అన్న అంశమే ఆ పరిశోధనలకు గీటురాయి కావాలి. మనవైన పద్ధతులను అవగతం చేసుకోవడానికి ఆ పరిశోధనలు ఎలా సహకరిస్తున్నాయన్నదే ప్రమాణం కావాలి.

ఇలాంటి వాదన చాలామంది ఆధునిక, బాగా చదువుకున్న భారతీయుల మనసులను అశాంతికి గురి చేయవచ్చు. ఒక విషయాన్ని మాత్రం మనం గుర్తుంచుకోవలసిందే. ఆధునికత అంటే ఎవరినో అనుకరించడం కాదు. ఎవరున్న సంకట స్థితి నుంచి వారిని తప్పించడానికి కొత్త పరిష్కారాలను అన్వేషించడమే ఆధునికత అంటే. విశ్వవ్యాప్తం కావడం గురించిన తృష్ణ రూపురేఖలు లేని స్థితి నుంచి ఆరంభం కాదు. దీనితో అందరూ ఏకీభవించకపోవచ్చు. అయినా కానీ విద్యను భారతీయం చేయడం గురించి మనం లోతైన చర్చను లేవదీయలేమా?

–వ్యాసకర్త స్వరాజ్ అభియాన్, జైకిసాన్ సంస్థల్లో సభ్యులు
మొబైల్ : 98688 88986

పీఎఫ్ సమాచారం వ్యక్తిగతమా?

కార్మికుల జీతంనుంచి కోత విధించి దాన్ని వారి పీఎఫ్ ఖాతాలో వేయకపోవడం పెద్ద అవినీతి. అలాంటి యాజమాన్యాలపైన చర్యతీసుకోకుండా కార్మికులకు నష్టం కలిగించే అధికారులపైన చట్టపరమైన చర్య తీసుకోవలసి ఉంటుంది.

విశ్లేషణ



మాడభూషి శ్రీధర్



ప్రయివేటు రంగంలో, కాంట్రాక్టు లేదా ఔట్ సోర్సింగ్ వర్కర్లకు ఒకే ఒక సంక్షేమ ప్రయోజనం భవిష్యనిధి. వేతనంలో 12శాతం భవిష్యనిధికి కార్మికుడి వాటాను చెల్లింపు సమయంలోనే తీసి, భవిష్యనిధి ఖాతాకు జమచేయాలి. యాజమాన్యం వారి వాటాను కూడా కలిపి కార్మికుడి ఖాతాలో వేయాలి. భవిష్యత్తులో కార్మికుడి ఆరోగ్య సంక్షేమాలకు ఆ డబ్బునుంచి సాయం లభిస్తుంది. చాలామంది కార్మికులు పీఎఫ్ వాటాను చెల్లించినా యాజమాన్యాలు వారి ఖాతాలో వాటిని జమ చేయడం లేదు. వారిపైన చర్యతీసుకోవలసిన పీఎఫ్ శాఖ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తారు. వారికి జవాబుదారీ ఎవరు? సమాచార హక్కు చట్టం వల్ల కార్మికులకి, వారి నాయకులకు, సంఘాలకు మరొక చేయూత దొరికింది. మా వాటా డబ్బు చెల్లించారా? యాజమాన్యం వాటా కలిపారా? చెల్లించని యాజమాన్యంపై ఏ చర్యతీసుకున్నారు? ఏ చర్యా తీసుకోని అధికారుల బాధ్యత ఏమిటి అని ఆర్టీఐ కింద అడుగుతున్నారు. కానీ ఇవ్వడం కుదరదని ప్రజాసమాచార అధికారులు నిరాకరిస్తున్నారు.

వేతనం నుంచి పీఎఫ్ వాటాను తీసి అతని ఖాతాలో జమచేశారా లేదా, యాజమాన్యం వాటా చెల్లించారా అని జనార్దన్ పాటిల్ ఆర్టీఐ దరఖాస్తు ద్వారా కోరారు. ఈ సమాచారం ఇస్తే ఏం నష్టం? ఇవ్వకపోతే తమకు వచ్చే లాభం ఏమిటి? అని ఎవరూ ఆలోచించడం లేదు అధికారులు. మూడో వ్యక్తి సమాచారం అనీ వ్యక్తిగత సమాచారం అనీ నిరాకరించారు. మొదటి అప్పీలు అధికారి కూడా ఆ నిరాకరణను సమర్థించారు. ఈ సమాచారం ఇవ్వవలసిందే అని ఈపీఎఫ్ఓను కమిషన్ ఆదేశించింది. సమాచారం ఇవ్వనందుకు గరిష్ట జరిమానా ఎందుకు విధించకూడదో తెలియజేయాలని ప్రజాసమాచార అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆర్టీఐ దరఖాస్తు వేసినప్పుడు తాను సీపీఐఓను కాదని, ప్రస్తుత సీపీఐఓ ఏసీ పగారే వివరణ ఇచ్చారు. అప్పటి అధికారితోపాటు, సమాచారం ఇవ్వని ఇప్పటి సీపీఐఓ కూడా అందుకు బాధ్యత వహించాలని ఇద్దరికీ కమిషన్ జరిమానా నోటీసులు జారీ చేసింది. సీఐసీ ఆదేశించిన తరువాత సమాచారం ఇచ్చామని, కనుక తనపై జరిమానా విధించరాదని ప్రస్తుత అధికారి పగారే వివరణ ఇచ్చారు. 2016 ఫిబ్రవరి 2న వచ్చిన దరఖాస్తును వెంటనే ఫిబ్రవరి 23న సంబంధిత శాఖకు పంపానని, దానికి సమాధానం ఆ అధికారే ఇవ్వాల్సి ఉందని ఆ నిర్ణయం సరైనదే అని మొదటి అప్పీలు అధికారి కూడా ఒప్పుకున్నారని, తనకు సమాచారం ఇవ్వకూడదనే దురుద్దేశం లేనేలేదని అప్పటి సీపీఐఓ జగదీష్ టాంబే వివరణ ఇచ్చారు. కార్మికుడి భవిష్యనిధి అతనికే ప్రత్యేకించిన వ్యక్తిగత సమాచారం కనుక ఇవ్వరాదని ఆయన వివరించారు. రికార్డులు పరిశీలిస్తే తేలిందేమంటే మొత్తం 15 నెలల తరువాత కార్మికుడికి చెందిన పీఎఫ్ సమాచారం ఇచ్చారు. అందాకా సమాచారం ఇవ్వకుండా వేధించారు. ఆ తరువాత కూడా రెండు అంశాలకు సంబంధించిన సమాచారం ఇవ్వలేదని దరఖాస్తుదారుడు వివరించారు. ఇవ్వకుండా వదిలేసిన సమాచారాన్ని కూడా ఇవ్వాలని కమిషన్ మళ్లీ ఆదేశించింది.

కార్మికుల వేతన సమాచారం వ్యక్తిగత సమాచారం కాదు. ఎందుకంటే అందరు కార్మికులకు ఒక లెక్క ప్రకారం, వేతన బోర్డు నిర్ణయం ప్రకారం ఒక స్కేలు పద్ధతిన వేతనం ఇస్తారు. అది అందరికీ తెలిసిన సమాచారమే. అందులో 12 శాతం భాగాన్ని భవిష్యనిధికి కార్మికుడి వాటాగా కేటాయించాలని. అంతే సొమ్మును యాజమాన్యం వాటాగా చెల్లించాలని చట్టం ఆదేశించింది. వేతనం వలెనే వేతనంలో భాగమైన పీఎఫ్ సొమ్ము వ్యక్తిగత రహస్యం అయ్యే అవకాశమే లేదు. పీఎఫ్ ఖాతాలో కార్మికుడి వాటా, యాజమాన్యం వాటా తప్ప మరేదీ ఉండదు. అందులో కార్మికుడు ఎక్కువ సొమ్ము జమచేయడం గాని మరో విధంగా ఖర్చుచేయడం గానీ జరగదు. అటువంటప్పుడు పీఎఫ్ ఖాతాను బ్యాంకు ఖాతాతోనూ లేదా ఆదాయపు పన్ను చెల్లింపు వివరాలతోనూ పోల్చి సమాచారాన్ని నిరాకరించడం సమంజసం కాదు.

పీఎఫ్ వాటా చెల్లింపులు చేసినా అతని ఖాతాలో ఆ డబ్బును తన వాటాతో కలిపి యాజమాన్యం జమ చేయకపోతే, అది చట్టవిరుద్ధమైన పని అవుతుంది. దానివెనుక మోసం ఉంటుంది. కార్మికుడికి ద్రోహం జరుగుతుంది. అతని జీతంనుంచి కోత విధించి అతని ఖాతాలో వేయకపోవడం పెద్ద అవినీతి కూడా అవుతుంది. ఈ పనిచేసిన యాజమాన్యాలపైన చర్యతీసుకునే అధికారం పీఎఫ్ అధికారులకు ఉంది. ఆ అధికారాన్ని వినియోగించకుండా కార్మికులకు నష్టం కలిగించే అధికారులపైన చట్టపరమైన చర్యతీసుకోవలసి ఉంటుంది. ఇవన్నీ తప్పించుకోవడానికి అధికారులు పీఎఫ్ సమాచారాన్ని వ్యక్తిగత సమాచారం అంటూ ఇవ్వకుండా దాస్తున్నారు. ఇందుకు సమాచార అధికారిపై కమిషన్ 25 వేల రూపాయల జరిమానా విధించింది. (నాగరాజ్ జనార్దన్ వర్సెస్ ఈపీఎఫ్ఓ నంబరు CIC/ EPFOG/ A /2016/294053, కేసులో 20.2.2018 నాడు కమిషన్ ఇచ్చిన తీర్పు ఆధారంగా)

–వ్యాసకర్త కేంద్ర సమాచార కమిషనర్
professorsridhar@gmail.com

ఈశాన్యంలో కమలం హవా

ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ ఎదుగుదలతో కమ్యూనిస్టు, కాంగ్రెస్ పార్టీలకు కునుకు పట్టడం లేదంటే అందుకు కారణం బీజేపీ వ్యూహకర్త రాం మాధవ్ మాయాజాలమే. ఆయన ఈశాన్యంలో అరుదైన విజయాలను పార్టీకి కట్టబెట్టనున్నారు.

సందర్భం



పురిఘళ్ల రఘురాం

మూడు ఈశాన్య రాష్ట్రాల్లో ముగిసిన ఎన్నికల్లో ఫలితాలు బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని ముందస్తు సర్వేలు చెబుతున్నాయి. గత ఎన్నికల్లో త్రిపురలో కేవలం 1.54 శాతం ఓట్లు మాత్రమే సాధించిన బీజేపీ అయిదేళ్ల వ్యవధిలో అక్కడ కమ్యూనిస్టు కంచుకోటను బద్దలు చేసే స్థాయిలో ఎదిగిందని అంచనాలు చెబుతున్నాయి. దీనికి ప్రధాని నరేంద్రమోదీ, అమిత్ షా ద్వయం సుడిగాలి పర్యటనలు, ప్రజలకు కలిగించిన విశ్వాసం ఒక కారణం కాగా, బీజేపీ సిద్ధాంతకర్త రాం మాధవ్ వ్యూహపరంగా పన్నిన మాయాజాలం మరో ముఖ్య కారణం.

నరేంద్రమోదీ–అమిత్ షా ద్వయం ఏ విషయాన్నీ తేలిగ్గా తీసుకోరు. ఆ మాటకొస్తే ఉప ఎన్నికైనా, మునిసిపల్ ఎన్నికలైనా, రాష్ట్ర ఎన్నికలైనా, ఏదైనా సరే.. చాలా సీరియస్‌గా పనిచేయడం వీరిద్దరికీ అలవాటు. అంతే సీరియస్‌గా ఫలితాలు కూడా ఉంటాయి. ప్రస్తుతం దేశంలో 4 రాష్ట్రాలు ఎన్నికలకు సిద్ధమయ్యాయి. కర్ణాటక, మేఘాలయలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉండగా త్రిపుర కమ్యూనిస్టుల కంచుకోటగా ఉంటోంది. అలాగే నాగాలాండ్ ఒకప్పటి కాంగ్రెస్ రాజ్యం. ఫిబ్రవరి నెలలో మూడు ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిశాయి. ఈ మూడు రాష్ట్రాల్లో ఎన్నికలను బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. బీజేపీ మాత్రం తన సిద్ధాంతకర్త రాం మాధవ్‌ను ఇక్కడ మోహరించింది. ఇప్పటికీ తన మాయాజాలంతో, తన పదునైన వ్యూహాలతో అస్సాం, మణిపూర్‌లలో పార్టీని గెలిపించిన రాం మాధవ్ ఇప్పుడు ఇతర రాష్ట్రాలైన త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్‌లపై తన దృష్టిని కేంద్రీకరించారు. కమ్యూనిస్టులు కూడా వాళ్ల కంచుకోట అయిన త్రిపురను నిలబెట్టుకోవాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ఇతర రాష్ట్రాలకు చెందిన కమ్యూనిస్టులు కూడా త్రిపురలో పనిచేస్తున్నారు. కాంగ్రెస్ కూడా తమ నాయకులను ఎన్నికలకు సిద్ధం చేసింది. ఆ పార్టీ నేతలు అక్కడే మకాం వేసి స్వయంగా ప్రచార కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

ముఖ్యంగా త్రిపుర ఎన్నికలు కమ్యూనిస్టులకు చాలా ప్రతిష్టాత్మకంగా మారాయి. 1978 నుంచి వరుసగా (1988–93లో 5 సంవత్సరాలు తప్ప) ఇక్కటివరకు కమ్యూనిస్టుల ప్రభుత్వమే రాజ్యమేలింది. ఇప్పుడు మాత్రం ఆ కోట బీటలు వారే దిశగా కదులుతోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇక్కడ కాంగ్రెస్, తృణమూల్ కొద్దిగా బలంగా ఉన్నప్పటికీ ఇప్పుడు వారంతా బీజేపీలో చేరిపోయారు. కాంగ్రెస్, తృణమూల్ పార్టీల శాసనసభ్యులు క్రితం సంవత్సరం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీకి 2013 శాసనసభ ఎన్నికల్లో కేవలం 1.54 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. 2014 పార్లమెంట్ ఎన్నికల్లో కొంత పెరిగి 5.77 శాతం ఓట్లు వచ్చాయి. మరి ఇప్పుడు అక్కడ ఏకంగా ప్రభుత్వానికి సవాల్ విసురుతోంది. ప్రభుత్వ ఏర్పాటుకు సైతం సిద్ధపడుతోంది.

గత రెండేళ్లుగా బీజేపీ నాయకత్వం బూత్ స్థాయిల్లో పనిచేస్తోంది. కొత్తగా అనేకమంది చేరడం, కేంద్రప్రభుత్వం నరేంద్రమోదీ 'సబకీ సాత్' నినాదం, కాంగ్రెస్ దాదాపు తెరమరుగవడం, అత్యధికశాతం బెంగాలీలు బీజేపీలో చేరడం, అభివృద్ధి పెద్దగా రాష్ట్రంలో కనబడకపోవడం, విద్య, వైద్యం, రోడ్లు వంటి మౌలిక వసతులు అసలు లేకపోవడం ఈ ఎన్నికల్లో బీజేపీకి కలిసివచ్చే అంశాలు. కమ్యూనిస్టులు మాత్రం కేవలం మానిక్ సర్కార్ పైనే కోటి ఆశలు పెట్టుకుంది. ఎన్నికల ప్రచార పర్వంలో సర్వశక్తులూ ఒడ్డుతోంది మానిక్ సర్కార్. బీజేపీ తన ప్రధానిని, అమిత్ షాను, రాజ్‌నాథ్ సింగ్‌ను, యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌ను, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని ప్రచారానికి ఉపయోగించింది. ఇది కాక ఐపీఎఫ్‌టీతో బీజేపీ పొత్తుపెట్టుకుంది. గిరిజనుల్లో, దళితుల్లో ఈ పార్టీకి మంచి పట్టుంది. ఫిబ్రవరి 18న త్రిపుర ఎన్నికలు ముగిశాయి. ఈ మూడు ఈశాన్య రాష్ట్రాల్లో ముగిసిన ఎన్నికల ఫలితాల కోసం మార్చి 3 వరకు వేచి చూడాల్సిందే.



నాగాలాండ్‌లో ఫిబ్రవరి 27న జరిగిన ఎన్నికల్లో నాగా సమస్యే ప్రధాన ఎజెండాగా ముందుకొచ్చింది. ఇక్కడ ప్రధాన పోటీ ఎన్‌డీపీపీ, ఎన్‌పీఎఫ్ కూటములకు మధ్య ఉంది. అభివృద్ధికే ఓటు వెయ్యాలని, మత ప్రాతిపదికన ఓటు వెయ్యవద్దని, డబ్బుకు లొంగవద్దని (నాగాలాండ్ బాప్టిస్ట్ చర్చి కౌన్సిల్) బహిరంగ ప్రకటన ఇచ్చింది. మేఘాలయలో కాంగ్రెస్ పార్టీకీ మంచి పట్టుంది. గత పదేళ్లుగా ముకుల్ సంగ్మా ఇక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నారు. యునైటెడ్ అలయెన్స్, కాంగ్రెస్ నేతృత్వంలో ఇక్కడ రాజ్యమేలుతోంది. 2013 ఎన్నికల్లో 47 స్థానాల్లో పోటీ చేసి ఒక్క సీటు కూడా గెలువని భాజపా ఇప్పుడు అనూహ్యంగా బలం పెంచుకుంది. ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా ఈసారి రెండుచోట్ల నుంచి పోటీకి దిగారంటేనే పరిస్థితి ఇక్కడ ఎలా మారిందీ అర్థమవుతుంది. మొత్తం మీద ఈశాన్య రాష్ట్రాల్లో భాజపా ఎదుగుదల, కమ్యూనిస్టు, కాంగ్రెస్‌లకు కునుకు పట్టడం లేదనే చెప్పాలి.

–వ్యాసకర్త బీజేపీ సమన్వయ కర్త, ఢిల్లీ


HONDA
The Power of Dreams
కలలను సాకారం చేస్తాం
Happy HOLI
#Terms and conditions apply. Offer applicable on purchase through finance from select financiers only. Finance at the sole discretion of financiers. Low down payment subject to finance policy. Limited period offer at Honda dealerships. Relevant documents needed to avail offer. Financier may withdraw scheme without giving any prior notice. Accessories shown in the picture are not a part of the standard equipment. **Conditions apply.
GRAZIA
NEW CB 125 Shine SP
HET BS-IV
muthoot CAPITAL
SHRIRAM City
MONEY WHEN YOU NEED IT MOST
₹ 5,999# DOWN PAYMENT
0 PROCESSING FEE#
హోండా అంటే HONDA
Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office: Commercial Complex II, Sector - 49-50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com
ALWAYS WEAR HELMET WHILE RIDING
Also available:
Annual Maintenance Contract**
Road Side Assistance**
Engine Health Assurance**
Follow us on
Honda Exclusive Authorized Dealerships: VIJAYAWADA: Anvita Honda - 9225922599, 0866 6628333; Mithra Honda - 2442149, 8297235235; Sri Santosh Honda - 9703123445, 8019669955; GUDIVADA: Pruthvi Honda - 8977185999, 8977803888; JAGGAIAHPET: Mithra Honda - 08297557149/50; MYLAVARAM: Mithra Honda - 8297568888; KAANURU: Sri Santosh Honda - 08666452666, 9618909494; GANNAVARAM: Sri Santosh Honda - 9912195558, 9391935558; VISSANNAPETA: Aishwarya Honda - 08673-272722, 9000866319; TIRUVURU: Sri VenkataSatya Honda - 08673-253446, 8977836666; KAIKALURU: Pruthvi Honda - 08677-225555, 9642854888; MACHILIPATNAM: Nagasai Honda - 9676945616; KANCHIKACHERLA: Sri Spandana Honda - 08678-273066, 8523034242; NANDIGAMA: Apple Honda - 07660867711, 08678-279001; CHALLAPALLI: Annapurna Honda - 8499900065; NUZIVIDU: Srishivani Honda - 7893194444; VUYYURU: Pruthvi Honda - 08676236236, 8142026888; IBRAHIMPATNAM: Leo Honda - 9348686966.
For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com



ప్యాకేజీతో మోసం చేయొద్దని నినాదాలు చేస్తూ విశాఖ కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వెళ్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు



ప్రత్యేక హోదా మా హక్కు అని నినదిస్తూ విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయానికి భారీ ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు కొలుసు పార్థసారథి, సామినేని ఉదయభాను, జోగి రమేష్, మల్లాది విష్ణు, తదితరులు

హోదా మా హక్కు



▶ మొదటి పేజీ తరువాయి

కోసమే ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారని, ఓటుకు కోట్లు కేసు నుంచి బైట పడడం కోసమే హోదాను వదిలేశారని విమర్శించారు. ధర్నా అనంతరం ఆయా కలెక్టర్ కార్యాలయాలలో అధికారులకు ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తూ పార్టీ నాయకులు వినతిపత్రాలు సమర్పించారు.

ఆటంకపరిచినా..

ధర్నా కార్యక్రమంలో పాల్గొనకుండా చేయడం కోసం రాష్ట్రంలో అనేక చోట్ల పోలీసులు ఆటంకపరిచారు. విశాఖ జీవీఎంసీ ఎదుట నిర్వహించిన మహా ధర్నాకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది తరలివచ్చారు. రెడ్నం గార్డెన్స్ జంక్షన్, జిల్లా కోర్టుల సముదాయం, జగదాంబ జంక్షన్, కేజీహెచ్‌ల మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు కార్యకర్తలు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. కృష్ణా జిల్లాలోనూ పలుచోట్ల నాయకులను పోలీసులు అటకాయించారు. విజయవాడలో ధర్నా కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్లకుండా ఆపేందుకు ప్రయత్నించారు. అయినా పెద్ద సంఖ్యలో చేరుకున్న కార్యకర్తలు ప్రదర్శనగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. శ్రీకాకుళంలో కలెక్టరేట్ వద్దకు వెళ్లడానికి పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రేణులు కలెక్టరేట్ సమీపంలో కాసేపు సమావేశమయ్యారు. అనంతరం భారీఎత్తున ప్రదర్శనగా కలెక్టరేట్‌కు వెళ్లారు.



ప్రతిపక్షనేత వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపుతో.. ఏపీకి ప్రత్యేక హోదా కోరుతూ కాకినాడలో కలెక్టరేట్‌ను ముట్టడించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు

ప్రత్యేక హోదాపై తమ డిమాండ్లతో వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. కడప నగరంలో కలెక్టరేట్ ముట్టడించనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు

బైక్ ర్యాలీలు.. తీన్‌మార్ డప్పులు

కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమంలో పాల్గొనేందుకు పలు జిల్లాల్లో యువకులు, విద్యార్థులు బైక్‌లతో ర్యాలీగా రావడం అందరినీ ఆకట్టుకుంది. యువకుల నినాదాలతో పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు మారుమోగింది. తీన్‌మార్ డప్పులు, మోటార్‌సైకిల్ ర్యాలీలతో కలెక్టరేట్ ప్రాంతం సందడిగా మారింది. గుంటూరు నగరంలో పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలోనూ, ప్రత్తిపాడు నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలోనూ బైక్‌ర్యాలీలు జరిగాయి. వారు ర్యాలీగా వచ్చి ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. కర్నూలు నగరంలో పార్టీ జిల్లా కార్యాలయం నుంచి దాదాపు ఐదు వేల మందితో నిర్వహించిన భారీ ర్యాలీ ఆకట్టుకుంది. ఒంగోలులో నిర్వహించిన ధర్నాలో విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విశాఖలోనూ, నెల్లూరులోనూ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. యువకులు నినాదాలతో హోరెత్తించారు.

నెల్లూరు కలెక్టరేట్ ముట్టడికి ర్యాలీగా వస్తున్న నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ▼





విజయనగరం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాకు హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న కార్యకర్తలు, ప్రజలు →





చిత్తూరు ధర్నాలో పాల్గొన్న ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గురువారం గుంటూరులో నిర్వహించిన ధర్నాకు హాజరైన ప్రజలు



అనంత కలెక్టరేట్ ముట్టడికి భారీగా హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎంపీ అనంత వెంకటరామిరెడ్డి



పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో కలెక్టరేట్ ముట్టడికి తరలివచ్చిన ప్రజలు



ప్రత్యేక హోదా సాధన కోసం శ్రీకాకుళం కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



కడప కలెక్టరేట్ వద్ద ఆందోళనలో పాల్గొన్న మహిళలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

హోదాతోనే యువతకు ఉపాధి



ప్రత్యేక హోదా ఉంటేనే పరిశ్రమలు వస్తాయి. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 15 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, లక్షలాది ఉద్యోగాలు వచ్చాయని చంద్రబాబు మభ్యపెడుతున్నారు. ఏవీ ఆ పెట్టుబడులు? ఎక్కడ ఆ ఉద్యోగాలు?
– ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, శాసనమండలి ప్రతిపక్షనేత

చంద్రబాబే అడ్డు...



ఓటుకు కోట్లు కేసులో జైలుకు పోవలసి వస్తుందేమోనన్న భయంతోనే ప్రత్యేక హోదాపై సీఎం చంద్రబాబు మాట్లాడడం లేదు. నాలుగేళ్లుగా హోదాపై చంద్రబాబు రకరకాలుగా మాట్లాడుతున్నారు. నాడు రాష్ట్ర విభజనకు కారకుడైన చంద్రబాబే ఇపుడు హోదా రాకపోవడానికి కూడా కారకుడు. తన స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర భవిష్యత్‌ను కేంద్రానికి తాకట్టు పెట్టారు. – మేకపాటి రాజమోహనరెడ్డి, ఎంపీ

జగన్ వల్లే 'హోదా' సజీవం..



ప్రత్యేక హోదా నినాదం ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి వల్లే ప్రజల్లో నిలిచింది. అధికారంలోకి వచ్చిన తరువాత దేవదేవుడి పాదాల దగ్గర ఇచ్చిన హామీకి మోదీ, చంద్రబాబులు తూట్లుపొడిచారు.
–పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే

హోదాకు ప్రత్యామ్నాయం లేదు



హోదాకు ప్రత్యామ్నాయం లేదు. కేంద్ర కేబినెట్‌లో చేసిన తీర్మానానికి చట్టబద్ధత లేకపోతే ఇంక దేనికి ఉంటుంది? 11 రాష్ట్రాలకు హోదా ఇచ్చినప్పుడు విభజనతో నష్టపోయిన ఏపీకి ఎందుకు ఇవ్వరు? –విజయసాయిరెడ్డి, ఎంపీ

హోదాపై బాబు పూటకోమాట..



హోదాపై చంద్రబాబు రోజుకో ప్రకటన చేస్తుండటం చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతోంది. బాబుకు ఓటేసినందుకు ఆంధ్రులు తల దించుకోవాల్సిన దుస్థితి దాపురించింది. –బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నేత

హోదాపై నిలువునా ముంచేసిన బాబు



ప్రత్యేక హోదా విషయంలో నాడొక మాట, నేడొక మాట చెబుతూ చంద్రబాబు రాష్ట్రాన్ని నిలువునా ముంచేశారు. తన అబద్ధాలతో మోసం చేసినందుకు ముందుగా ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి.
– ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నేత

ఆ అధికారం మీకెక్కడిది?



చంద్రబాబు నిర్వాకం వల్ల నాలుగేళ్లుగా హోదాతో రావల్సిన ప్రయోజనాలు ఆగిపోయాయి. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టే అధికారం అసలు చంద్రబాబుకు ఎవరిచ్చారు?
– కొలుసు పార్థసారథి, వైఎస్సార్‌సీపీ నేత

హోదా కోసం ఎందాకైనా..



విభజన సమయంలో ఏపీకి హోదా పదేళ్లు కాదు పదిహేనేళ్లు కావాలని డిమాండ్ చేసిన టీడీపీ, బీజేపీ నేతలు అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కడం వల్లే రాష్ట్రానికి అన్యాయం. హోదా కోసం ఎందాకైనా వెళ్తాం. –వైఎస్ వివేకానంద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత

ప్యాకేజీతో ఏం సాధించారు?



ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఏమి తెచ్చిందో ప్రజలకు స్పష్టం చేయాలి. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో తెలుగుదేశం, బీజేపీ నాటకాలు ఆడుతున్నాయి.
–బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పీఏసీ ఛైర్మన్

రాష్ట్ర ప్రయోజనాలు గాలికి వదిలారు



ప్యాకేజీలంటూ కేంద్రం వెంటపడి వచ్చే నిధులను కూడా దక్కించుకోలేకపోయిన అసమర్థత చంద్రబాబుదే. కమీషన్లకు కక్కుర్తిపడి ప్రజల ప్రయోజనాలను చంద్రబాబు గాలికి వదిలారు. – పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ

ప్రాణత్యాగానికైనా సిద్ధమే..




టీడీపీ ఎంపీలను రాజీనామా చేయించే దమ్ముందా? హోదాపై వైఎస్ జగన్ పోరాట స్ఫూర్తిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి. హోదా కోసం ప్రాణత్యాగానికి కూడా వెనుకాడబోం.
– ఆళ్ల నాని, వైఎస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్సీ

వెంకన్న సాక్షిగా మోసగించారు..



మోదీ, వెంకయ్య, చంద్రబాబు కలిసి వెంకన్న స్వామి సాక్షిగా ఆంధ్ర రాష్ట్ర ప్రజల్ని మోసం చేశారు. ఇటీవల చంద్రబాబు చేయించిన ఓ సర్వేలో ఎక్కువ మంది హోదానే కావాలన్నారు.– బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత

అందరూ ఏకతాటిపైకి రావాలి



చంద్రబాబుకు మోసం వెన్నతో పెట్టిన విద్య. కేంద్రానికి కోవర్టులా వ్యవహరించే చంద్రబాబుతో జాగ్రత్తగా ఉండాలి. హోదా అనేది జీవన్మరణ సమస్య. అందరూ ఏకతాటిపైకి వచ్చి ఉద్యమించాలి. – అనంత వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత

రైల్వే హాస్పిటల్‌కు అవినీతి జబ్బు!

ఒంగోలుకు చెందిన ఒక టీసీ మూడేళ్ల కుమార్తెకు క్యాన్సర్ సోకింది. దీంతో ఆ చిన్నారిని చైన్నై అపోలో హాస్పిటల్‌కు తీసుకెళ్లి చికిత్స చేయిస్తే రూ. 6.6 లక్షలు ఖర్చు అయ్యింది. ఆ రైల్వే ఉద్యోగి విజయవాడ రైల్వే హాస్పిటల్‌లో బిల్లులు సమర్పించి, రీయింబర్స్ కోరితే కేవలం రూ. 9 వేలు మాత్రమే మంజూరు చేశారు. ఈ విషయం చివరకు జీఎం వరకు వెళ్లడంతో ఆయన బిల్లులు ఇప్పించారు.

విజయవాడకు చెందిన డీఆర్‌ఎం కార్యాలయంలో ఒక గుమస్తా అనారోగ్యంతో రైల్వే హాస్పిటల్‌కు వెళ్లారు. ఆయన్ను వైద్య పరీక్షల కోసం ఒక కార్పొరేట్ హాస్పిటల్‌కు పంపించారు. అక్కడ యాంజియోగ్రామ్ చేసినందుకు రూ. 10 వేలు బిల్లు బదులుగా ఆ ఆస్పత్రికి రూ. 14 వేలు చెల్లించారు. ఆ కార్పొరేట్ హాస్పిటల్‌తో రైల్వే హాస్పిటల్ వైద్యులకు ఉన్న లోపాయికారీ ఒప్పందం కారణంగానే ఎక్కువ చెల్లించారు.

వైద్యానికి అయిన బిల్లులు చెల్లించకుండా ముప్పతిప్పలు

- ఓ హాస్పిటల్‌కు మాత్రం ప్రత్యేకంగా రూ. 30 లక్షల చెల్లింపు
- లోపాయికారి ఒప్పందమే కారణం
- విజిలెన్స్ విచారణలో వెలుగులోకి..

సాక్షి, విజయవాడ

విజయవాడ రైల్వే హాస్పిటల్‌కు అవినీతి జబ్బు చేసింది. రైల్వే ఉద్యోగులు అనారోగ్యంతో ఏదైనా ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని ఆ మేరకు బిల్లులు పెడితే ఇవ్వకుండా కొందరు అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. అదే సమయంలో తాము లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్న కార్పొరేట్ ఆస్పత్రికి మాత్రం లక్షల్లో బిల్లులు ఇస్తున్నారు. విజిలెన్స్ విచారణలో ఈ అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. అనకాపల్లి నుంచి గూడూరు వరకు ఉన్న రైల్వే ఉద్యోగులకు విజయవాడ రైల్వే ఆస్పత్రి



విజయవాడలోని రైల్వే హాస్పిటల్

రిఫరల్‌గా పనిచేస్తోంది. నిత్యం వెయ్యి మంది రోగులు వస్తుంటారు. ఇక్కడ రోగానికి సంబంధించిన వసతులు లేకపోతే వైద్యులు ఇతర ప్రైవేటు ఆస్పత్రులకు పంపుతుంటారు. ఈ మేరకు విజయవాడలోని అనేక కార్పొరేట్ హాస్పిటల్స్‌తో రైల్వే హాస్పిటల్ ఒప్పందం కుదుర్చుకుంది. రోగి ఏ హాస్పిటల్‌ను కోరుకుంటే అక్కడికే రిఫర్ చేయాల్సి ఉంది. అయితే రింగ్ రోడ్డు సమీపంలోని ఒక కార్పొరేట్ హాస్పిటల్‌తో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్న కొందరు అధికారులు.. రోగుల్ని బలవంతంగా అక్కడికి పంపుతున్నారు. రోగులంతా కేవలం ఒకే హాస్పిటల్‌కు మాత్రమే వెళ్తుండటంతో అనుమానం వచ్చిన మిగిలిన కార్పొరేట్ హాస్పిటళ్ల వైద్యులు తీగలాగితే అవినీతి డొంక కదిలింది. సుమారు 200 మంది రోగులకు వివిధ పరీక్షల నిమిత్తం ఈ హాస్పిటల్‌కు గత ఏడాది కాలంలో రూ. 30 లక్షలు చెల్లించినట్లు తెలుస్తోంది. ఈ సమాచారం తెలిసిన రైల్వే విజిలెన్స్ అధికారులు ఇటీవల హాస్పిటల్ రికార్డులు పరిశీలించి కొన్నింటిని సీజ్ చేశారు.

అంతా ఆ అధికారిదే హవా!

కార్పొరేట్ హాస్పిటల్‌తో ఒప్పందం వెనుక చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్ స్థాయి అధికారి ఒకరి హస్తం ఉందని సమాచారం. రైల్వే కార్మిక సంఘంలో ఆయన కీలక నేత కావడంతో హాస్పిటల్‌లోనూ ఇతర సిబ్బంది ఆయనంటే భయపడుతున్నారు. ఆయనపై ఫిర్యాదు చేస్తే ట్రాన్స్‌ఫర్ చేయిస్తాడనే భయంతోనే ఇతర అధికారులు మాట్లాడలేక పోతున్నారు. విజిలెన్స్ అధికారులు ఈ చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్ వివరాలు సేకరించినట్లు సమాచారం.

నీటి లెక్కలు తేలేనా!

- నేడు కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం
- ఆగస్టు వరకూ అవసరాలపై చర్చించి కేటాయించనున్న కమిటీ



సాక్షి, అమరావతి: కృష్ణా జలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య లెక్కలు కుదరకపోవడంతో కృష్ణా బోర్డు రంగంలోకి దిగింది. నీటి లెక్కలను తేల్చడంతోపాటూ వర్షాకాలం ప్రారంభమయ్యే వరకూ నీటి అవసరాలపై చర్చించేందుకు శుక్రవారం హైదరాబాద్‌లో బోర్డు సభ్య కార్యదర్శి ఎ.పరమేశం నేతృత్వంలో త్రిసభ్య కమిటీ సమావేశం కానుంది. గత జనవరి 10న ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో కనీస నీటి మట్టాలకు ఎగువన నీటి లభ్యతగా ఉన్న 133.75 టీఎంసీలలో ఆంధ్రప్రదేశ్‌కు 60, తెలంగాణకు 50 టీఎంసీలను త్రిసభ్య కమిటీ కేటాయించింది. ఆంధ్రప్రదేశ్ సర్కార్ కేటాయించిన నీటి కన్నా 2.324 టీఎంసీలు అధికంగా వినియోగించుకుందని లెక్క కట్టిన బోర్డు.. శ్రీశైలం, నాగార్జునాసాగర్‌ల నుంచి నీటి విడుదలను ఆపేయాలంటూ గత నెల 27న లేఖ రాసింది. దీనిపై ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం తెలిపింది. తాము 54 టీఎంసీలే వినియోగించుకున్నామని, తమ వాటా కింద మరో 6 టీఎంసీలు విడుదల చేయాలని బోర్డుకు స్పష్టం చేసింది. సాగర్ ఎడమ కాలువకు 14.5 టీఎంసీలకుగాను కేవలం 7.5 టీఎంసీలు మాత్రమే వచ్చాయని పేర్కొంది. ఉమ్మడి ప్రాజెక్టుల్లో కనీస నీటిమట్టాలకు ఎగువన ఇంకా 36.180 టీఎంసీలు ఉన్నాయని, ఇందులో తమ వాటాగా 15 టీఎంసీలు వస్తాయని.. ఆ మేరకు నీటిని వినియోగించుకుంటామని బోర్డుకు తెలిపింది. ఈ నెలాఖరు వరకూ నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల కింద పంటలకు నీటిని విడుదల చేయాలని కోరింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేస్తూ గత నెల 28న బోర్డుకు లేఖ రాసింది. ఉమ్మడి ప్రాజెక్టుల్లో కనీస నీటి మట్టాలకు ఎగువన ఉన్న జలాల్లో కేవలం 0.56 టీఎంసీలు మాత్రమే ఆంధ్రప్రదేశ్ వాటా కింద వస్తాయని.. మిగతా నీళ్లన్నీ తమకే చెందుతాయని తెలంగాణ సర్కార్ బోర్డుకు వివరించింది. ఈ నేపథ్యంలోనే బుధవారం నాగార్జునసాగర్ కుడి కాలువకు నీటి విడుదలను ఆపేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడంతో బోర్డు జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. నీటి లెక్కలను తేల్చేందుకు త్రిసభ్య కమిటీ సమావేశాన్ని నిర్వహించడానికి బోర్డు సిద్ధమైంది. సాగునీటి అవసరాలతోపాటూ.. ఆగస్టు వరకూ తాగునీటి అవసరాసరాలపై చర్చించి.. నీటి లభ్యత ఆధారంగా ఇరు రాష్ట్రాలకు త్రిసభ్య కమిటీ కేటాయింపులు చేయనుంది.

నిలిచిన రూ.464 కోట్ల రీఫండ్

- అంతర్రాష్ట్ర జీఎస్టీపై కొరవడిన అవగాహన
- వ్యాపారులకు చెల్లింపుల కోసం కస్టమ్స్ హౌస్‌ల ఏర్పాటు

విశాఖ సిటీ: దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమలులోకి వచ్చి ఎనిమిది నెలలు దాటుతున్నా వ్యాపారుల్లో నెలకొన్న సందేహాలు, అపోహలు ఇంకా వీడటం లేదు. వారు చేస్తున్న చిన్న తప్పిదం కారణంగా దేశవ్యాప్తంగా రూ.10 వేల కోట్ల రీఫండ్ నిలిచిపోయింది. అంతర్రాష్ట్ర ఎగుమతుల పన్నులకు సంబంధించి రెండు బిల్లుల్లో వేర్వేరు నంబర్లు ఇవ్వడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. కొందరు వ్యాపారులు పన్ను ఎగవేసేందుకు సరకుకు సంబంధించి తప్పుడు సమాచారం ఇస్తుండగా మరికొందరు అవగాహనా లోపంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గతంలో చేతికే రీఫండ్

సాధారణంగా ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు లేదా ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి ఎగుమతులు చేస్తున్నప్పుడు సరకుపై ఎగుమతి, దిగుమతి సుంకాల రూపంలో ఐజీఎస్టీ చెల్లిస్తున్నారు. అయితే ఎగుమతులపై పన్ను ఉండదు. ఇందుకోసం చెల్లించిన పన్నుని రీఫండ్ చేసే సౌకర్యం కస్టమ్స్, పన్నుల శాఖ కల్పించింది. రీఫండ్‌కు అర్హులైన వ్యాపారాలు షిప్పింగ్ బిల్లుతో పాటు జీఎస్టీఆర్–1 బిల్లు నంబర్లు ఫైల్ చేయాలి. గతంలో ఈ విధానం ఉన్నా మాన్యువల్‌గా ఫైల్ చేయటంతో రీఫండ్ చేతికి ఇచ్చేవారు. జీఎస్టీ వచ్చాక ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తున్నారు. వ్యాపారులు షిప్పింగ్ బిల్లులో ఒక నంబర్, జీఎస్టీఆర్–1 ఫైల్ చేసినప్పుడు మరో నంబర్ ఇవ్వటంతో సరిపోలక రీఫండ్ ఫైల్స్ తిరస్కరణకు గురవుతున్నాయి. జీఎస్టీ అమలులోకి వచ్చాక ఈ ఏడాది జనవరి వరకూ దేశవ్యాప్తంగా రూ.4 వేల కోట్లు రీఫండ్ చేయగా నంబర్లు సరిపోలక మరో రూ. 10 వేల కోట్లు స్తంభించాయి. రాష్ట్రంలో రూ.216 కోట్లు రీఫండ్ చేయగా, రూ.464 కోట్లు నిలిచిపోయాయని సెంట్రల్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ ఎన్.సృజన్ కుమార్ మంగళవారం 'సాక్షి'కి తెలిపారు. వ్యాపారులకు అవగాహన కల్పించినా బిల్లుల నంబర్లలో తప్పులు దొర్లటంతో రీఫండ్ చెల్లించలేకపోతున్నామని తెలిపారు.

రీఫండ్‌కు 4 కస్టమ్స్ హౌస్‌లు

ఇంటర్ స్టేట్ జీఎస్టీ రీఫండ్ చెల్లింపులకు సంబంధించి రాష్ట్రంలో నాలుగు కస్టమ్స్ హౌస్‌లు ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ సృజన్ కుమార్ తెలిపారు. సరైన బిల్లింగ్ నంబర్లను ఎంటర్ చేస్తే ఒకటి రెండు రోజుల్లో రీఫండ్ చెల్లింపులు చేస్తామని తెలిపారు. వ్యాపారులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. విశాఖపట్నం కస్టమ్స్‌హౌస్‌లో అసిస్టెంట్ కమిషనర్ టి.రవివర్మ(0891–2565140), కాకినాడ కస్టమ్స్ హౌస్‌లో డిప్యూటీ కమిషనర్ బీకే సింగ్(0884–2375632), కృష్ణపట్నం కస్టమ్స్ హౌస్‌లో డిప్యూటీ కమిషనర్ ఎన్నింటి భాస్కరరావు (0861–2377722), విశాఖపట్నం మర్రిపాలెంలోని ఇన్‌లాండ్ కంటైనర్ డిపోలో డిప్యూటి కమిషనర్ ఎం.శ్రీకాంత్(0863–2344213) రీఫండ్ మొత్తాలపై అవగాహన కల్పించి చెల్లింపులు చేసేందుకు సిద్ధంగా ఉంటారని డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

విభజన హామీలు నెరవేర్చాలి

- ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే హోదా ఇవ్వాలి
- ప్రత్యేక హోదా ఇచ్చే వరకు పోరాటం
- ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు సాధన సమితి

కొరిటెపాడు (గుంటూరు): ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి డిమాండ్ చేసింది. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సమితి ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి అయినా ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు చేసిన మోసాలపై 420 కింద కేసు నమోదు చేయాలని ఈ నెల 6న ఢిల్లీలో ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చంద్రబాబు వ్యక్తిగత కారణాలతో రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టారని విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్‌సీపీ మొదటి నుంచి ఒకే మాటమీద ఉన్నదని, ఎన్నో ఉద్యమాలు చేశామని గుర్తు చేశారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే తమ పార్టీ పార్లమెంట్ సభ్యులు రాజీనామాలు చేస్తారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ ప్రత్యేక హోదా కోసం సుదీర్ఘ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర చర్చా వేదిక అధ్యక్షుడు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 25 మంది ఎంపీలు రాజీనామా చేస్తే కేంద్రం దిగిరాక తప్పదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. పదే పదే రాష్ట్రం అభివృద్ధి చెందిందంటున్న చంద్రబాబు.. ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు మేరుగ నాగార్జున, లేళ్ల అప్పిరెడ్డి, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం-కడప విమాన సర్వీసు ప్రారంభం

విమానాశ్రయం (గన్నవరం) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉడాన్ పథకంలో భాగంగా గురువారం గన్నవరం విమానాశ్రయం నుంచి వైఎస్సార్ జిల్లా కడపకు ట్రూజెట్ విమాన సంస్థ కొత్త సర్వీస్‌ను ప్రారంభించింది. ఈ సర్వీస్ ప్రారంభోత్సవం సందర్భంగా టెర్మినల్ భవనంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జి.మధుసూదనరావు తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ప్రయాణికులకు బోర్డింగ్ పాస్ ఇచ్చారు. ఉ.8.05 గంటలకు ఏటీఆర్ 72–600 విమానం 39 మంది ప్రయాణికులతో కడపకు బయలుదేరింది. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ.. ప్రాంతీయ కనెక్టివిటీని పెంపొందించేందుకుగాను పౌర విమాన శాఖ ఈ సర్వీస్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకం కింద గంటలోపు ప్రయాణం కేవలం రూ. 2,500 లోపే ఉంటుందని చెప్పారు. కాగా, ఈ విమానం తిరిగి 10.35 గంటలకు 58 ప్రయాణికులతో కడప నుంచి ఇక్కడికి చేరుకుంది.

నేటి నుంచి ఇండిగో సర్వీసులు

ఇండిగో ఎయిర్‌లైన్స్ కూడా శుక్రవారం నుంచి గన్నవరం నుంచిత హైదరాబాద్, బెంగళూరు, చెన్నైల మధ్య నూతన సర్వీసులు నడపనుంది. హైదరాబాద్ నుంచి ఉ.7.35 గంటలకు విమానం గన్నవరానికి చేరుకోగానే సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ప్రతిరోజూ ఈ సంస్థ హైదరాబాద్–విజయవాడ మధ్య ఆరు సర్వీస్‌లు, విజయవాడ–బెంగళూరు, విజయవాడ–చెన్నై మధ్య మరో నాలుగు సర్వీసులను నడపనుంది. ఎయిర్‌పోర్టు టెర్మినల్ భవనంలో ఉ.6 గంటలకు నూతన సర్వీసుల ప్రారంభోత్సవాన్ని నిర్వహించనున్నారు.


ప్రయాణికుడికి బోర్డింగ్ పాస్ ఇస్తున్న మధుసూదన రావు

ఆర్‌హెచ్‌ఆర్ వరల్డ్ రికార్డ్ సాధించిన అవనిగడ్డ విద్యార్థి

50 అంకెల వరుసను మరో 50 అంకెలతో 46 సెకన్లలో లెక్కింపు


నాగప్రదీప్‌కు ఆర్‌హెచ్‌ఆర్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందిస్తున్న పర్వీజ్, ఉమామహేశ్వరరావు

అవనిగడ్డ : రికార్డ్ హోల్డర్ రిపబ్లిక్ (ఆర్‌హెచ్‌ఆర్) వరల్డ్ రికార్డు మెమోరాలజీలో కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందిన విద్యార్థి పువ్వాడ బాలనాగప్రదీప్ ప్రపంచ రికార్డు సాధించారు. ఆర్‌హెచ్‌ఆర్ వరల్డ్ రికార్డ్ లండన్ సౌత్ ఇండియా అధ్యక్షుడు ఎం. పర్వీజ్ పర్యవేక్షణలో స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పువ్వాడ నాంచారయ్య, సునీత దంపతుల కుమారుడు నాగప్రదీప్ ఒక వరుసలో 50 అంకెలు వేసి వాటి కింద మరో 50 అంకెలు వేయగా ఈ మొత్తాన్ని 46 సెకన్లలో లెక్కించి ఆర్‌హెచ్‌ఆర్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నారు. అనంతరం నాగప్రదీప్‌కు పర్వీజ్, ఎస్‌వీఎల్ క్రాంతి విద్యా సంస్థల చైర్మన్ దుట్టా ఉమామహేశ్వరరావు మెమొంటో, సర్టిఫికెట్‌ని అందజేశారు. స్థానిక ఎస్‌వీఎల్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ చదివిన నాగప్రదీప్ అరుదైనన రికార్డు సాధించడం పట్ల పలువురు అభినందించారు.

సింహాద్రిలో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం

పరవాడ (పెందుర్తి): సింహాద్రి ఎన్టీపీసీ మూడో యూనిట్‌లోని టర్బైన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం వల్ల గురువారం సాయంత్రం విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో యూనిట్‌లో 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. సాంకేతిక నిపుణులు వెంటనే మరమ్మతులు చేపట్టడం ప్రారంభించారు. శుక్రవారం మధ్యాహ్నానికి విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరిస్తామని ఎన్టీపీసీ వర్గాలు తెలిపాయి.

విధులు బహిష్కరించిన హైకోర్టు న్యాయవాదులు

న్యాయమూర్తుల పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్

- హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి
- సీఆర్పీసీ సెక్షన్ 41ఏ ను ఉపసంహరించుకోవాలి
- పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిని నియమించాలని విజ్ఞప్తి
- హైకోర్టు నుంచి చార్మినార్ వరకు భారీ ర్యాలీ
- నేడు కూడా కొనసాగనున్న విధుల బహిష్కరణ


ఆందోళన నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయవాదులు

సాక్షి, హైదరాబాద్: న్యాయమూర్తుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ ఉమ్మడి హైకోర్టు న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు. హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని, సీఆర్పీసీ సెక్షన్ 41ఏ ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉదయం 11 గంటల సమయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల న్యాయవాదుల సంఘాల అధ్యక్షులు జల్లి కనకయ్య, సీహెచ్ ధనంజయల నేతృత్వంలో న్యాయవాదులంతా హైకోర్టు బార్ కౌన్సిల్ నుంచి చార్మినార్ గుల్జార్‌హౌస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

నిలిచిపోయిన విచారణలు..

తొలుత హైకోర్టు పనివేళలు ప్రారంభం కాగానే న్యాయమూర్తులంతా కేసులను విచారించేందుకు కోర్టు హాళ్లలోకి వచ్చారు. కానీ న్యాయవాదులెవరూ హాజరుకాలేదు. కొందరు న్యాయవాదులు కోర్టు హాళ్లకు వెళ్లి.. తమ విధుల బహిష్కరణ విషయాన్ని న్యాయమూర్తుల దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం.. వాదనలు వినిపించేందుకు హాజరుకాని న్యాయవాదుల కేసులను కొట్టివేయబోమని, వాదనలు వినిపించేందుకు న్యాయవాదులు వస్తే విచారణలు జరుపుతామని స్పష్టం చేసింది. అయితే న్యాయవాదులెవరూ వాదనలు వినిపించేందుకు కోర్టు హాళ్లకు వెళ్లలేదు. దాంతో కొద్దిసేపటి తర్వాత న్యాయమూర్తులు బెంచ్‌లు దిగి చాంబర్లలోకి వెళ్లిపోయారు. ఇక కొన్ని అత్యవసర కేసులపై మాత్రం ఒకరిద్దరు న్యాయమూర్తులు విచారణను కొనసాగించారు.

న్యాయవాద సంఘాల తీర్మానం మేరకు..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల న్యాయవాద సంఘాల సర్వ సభ్య సమావేశం ఫిబ్రవరి 27న జరిగింది. ఈ సందర్భంగా.. హైకోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి, పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిని నియమించేందుకు కేంద్రం, సుప్రీంకోర్టు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు. అలాగే 2012లోపు దాఖలైన కేసులను నిర్దిష్ట కాల పరిమితిలోగా పరిష్కరించాలంటూ జారీ చేసిన సర్క్యులర్‌ను సుప్రీంకోర్టు ఉపసంహరించుకోవాలని, సీఆర్పీసీ సెక్షన్ 41ఏ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని, హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ డిమాండ్ల సాధన కోసం మార్చి 1, 2 తేదీల్లో విధులను బహిష్కరించాలని నిర్ణయించారు. దాని ప్రకారం తాజాగా విధుల బహిష్కరణ చేపట్టారు.

భారీగా ర్యాలీ.. ఆందోళన

విధులు బహిష్కరించిన న్యాయవాదులంతా బార్ కౌన్సిల్ గేటు నుంచి గుల్జార్‌హౌస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మదీనా చౌరస్తా వద్ద కొంతసేపు బైఠాయించారు. గుల్జార్‌హౌస్ వద్ద పెద్దపెట్టున నినాదాలు చేస్తూ కొంతసేపు ఆందోళన నిర్వహించారు. కాగా న్యాయవాదుల ఆందోళన నేపథ్యంలో హైకోర్టు, పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. శుక్రవారం కూడా విధుల బహిష్కరణ కొనసాగనుంది.

వైభవంగా లక్ష్మీ నరసింహుని రథోత్సవం

భక్తులతో కిటకిటలాడిన మంగళగిరి పట్టణం


రథోత్సవంలో పాల్గొన్న జన సందోహం

మంగళగిరిరూరల్: గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో వేంచేసియున్న శ్రీదేవిభూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి దివ్య రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో పురవీధులు కిక్కిరిసిపోయాయి. భక్తుల జయజయధ్వానాల మధ్య నేత్రపర్వంగా స్వామివారి రథోత్సవం సాగింది. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైన రథోత్సవం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి రథోత్సవాన్ని తిలకించారు. నమో నరసింహ, శ్రీ లక్ష్మీ నరసింహ నామస్మరణతో మంగళగిరి పట్టణం మారుమోగిపోయింది.

నేడు వసంతోత్సవం

శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం చక్రవారి చూర్ణోత్సవం, అనంతరం వసంతోత్సవం జరుగుతాయని, ఆ తర్వాత కోనేరులో స్వామివారు చక్రస్నానం చేస్తారని ఆలయ కార్య నిర్వహణాధికారి మండేపూడి పానకాలరావు తెలిపారు. శుక్రవారం రాత్రి 8 గంటలకు ధ్వజారోహణం, కేళిగుర్రం, దొంగలదోపిడీ, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

వైఎస్సార్‌సీపీ బీసీ విభాగానికి న్యాయవాదుల వినతి


జంగా కృష్ణమూర్తికి వినతిపత్రం ఇస్తున్న పల్లపు కృష్ణ, న్యాయవాదులు

పట్నంబజారు (గుంటూరు): రాష్ట్రంలో బీసీ న్యాయవాదుల సమస్యలను పరిష్కరించేలా దృష్టి సారించాలని ఏపీ బీసీ న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు పల్లపు కృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన గురువారం గుంటూరులో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ అధ్యయన కమిటీ చైర్మన్ జంగా కృష్ణమూర్తిని కలసి వినతి పత్రం అందజేశారు. బీసీ న్యాయవాదుల సమస్యలను అధ్యయన కమిటీ నివేదికలో పొందుపర్చాలని కోరారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు, డెత్ బెనిఫిట్ పెంపుదల, జూనియర్ న్యాయవాదుల స్టైఫండ్, లా ఆఫీసర్స్ నియామకాల్లో రిజర్వేషన్లు (ఏపీపీ, ఏజీపీ), అమరావతిలో న్యాయవాదులకు వసతి భవనం తదితర అంశాలను అందులో పేర్కొన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో బార్ అసోసియేషన్లకు పూర్తి సౌకర్యాలతో కూడిన కార్యాలయాలను నిర్మించాలని కోరారు. ఎన్నికల్లో 4 ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ, నాలుగు మేయర్ స్థానాలను న్యాయవాదులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. లా ఆఫీసర్స్, స్టాండింగ్ కౌన్సిల్ నియామకాల్లో రిజర్వేషన్ విధానాన్ని పాటించాలన్నారు. జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యలను వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. న్యాయవాదులకు అన్ని విధాలా న్యాయం జరిగేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జంగాను కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సయ్యద్‌బాబు, షేక్ నైనా, కేవీ భాస్కర్ తదితరులు ఉన్నారు.

'నీట్'తో 15 శాతం పశువైద్య సీట్ల భర్తీ

వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వెల్లడి

సాక్షి, హైదరాబాద్: 'నీట్'ద్వారా జాతీయస్థాయిలో 15 శాతం పశు వైద్య సీట్లను భర్తీ చేస్తామని వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (వీసీఐ) తెలిపింది. ఈ మేరకు వీసీఐ ఓ ప్రకటన విడుదల చేసింది. జాతీయస్థాయిలో ఉండే ప్రభుత్వ వెటర్నరీ కాలేజీల్లో ఉన్న బీవీఎస్సీ సీట్లలో 15 శాతం నేషనల్ పూల్ కింద కేటాయించారు. వాటిలో సీటు పొందేందుకు గతంలో వీసీఐ పరీక్ష రాస్తే సరిపోయేది. కానీ, గతేడాది నుంచి వాటిని నీట్ పరీక్ష ద్వారానే భర్తీ చేస్తున్నారు. రాష్ట్రంలోనూ ఆ 15 శాతం సీట్లకు పోటీ పడేందుకు విద్యార్థులు నీట్ రాస్తున్నారు. అయితే రాష్ట్రంలో ఉన్న 150 బీవీఎస్సీ సీట్లలో నేషనల్ పూల్ పరిధిలోకి వెళ్లిన 15 శాతం సీట్లను మినహాయిస్తే, మిగిలిన 85 శాతం సీట్లను మాత్రం ఎంసెట్ ద్వారా భర్తీ చేస్తున్నారు. నీట్ పరీక్ష ఈ ఏడాది మే 6వ తేదీన జరగనున్న విషయం తెలిసిందే.

మేకిన్ ఇండియాకు సాక్ష్యమిది

హెలికాప్టర్ బాడీ తయారీ కేంద్రం ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్


గురువారం రంగారెడ్డి జిల్లా ఆదిభట్లలో అపాచీ హెలికాప్టర్ల బాడీ తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న రతన్ టాటా, రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్. చిత్రంలో తెలంగాణ మంత్రి కేటీఆర్, బోయింగ్ సీఈవో లీన్ కారెట్ తదితరులు

సాక్షి, బిజినెస్ బ్యూరో: ప్రఖ్యాత విమానాల తయారీ సంస్థ బోయింగ్, దేశీ దిగ్గజం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఉమ్మడిగా తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆదిభట్లలో ఏర్పాటు చేసిన హెలికాప్టర్ బాడీ తయారీ కేంద్రం గురువారం ప్రారంభమైంది. భారత్‌లో అమెరికా రాయబారి కెన్నెత్ జెస్టర్, రతన్ టాటా, బోయింగ్ సీఈవో లీన్ కారెట్, మంత్రి కేటీఆర్‌లతో కలసి రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ దీనిని ప్రారంభించారు. బోయింగ్‌కు చెందిన ఏహెచ్ 64 అపాచీ హెలికాప్టర్ల తయారీకి కీలకమైన 'ఫ్యూజ్ లీజ్ (ప్రధాన ఫ్రేమ్)'ను, కొన్ని ఏరోస్ట్రక్చర్లను ఈ కేంద్రంలో తయారు చేస్తారు.

అంతర్జాతీయంగా కీలక పాత్ర పోషిద్దాం

ప్రారంభోత్సవం సందర్భంగా రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడారు. శంకుస్థాపన చేశాక అతి తక్కువ వ్యవధిలోనే ఉత్పత్తి మొదలయ్యే స్థాయికి తెచ్చారంటూ బోయింగ్, టాటా యాజమాన్యాలను ఆమె ప్రశంసించారు. ఇన్నాళ్లుగా దిగుమతులపైనే ఆధారపడ్డామని, ఇకపై అంతర్జాతీయ ఎగుమతుల్లో కీలక పాత్ర పోషించి.. ఇతర దేశాలకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు మనవైపు చూసేలా చేయాలని చెప్పారు.

రెండేళ్లలో నాలుగు రెట్లు!

భారతదేశంలో తాము మరిన్ని పెట్టుబడులు పెడుతున్నామని బోయింగ్ డిఫెన్స్, స్పేస్, సెక్యూరిటీ సంస్థ అధ్యక్షురాలు, సీఈవో లీన్ కారెట్ చెప్పారు. తమ ఉత్పత్తుల్లో భారత్ నుంచి తీసుకునే పరికరాల విలువ రెండేళ్ల కింద 250 మిలియన్ డాలర్లుగా ఉండేదని, ఇప్పుడు నాలుగు రెట్లు పెరిగి బిలియన్ డాలర్లకు చేరిందని తెలిపారు. కార్యక్రమంలో రక్షణ శాఖ సలహాదారు సతీశ్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్, బోయింగ్ ఏరోస్పేస్ ఇండియా అధ్యక్షుడు ప్రత్యూష్‌కుమార్, టాటా సన్స్ ప్రెసిడెంట్ బన్మాలీ అగర్వాల్, టీఏఎస్ఎల్ సీఈవో సుక్రాన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



తెప్పోత్సవంలో పాల్గొన్న జస్టిస్ అరుణ్‌కుమార్ మిశ్రా, పక్కన ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తదితరులు

ఘనంగా ముగిసిన శ్రీవారి తెప్పోత్సవాలు

సాక్షి, తిరుమల: తిరుమలేశుని తెప్పోత్సవాలు గురువారం ఘనంగా ముగిసాయి. గత నెల 25వ తేదీన పుష్కరిణిలో ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఐదు రోజులపాటు కోలాహలంగా సాగాయి. తొలిరోజు సీతా,లక్ష్మణ, ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి, రెండో రోజు రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి, చివరి మూడ్రోజులు శ్రీదేవి, భూదేవి సమేతుడైన మలయప్పస్వామి పుష్కరిణిలో తెప్పపై విహరిస్తూ భక్తును కనువిందు చేశారు. పచ్చకర్పూరపు హారతుల మధ్య ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకుని ఆనంద పరవశులయ్యారు. అలాగే పుష్కరిణిలో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు కూడా విశేషంగా ఆకట్టుకున్నాయి.

థర్మల్‌కు కోతేస్తే కష్టాలే!

పవన, సౌర విద్యుత్‌తో తిప్పలే

- ఎప్పుడు విద్యుత్ కొరత వస్తుందో చెప్పలేం
- వేసవిలో థర్మల్ ఉత్పత్తి పెంచాల్సిందే
- లోడ్ డిస్పాచ్ సెంటర్ తాజా నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: విద్యుత్తు ఉత్పత్తి విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వచ్చే వేసవిలో కష్టాలకు దారితీయనున్నాయి. ఈ మేరకు థర్మల్ విద్యుత్తుకు కోత పెట్టే యోచనను విరమించుకోవాలని సూచిస్తూ రాష్ట్ర లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్‌డీసీ) విద్యుత్తు విభాగానికి ఓ నివేదిక సమర్పించింది. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. గత నెలలో 150 మిలియన్ యూనిట్లున్న వినియోగం ఇప్పుడు రోజుకు 178 మి.యూ.కు చేరింది. ఏప్రిల్ నాటికి ఇది 190 మి.యూ.కు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ సమయంలో పవన, సౌర విద్యుత్‌కు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని ఎస్ఎల్‌డీసీ తెలిపింది. వీటిని అతిగా ప్రోత్సహిస్తూ, థర్మల్ విద్యుత్‌కు కోత పెట్టే ఆలోచనలు మానుకోవాలని పేర్కొంది. ఇదే ప్రక్రియ అనుసరిస్తే మండు వేసవిలో విద్యుత్ కోతలు తప్పవని నివేదికలో హెచ్చరించింది. ప్రైవేటు సంస్థలకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం ఈ ఏడాది ప్రైవేటు పవన, సౌర విద్యుత్ కేంద్రాలతో కొనుగోలు ఒప్పందాలు చేసుకుంది. దేశంలో ఎక్కడా లేని విధంగా పవన విద్యుత్‌కు యూనిట్‌కు రూ.4.83 చొప్పున చెల్లించేందుకు సిద్ధపడింది. ఫలితంగా రాష్ట్ర విద్యుత్ అవసరాల్లో సగభాగం పవన, సౌర విద్యుత్ ఆక్రమిస్తోంది. సీజన్‌లో ఈ రెండింటి వాటా రోజుకు 50 నుంచి 60 మిలియన్ యూనిట్ల వరకూ ఉంటోంది. వేసవిలో సోలార్ పవర్ మరింత పెరిగే అవకాశం ఉంది. అదే క్రమంలో మే నెలలో పవన విద్యుత్ ఉత్పత్తి క్రమంగా పెరుగుతుంది. రాష్ట్రంలోని ఏపీ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల ఉత్పత్తి సామర్థ్యం రోజుకు 105 మిలియన్ యూనిట్ల వరకూ ఉంటుంది. కానీ పవన, సౌర విద్యుత్‌ను తీసుకోవడం కోసం థర్మల్ విద్యుత్తును రోజుకు గరిష్టంగా 60 యూనిట్లకే పరిమితం చేస్తున్నారు. థర్మల్ యూనిట్ల బ్యాకింగ్ డౌన్ పేరుతో ఉత్పత్తి నిలిపివేస్తున్నారు. దీనివల్ల లోడ్ డిస్పాచ్ సెంటర్‌కు కొత్త తలనొప్పులు వచ్చి పడుతున్నాయి. సోలార్, విండ్ పవర్‌కు అనుకోకుండా ప్రతికూలత పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గత ఏడాదిలో మూడుసార్లు ఈ విద్యుత్ ఉత్పత్తి ఒక్కసారిగా పడిపోయింది. గాలి లేకపోవడం వల్ల పవన విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా ఆగిపోయిన సందర్భాలూ ఉన్నాయి. థర్మల్ విద్యుత్ ప్లాంట్లను పునరుద్ధరించాలంటే కనీసం 48 గంటలు పడుతుంది. పవన, సౌర విద్యుత్ ఆగిపోయి, థర్మల్ ప్లాంట్లు అందుబాటులో లేకపోవడం వల్ల గత సంవత్సరం మూడుసార్లు విద్యుత్ సంక్షోభం ఏర్పడింది. రెండు డిస్కమ్‌ల పరిధిలో అందుబాటులోని విద్యుత్తును సర్దుబాటు చేయడానికి పెద్దఎత్తున గంటల కొద్దీ విద్యుత్ సరఫరాను నిలిపివేయాల్సి వచ్చిందని ఎస్ఎల్‌డీసీ గుర్తుచేసింది. రాష్ట్రంలోని థర్మల్ ప్లాంట్లలో అవసరమైన మేర బొగ్గు నిల్వలున్నాయి. కొత్తగా విదేశీ బొగ్గును కూడా దిగుమతి చేసుకున్నారు. ఉత్పత్తికి అన్ని అవకాశాలున్నా, ప్రైవేటు పవన, సౌర విద్యుత్ కోసం ఉత్పత్తిని నిలిపివేయడం సరికాదని అభిప్రాయపడింది. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఇంధనశాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

ఆర్థిక శాఖ తీరుతో వైద్య సిబ్బందికి ఇక్కట్లు

- రెండు, మూడు నెలల పాటు జీతాలు అందక ఇబ్బందులు
- అనుమతి లేకుండా పోస్టులిచ్చారన్న కారణంతో మూడేళ్లుగా ఇదే తంతు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ తీరుతో 800 మందికి పైగా వైద్య సిబ్బంది ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక శాఖ అనుమతి లేకుండా పోస్టులిచ్చారన్న సాకుతో.. ఏటా రెండు, మూడు నెలల పాటు జీతాలు ఇవ్వకపోవడంతో అప్పుల్లో కూరుకుపోతున్నారు. 13వ ఆర్థిక సంఘం సహకారంతో 2014లో రాష్ట్రంలో 81 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరయ్యాయి. 11 మంది చొప్పున 81 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 891 మంది సిబ్బందిని మంజూరు చేశారు. వీళ్లందరినీ కాంట్రాక్టు పద్ధతిలో వైద్య ఆరోగ్య శాఖ నియమించింది. అయితే ఆర్థిక శాఖ అనుమతి లేకుండా నియమించారన్న కారణంతో.. ఏడాదిలో కనీసం రెండు సార్లయినా ఆర్థిక శాఖ వేతనాలు ఆపేస్తోంది. మూడేళ్లుగా ఇదే తంతు జరుగుతోంది. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు ఎన్జీవో నేతలు.. వారి వేతనాలు మంజూరు చేయించేందుకు కాంట్రాక్టు ఉద్యోగులు ఒక్కొక్కరి నుంచి రెండు, మూడు వేలు వసూలు చేస్తున్నట్టు కూడా ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఉద్యోగంలోకి వచ్చినా.. ఆరోగ్య శాఖ చేసిన తప్పుకు తామెందుకు శిక్ష అనుభవించాలని, ప్రతిసారీ ఎన్జీవో నేతలను మరెవరినో కాళ్లావేళ్లా పడాల్సిన పనేంటని వారు వాపోతున్నారు.

ఇళ్ల స్థలాల కోసం 18.78 లక్షల దరఖాస్తులు

2 లక్షల దరఖాస్తులు తిరస్కరణ

సాక్షి, అమరావతి: ఇళ్ల స్థలాల కోసం ‘మీ కోసం’ పోర్టల్‌కు 18,78,970 దరఖాస్తులు వచ్చాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్‌కు సీసీఎల్ఏ అనిల్ చంద్ర పునీత తెలిపారు. ఇళ్ల స్థలాల పంపిణీపై సీఎస్ గురువారం తాత్కాలిక సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పునీత మాట్లాడుతూ.. ఇప్పటివరకు 14,900 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు వివరించారు. డాక్యుమెంట్లు సమర్పించకపోవడం, బీపీఎల్ కుటుంబాలకు చెందిన వారు కాకపోవడంతో 2 లక్షల దరఖాస్తులను తిరస్కరించామని పునీత తెలిపారు. అనంతరం సీఎస్ మాట్లాడుతూ.. స్థలాల లభ్యత ఆధారంగా అర్హులకు ఇళ్ల స్థలాలు లేదా ఇళ్లయినా నిర్మించి ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మీ కోసం పోర్టల్‌కు వచ్చిన దరఖాస్తులన్నీ జిల్లా కలెక్టర్లకు పంపించాలని ఆదేశించారు. తహసీల్దార్లు వాటిని పరిశీలించి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసిన అనంతరం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులకు సీఎస్ స్పష్టం చేశారు.

సత్యశోధనకు చరిత్ర పరిశోధన జరగాల్సిందే

- శ్రీకృష్ణదేవరాయలు మూలాలు తెలకపోవటమే మంచిది
- పుస్తక పరిచయ సభలో జస్టిస్ జాస్తి చలమేశ్వర్



మాట్లాడుతున్న జస్టిస్ జాస్తి చలమేశ్వర్. వేదికపై రవీంద్రనాథ్, యార్లగడ్డ, రాజా

తెనాలి: తెలుగు భాషకు అపూర్వ గౌరవం ఇచ్చిన విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణదేవరాయలు తెలుగువాడా, కన్నడిగుడా.. అనేదే కాకుండా ఆయన కులం కూడా ఎప్పటికీ తేలకపోవటమే మంచిదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అభిప్రాయపడ్డారు. అప్పుడే రెండు రాష్ట్రాల వారు సహా అందరూ ఆయన్ను ప్రేమిస్తారని, ఫలానా కులం అని తేలితే ఇతర కులాలు చిన్నచూపు చూసే ప్రమాదముందని చెప్పారు. సత్యశోధన జరగాలంటే చరిత్ర గురించి పరిశోధన జరగాల్సిందేనని చెబుతూ, దేశంలో ప్రస్తుతమున్న పరిస్థితుల దృష్ట్యా రాయలు చరిత్ర తెలియకుండా ఉండటమే మంచిదన్నారు. తెనాలికి చెందిన రచయిత, పరిశోధకుడు ముత్తేవి రవీంద్రనాథ్ రచించిన పరిశోధన గ్రంథం ‘శ్రీకృష్ణదేవరాయలు వంశ మూలాలు’ పరిచయ సభ గురువారం పట్టణంలో నిర్వహించారు. మాజీ ఎంపీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జస్టిస్ చలమేశ్వర్ మాట్లాడుతూ.. చరిత్ర అధ్యయనం తనకిష్టమని, ముఖ్యంగా విజయనగర చరిత్ర తెలుసుకోవటమని చెప్పారు. ఏపీ, కర్ణాటకలోని సువిశాలమైన సామ్రాజ్యాన్ని పరిపాలించిన రాయలు జనన, మరణ తేదీలు మనకు తెలియదని గుర్తుచేశారు. రాజవంశాలకు కులాలుంటాయంటే తాను విశ్వసించనని చెప్పారు.

చరిత్ర గతిని మార్చేస్తున్నారు..

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. అజ్ఞానంతో కొందరు, అహంకారంతో మరికొందరు, అమాయకత్వంతో ఇంకొందరు చరిత్ర గతిని మార్చేస్తున్నారని విమర్శించారు. రచయిత ముత్తేవి రవీంద్రనాథ్ తన కృతజ్ఞతాపూర్వక ప్రసంగంలో శ్రీకృష్ణదేవరాయలు తెలుగు ప్రజల కీర్తిపతాకగా చెబుతూ, కులాభిమానం, దురభిమానం కారణంగా చరిత్ర వక్రీకరించకూడదన్న భావనతో గ్రంథ రచనకు పూనుకున్నట్టు చెప్పారు. తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ కూడా మాట్లాడారు. రచయిత డాక్టర్ సూర్యదేవర రవికుమార్ స్వాగతం పలికారు.

తల్లిదండ్రుల నుండి రక్షణ కల్పించండి

విలేకరుల సమావేశంలో ప్రేమజంట



రక్షణ కల్పించాలని కోరుతున్న ప్రేమజంట బాలసంగీత, సంతోష్

అల్లిపురం (విశాఖదక్షిణ): చట్టబద్ధంగా ఒక్కటైన మేజర్లమైన తమను తల్లిదండ్రులు వేరుచేయాలని చూడటమే కాక, హత్యాయత్నానికి ప్రయత్నిస్తున్నారని ప్రేమజంట బాల సంగీత, సంతోష్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖపట్నంలోని వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం వారు మహిళా చేతన్ అధ్యక్షురాలు కత్తి పద్మతో కలసి వివరాలు వెల్లడించారు. బాలసంగీత నగరంలోని గాయత్రి విద్యాపరిషత్‌లో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతోంది. ఆమెకు నగరంలోని తాటిచెట్లపాలేనికి చెందిన ఎం.సంతోష్‌బాబుతో ఫేస్‌బుక్‌లో పరిచయం కుదిరింది. అతను బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. వీరి ప్రేమవ్యవహారం తెలిసిన బాల సంగీత కుటుంబ సభ్యులు అబ్బాయి కులంవేరని చెప్పి పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో ప్రేమికులిద్దరూ గత నవంబర్ 19న నగరంలో ఒక దేవాలయంలో వివాహం చేసుకున్నారు. తరువాత ఆ ప్రేమ జంట తమ పెళ్లిని చట్టబద్ధంగా రిజిస్టర్ చేసుకున్నారు. విషయం తెలుసుకున్న అమ్మాయి బంధువులు తమ పరువు తీసిందని.. చంపేస్తామని బెదిరిస్తున్నారని మహిళా చేతన అధ్యక్షురాలు కత్తి పద్మ ఆందోళన వ్యక్తం చేశారు. యువతి ఫిర్యాదు మేరకు 4వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

రేషన్ డీలర్ల కమీషన్ బకాయి రూ.40 కోట్లు

- అప్పులతో సతమతమవుతున్న డీలర్లు
- వెంటనే కమీషన్ చెల్లించాలని వేడుకోలు

సాక్షి, అమరావతి: పేదలకు సరుకులు పంపిణీ చేసినందుకు ప్రభుత్వం చెల్లించాల్సిన కమీషన్ సకాలంలో మంజూరు చేయకపోవడంతో రేషన్ డీలర్లకు షాపుల నిర్వహణ భారంగా మారింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా తెల్లరేషన్ కార్డులకు, అంగన్‌వాడీ సెంటర్లకు, మధ్యాహ్న భోజన పథకం కోసం సరుకులను పంపిణీ చేసినందుకు డీలర్ల బ్యాంకు ఖాతాలకు ప్రతి నెలా కమీషన్ జమ చేయాలి. ప్రభుత్వం కాలయాపన చేయడంతో కమీషన్ మొత్తం దాదాపు రూ.40 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం బియ్యం, పంచదార ఒక్కటే రేషన్ షాపుల ద్వారా ఇస్తున్నారు. వాటి ద్వారా వచ్చే కమీషన్‌తో షాపుల నిర్వహణ కష్టతరంగా మారిపోయిందని డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం, కందిపప్పు తదితర వస్తువులను రేషన్ షాపుల నుంచే ప్రభుత్వం సరఫరా చేస్తున్నా మూడేళ్లుగా కమీషన్ ఇవ్వడం లేదు. పేదలకు బియ్యం పంపిణీ చేసినందుకు డీలర్లకు ఇచ్చే కమిషన్‌ను క్వింటాల్‌కు రూ.87 ప్రకారం నిర్ణయించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తోంది. రేషన్ డీలర్లను కేంద్ర ప్రభుత్వం ఆదుకున్నా రాష్ట్ర ప్రభుత్వం వాటిలో కోత విధించి రూ.70 మాత్రమే కమిషన్ చెల్లించేలా డీలర్లతో ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలోని 29 వేల మంది రేషన్ డీలర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.40 కోట్ల వరకు కమీషన్ రూపంలో చెల్లించాల్సి ఉంది. బకాయిలు విడుదల చేయకపోవడంతో డీలర్లు అప్పులపాలవుతున్నారని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు వాపోయారు.



గుడారాల పండుగకు హాజరైన భక్తులు



వేదికపై బ్రదర్ అబ్రహాం, జాన్‌వెస్లీ తదితరులు

హోసన్నా 41వ గుడారాల పండుగ ప్రారంభం

తొలిరోజు పెద్ద సంఖ్యలో పాల్గొన్న క్రీస్తు భక్తులు

గుంటూరు రూరల్: హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 41వ గుడారాల పండుగను గురువారం రాత్రి వేడుకగా ప్రారంభించారు. గుంటూరు సమీపంలోని గోరంట్ల గ్రామంలోని హోసన్నా మందిరం సమీపంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ప్రాంగణంలో ప్రార్థనలు ప్రారంభించారు. తొలుత శాంతికి చిహ్నంగా పావురాలను ఎగురవేశారు. అనంతరం 41వ నూతన హోసన్న మినిస్ట్రీస్ పాటల సీడీలను బ్రదర్ రత్నపాల్ కమలాకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ముందుగా పాస్టర్ మోహన్‌సీ లాజరస్ ప్రత్యేక ప్రార్థన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం క్రీస్తు నూతన పాటలను హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో ఆలపించారు. గుడారాల పండుగ ద్వారా రాష్ట్రంలోని ప్రజలకు శాంతి చేకూరాలని ఈ సందర్భంగా ప్రార్థన చేశారు. మూడు రోజులపాటు జరిగే ఈ పండుగ ఆదివారం మధ్యాహ్నంతో ముగుస్తుంది. కాగా, మొదటి రోజు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ సాయిరేవతి వివాహం

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ దంపతుల ఆశీస్సులు



వధూవరులు సాయిరేవతి, భార్గవ్‌కుమార్‌తో జస్టిస్ జాస్తి చలమేశ్వర్ దంపతులు, ఆలపాటి రాజా, సాయిరేవతి కుటుంబసభ్యులు

తెనాలి: పట్టణానికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్, కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల స్వర్ణపతక విజేత ఘట్టమనేని సాయిరేవతి వివాహం గురువారం రాత్రి స్థానిక చెంచుపేటలోని చావాస్ గ్రాండ్‌లో వైభవంగా జరిగింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ దంపతులు వివాహానికి హాజరై వధూవరులు సాయిరేవతి, భార్గవ్‌కుమార్‌లను ఆశీర్వదించారు. తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, జెడ్పీటీసీ అన్నాబత్తుని జయలక్ష్మి, హోటల్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్, జీడీసీసీబీ మాజీ చైర్మన్ మారౌతు సీతారామయ్య హాజరయ్యారు.

ఫోన్‌లో పెళ్లి.. 21 ఏళ్ల నరకం..

- అరబ్ షేక్‌ల దాష్టీకానికి బలైన పాతబస్తీ బాలిక
- 1996లో మస్కట్ షేక్‌తో ఫోన్‌లో వివాహం



తల్లిదండ్రులతో మహ్మదీ బేగం చిత్రంలో ఎంబీటీ పార్టీ నేత అంజదుల్లాఖాన్

సాక్షి, హైదరాబాద్: ఫోన్.. ఫేస్‌బుక్.. వాట్సాప్‌లో తలాక్ చెప్పడం మనకు తెలిసిందే.. అయితే 21 ఏళ్ల క్రితమే అరబ్ షేక్‌తో పాత బస్తీకి చెందిన 15 ఏళ్ల బాలికకు ఫోన్‌లోనే పెళ్లయ్యింది. అరబ్ షేక్‌తో పెళ్లి చేస్తే కూతురు జీవితం బాగుపడుతుందని తల్లిదండ్రులు భావిస్తే.. విధి మరొకటి తలిచింది. ఈ 21 ఏళ్ల నరకం అనుభవించిన ఆమె విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ చొరవతో బుధవారం హైదరాబాద్ చేరుకుంది. వివరాల్లోకి వెళితే.. పాతబస్తీలో సైకిల్ రిపేరింగ్ షాప్ నడిపిస్తున్న మహ్మద్ అక్బర్ కూతురు మహ్మదీ బేగం. 1996లో మస్కట్ దేశం నుంచి పాతబస్తీకి వచ్చిన ఓ వృద్ధుడైన అరబ్ షేక్ ఇక్కడి అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. ఈ క్రమంలో అతడికి మహ్మద్ అక్బర్‌తో పరిచయమైంది. తనకూ కూతుళ్లు ఉన్నారని, పేదరికం వల్ల వారి పెళ్లిళ్లు ఎలా చేయాలో తెలియడం లేదని తన గోడు అరబ్ షేక్‌కు చెప్పుకున్నాడు. అక్బర్ మాటలు విన్న అరబ్ షేక్ మస్కట్‌లో తన బావమరిది మహ్మద్ యూనస్ ఉన్నాడని, అతనికి మీ అమ్మాయినిచ్చి పెళ్లి చేస్తే.. మీ ఆర్థిక పరిస్థితులు కూడా బాగుపడుతాయని చెప్పాడు. అబ్బాయి ఇక్కడికి రావాలంటే వీసా కోసం జాప్యం జరుగుతుందని, ఫోన్‌లోనే పెళ్లి చేయిద్దామని సలహా ఇచ్చాడు. 1996 సెప్టెంబర్ 1న వివాహం జరిపించారు.పెళ్లయిన పది రోజులకు అరబ్ షేక్ సేవకురాలి వీసాపై మహ్మదీ బేగం మస్కట్‌కు వెళ్లింది. అక్కడికి వెళ్లిన తర్వాత బేగం పరిస్థితి దారుణంగా తయారైంది. ఫోన్‌లో పెళ్లి చేసుకున్న భర్తకు అప్పటికే ఇద్దరు భార్యలున్నారు. అక్కడి పరిస్థితులను తల్లిదండ్రులకు వివరించి.. హైదరాబాద్ వచ్చేస్తానని కన్నీరుమున్నీరైంది. అరబ్ షేక్ నుంచి తీసుకున్న డబ్బులు అప్పులకు చెల్లించామని, ఏదోలా సర్దుకుని ఉండాలని తల్లిదండ్రులు చెప్పారు. గత్యంతరం లేక బేగం అక్కడే ఉండిపోయింది. ఆమెకు ముగ్గురు పిల్లలు పుట్టారు.

మస్కట్ నుంచి పాకిస్తాన్‌కు..

చట్టవిరుద్ధంగా తమ దేశంలో ఉంటున్న వారు స్వదేశం వెళ్లిపోవాలని, లేని పక్షంలో జైలులో పెడతామని మస్కట్ ప్రభుత్వం ఇటీవల కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో మహ్మదీ బేగం భర్త యూనస్ అసలు దేశం పాకిస్తాన్. అతడు మస్కట్‌లో చట్టవిరుద్ధంగా ఉండటంతో.. ఇద్దరు భార్యలు, మహ్మదీ బేగంతో పాటు 2012 జూన్‌లో పాక్ చేరుకున్నాడు. బేగం భారతదేశానికి చెందినది కావడంతో అక్కడి పోలీసులకు సమాచారం తెలియకుండా ఆమెను గ్యారేజ్‌లో బంధించాడు. పెళ్లి చేయించి తీసుకెళ్లిన అరబ్ షేక్ కూడా చనిపోవడంతో బేగంకు తల్లిదండ్రులతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. ఓ రోజు యూనస్ ఇంటికి వచ్చిన బంధువులు.. లోపల నుంచి ఏడుపులు వినిపించడంతో గ్యారేజ్‌లో ఎవరున్నారని ప్రశ్నించారు. జరిగినదంతా వారికి అతడు వివరించాడు. బేగం దీన పరిస్థితిని చూసి చలించిపోయిన వారు.. హైదరాబాద్‌లో ఉన్న తల్లిదండ్రులతో మాట్లాడించారు. తమ కుమార్తె పాక్‌లో నరకం అనుభవిస్తోందని, ఆమెను నగరానికి తీసుకురావడానికి పలు ముస్లిం స్వచ్ఛంద సంస్థలతో తల్లిదండ్రులు సంప్రదించారు. ఎంబీటీ పార్టీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్‌ను కలసి బేగం విషయం వివరించారు. అంజదుల్లాఖాన్ విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్‌కు లేఖ రాశారు. భారత రాయబార కార్యాలయ సిబ్బంది, స్థానిక పోలీసుల సహాయంతో భారత రాయబార కార్యాలయానికి తీసుకొచ్చారు. గత నెల 28న ఆమె నగరానికి చేరుకుంది.

చెట్టు కూలి ఇద్దరు కార్మికుల మృతి

పరవాడ (పెందుర్తి): ఇంటి నిర్మాణానికి అడ్డుగా ఉన్న చెట్టును తొలగించడానికి ప్రయత్నిస్తున్న కూలీలపై చెట్టు కొమ్మలు పడడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. విశాఖ జిల్లా పరవాడ గ్రామంలో చోటుచేసుకున్న ఈ విషాదం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లాలం రమణకు చెందిన ఇంటి స్థలంలో నిర్మాణం పనులు చేయడానికి అడ్డుగా ఉన్న చెట్టు కొట్టేందుకు కొందరు కూలీలను ఏర్పాటు చేశారు. ఇంటి స్థలం పక్కనే ఉన్న ఎండుచెట్టును గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో కొందరు కూలీలు నరుకుతుండగా చెట్టు కొమ్మలు విరిగి పైల అప్పారావు(50), బండారు అప్పారావు(70)లపై పడ్డాయి. తీవ్ర గాయాలు కావడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు.

● తెలంగాణ

55 మంది ‘తండ్రులకు’ జైలు

- గురువారమే పది మందికి విధించిన కోర్టు
- మైనర్లకు వాహనాలు ఇచ్చిన నేరానికి..



సాక్షి, హైదరాబాద్: అత్యంత తీవ్రమైన ఉల్లంఘనగా భావించే మైనర్ డ్రైవింగ్‌పై నగర ట్రాఫిక్ విభాగం అధికారులు నెల రోజులుగా స్పెషల్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నారు. ఎవరైనా చిక్కితే జరిమానాతో సరిపెట్టడం లేదు. వారి నుంచి వాహనాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు డ్రైవర్లుగా ఉన్న మైనర్లు, వీరికి వాహనాలిచ్చిన తల్లిదండ్రులు, యజమానులపై కోర్టుల్లో అభియోగ పత్రాలు దాఖలు చేస్తున్నారు. ఇలా గత నెల రోజుల కాలంలో 1,079 చార్జ్‌షీట్లు దాఖలు చేయగా... మొత్తం 55 మంది తండ్రులకు ఒకటి నుంచి రెండు రోజులు జైలు శిక్ష పడింది. గురువారం ఒక్క రోజే నాంపల్లిలోని 9వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కె.అల్తాఫ్ హుస్సేన్ 10 మందికి ఒకరోజు చొప్పున జైలు శిక్ష విధించారు. బుధవారం టోలిచౌకి పరిధికి చెందిన ఓ మైనర్‌కు ఒక రోజు శిక్ష పడటంతో జువైనల్ హోమ్‌కు తరలించారు.

మైనర్ డ్రైవింగ్‌పై తొలిసారిగా బాలుడికి శిక్ష

గత కొన్నాళ్లుగా వాహనం ఇచ్చిన నేరంపై తండ్రులకు ఒకటి నుంచి రెండు రోజుల వరకు జైలు శిక్షలు పడుతున్నా... ఇలా మైనర్ డ్రైవింగ్ కేసులో బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించడం ఇదే తొలిసారి అని డీసీపీ ఏవీ రంగనాథ్ ‘సాక్షి’కి తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు ఉల్లంఘనల్ని ప్రధానంగా మూడు కేటగిరీలు విభజిస్తారు. వాహనం నడిపే వ్యక్తికి ముప్పు కలిగించేవి, ఎదుటి వారికి ముప్పుగా మారేవి, వాహన చోదకుడితో పాటు ఎదుటి వ్యక్తికీ ముప్పును తెచ్చిపెట్టేవి. మైనర్ డ్రైవింగ్ మూడో కేటగిరీ కిందికి వస్తుందని ట్రాఫిక్ పోలీసులు చెప్తున్నారు. భారత మోటారు వాహనాల చట్టం ప్రకారం (ఎంవీ యాక్ట్) పదహారేళ్ల లోపు వయస్సు వారు ఎలాంటి వాహనాలనూ నడపకూడదు. 16 ఏళ్లు నిండిన వారు మాత్రం కేవలం గేర్లు లేని సాధారణ వాహనాలు నడిపే అవకాశం ఉంటుంది. పద్దెనిమిదేళ్లు నిండిన తరవాత మాత్రమే గేర్స్‌తో కూడిన వాహనాలు నడపడానికి అర్హులు. చట్ట ప్రకారం మైనర్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తికి వాహనాన్ని ఇచ్చిన యజమాని సైతం శిక్షార్హుడే.

బాధ్యతలు చేపట్టిన బిక్కి రవీంద్రబాబు

ఎన్‌సీఎల్‌టీలోని ఇద్దరు సభ్యులూ తెలుగువారే

సాక్షి, హైదరాబాద్: నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్‌లో జ్యుడీషియల్ సభ్యుడిగా నియమితులైన బిక్కి రవీంద్రబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న జ్యుడీషియల్ సభ్యుడు విత్తనాల రాజేశ్వరరావు, ఇప్పుడు మరో సభ్యుడు బిక్కి రవీంద్రబాబు ఇద్దరూ తెలుగు వ్యక్తులు కావడం విశేషం. మొన్నటివరకు సాంకేతిక సభ్యుడిగా ఉన్న రవికుమార్ దొరైస్వామిని ముంబై ఎన్‌సీఎల్‌టీ బెంచ్‌కు బదిలీ చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే సమయంలో అహ్మదాబాద్ ఎన్‌సీఎల్‌టీలో పనిచేస్తున్న రవీంద్రబాబును హైదరాబాద్‌కు బదిలీ చేసింది. విత్తనాల రాజేశ్వరరావుతో ఓ ధర్మాసనం, రవీంద్రబాబుతో మరో ధర్మాసనం ఏర్పాటుచేస్తూ ఎన్‌సీఎల్‌టీ రిజిస్ట్రార్ శివరాం భైర్వా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌సీఎల్‌టీ అధ్యక్షుడు జస్టిస్ ఎంఎం కుమార్ ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బడ్జెట్ కౌంట్ డౌన్ షురూ!

రెండో వారంలో ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్ కౌంట్ డౌన్ మొదలైంది. ఈ నెల రెండో వారంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ఆర్థిక శాఖ సన్నాహాలు మెదలుపెట్టింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దిశానిర్దేశం మేరకు వరుసగా ఐదో ఏడాది భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దేశంలోని రెవెన్యూ మిగులు ఉన్న రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణలో ఆర్థిక పరిస్థితులేంటి.. గతేడాది జూలై నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీ ప్రభావం ఎంత.. ఆదాయ వ్యయాలెలా ఉన్నాయో.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తమ ఆదాయ వ్యయాల చిట్టాను కాగ్‌కు సమర్పించింది. 2018 జనవరి నెలాఖరు ఉన్న వివరాలను ఇందులో పొందుపరిచింది.

రూ.1.10 లక్షల కోట్లకు ఆదాయం!

కాగ్‌కు సమర్పించిన నివేదిక ప్రకారం.. 2017–18 ఆర్థిక సంవత్సరంలో మిగులు ఆదాయం ఉంటుందని ప్రభుత్వం వేసిన అంచనాలు అందుకోవటం కష్టంగానే ఉంది. మొత్తం రూ.1.49 లక్షల కోట్ల రాబడి అంచనా వేసిన ప్రభుత్వం.. జనవరి నెలాఖరు వరకు రూ.90,330 కోట్ల ఆదాయాన్ని అందుకుంది. అందులో రూ.87 వేల కోట్లు ఖర్చు చేసింది. సగటున ప్రతినెలా రూ.9 వేల కోట్ల ఆదాయం నమోదు చేసుకుంది. అదే అంచనాతో ఆర్థిక సంవత్సరంలో మిగిలిన ఫిబ్రవరి, మార్చి నెలల ఆదాయం కూడా జోడిస్తే.. రాష్ట్ర ఆదాయం దాదాపు రూ.1.10 లక్షల కోట్లకు చేరే అవకాశముంది. వాస్తవ ఆదాయానికి మించి అంచనాలు వేసుకోవటంతో పాటు ఏడాది మధ్యలో కేంద్రం తెచ్చిన జీఎస్టీ ఎఫెక్ట్‌తోనే ఈ పరిస్థితి తలెత్తినట్లు స్పష్టమవుతోంది.

15.6 శాతం ఆదాయ వృద్ధి..

అంతకు ముందు ఏడాదితో పోలిస్తే రాష్ట్ర రెవెన్యూ రాబడి మొత్తం 13 శాతం ఎగబాకింది. పన్నుల ద్వారా వచ్చే ఆదాయం 15.6 శాతం వృద్ధి సాధించింది. 2016–17లో తొలి పది నెలల్లో పన్నుల ద్వారా రూ.48,704 కోట్ల ఆదాయం సమకూరగా, ఈ జనవరి నెలాఖరుకు రూ.56,348 కోట్ల రాబడి వచ్చింది. అయితే జీఎస్టీతో రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లింది. 2016–17లో పది నెలల్లోనే వ్యాట్ ద్వారా రూ.27 వేల కోట్ల ఆదాయం వస్తే.. జీఎస్టీతో ఈ సారి రూ.20,882 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో జీఎస్టీతో దాదాపు రూ.7 వేల కోట్ల గండి పడింది.

సాక్షి
భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
శుక్రవారం 2-3-2018

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్ ప్రిలిమినరీ పరీక్ష వాయిదా

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ).. 8,301 జూనియర్ అసోసియేట్ (కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్) పోస్టుల భర్తీకి మార్చి/ ఏప్రిల్ 2018లో జరగాల్సిన ప్రిలిమినరీ పరీక్షను జూన్/జూలై 2018కు ఎస్‌బీఐ వాయిదా వేసింది. దీనికి సంబంధించి కాల్ లెటర్ల డౌన్‌లోడ్, పరీక్ష తేదీల్లో మార్పులు చేసింది. దీని ప్రకారం ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ కాల్ లెటర్లను 2018, జూన్ 6 నుంచి, మెయిన్ ఎగ్జామినేషన్ కాల్ లెటర్లను 2018, జూలై 23 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అలాగే ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ జూన్/జూలై-2018లో, మెయిన్ ఎగ్జామినేషన్ 2018, ఆగస్టు 5న జరపనున్నట్లు మార్పులతో కూడిన ప్రకటన విడుదల చేసింది.

విద్య, ఉద్యోగ సమాచారం



యూపీఎస్సీ.. 6 ఖాళీలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. 6 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **పోస్టు-ఖాళీలు:** ట్రాన్స్‌లేటర్ (టిబెటన్)-1; అసిస్టెంట్ డైరెక్టర్ సేఫ్టీ-5 (కెమికల్-1+ఎలక్ట్రికల్-1+మెకానికల్-3).
- **వేతనశ్రేణి:** రూ.56,100-రూ.1,77,500.
- **అర్హతలు:** ట్రాన్స్‌లేటర్‌కు బ్యాచిలర్ డిగ్రీ (టిబెటన్)/డిప్లొమా (టిబెటన్); అసిస్టెంట్ డైరెక్టర్ సేఫ్టీ పోస్టులకు ఇంజనీరింగ్ డిగ్రీ (కెమికల్/ఎలక్ట్రికల్/మెకానికల్)/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. అలాగే నిబంధనల మేర సంబంధిత రంగంలో అనుభవం.
- **వయసు:** 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ. ❖ **దరఖాస్తు రుసుం:** రూ.25; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** మార్చి 15, 2018.
- **వెబ్‌సైట్:** https://upsconline.nic.in

రైట్స్ లిమిటెడ్‌లో 11 ఖాళీలు

కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలోని మినీ రత్న సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ అయిన రైట్స్ లిమిటెడ్... సివిల్ విభాగంలోని 11 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **పోస్టు-ఖాళీలు:** డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం)-4 (ఏఆర్ఈ స్లీపర్ ప్లాంట్); మేనేజర్-7 (ఏఆర్ఈ బ్రిడ్జ్).
- **వేతనశ్రేణి:** డీజీఎం-రూ.29,100-రూ.54,500; మేనేజర్-రూ.24,900-రూ.50,500. ❖ **అర్హతలు:** సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ/డిప్లొమాతోపాటు సంబంధిత రంగంలో నిబంధనల మేర అనుభవం.
- **వయసు:** 2018, ఫిబ్రవరి 1 నాటికి 55 ఏళ్లు మించకూడదు.
- రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ.❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి గడువులోగా పంపాలి. ❖ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 9, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** మార్చి 16, 2018. ❖ **వెబ్‌సైట్:** www.ritesltd.com

ఎన్ఈఈఆర్ఐలో 15 ఖాళీలు

నాగపూర్‌లోని నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఈఈ ఆర్ఐ)... 15 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)కు చెందింది.
- **పోస్టు-ఖాళీలు:** టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ)-10; టెక్నికల్ ఆఫీసర్ (టీవో)-1; సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ (ఎస్ఆర్‌టీవో)-4. ❖ **వేతనం:** టీఏ-రూ.35,400; టీవో-రూ.49,900; ఎస్ఆర్‌టీవో-రూ.56,100.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి బీఎస్సీ/బీఎస్సీ ఇంజనీరింగ్/ఇంజనీరింగ్ డిప్లొమా/బీఈ/బీటెక్/ఎంబీఏ/ఎంఎస్సీ/ఎంబీబీఎస్. అలాగే సంబంధిత రంగంలో నిబంధనల మేర అనుభవం ఉండాలి.
- **వయసు:** 2018, జనవరి 31 నాటికి టీఏకు 28 ఏళ్లు; టీవో-30 ఏళ్లు, ఎస్ఆర్‌టీవో-35/40 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష/స్కినింగ్ టెస్ట్, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ.❖ **దరఖాస్తు రుసుం:** రూ.100; రిజర్వేషన్ కేటగిరీలకు ఫీజు లేదు. ❖ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఏప్రిల్ 2, 2018. ❖ **వెబ్‌సైట్:** www.neeri.res.in

వాప్‌కోస్‌లో 10 ఖాళీలు

హర్యానాలోని గురుగ్రామ్‌లో ఉన్న వాప్‌కోస్ లిమిటెడ్.. 10 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **పోస్టు:** జూనియర్ అసిస్టెంట్ (ఫైనాన్స్)-8; సిస్టమ్ ఆఫీసర్-1; సీనియర్ సిస్టమ్ ఆఫీసర్-1.
- **వేతనశ్రేణి:** జూనియర్ అసిస్టెంట్-రూ.19,000-రూ.66,000; సిస్టమ్ ఆఫీసర్-రూ.40,000-రూ.1,40,000; సీనియర్ సిస్టమ్ ఆఫీసర్-రూ.50,000-రూ.1,60,000.
- **అర్హతలు:** జూనియర్ అసిస్టెంట్ (ఫైనాన్స్)కు బీకామ్; మిగిలిన పోస్టులకు బీఈ/బీటెక్ (ఐటీ)/కంప్యూటర్ సైన్స్/ఈఅండ్‌సీ/ఎంసీఏ/ఎంకామ్/సీఏ/ఐసీడబ్ల్యూఏ. అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం, సంబంధిత రంగం ప్రత్యేకాంశాల్లో నైపుణ్యం తదితర అర్హతలుండాలి.
- **వయసు:** జూనియర్ అసిస్టెంట్‌కు 27 ఏళ్లు; సిస్టమ్ ఆఫీసర్-40 ఏళ్లు; సీనియర్ సిస్టమ్ ఆఫీసర్‌కు 42 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** స్కిల్‌టెస్ట్/ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** జనరల్/ఓబీసీ-రూ.1,000; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ-రూ.500.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** మార్చి 9, 2018.
- **వెబ్‌సైట్:** www.wapcos.gov.in

ఐఐఎస్ఈఆర్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)లలో ఐదేళ్ల బీఎస్-ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు సంయుక్త ప్రకటన వెలువడింది. ఉమ్మడి పరీక్ష ద్వారా ఈ సంస్థల్లో ప్రవేశాలు కల్పిస్తారు.
- **ఐఐఎస్ఈఆర్‌లు:** తిరుపతి, బెర్హంపూర్, భోపాల్, కోల్‌కతా, మొహాలి, పుణె, తిరువనంతపురం ❖ **అర్హత:** సైన్సు సబ్జెక్టులతో 2017, 2018 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై 1)కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై) ఫెలోషిప్ లేదా జేఈఈ అడ్వాన్స్‌డ్ 2018 ర్యాంకు లేదా ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారాలో కనబర్చే ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. ❖ ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ జూన్‌లో ఉంటుంది. కేవీపీవై అభ్యర్థులకు సదరు ఉపకారవేతనాలు లభిస్తాయి. మిగతా వారికి పరిమిత సంఖ్యలో ఇన్‌స్పైర్ ఉపకారవేతనాల కింద నెలకు రూ.5000 చెల్లిస్తారు. ❖ **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** 2018 మే లో ప్రారంభమవుతుంది. ❖ **దరఖాస్తు ఫీజు:** రూ.2000 (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు రూ.1000) ❖ **వెబ్‌సైట్:** https://www.iiseradmission.in

కాంపిటీటివ్ కౌన్సెలింగ్



ఉద్యోగ నియామక పరీక్షలను ఆన్‌లైన్లో విజయవంతంగా రాయాలంటే సన్నద్ధత ఎలా ఉండాలి?

- వి.అనూష, రాజమండ్రి.

- ఆన్‌లైన్ పరీక్షలకు హాజరుకాబోయే అభ్యర్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్ మాక్‌టెస్టులు ప్రాక్టీస్ చేయాలి. తొలుత ఆయా పరీక్షలకు సంబంధించి సబ్జెక్టుల వారీగా పరీక్షలు రాయాలి. మొత్తం సిలబస్ చదవడం పూర్తయ్యాక గ్రాండ్ టెస్టులు ప్రాక్టీస్ చేయాలి.
- ఆన్‌లైన్ మాక్ పరీక్షలకు హాజరు కావడం ద్వారా పరీక్ష విధానానికి అలవాటుపడటంతోపాటు టైం మేనేజ్‌మెంట్ అలవడుతుంది. ఎంత సమయంలో ఎన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలుగుతున్నారో తెలుస్తుంది. ప్రిపరేషన్ పరంగా బలాలు-బలహీనతలు తెలుస్తాయి.
- ఆన్‌లైన్ మాక్ పరీక్ష రాసిన తర్వాత పేపర్, 'కీ'ని డౌన్‌లోడ్ చేసుకొని సమీక్షిస్తే మంచి ఫలితం ఉంటుంది. ఏవైనా సందేహాలుంటే సంబంధిత సబ్జెక్టు నిపుణులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలి.
- ఆన్‌లైన్ మాక్ టెస్టుల వల్ల అభ్యర్థులు తమ సన్నద్ధత స్థాయిని అంచనా వేసుకొని, తదనుగుణంగా ప్రిపరేషన్ ప్రణాళికను మార్చుకోవచ్చు.
- వాస్తవ ఆన్‌లైన్ పరీక్ష రాసేముందు సిస్టమ్‌కు సంబంధించి ఎలాంటి టెక్నికల్ సమస్యలున్నా వెంటనే పరీక్ష కేంద్రం సమన్వయకర్త దృష్టికి తీసుకెళ్లాలి.
- చాలా ఆన్‌లైన్ మాక్‌టెస్టులు రాశాం కాబట్టి, మళ్లీ వాస్తవ పరీక్ష సమయంలో నిబంధనలు (Instructions) చదవనవసరం లేదన్న భావనతో కొందరు నేరుగా పరీక్ష రాయడం ప్రారంభిస్తారు. ఇది సరికాదు. తప్పనిసరిగా ముందు నిబంధనలన్నీ చదవాలి. తొలుత బాగా తెలిసిన ప్రశ్నలన్నింటికీ సమాధానాలు గుర్తించాలి. దీనివల్ల ఆత్మవిశ్వాసం పెరిగి, ఒత్తిడికి తావులేకుండా మిగిలిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించవచ్చు.

స్కూల్ ఎడ్యుకేషన్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖ (182), గిరిజన సంక్షేమ శాఖ (35), బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (41), ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (50) తదితర మొత్తం 308 గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలోకి ప్రవేశానికి ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, అమరావతి నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఆంధ్రప్రదేశ్ గురుకులాలు

గురుకులాల ప్రత్యేకతలు

- గురుకులాల్లో ప్రవేశంపొందిన విద్యార్థులకు సమర్థులైన ఉపాధ్యాయుల బోధన, పర్యవేక్షణ లభిస్తుంది.
- సమర్థులైన, సుదీర్ఘ అనుభవం కలిగిన ఉపాధ్యాయుల బోధనతోపాటు, 24 గంటల పర్యవేక్షణ ఉంటుంది. విద్యార్థుల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని.. పరిష్కరించేందుకు హౌస్ మాస్టర్/హౌస్ పేరెంట్ వ్యవస్థ ఉంటుంది.
- ఐఐటీ, ఎంసెట్, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించేలా నిపుణుల శిక్షణ అందిస్తారు. సెంట్రల్ యూనివర్సిటీలు, నల్సార్, టిస్, ఇఫ్లూ తదితర ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందేలా విద్యార్థులకు నిరంతరం మార్గనిర్దేశం చేస్తారు.
- పాఠ్యాంశాలతో పాటు క్రీడలు, యోగా, ఫిజికల్ ఎడ్యుకేషన్, మార్షల్ ఆర్ట్స్, లలిత కళలు తదితరాలపైనా అవగాహన కల్పిస్తారు.
- విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేలా బహుమతులు అందిస్తారు. వీటన్నింటితోపాటు విద్యార్థులకు పోషకాహారం, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం, ఇతర సౌకర్యాలు కల్పిస్తారు.

అర్హతలు

- 2017-18 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో విద్యార్థి 4వ తరగతి చదువుతుండాలి.
- ఓసీ/బీసీ/ఈబీసీ/ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్స్ (బీసీ-సీ) 1.09.2007 నుంచి 31.08.2009 మధ్య జన్మించి ఉండాలి.
- ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు 01.09.2005 నుంచి 31.08.2009 మధ్య జన్మించి ఉండాలి.
- విద్యార్థులు రెండేళ్లపాటు 3,4 తరగతులను (2016-17, 2017-18) చదివిన జిల్లాకు స్థానికులవుతారు.
- తల్లిదండ్రులు/సంరక్షకుల సంవత్సరాదాయం రూ.1,00,000 మించకూడదు.

ఎంపిక ప్రక్రియ

ప్రవేశ పరీక్ష ద్వారా జిల్లాల వారీగా బాలురు, బాలికలకు ప్రత్యేకంగా మెరిట్‌లిస్ట్ తయారుచేస్తారు. 50 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమాల్లో అందుబాటులో ఉంటుంది.

విభాగం	సబ్జెక్టు	ప్రశ్నలు	మార్కులు
పార్ట్-ఏ	తెలుగు	10	10
పార్ట్-బీ	ఇంగ్లిష్	10	10
పార్ట్-సీ	మ్యాథమెటిక్స్	10	10
పార్ట్-డీ	ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ (సైన్స్+సోషల్)	20	20
మొత్తం		50	50

దరఖాస్తు విధానం

- https://apgpcet.apcfss.in ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. ఎలాంటి దరఖాస్తు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** మార్చి 20, 2018.
- **హాల్‌టికెట్:** ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తిచేశాక.. హాల్‌టికెట్‌ను ప్రింట్‌అవుట్ తీసుకొని పరీక్ష కేంద్రానికి వెళ్లొచ్చు.
- **పరీక్ష:** ఏప్రిల్ 8న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..

అంతర్జాతీయ సూచీలు



సివిల్స్, గ్రూప్స్ ప్రత్యేకం
జీకే, కరెంట్ అఫైర్స్

ఇటీవల విడుదలైన కొన్ని ముఖ్యమైన అంతర్జాతీయ సూచీలు, వాటిని రూపొందించిన సంస్థలు, వాటిలో భారతదేశ ర్యాంకు తదితర వివరాలు...

ప్రపంచ అవినీతి సూచీ

ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ ప్రపంచ అవినీతి సూచీ- 2017 (Corruption Perception Index)ను 2018, ఫిబ్రవరిలో విడుదల చేసింది. మొత్తం 180 దేశాలకు ర్యాంకులు కేటాయించగా భారత్ 81వ స్థానంలో నిలిచింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అవినీతి, పత్రికా స్వేచ్ఛకు భంగం తదితర అంశాల్లో భారత్ చాలా దిగువ స్థాయిలో ఉందని నివేదిక పేర్కొంది. సర్వే నిర్వహించిన దేశాల్లో 0 నుంచి 100 వరకు స్కోరు కేటాయించారు. భారత్ స్కోర్ కేవలం 40. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అవినీతి అత్యంత ఎక్కువగా, పత్రికాస్వేచ్ఛ అత్యంత తక్కువగా ఉన్న దేశాలు ఫిలిప్పీన్స్, భారత్, మాల్దీవులు. 2016 అవినీతి సూచీలో భారత్‌కు 79వ ర్యాంకు దక్కింది. తాజా సూచీలో మరో రెండు స్థానాలు దిగజారి 81వ స్థానంలో నిలవడం గమనార్హం.
- తాజా సూచీలో అత్యంత తక్కువ అవినీతి కలిగిన దేశాలుగా న్యూజిలాండ్ (మొదటి ర్యాంకు), డెన్మార్క్ (రెండో ర్యాంకు) నిలిచాయి. సోమాలియా చివరిస్థానంలో (180వ ర్యాంకు) నిలిచింది. మన పొరుగుదేశాల్లో భూటాన్ 26వ ర్యాంకును దక్కించుకోవడం గమనార్హం.

భారత్, పొరుగు దేశాల ర్యాంకులు

భూటాన్	26
చైనా	77
భారత్	81
శ్రీలంక	91
పాకిస్తాన్	117
నేపాల్	122
మయన్మార్	130
బంగ్లాదేశ్	143

- ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ అనేది జర్మనీలోని బెర్లిన్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థ.

మేధోహక్కుల సూచీ

అమెరికా ఛాంబర్స్ ఆఫ్ కామర్స్‌లో భాగమైన గ్లోబల్ ఇన్నోవేషన్ పాలసీ సెంటర్ (జీఐపీసీ) 2018, ఫిబ్రవరి 8న అంతర్జాతీయ మేధోహక్కుల సూచీని (International Intellectual Property Index) విడుదల చేసింది. ఐపీ సూచీకి సంబంధించి 50 దేశాల జాబితాలో భారత్ 44వ స్థానం దక్కించుకుంది. గతేడాది 45 దేశాల సూచీలో భారత్‌కు 43వ ర్యాంకు దక్కింది. మేధోహక్కుల సూచీలో అమెరికా అగ్రస్థానంలో ఉండగా, తర్వాతి స్థానాల్లో యునైటెడ్ కింగ్‌డమ్, స్వీడన్ నిలిచాయి.
- భారత్ తన స్థానాన్ని మరింత మెరుగుపరచుకునేందుకు మరిన్ని అర్థవంతమైన సంస్కరణలు అమలు చేయాల్సి ఉంటుందని అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అభిప్రాయపడింది.

ప్రపంచ ప్రజాస్వామ్య సూచీ

లండన్‌లోని ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ).. ప్రపంచ ప్రజాస్వామ్య సూచీ (Global Democracy Index)ని 2018, జనవరి 31న విడుదల చేసింది. 167 దేశాలతో కూడిన ఈ జాబితాలో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ 42వ స్థానంలో నిలిచింది. 2016 సూచీలో భారత్‌కు 32వ స్థానం దక్కగా, 2017లో 42వ స్థానానికి దిగజారింది. 2017 జాబితాలో నార్వేకు అగ్రస్థానం, ఉత్తర కొరియాకు చిట్టచివరి స్థానం (167) దక్కింది. ఆయాదేశాల్లో ఎన్నికల ప్రక్రియ, పౌరస్వేచ్ఛ, ప్రభుత్వ పనితీరు, రాజకీయ ప్రాతినిధ్యం, రాజకీయ సంస్కృతి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని జాబితా రూపొందిస్తారు.

2017లో టాప్-10 దేశాలు

ర్యాంకు	దేశం
1	నార్వే
2	ఐస్‌లాండ్
3	స్వీడన్
4	న్యూజిలాండ్
5	డెన్మార్క్
6	ఐర్లాండ్
7	కెనడా
8	ఆస్ట్రేలియా
9	ఫిన్లాండ్
10	స్విట్జర్లాండ్

సమ్మిళిత వృద్ధి సూచీ

ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్).. 2018, జనవరి 22న సమ్మిళిత వృద్ధి సూచీని (Inclusive Development Index) విడుదల చేసింది. 74 వర్ధమాన దేశాలకు సంబంధించిన సమ్మిళిత వృద్ధి సూచీలో భారత్ 62వ స్థానంలో నిలిచింది. లిథుయేనియాకు అగ్రస్థానం దక్కింది. గతేడాది (2017) 79 వర్ధమాన దేశాల జాబితాలో భారత్ 60వ స్థానంలో నిలిచింది. తాజా జాబితాలో 62వ ర్యాంకుకు పడిపోయింది.
- జీవన ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణ, రుణభారాల నుంచి భవిష్యత్ తరాలను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ సూచీని రూపొందించారు.
- 29 సంపన్న దేశాల సమ్మిళిత వృద్ధి సూచీలో నార్వే అగ్రస్థానంలో నిలిచింది.

సంపన్న దేశాల సమ్మిళిత వృద్ధి సూచీలో టాప్ 10 దేశాలు


1. నార్వే
2. ఐస్‌లాండ్
3. లగ్జెంబర్గ్
4. స్విట్జర్లాండ్
5. డెన్మార్క్
6. స్వీడన్
7. నెదర్లాండ్స్
8. ఐర్లాండ్
9. ఆస్ట్రేలియా
10. ఆస్ట్రియా

వర్ధమాన దేశాల్లో టాప్-10 దేశాలు

1. లిథుయేనియా
2. హంగేరి
3. అజర్‌బైజాన్
4. లాత్వియా
5. పోలండ్
6. పనామా
7. క్రొయేషియా
8. ఉరుగ్వే
9. చిలీ
10. రొమేనియా

గ్లోబల్ టాలెంట్ కాంపిటీటివ్‌నెస్ ఇండెక్స్

2018, జనవరి 22న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సు సందర్భంగా దావోస్‌లో గ్లోబల్ టాలెంట్ కాంపిటీటివ్‌నెస్ ఇండెక్స్‌ను విడుదల చేశారు. 118 దేశాల జాబితాలో భారత్‌కు 81వ స్థానం దక్కింది. గతేడాది 92వ స్థానంలో ఉన్న భారత్ ఈసారి 81వ స్థానానికి ఎగబాకింది. ప్రతిభను ఆకర్షించడంలో, పోటీతత్వానికి సంబంధించిన ఈ సూచీలో స్విట్జర్లాండ్ అగ్రస్థానాన్ని దక్కించుకోగా సింగపూర్, అమెరికా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ సూచీని ప్రముఖ బిజినెస్ స్కూల్ ఇన్‌సీడ్, అడెక్కో గ్రూప్, టాటా కమ్యూనికేషన్స్ భాగస్వామ్యంతో విడుదల చేశారు.



ఎన్.విజయేందర్‌రెడ్డి
విజయేందర్ అకాడమీ
హైదరాబాద్.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌	నిఫ్టీ
137 ▼	34 ▼
34,047	10,458

మరిన్ని వార్తలు, స్టాక్‌ అప్‌డేట్స్‌ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 10.30కి)

సూచీ		మార్పు
నాస్‌డాక్‌	7,258	▼ 15
డోజోన్స్‌	24,961	▼ 68
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,176	▼ 56
డాక్స్‌	12,191	▼ 245
షాంఘై	3,274	▲ 14
నికాయ్‌	21,724	▼ 344

• అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

	కరెన్సీ		• కొనుగోలు	• అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	65.95	66.08
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	91.01	91.19
€	యూరో	ఎస్‌బీఐ	80.79	80.95
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	62.04	62.16
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	51.28	51.38
SS	సింగపూర్‌ డాలర్‌	ఎస్‌బీఐ	49.96	50.06
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	15.77	18.70
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	16.14	18.87
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	7.27	11.80



ఎస్‌బీఐ వడ్డీ రేట్లు పెంపు

రుణాలపై 0.2 శాతం దాకా పెరుగుదల ◆ 8.15 శాతానికి ఏడాది వ్యవధి ఎంసీఎల్‌ఆర్‌

ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్‌ దిగ్గజం ఎస్‌బీఐ డిపాజిట్లపై వడ్డీ రేట్లు పెంచిన మర్నాడే రుణాలపైనా వడ్డీ రేటు పెంచింది. 0.20 శాతం దాకా వడ్డీ రేటు పెంచుతున్నట్లు గురువారం ప్రకటించింది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. దీంతో ఇప్పటిదాకా 7.95 శాతంగా ఉన్న ఏడాది వ్యవధి ఎంసీఎల్‌ఆర్‌ (మార్జినల్‌ కాస్ట్‌ ఆఫ్‌ ఫండ్స్‌ ఆధారిత రుణాల వడ్డీ రేటు) ఇక 8.15 శాతానికి పెరిగింది. ప్రధానంగా దీని ప్రాతిపదికనే బ్యాంకు రుణాలు మంజూరు చేస్తోంది. మరోవైపు, ఆరు నెలల ఎంసీఎల్‌ఆర్‌ 0.10 శాతం పెరిగి 8 శాతానికి, మూడేళ్ల ఎంసీఎల్‌ఆర్‌ 25 బేసిస్‌ పాయింట్లు పెరిగి 8.35 శాతానికి చేరింది. గతేడాది నవంబర్‌ నుంచి డిపాజిట్లపై వడ్డీ రేట్లు పెంచుతూ వస్తున్న ఎస్‌బీఐ.. రుణాలపై వడ్డీ రేట్లు పెంచడం 2016 ఏప్రిల్‌ తర్వాత ఇదే తొలిసారి. వివిధ కాలావధుల డిపాజిట్ల రేట్లను 0.75 శాతం దాకా పెంచుతున్నట్లు ఎస్‌బీఐ బుధవారమే ప్రకటించిన సంగతి తెలిసిందే.

పీఎస్‌బీలు రిస్కు నిర్వహణ సామర్థ్యం మెరుగుపర్చుకోవాలి: ఎస్‌బీఐ చైర్మన్‌

నిర్వహణపరమైన సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే దిశగా ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ) తమ కార్పొరేట్, రిస్క్‌ గవర్నెన్స్‌ వ్యవస్థలను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని ఎస్‌బీఐ చైర్మన్‌ రజనీష్‌ కుమార్‌ అభిప్రాయపడ్డారు. 'పీఎస్‌బీలు తమ పాలనా వ్యవస్థను మెరుగుపర్చుకోవాలి. కార్పొరేట్‌ గవర్నెన్స్, రిస్క్‌ గవర్నెన్స్‌ వ్యవస్థల్లో లోపాలేమైనా ఉన్నాయేమో సమీక్షించుకోవాలి. అలాంటివేమైనా ఉన్న పక్షంలో వాటిని సాధ్యమైనంత త్వరగా సరిదిద్దుకోవాలి' అని గురువారం ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన పేర్కొన్నారు. బ్యాంకింగ్‌ రంగంలో పలు మోసాలు బైటపడుతుండటంపై రజనీష్‌ కుమార్‌ ఈ మేరకు స్పందించారు. ఎస్‌బీఐలో రిస్కులను సమర్థంగా ఎదుర్కొనేందుకు తగిన యంత్రాంగం ఉందని ఆయన చెప్పారు. మరోవైపు, పీఎస్‌బీల విదేశీ శాఖల క్రమబద్ధీకరణ అంశం కొత్తదేమీ కాదని, వ్యయాల నియంత్రణ చర్యల్లో భాగంగా ఇది ఇప్పటికే ప్రభుత్వ అజెండాలో ఉందని వివరించారు. దీనికి పంజాబ్‌ నేషనల్‌ బ్యాంకు మోసం కేసుకు సంబంధమేమీ లేదని పేర్కొన్నారు. ఎస్‌బీఐ గడిచిన మూడేళ్లుగా విదేశీ శాఖలను క్రమబద్ధీకరించుకుంటూనే ఉందన్నారు. ఇందులో భాగంగా జెడ్డాలోని కార్యాలయాన్ని మూసివేశామని, పారిస్‌ శాఖను రిప్రజెంటేటివ్‌ ఆఫీస్‌ కింద మార్చామని చెప్పారు.

పెరిగిన పీఎన్‌బీ రుణ రేటు

దేశంలో ప్రభుత్వ రంగ రెండవ బ్యాంకింగ్‌ దిగ్గజం– పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌ (పీఎన్‌బీ) ఎంసీఎల్‌ఆర్‌ (మార్జినల్‌ కాస్ట్‌ ఆఫ్‌ ఫండ్స్‌) ఆధారిత రుణాల వడ్డీ రేటును 15 బేసిస్‌ పాయింట్లు పెంచింది. దీనితో బ్యాంక్‌ ఏడాది వ్యవధి రేటు 8.30 శాతానికి పెరిగింది. తక్షణం తాజా రేటు అమల్లోకి వస్తుందని బ్యాంక్‌ పేర్కొంది. బ్యాంక్‌ 15 బేసిస్‌ పాయింట్లు రేటు పెంపు ప్రకారం ఓవర్‌నైట్, నెల, మూడు, ఆరు నెలల రేట్లు 7.80 శాతం, 7.95 శాతం, 8.10 శాతం, 8.25 శాతానికి పెరిగాయి.

డిపాజిట్‌ రేట్లూ పెంపు: బ్యాంక్‌ రిటైల్, బల్క్‌ డిపాజిట్‌ రేట్లను కూడా వివిధ మెచ్యూరిటీ లపై 45 బేసిస్‌ పాయింట్ల వరకూ పెంచింది. దీని ప్రకారం... రిటైల్‌ డిపాజిట్‌ ఏడాది– మూడేళ్ల మెచ్యూరిటీ రేటు 25 బేసిస్‌ పాయింట్లు పెరిగి 6.75కు చేరింది. బల్క్‌ డిపాజిట్‌ రేటు ఏడాది కాలానికి 6.50 శాతం నుంచి 6.75 శాతానికి పెరిగింది.

ఫిబ్రవరిలో కారు జోరు

ప్రముఖ కంపెనీల దేశీ విక్రయాల్లో రెండంకెల వృద్ధి • టూవీలర్, వాణిజ్య వాహన అమ్మకాల్లోనూ ఇదే ట్రెండ్‌

న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ ఇండియా, మహీంద్రా అండ్‌ మహీంద్రా, టాటా మోటార్స్‌ వంటి కంపెనీలు వాటి ఫిబ్రవరి నెల దేశీ విక్రయాల్లో రెండంకెల వృద్ధిని ప్రకటించాయి. బజాజ్‌ ఆటో, రాయల్‌ ఎన్‌ఫీల్డ్, టీవీఎస్‌ మోటార్, హీరో మోటొకార్ప్‌ వంటి టూవీలర్‌ కంపెనీల వాహన అమ్మకాల్లోనూ బలమైన వృద్ధి కనిపించింది.

- మారుతీ దేశీ వాహన అమ్మకాలు 14.2 శాతం వృద్ధితో 1,37,900 యూనిట్లకు పెరిగాయి. ఇక కంపెనీ మొత్తం వాహన అమ్మకాలు 15 శాతం వృద్ధితో 1,30,280 యూనిట్ల నుంచి 1,49,824 యూనిట్లకు చేరాయి.
- మహీంద్రా అండ్‌ మహీంద్రా దేశీ విక్రయాలు 20 శాతం పెరుగుదలతో 40,526 యూనిట్ల నుంచి 48,473 యూనిట్లకు చేరాయి.
- వాణిజ్య, ప్యాసింజర్‌ వాహన విభాగాల్లోని బలమైన విక్రయాల కారణంగా టాటా మోటార్స్‌ దేశీ అమ్మకాలు 38 శాతం వృద్ధి చెందాయి. ఇవి 58,993 యూనిట్లుగా నమోదయ్యాయి. టియాగో, టిగోర్, నెక్సాన్, హెక్సా వంటి కొత్త ప్రొడక్టుల డిమాండ్‌ వల్ల 45 శాతం వృద్ధిని సాధించామని టాటా మోటార్స్‌ ప్రెసిడెంట్‌ (ప్యాసింజర్‌ వెహికల్స్‌ విభాగం) మయాంక్‌ పరీఖ్‌ తెలిపారు. టాటా మోటార్స్‌ ప్యాసింజర్‌ వాహన అమ్మకాలు 45 శాతం వృద్ధితో 12,272 యూనిట్ల నుంచి 17,771 యూనిట్లకు పెరిగాయి.
- ఫోర్డ్‌ ఇండియా మొత్తం విక్రయాలు స్వల్పంగా తగ్గి 23,965 యూనిట్లకు పరిమితం అయ్యాయి. అయితే దేశీ విక్రయాలు మాత్రం 8.43 శాతం వృద్ధితో 8,338 యూనిట్ల నుంచి 9,041 యూనిట్లకు పెరిగాయి.
- టయోటా కిర్లోస్కర్‌ మోటార్‌ దేశీ అమ్మకాలు 3 శాతం పెరిగాయి. ఇవి 11,864 యూనిట్లుగా నమోదయ్యాయి.

వాణిజ్య వాహన విక్రయాల జోరు

వాణిజ్య వాహన విక్రయాలకు వస్తే.. హిందూజా గ్రూప్‌ అశోక లేలాండ్‌ మొత్తం విక్రయాలు 29 శాతం పెరిగాయి. ఇవి 18,181 యూనిట్లుగా నమోదయ్యాయి. అలాగే మహీంద్రా వాణిజ్య వాహన అమ్మకాలు 28 శాతం వృద్ధితో 16,383 యూనిట్ల నుంచి 20,946 యూనిట్లకు పెరిగాయి. 'స్థిరమైన డిమాండ్‌ కారణంగా అటు పర్సనల్, ఇటు కమర్షియల్‌ రెండు వాహన విభాగాల్లోనూ మంచి విక్రయాలను సాధించగలిగాం. ఇదే ట్రెండ్‌ మార్చిలోనూ కొనసాగుతుందని అంచనా వేస్తున్నాం' అని మహీంద్రా అండ్‌ మహీంద్రా ప్రెసిడెంట్‌ (ఆటోమోటివ్‌ విభాగం) రాజన్‌ వడేరా తెలిపారు. టాటా మోటార్స్‌ దేశీ వాణిజ్య వాహన విక్రయాలు 36 % వృద్ధితో 30,407 యూనిట్ల నుంచి 41,222 యూనిట్లకు పెరిగాయి.



టూవీలర్‌ రయ్‌..రయ్‌..

టూవీలర్‌ వాహన విభాగంలోనూ బలమైన వృద్ధి నమోదయ్యింది. బజాజ్‌ ఆటో మొత్తం విక్రయాలు 31 శాతం వృద్ధితో 2,73,513 యూనిట్ల నుంచి 3,57,883 యూనిట్లకు పెరిగాయి. దేశీ అమ్మకాలు 35 శాతం వృద్ధి చెందాయి. ఇవి 1,59,109 యూనిట్ల నుంచి 2,14,023 యూనిట్లకు పెరిగాయి. ఐషర్‌ మోటార్స్‌కు చెందిన టూవీలర్‌ విభాగం రాయల్‌ ఎన్‌ఫీల్డ్‌ మొత్తం విక్రయాలు 25 శాతం వృద్ధితో 73,077 యూనిట్లకు చేరాయి. గతేడాది ఇదే నెలలో కంపెనీ 58,439 యూనిట్లను విక్రయించింది.

ఫిబ్రవరి నెల దేశీ వాహన విక్రయాలు

కంపెనీ	2018	2017	మార్పు(వృ/క్షీ)
మారుతీ సుజుకీ	1,37,900	--	14.2
మహీంద్రా	48,473	40,526	20
టాటా మోటార్స్‌	58,993	--	38
ఫోర్డ్‌ ఇండియా	9,041	8,338	8.43

రెనో డస్టర్‌ ధర తగ్గింది..



ప్రముఖ వాహన తయారీ కంపెనీ 'రెనో ఇండియా' తాజాగా తన ఎస్‌యూవీ 'డస్టర్‌' ధరను తగ్గించింది. ధర తగ్గింపు రూ.29,746–రూ.1,00,761 శ్రేణిలో ఉంటుందని, ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని కంపెనీ తెలిపింది. దీంతో ఇప్పుడు డస్టర్‌ పెట్రోల్‌ వేరియంట్‌ ధర రూ.7.95 లక్షలు నుంచి ప్రారంభమౌతోంది. ఇక దీని గరిష్ట ధర రూ.9.95 లక్షలుగా ఉంది. కాగా ఇదివరకు పెట్రోల్‌ వేరియంట్‌ ధర శ్రేణి రూ.8.5 లక్షలు– రూ.10.24 లక్షలుగా ఉంది. డీజిల్‌ వేరియంట్‌ విషయానికి వస్తే.. దీని ప్రస్తుత ధర రూ.8.95 లక్షలు–12.79 లక్షల మధ్యలో ఉంది. ఇదివరకు ఈ వేరియంట్‌ ధర శ్రేణి రూ.9.45 లక్షలు–13.79 లక్షలుగా ఉంది. అన్ని ధరలు ఎక్స్‌షోరూమ్‌వి.

పరారైన ఆర్థిక నేరగాళ్ల ఆస్తులు ఇక నిట్టనిలువునా వేలం

న్యూఢిల్లీ: వజ్రాల వ్యాపారి నీరవ్‌ మోదీ, కింగ్‌ ఫిషర్‌ ఎయిర్‌ లైన్స్‌ అధినేత విజయ్‌ మాల్యా తరహా ఆర్థిక నేరగాళ్ల ఆటలు కట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ చట్టాన్ని రూపొందించింది. ఇందుకు సంబంధించి 'ఫ్యుజిటివ్‌ ఎకనమిక్‌ అఫెండర్స్‌ బిల్లు'కు కేంద్ర కేబినెట్‌ గురువారం ఆమోదముద్ర వేసింది. మోసాలకు పాల్పడి విదేశాలకు పారిపోయిన వారు, రుణం ఎగవేసి అదృశ్యమైన వారికి సంబంధించి అన్ని ఆస్తులను స్వాధీనం చేసుకుని వాటిని వెంటనే విక్రయించే అధికారం ఈ బిల్లు కల్పిస్తుంది. దీంతో నీరవ్‌ మోదీ తరహా భారీ కుంభకోణాల్లో ఈ చట్టం ప్రకారం ప్రత్యేక కోర్టు అనుమతితో బకాయిలను తక్షణమే రాబట్టుకునేందుకు వీలు పడుతుంది. ఆర్థిక నేరగాళ్లతోపాటు రూ.100 కోట్లకు పైగా రుణ బకాయి పడి విదేశాలకు పారిపోయిన వారికీ ఇదే వరిస్తుంది. మార్చి 5 నుంచి మొదలయ్యే బడ్జెట్‌ రెండో దశ సమావేశాల్లో ఈ బిల్లును పార్లమెంటు ఆమోదం కోసం ప్రవేశపెడతామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మీడియాకు తెలిపారు. మనీలాండరింగ్‌ నిరోధక చట్టానికి ఫ్యుజిటివ్‌ బిల్లు భిన్నమైనదని, ఆర్థిక నేరగాళ్ల ఆస్తులను స్వాధీనం చేసుకునే అధికారం కల్పిస్తుందని జైట్లీ చెప్పారు. ఈ నూతన చట్టాన్ని పాత నేరస్థులకు సంబంధించిన కేసులకూ వర్తింపజేస్తామన్నారు. మనీలాండరింగ్‌ నిరోధక చట్టం ప్రకారం, నేరం కారణంగా కలిగిన లబ్ధి మేరకే ఆస్తులు జప్తు చేసి వేలం వేసే అధికారం ఉంది. అది కూడా నేరం నిరూపితమైన తర్వాతనే. ఈ కొత్త చట్టం కింద పారిపోయిన ఆర్థిక నేరగాళ్లు, రుణ ఎగవేతదారులకు సంబంధించి అన్ని ఆస్తులనూ(బినామీ ఆస్తులు సైతం) స్వాధీనం చేసుకోవచ్చు. ఫ్యుజిటివ్‌ అఫెండర్‌ అన్నదానికి... నేరాలకు పాల్పడి, నేరపూరిత విచారణ తప్పించుకునేందుకు విదేశాలకు పారిపోయిన, లేదా విదేశాల నుంచి విచారణకు రావడానికి నిరాకరించేవారికి వ్యతిరేకంగా అరెస్ట్‌ వారెంటర్‌ జారీ అవడంగా ఈ బిల్లులో పేర్కొన్నారు. వాస్తవానికి 2017–18 కేంద్ర బడ్జెట్‌లోనే ఈ బిల్లు గురించి పేర్కొన్నారు. రూ.12,700 కోట్ల మేర నీరవ్‌ మోదీ స్కామ్‌ ధాటికి కేంద్ర కేబినెట్‌ దీన్ని శీఘ్రతరం చేసింది.

- పారిపోయిన వారి ఆస్తులన్నీ స్వాధీనం
- విక్రయించి బకాయిల వసూలు
- రుణం ఎగ్గొట్టి పారిపోయిన వారికీ ఇదేగతి
- సంబంధిత బిల్లుకు కేంద్ర కేబినెట్‌ ఆమోదం
- నీరవ్‌మోదీ కేసు నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు

లొంగిపోతే వెసులుబాటు: ''ప్రత్యేక కోర్టులో కేసు విచారణ ప్రక్రియలు కొనసాగుతూ పారిపోయిన ఆర్థిక నేరగాడు అని ప్రకటించకముందే, సదరు వ్యక్తి భారత్‌కు తిరిగొచ్చి కోర్టు ముందు హాజరు అయితే సంబంధిత చట్టం కింద కొనసాగే విచారణ ప్రక్రియలను నిలిపివేయడం జరుగుతుంది'' అని కేబినెట్‌ భేటీ తర్వాత విడుదలైన అధికారిక ప్రకటనలో ప్రభుత్వం పేర్కొంది.

ఆడిటింగ్‌ సంస్థలపై నియంత్రణ సంస్థ

కంపెనీల్లో భారీ స్కామ్‌లు జరిగిపోతున్నా ఆడిటింగ్‌ సంస్థలు కళ్లప్పగించి చూస్తుండడం, వాటిని ముందుగానే రిపోర్ట్‌ చేయలేకపోతుండడంతో వీటిపై పర్యవేక్షణ కోసం ఓ స్వతంత్ర నియంత్రణ సంస్థను 'నేషనల్‌ ఫైనాన్షియల్‌ రిపోర్టింగ్‌ అథారిటీ (ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏ)' పేరుతో ఏర్పాటు చేయడానికి కేంద్ర కేబినెట్‌ గురువారం నిర్ణయం తీసుకుంది. 'కంపెనీల చట్టం 2013'లో ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏ ఏర్పాటును చేర్చనుంది. ఆడిటర్లు, ఆడిటింగ్‌ సంస్థలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునే అధికారం ప్రస్తుతం ఏసీఏఐకు ఉండగా, అవి ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏకు దఖలు పడతాయి. అక్రమాలకు పాల్పడే ఆడిటర్లు, ఆడిటింగ్‌ సంస్థలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునే సంపూర్ణ అధికారాలు ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏకు ఉంటాయి. పీఎన్‌బీలో నీరవ్‌ మోదీ 12,700 కోట్ల కుంభకోణం, సత్యం కంప్యూటర్స్‌ కుంభకోణం ఇలా ఎన్నో కార్పొరేట్‌ స్కాముల్లో ఆడిటింగ్‌ సంస్థల వైఫల్యాలపై ప్రశ్నలు ఎదురవుతున్న తరుణంలో కేంద్రం ఈ కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం.



కేబినెట్‌ నిర్ణయాలను తెలియజేస్తున్న ఆర్థికమంత్రి జైట్లీ

నీరవ్‌ మోదీ గ్రూప్‌ సంస్థల 3 ఖాతాల స్తంభన: ఎస్‌బీఐ

పంజాబ్‌ నేషనల్‌ బ్యాంకు కుంభకోణంలో నిందితుడు నీరవ్‌ మోదీ గ్రూప్‌ కంపెనీలకు చెందిన మూడు ఖాతాలను ఎస్‌బీఐ స్తంభింపజేసింది. మోదీ గ్రూప్‌ కంపెనీలకు తమ విదేశీ శాఖల్లో మూడు డిపాజిట్‌ అకౌంట్లు ఉన్నాయని అంతర్గత సమీక్షలో తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్‌బీఐ వర్గాలు తెలిపాయి. దుబాయ్, బహ్రెయిన్, యాంట్‌వెర్ప్‌ శాఖల్లో ఈ అకౌంట్లు గుర్తించినట్లు వివరించాయి. పీఎన్‌బీలో బైటపడిన రూ. 12,600 కోట్ల కుంభకోణానికి ఈ ఖాతాలకు ప్రత్యక్ష ప్రమేయమేదీ లేదని పేర్కొన్నాయి. అయినప్పటికీ.. స్కామ్‌ విచారణలో తగిన చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.

బ్యాంకు షేర్లు బేర్‌...!

(సాక్షి, బిజినెస్‌ విభాగం)

రూ.12,700 కోట్ల రుణ కుంభకోణంతో పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌ షేర్‌ ఒక్క నెలలోనే 41 శాతం పతనమైంది. ఒక్కసారిగా అంతా అప్రమత్తం కావటంతో మరిన్ని బ్యాంకుల్లో రుణ కుంభకోణాలు, ఇతర మోసాలు మెల్లగా వెలుగులోకి వస్తున్నాయి. దీంతో ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు సైతం పాతాళానికి పడిపోతున్నాయి. ప్రభుత్వ బ్యాంక్‌ల కష్టాలు కొనసాగుతాయని హెచ్చరిస్తున్న విశ్లేషకులు ప్రస్తుతం వీటికి దూరంగా ఉండడమే మేలని సూచిస్తున్నారు. వారి విశ్లేషణల సమాహారమే ఈ కథనం...

- తాజా పతనంతో ఏడాది కనిష్టానికి
- పీఎస్‌బీల కష్టాలు ఇంకా ఉన్నాయ్‌..
- మూలధన నిధులు ఏ మూలకూ సరిపోవు
- మొండి బాకీల కేటాయింపులకే అత్యధికం
- రుణాలివ్వాలంటే తగిన నిధులు లేవు
- కఠినమవుతున్న ఆర్‌బీఐ నిబంధనలు
- కొన్నాళ్లు పీఎస్‌బీ షేర్లకు దూరంగా ఉండాలి
- విశ్లేషకులు, మార్కెట్‌ నిపుణుల సూచనలు



రూ.2 లక్షల కోట్ల మేర మూలధన నిధులను సమకూరుస్తామని కేంద్రం చేసిన ప్రకటనతో కెరటాల మాదిరి ఎగసిన ప్రభుత్వ రంగ బ్యాంక్‌ షేర్లు... ఇపుడు ఏడాది కనిష్టానికి పడిపోతున్నాయి. గత నెలలో అన్ని సూచీల కంటే నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్‌ ఇండెక్స్‌ అధికంగా... 16.4% నష్టపోయింది. ఇక ఇదే నెలలో నిఫ్టీ 5 శాతం, ప్రైవేట్‌ బ్యాంక్‌ ఇండెక్స్‌ 7.2%చొప్పున నష్టపోయాయి. రెండేళ్ల క్రితం 2016 జనవరిలో నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్‌ ఇండెక్స్‌ 20 శాతం నష్టపోయింది. ఆ నెలలో నిఫ్టీ 5 శాతం, ప్రైవేట్‌ బ్యాంక్‌ ఇండెక్స్‌ 7.2% చొప్పున నష్టపోయాయి.

అసలు కారణం పీఎన్‌బీ!

తాజా పతనానికి పీఎన్‌బీ రూ.12,700 కోట్ల కుంభకోణమే ప్రధాన కారణం. మొండి బకాయిలు అంతకంతకూ పెరిగిపోతుండడం, రుణ వృద్ధి నానాటికీ తగ్గుతుండడం వంటి ప్రతికూల పరిస్థితుల్లో మూలిగే నక్క మీద తాటిపండులా పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌ రూ.12,700 కోట్ల రుణ కుంభకోణం వెలుగులోకి రావడం బ్యాంక్‌ షేర్ల హవాను మసకబార్చింది. అంతే కాకుండా ఓరియంటల్‌ బ్యాంక్‌ ఆఫ్‌ కామర్స్, బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా, కార్పొరేషన్‌ బ్యాంకుల్లో వెలుగు చూసిన మరిన్ని మోసాలు పరిస్థితులను మరింత దిగజార్చాయి. షేర్ల పరంగా చూస్తే.., పలు షేర్లు తాజాగా ఏడాది కనిష్ట స్థాయిలను తాకాయి.

బలహీనంగా.. ప్రభుత్వ బ్యాంక్‌ షేర్లు

ప్రభుత్వ రంగ షేర్ల విషయమై సెంటిమెంట్‌ ప్రతికూలంగా మారిందని నిపుణులంటున్నారు. అందుకని ప్రస్తుతం ప్రభుత్వ రంగ బ్యాంక్‌ షేర్లకు దూరంగా ఉండడమే మంచిదని వారు సూచిస్తున్నారు. వీటికి బదులుగా ప్రైవేట్‌ బ్యాంక్‌ షేర్లలో ఇన్వెస్ట్‌ చేయవచ్చని వారు చెప్పారు. ఇప్పుడు మార్కెట్లో అత్యంత బలహీనంగా ఉన్న షేర్లంటే ప్రభుత్వ రంగ బ్యాంక్‌ షేర్లేనని సెంట్రమ్‌ బ్రోకింగ్‌ రీసెర్చ్‌ హెడ్‌(వెల్త్‌) జగన్నాథమ్‌ తూనుగుంట్ల వ్యాఖ్యానించారు. బ్యాంక్‌లకు సంబంధించి ప్రతికూల వార్తలు ఒకదాని వెంట మరొకటి వస్తూనే ఉన్నాయని, దీంతో బీఎఫ్‌ఎస్‌ఐ (బ్యాంకింగ్, ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ ఇన్సూరెన్స్‌) సెగ్మెంట్లో ఇతర సురక్షిత కంపెనీల వైపు ఇన్వెస్టర్లు తరలిపోతున్నారని వివరించారు.

పీఎన్‌బీ పతనమే అధికం...

గత నెల ఆరంభంలో రూ.172 వద్ద ఉన్న పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌ షేర్‌ నెల రోజుల తర్వాత 41 శాతం పతనమై రూ.101కు పడిపోయింది. ఇది 20 నెలల కనిష్ట స్థాయి. ప్రాంప్ట్‌ కరెక్టివ్‌ యాక్షన్‌(పీసీఏ) ప్లాన్‌ కింద ఆర్‌బీఐ ఈ బ్యాంక్‌ను కూడా చేర్చే అవకాశాలు అధికంగా ఉండటంతో రేటింగ్‌ను తగ్గిస్తున్నామని బీఎన్‌పీ పారిబా పేర్కొంది. బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియాతో సహా మొత్తం 11 పీఎస్‌బీలు ఇప్పుడు ఈ పీసీఏ పరిధిలో ఉన్నాయి. పీసీఏ పరిధిలో ఉన్న బ్యాంక్‌లు భారీ స్థాయి రుణాలివ్వడానికి వీలుండదు. ఫలితంగా ఆర్థిక వృద్ధి కుంటుపడుతుందని నిపుణులంటున్నారు. మొత్తం దేశం రుణావసరాలను 70 శాతం వరకూ ప్రభుత్వ రంగ బ్యాంక్‌లే తీరుస్తున్న నేపథ్యంలో ఆర్థిక వృద్ధి ఏ తీరుగా ప్రభావితమవుతుందో అన్న ఆందోళన అందరిలో నెలకొన్నది. బ్యాంక్‌ రుణ కుంభకోణాలు,మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం సత్వరం సరైన చర్యలు తీసుకోకుంటే పెద్ద నష్టమే జరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆరునెలల్లో మరిన్ని మొండి బకాయిలు...

మరోవైపు ఆర్‌బీఐ 'ఒత్తిడి రుణాల'కు సంబంధించిన నియమ నిబంధనల్లో మార్పులు తెచ్చింది. రుణ పునర్వ్యస్థీకరణ ప్రణాళికలకు సంబంధించిన కొన్ని విధానాలను రద్దు చేసింది. రుణ ఎగవేతలను తక్షణం గుర్తించాలని, సంబంధించిన వివరాలను ప్రతి శుక్రవారం ఆర్‌బీఐ క్రెడిట్‌ రిజిస్ట్రీలో నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. రుణ పునర్వ్యస్థీకరణ ప్రణాళికల రద్దు కారణంగా మరో 2.8 లక్షల కోట్ల రుణాలు తాజాగా మొండి బకాయిలుగా మారే ప్రమాదం ఉందని అంచనా. అయితే ఆర్‌బీఐ తాజా నిబంధనల వల్ల రుణ ఎగవేతలను త్వరగానే గుర్తించే వీలు కలుగుతుందని, సకాలంలో సత్వర చర్యలు తీసుకునే వీలు కలుగుతుందని నిపుణులంటున్నారు. దీర్ఘకాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఇది సానుకూలమైన చర్యేనని కేర్‌ రేటింగ్స్‌ పేర్కొంది. అయితే రానున్న ఆరు నెలల్లో మొండి బకాయిల స్థాయిలు మరింతగా ఎగిసే అవకాశాలున్నాయని హెచ్చరించింది.

బ్యాంక్‌ షేర్ల దిగువబాట ఇలా....


పేరు	జనవరి 31 ధర	ఫిబ్రవరి 28 ధర	క్షీణత (శాతం)	ఏడాది కనిష్టం	ఏడాది గరిష్టం
పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌	171	101	41	92	232
బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా	157	116	26	111	217
యూనియన్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా	136	106	23	100	205
అలహాబాద్‌ బ్యాంక్‌	67	53	21	49	93
దేనా బ్యాంక్‌	25	21	18	20	50
యూకో బ్యాంక్‌	31	26	18	25	45
సిండికేట్‌ బ్యాంక్‌	73	61	16	54	96
బ్యాంక్‌ ఆఫ్‌ మహారాష్ట్ర	20	17	15	16	41
యునైటెడ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా	16	14	15	13	29
ఎస్‌బీఐ	313	268	14	241	352

మూలధన నిధులు ఏ మూలకు?

ప్రభుత్వం అందించనున్న రూ.2 లక్షల కోట్ల మూలధన నిధులతో ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల దశ తిరిగిపోతుందని అంతా భావించారు. ఈ ప్రణాళికను వెల్లడించినప్పటి నుంచి బ్యాంక్‌ షేర్లు జోరుగా పెరిగాయి కూడా. అయితే తాజాగా వెలుగులోకి వస్తున్న మోసాల వరుస చూస్తుంటే, ఈ మూల ధన నిధులు భవిష్యత్తు వృద్ధికి కాకుండా ప్రస్తుతం భారీగా పెరిగిపోతున్న మొండి బకాయిలకు, నష్టాలకు కేటాయింపులకు కూడా సరిపోయేటట్టు లేవని విశ్లేషకులు చెబుతున్నారు. ఉదాహరణకు పీఎన్‌బీకు ప్రభుత్వం రూ.5,700 కోట్లు మూలధన నిధులు ఇవ్వనుంది. పీఎన్‌బీ రుణ కుంభకోణం దీనికి రెట్టింపునకు పైగా రూ.12,700 కోట్ల మేర ఉండటం గమనార్హం.

35 విదేశీ శాఖల మూసివేత

- జాబితాలో రిప్రజెంటేటివ్‌ ఆఫీసులు
- విదేశీ కార్యకలాపాల క్రమబద్ధీకరణలో ప్రభుత్వ బ్యాంకులు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ) విదేశీ కార్యకలాపాల క్రమబద్ధీకరణపై దృష్టి సారించాయి. లాభసాటిగా లేని 35 శాఖలు, రిప్రజెంటేటివ్‌ కార్యాలయాలను మూసివేశాయి. స్వచ్ఛమైన, బాధ్యతాయుతమైన బ్యాంకింగ్‌ విధానాల అమల్లో భాగంగా ఈ మేరకు చర్యలు తీసుకున్నాయి. బ్యాంకింగ్‌ వ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా మొత్తం 216 విదేశీ శాఖలు, రెమిటెన్స్‌ సెంటర్లు మొదలైన వాటన్నింటినీ సమీక్షించి, క్రమబద్ధీకరించుకోవాలంటూ గతేడాది నవంబర్‌లో నిర్వహించిన పీఎస్‌బీ మంథన్‌లో బ్యాంకర్లు నిర్ణయం తీసుకున్నారు. దానికి అనుగుణంగానే తాజాగా బ్యాంకులు చర్యలు ప్రారంభించాయి. ఈ ఏడాది జనవరి 31 నాటికి.. పీఎస్‌బీలకు అనుబంధ సంస్థలు, జాయింట్‌ వెంచర్లు, ప్రాతినిధ్య కార్యాలయాలు కాకుండా 165 పైచిలుకు విదేశీ శాఖలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్‌ దిగ్గజం స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఎస్‌బీఐ)కి అత్యధికంగా 52 శాఖలు ఉండగా, బ్యాంక్‌ ఆఫ్‌ బరోడాకు 50, బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియాకు 29 ఉన్నాయి. పీఎస్‌బీ శాఖలు ఎక్కువగా బ్రిటన్‌ (32), హాంకాంగ్‌.. యునైటెడ్‌ అరబ్‌ ఎమిరేట్స్‌ (చెరి 13), సింగపూర్‌లో (12) ఉన్నాయి.

ఆంధ్రా బ్యాంక్‌ దుబాయ్‌ ఆఫీసు మూసివేత..

విదేశీ శాఖల క్రమబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా ఆంధ్రా బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, ఇండియన్‌ ఓవర్సీస్‌ బ్యాంక్‌.. దుబాయ్‌లో తమ తమ కార్యకలాపాలు నిలిపివేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే పీఎన్‌బీ, కెనరా బ్యాంక్, యూనియన్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా .. షాంఘై ఆఫీసులు మూసివేశాయి. బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా అటు యాంగాన్, బోట్స్‌వానా కార్యకలాపాలు కూడా నిలిపివేసింది. బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా, ఇండియన్‌ ఓవర్సీస్‌ బ్యాంక్‌ సైతం.. హాంకాంగ్‌ శాఖను మూసివేశాయి.





నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, (వ్యాపారస్తులు))	మిర్చి (వరంగల్, తేజ)	పసుపు (నిజామాబాద్, కొమ్ము)	ఉల్లి (కర్నూలు)	చక్కెర (చెన్నై)	బియ్యం (కరీంనగర్)	కందిపప్పు (చెన్నై)	సుబాబులు (కృష్ణా)	ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)
--	--	--	--	రూ.3,600	రూ. 3,800 (హెచ్ఎంటీ)	రూ.7,200	రూ.4,400 (టన్నుకు)	--
--	--	--	--					







డెనిమ్ గ్రూప్‌లో విప్రో వాటా కొనుగోలు!!

డీల్ విలువ దాదాపు రూ.59 కోట్లు

న్యూఢిల్లీ: దేశీ మూడో అతిపెద్ద ఐటీ కంపెనీ విప్రో తాజాగా వాటా కొనుగోలుకు సంబంధించి అమెరికాకు చెందిన డెనిమ్ గ్రూమ్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా విప్రో సంస్థ డెనిమ్ గ్రూప్‌లో 33.33 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. డీల్ విలువ దాదాపు రూ.59 కోట్లు (8.83 మిలియన్ డాలర్లు). 2018 మార్చితో ముగియనున్న క్వార్టర్‌లో ఈ డీల్ పూర్తి కానుంది. డెనిమ్ గ్రూప్ అనేది ఒక అప్లికేషన్ సెక్యూరిటీ సంస్థ.

ఎన్‌సీసీకి రూ.2,980 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ కంపెనీ ఎన్‌సీసీ రూ.2,980 కోట్ల విలువైన ఏడు ఆర్డర్లను ఫిబ్రవరి నెలలో దక్కించుకుంది. ఇందులో వాటర్, ఎన్విరాన్‌మెంట్ విభాగం మూడు ఆర్డర్లు పొందింది. వీటి విలువ రూ.1,967 కోట్లు. బిల్డింగ్స్, హౌజింగ్ డివిజన్ రూ.707 కోట్ల విలువైన రెండు ప్రాజెక్టులు, రోడ్స్ విభాగం రూ.306 కోట్ల విలువైన రెండు కాంట్రాక్టులను సాధించింది.

ద్రవ్యలోటు భయాలతో నష్టాలు

బలహీనంగా అంతర్జాతీయ సంకేతాలు

- 137 పాయింట్ల పతనంతో 34,047కు సెన్సెక్స్
- 35 పాయింట్ల నష్టంతో 10,458కు నిఫ్టీ

జీడీపీ, కోర్ సెక్టార్ గణాంకాలు అంచనాలను మించినప్పటికీ, ద్రవ్యలోటు భయాలు గురువారం స్టాక్ మార్కెట్‌ను పడగొట్టాయి. స్టాక్ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ రేట్ల పెంపు భయాలు కొనసాగడంతో ప్రపంచ మార్కెట్లు పతనం కావడం ప్రతికూల ప్రభావం చూపించింది. సెన్సెక్స్ 137 పాయింట్లు నష్టపోయి 34,047 పాయింట్ల వద్ద, నిఫ్టీ 35 పాయింట్ల నష్టంతో 10,458 పాయింట్ల వద్ద ముగిశాయి. ఇక ఈ వారంలో సెన్సెక్స్ 95 పాయింట్లు, నిఫ్టీ 33 పాయింట్ల చొప్పున నష్టపోయాయి.

బ్యాంక్ రుణ మోసాల కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఫిబ్రవరి నెల వాహన విక్రయాలు బాగా ఉండటంతో కొన్ని వాహన కంపెనీ షేర్లు దూసుకుపోవడంతో నష్టాలు కొంత తగ్గాయి. బుధవారం మార్కెట్ ముగిశాక వెలువడిన జీడీపీ గణాంకాలు సానుకూలంగా ఉండటంతో సెన్సెక్స్ 34,279 పాయింట్ల వద్ద లాభాల్లో ఆరంభమైంది. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో జీడీపీ ఐదు క్వార్టర్ల గరిష్ట స్థాయికి, 7.2 శాతం వృద్ధి చెందింది. జనవరిలో కోర్ సెక్టార్ 6.2 శాతం వృద్ధి చెందడం కూడా కలిసిరావడంతో కొనుగోళ్లు జోరుగా సాగాయి. దీంతో సెన్సెక్స్ ఇంట్రాడేలో 95 పాయింట్ల లాభంతో 34,279 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకింది. అంతర్జాతీయ సంకేతాలు అంతంతమాత్రంగానే



ఉండటం, ఈ ఏడాది జనవరి చివరినాటికి ద్రవ్యలోటు రూ.6.77 లక్షల కోట్లు(ఇది బడ్జెట్ లక్ష్యంలో 13.7 శాతం అధికమై మొత్తం 113.7 శాతానికి ఎగసింది) పెరగడం, సుదీర్ఘ సెలవుల కారణంగా లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. సెన్సెక్స్ 168 పాయింట్లు క్షీణించి 34,016 పాయింట్ల వద్ద ఇంట్రాడేలో కనిష్ట స్థాయిని తాకింది.

పెరిగినప్పుడల్లా అమ్మకాలు...

అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో మార్కెట్ పెరిగినప్పుడల్లా ఇన్వెస్టర్లు అమ్మేస్తున్నారని నిపుణులు అంటున్నారు. జీడీపీ, కీలక పరిశ్రమల గణాంకాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ఉన్నప్పటికీ, ఆరంభంలో మార్కెట్లో లాభాలు వచ్చాయని రెలిగేర్ బ్రోకింగ్ ప్రెసిడెంట్ జయంత్ మాంగ్లిక్ చెప్పారు.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,926
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	27,986
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	13,18,649
ఎఫ్ఐఐ	242
డీఐఐ	-3

ఓఎన్‌జీసీ: గత ఆర్థిక సంవత్సరానికి రెండో మధ్యంతర డివిడెండ్‌గా ఒక్కో షేర్‌కు రూ.2.25ను (45%)చెల్లించనున్నది. ఈ షేర్‌కు రికార్డ్ డేట్‌గా ఈ నెల 14ను నిర్ణయించింది. మొత్తం రూ.2,887 కోట్లు డివిడెండ్‌గా చెల్లించనున్నది. ఇక ఒక్కో షేర్‌కు రూ.3 చొప్పున తొలి మధ్యంతర డివిడెండ్‌ను గత ఏడాది నవంబర్‌లో చెల్లించింది.

నాట్కో ఫార్మా: హెపటైటిస్–సి చికిత్సలో వాడే సోఫోస్బువిర్–400 ఎంజీ ట్యాబ్లెట్ల విక్రయానికై ఏఎన్‌డీఏను యూఎస్ఎఫ్‌డీఏ వద్ద దాఖలు చేసింది.

పిట్టి ల్యామినేషన్స్: పిట్టి ల్యామినేషన్స్ లిమిటెడ్ పేరును పిట్టి ఇంజనీరింగ్ లిమిటెడ్‌గా మార్చేందుకై మార్చి 9న బోర్డు సమావేశం కానుంది.

నేడు సెలవు

హోలీ సందర్భంగా నేడు స్టాక్ మార్కెట్‌కు సెలవు. బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో ట్రేడింగ్ తిరిగి ఈ నెల 5న సోమవారం ప్రారంభమవుతుంది.

హెయిర్ ఫాల్ చికిత్సకు గ్లెన్‌మార్క్ నూర్‌క్రిన్

మహిళల కోసం ప్రత్యేకం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ మహిళల కేశ సంరక్షణ కోసం భారత మార్కెట్లో 'నూర్‌క్రిన్' పేరిట కొత్త ఉత్పాదనను ప్రవేశపెట్టింది. జుట్టు రాలిపోవడాన్ని అరికట్టి కొత్త వెంట్రుకలు వచ్చేందుకు ఇది ఉపకరిస్తుందని కంపెనీ తెలిపింది. ఎటువంటి రసాయనాలు లేకుండా ప్రొటోగ్లైకెన్స్ ప్రొటీన్‌తో కూడిన మెరిలెక్స్ అనే పదార్థాన్ని ఇందులో వాడారు. పేటెంటెడ్ ఉత్పాదన అయిన నూర్‌క్రిన్ ట్యాబ్లెట్లు 20 ఏళ్లుగా 50 దేశాల్లో విజయవంతంగా అమ్ముడవుతున్నాయి. భారత్‌లో 60 ట్యాబ్లెట్ల ప్యాక్ ధర రూ.3,000. డెన్మార్క్ కంపెనీ ఫార్మా మెడికోతో గ్లెన్‌మార్క్ ఒప్పందం చేసుకుని భారత్‌లో విడుదల చేసింది. వైద్యుల సిఫార్సు మేరకే ఈ ఉత్పాదనను విక్రయిస్తామని గ్లెన్‌మార్క్ సేల్స్, మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేశ్ కపూర్ తెలిపారు. కనీసం 6 నెలలపాటు నూర్‌క్రిన్‌ను వాడాలని ఆయన సూచించారు. నియంత్రణ సంస్థల అనుమతి వస్తే పురుషుల కోసం సైతం ఉత్పాదనను అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.

రామ్‌కీ ఇన్‌ఫ్రాకు రూ.939 కోట్ల కాంట్రాక్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ సంస్థ రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.939.41 కోట్ల విలువైన కాంట్రాక్టును ఎన్‌హెచ్ఏఐ నుంచి చేజిక్కించుకుంది. ఇందులో భాగంగా జమ్ము–శ్రీనగర్ హైవేలో గలందర్ నుంచి సంబల్ రోడ్ మధ్య ప్రతిపాదిత శ్రీనగర్ రింగ్ రోడ్‌ను నిర్మించాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ విధానంలో 42.10 కిలోమీటర్ల మేర రోడ్డును నిర్మిస్తారు. 36 నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేయాలి. ఈ నిర్మాణం పూర్తయితే శ్రీనగర్ సిటీతోపాటు నగరం చుట్టుపక్కల ట్రాఫిక్ సులభంగా వెళ్లేందుకు వీలవుతుంది. హెవీ మెషినరీని సరిహద్దులో కీలక ప్రాంతాలైన బారాముల్లా, యూరీ, కుప్వారా, బందీపురకు అడ్డంకులు లేకుండా చేరవేయవచ్చు. ఐదు జిల్లాల్లో విస్తరించిన ఈ రోడ్డు 52 గ్రామాలను అనుసంధానిస్తుంది.

ప్రమోటర్ల అవకతవకలపై ఫోర్టిస్ విచారణ

న్యూఢిల్లీ: ప్రమోటర్లు మల్వీందర్ సింగ్, శివీందర్ సింగ్ నిధులు స్వాహా చేశారన్న ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరిపేందుకు బైటి లీగల్ సంస్థను నియమించుకోనున్నట్లు ఫోర్టిస్ హెల్త్‌కేర్ తెలిపింది. అనుబంధ సంస్థ ఇచ్చిన ఇంటర్ కార్పొరేట్ డిపాజిట్లు, గ్రూప్ అంతర్గతంగానూ.. సంబంధిత వర్గాల మధ్య జరిగిన లావాదేవీలు వంటి వాటిపై విచారణ జరపనున్నట్లు రెండో, మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల ప్రకటనలో సంస్థ వివరించింది. ఇక ఫోర్టిస్ హెల్త్‌కేర్ జూలై –సెప్టెంబర్ త్రైమాసికంలో రూ. 24 కోట్లు, అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో రూ. 19.10 కోట్ల నికర నష్టాలు నమోదు చేసింది.

గీతాంజలి జెమ్స్:
పీఎన్‌బీ రుణ కుంభకోణం నేపథ్యంలో గీతాంజలి జెమ్స్‌కు చెందిన రూ.1,200 కోట్ల విలువైన 41 ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. దీంతో ఈ షేర్ బీఎస్ఈలో 5 శాతం క్షీణించి రూ.20.30 వద్ద ముగిసింది. వరుసగా 12వ రోజూ ఈ షేర్ నష్టపోయింది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,535	▼	160
బంగారం (99.5, 10గ్రా)	30,385	▼	160
వెండి (కిలో)	38,210	▼	285
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	28,930	▼	150
వెండి (కిలో)	– –		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,380	▼	150
బంగారం (22 క్యారెట్లు)	28,930	▼	150
వెండి (కిలో)	41,100	▼	200
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,350	▼	100
బంగారం (22 క్యారెట్లు)	29,060	▼	20
వెండి (కిలో)	39,400		0
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	31,560		
బంగారం (22 క్యారెట్లు)	28,930		
వెండి (కిలో)	41,000		
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,250	▼	250
బంగారం (22 క్యారెట్లు)	29,000	▼	100
వెండి(కిలో)	39,300	▼	300
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,280	▼	160
బంగారం (22 క్యారెట్లు)	28,930	▼	150
వెండి (కిలో)	39,100	▼	200

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.00కు	బుధవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	60.88	$61.64
బ్రెంట్	63.77	$64.73

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 02-3-2018

విశాఖ	350–00
చిత్తూరు	378–00
వరంగల్	347–00
ముంబై	390–00
చెన్నై	385–00
విజయవాడ	340–00
గోదావరి	340–00
నమక్కల్	370–00
01–3–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	345–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.05
బెంగళూరు	385–00
కోల్‌కతా	398–00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	406.1	408.35
AMBUJA CEME	253.15	252.35
ASIAN PAINT	1118.9	1117.75
AUROBINDO P	624.1	613.9
AXIS BANK L	525.75	528.75
BAJAJ AUTO	3020.9	3020.6
BAJAJ FINAN	1659.35	1640.25
BHARTI AIRT	427.75	428.55
BOSCH LIMIT	18707.5	18687.3
BHARAT PETR	441.9	429.55
CIPLA LTD	581.7	589.65
COAL INDIA	312.9	309.15
DR. REDDY'S	2231.5	2237.25
EICHER MOTO	27742.35	27437.75
GAIL (INDIA	454.25	457.5
HCL TECHNOL	942.8	940.3
HDFC LTD	1814.15	1808.7
HDFC BANK L	1874.35	1884.2
HERO MOTOCO	3576.9	3596.7
HINDALCO I	240.8	245.4
HIND.Petrol	376.75	380.15
HIND.Unilever	1324.25	1317.75
INDIABULLS	1256.3	1254.1
ICICI BANK	304.95	313.25
INDUSIND BA	1700.35	1680.75
BHARTI INFR	345.2	346.7
INFOSYS LIM	1160.75	1172.6
INDIAN OIL	381.5	379.3
ITC LTD	264	265.05
KOTAK MAHIN	1095.7	1090.55
LARSEN & TO	1315.2	1318.15
LUPIN LIMIT	803.9	819.95
MAHINDRA &	732.55	728.35
MARUTI SUZU	8873.45	8850.95
NTPC LTD	163	163.25
OIL AND NAT	189.7	188.3
POWER GRID	197.4	197.7
RELIANCE IN	948.4	954.55
STATE BANK	262.15	268
SUN PHARMAC	535.4	535.35
TATA MOTORS	370.75	369.9
TATA STEEL	675.05	671.6
TATA CONSUL	3037.7	3035.05
TECH MAHIND	611.9	612.65
ULTRATECH C	4153.3	4155.6
UPL LIMITED	714.25	728.75
VEDANTA LIM	323.25	329.75
WIPRO LTD	292.5	292.8
YES BANK LI	321.05	322.3
ZEE ENTERTA	555.4	565.35

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

ABB INDIA L	1525.15	1531.75
ACC LIMITED	1633.8	1623.05
ASHOK LEYLA	140.95	141.5
BAJAJ FINSE	4999.4	5051.7
BANK OF BAR	138.3	141.95
BHARAT ELEC	153.3	154.35
BHEL	90.7	89.9
BRITANNIA I	4943.85	4994.25
CADILA HEAL	404.05	405.1
COLGATE PAL	1056.9	1041.1
CONTAINER C	1312.35	1304.15
CUMMINS IND	804.1	795.95
DABUR INDIA	325.2	325.05
DLF LIMITED	224.3	226.25
AVENUE SUPE	1314.25	1348.15
EMAMI LIMIT	1081.2	1080
GLAXOSMITHK	2378.9	2384.15
GLENMARK PH	544.5	544.55
GODREJ CONS	1080.2	1070.45
GLAXOSMITHK	6791.5	6696.9
HAVELLS IND	511.25	507.65
HIND.Zinc	315.6	326.45
ICICI PRU L	408.1	412.8
IDEA CELLUL	83.05	83.9
INTERGLOBE	1332.15	1335.7
JSW STEEL L	305.5	312.2
LIC HOUSING	507.05	507.8
MARICO LIMI	312.15	308.15
UNITED SPIR	3244.85	3291.95
MOTHERSON S	319.9	330
MRF LTD	72683.65	73391.6
NHPC LTD	27.8	27.3
NMDC LTD.	130.7	129.35
ORACLE FIN	3855.55	3941.6
OIL INDIA L	349.75	349.85
PIRAMAL ENT	2547.05	2582.55
PETRONET LN	240.8	247.3
POWER FIN C	102.45	105.1
P&G HYGIENE	9413.85	9392.75
PIDILITE IN	894.4	900.95
PUNJAB NATI	101.05	101.4
RURAL ELEC	142.15	144.3
STEEL AUTHO	80.9	83.2
SHREE CEMEN	16595.35	16623.45
SIEMENS LTD	1153.15	1167.9
SHRIRAM TRA	1338.55	1333.85
SUN TV NETW	916.65	927.8
TATA POWER	84.3	84.5
TITAN COMPA	810.2	816.15
TORRENT PHA	1338.1	1368.65

మాజీ ఎమ్మెల్యే సింగన్నదొర మృతి

గుండెపోటుతో రాజమహేంద్రవరంలో కన్నుమూత

పోలవరం: గిరిజన నాయకుడు, పోలవరం మాజీ ఎమ్మెల్యే పూనెం సింగన్నదొర(75) గురువారం ఉదయం మృతి చెందారు. బుధవారం రాత్రి గుండెలో మంటగా ఉందని చెప్పడంతో కుటుంబసభ్యులు ఆయనను




పూనెం సింగన్నదొర

రాజమహేంద్రవరంలోని బొల్లినేని వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా గురువారం ఉదయం గుండెపోటు రావటంతో మృతి చెందారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లా పోలవరం మండలంలోని కోండ్రుకోట గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. సింగన్నదొర మరణంతో ఏజన్సీ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సింగన్నదొర భౌతికకాయాన్ని కడసారిగా చూసేందుకు వివిధ పార్టీల నాయకులు, అభిమానులు తరలివచ్చారు. ఈయనకు భార్య శ్రీలక్ష్మి, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సింగన్నదొర నాలుగుసార్లు కోండ్రుకోట గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సేవలందించారు. 1994 నుంచి 1999 వరకు పోలవరం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఎస్టీ శాసనసభా కమిటీ సభ్యుడిగా, జీసీసీ డైరెక్టర్‌గా, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌గా పనిచేశారు. సింగన్నదొర మృతికి సంతాపంగా పోలవరంలో మధ్యాహ్నం వరకు దుకాణాలు మూసివేశారు. పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు తెల్లం బాలరాజు, జొన్నకూటి బాబాజీరావు తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు.

సీఎం సంతాపం

సాక్షి, అమరావతి: పోలవరం మాజీ ఎమ్మెల్యే సింగన్న దొర మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రజలకు సింగన్న దొర ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

కంచి పీఠాధిపతిగా విజయేంద్ర సరస్వతి



సాక్షి, చెన్నై: కంచి కామకోటి పీఠం 70వ పీఠాధిపతిగా విజయేంద్ర సరస్వతి బాధ్యతలు స్వీకరించారు. జయేంద్ర సరస్వతి మహాసమాధితో.. నూతన పీఠాధిపతిగా ఆయన బాధ్యతలు స్వీకరిస్తూ తమిళనాడు దేవాదాయ శాఖకు లేఖ అందజేశారు. జయేంద్ర సరస్వతి తన ఇచ్చిన బాధ్యతలను, సేవలను కొనసాగిస్తూ, మఠం విశిష్టతను పరిరక్షిస్తూ, ఆధ్యాత్మిక పయనాన్ని, పర్యటనలను విస్తృతం చేయనున్నట్టు విజయేంద్ర సరస్వతి ప్రతిజ్ఞ చేశారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం మఠం మండపంలోని చంద్రమౌళీశ్వర పూజలో పాల్గొన్నారు. 1969లో మార్చి 13న తమిళనాడులోని ఆరణిలో విజయేంద్ర జన్మించారు. ఆయన అసలు పేరు శంకరనారాయణ. తల్లిదండ్రులు కృష్ణమూర్తి శాస్త్రి, అంబాలక్ష్మి. ఈ దంపతులకు తొమ్మిదో సంతానం విజయేంద్ర సరస్వతి. 1973-77వరకు తండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు విద్యను అభ్యసించారు. తదుపరి పౌరోహిత్యం మీద దృష్టి పెట్టి వేద పాఠశాలలో చేరారు. వేదపాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉన్న తన తండ్రి ఉపదేశాలు ఆయన మీద ప్రభావం చూపడంతో సంస్కృతంలో వేద పఠనం చేశారు. తర్వాత 1983లో కంచి మఠంలోకి అడుగుపెట్టి.. జయేంద్ర సరస్వతికి అత్యంత సన్నిహిత శిష్యుడయ్యారు.

పరమాచార్య కాలంలో కొత్త ఒరవడి

- నాడు కంచిలో పెరిగిన జనాదరణ
- జయేంద్ర సరస్వతి హయాంలో విస్తరణ
- చివరి రోజుల్లో ప్రశాంత జీవనం

(సాక్షి నాలెడ్జ్ సెంటర్): కంచి కామకోటి పీఠాధిపతుల్లో అత్యంత వివాదాస్పదమైన ఆధ్యాత్మిక గురువుగా జయేంద్ర సరస్వతిని పరిగణిస్తే ఆయనకు ముందు 68వ పీఠాధిపతిగా దాదాపు 87 ఏళ్లు కొనసాగిన చంద్రశేఖరేంద్ర సరస్వతిని అత్యధిక గౌరవ ప్రతిపత్తులున్న 'పరమాచార్య'గా గౌరవిస్తారు. అసలు కంచి పీఠం హోదాపైనే చాలా కాలం వివాదం సాగింది. హిందూ మత పునరుద్ధరణకు పునాదులు వేసిన ఆది శంకరాచార్య స్థాపించిన నాలుగు పీఠాల్లో కంచిలేదనీ, దీన్ని ఆయనే ఏర్పాటు చేశారనే మాటల్లో నిజంలేదని అనేకమంది వాదిస్తారు. అయితే, కంచి కామకోటి పీఠాన్ని ఆది శంకరుడే (ఆది శంకర భగవత్పాద)స్థాపించారని, ఆయనే తొలి పీఠాధిపతి (క్రీస్తు పూర్వం 482-477) అని కంచి పీఠం పేర్కొంది. ఈ పీఠం లెక్క ప్రకారం చూస్తే దాదాపు 2,500 సంవత్సరాల చరిత్రలో జయేంద్ర సహా 69 మంది ఇప్పటివరకూ కంచి కామకోటి పీఠాధిపతులుగా ఉన్నారు.

'పరమాచార్య' హయాంలో పెరిగిన జనాదరణ

1907-94 మధ్య కంచి కామకోటి పీఠాధిపతిగా ఉన్న జగద్గురు చంద్రశేఖరేంద్ర సరస్వతి మిగిలిన అన్ని పీఠాలతో పోల్చితే తన పీఠానికి ఎప్పుడూ లేనంత జనాదరణ సంపాదించిపెట్టారు. ఈ కాలంలో బ్రిటిష్ అధికారులు, స్వాతంత్య్ర సమరయోధులు, తర్వాత ప్రధానులు, ముఖ్యమంత్రులు, మంత్రులు సహా అనేకమంది ప్రముఖులు కంచి పరమాచార్యను కలిసి ముచ్చటించడం ఆనవాయితీగా ఉండేది. ఆయన హయాంలో కంచి పీఠం పేరు బాగా విస్తరించింది. ఇందిరా గాంధీ క్రమం తప్పకుండా పరమాచార్యతో సమావేశమయ్యేవారు.

పేదల భూములే టార్గెట్

▶ మొదటి పేజీ తరువాయి

గురి పెట్టింది. పేదలకు జీవనోపాధి కోసం గతంలో కేటాయించిన అసైన్డ్, పట్టా భూములను బలవంతంగా లాక్కొని, బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతోంది. విశాఖపట్నం, మచిలీపట్నం, దొనకొండ, శ్రీకాళహస్తి-ఏర్పేడు పారిశ్రామిక నోడ్స్ పేరుతో 20,603.65 ఎకరాల పేదల భూములను, 22,015.27 ఎకరాల పట్టా భూములను సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ భూములను ఇప్పటికే పరిశ్రమల శాఖ గుర్తించింది. గుర్తించిన భూములను వీలైనంత త్వరగా సేకరించి, ఏపీఐఐసీకి అప్పగించాలని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు సైతం జారీ చేసింది. నాలుగు పారిశ్రామిక నోడ్స్ కోసం అసైన్డ్, పట్టా భూములతోపాటు ప్రభుత్వ భూమి కలిపి మొత్తం 61,315.38 ఎకరాలను గుర్తించింది.

చట్టమంటే లెక్కలేదా?

చట్టం ప్రకారం.. పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను ఇతరులెవరూ కొనుగోలు చేయరాదు. ఎవరైనా కొనుగోలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలి. అలా స్వాధీనం చేసుకున్న భూమిని తొలుత కేటాయించిన పేదలు ఉంటే వారికే ఇవ్వాలి. వారు లేకపోతే ఇతర పేదలకు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం లెక్కచేయడం లేదు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు చరమగీతం పాడేస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు భూపంపిణీ కోసం పైసా కూడా ఖర్చు చేయకపోగా, వారి భూములను ఇతర అవసరాల కోసం ప్రభుత్వమే లాగేసుకోవడం బాధాకరమని ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

నాలుగు పారిశ్రామిక నోడ్స్ కోసం సేకరించనున్న భూమి(ఎకరాల్లో)

పారిశ్రామిక నోడ్	మండలం	అసైన్డ్ భూమి	ప్రభుత్వ భూమి	పట్టా భూమి	మొత్తం
విశాఖపట్నం	రాంబిల్లి	--	241.15	1,143.30	1,384.45
	నక్కపల్లి ఫేస్-1	--	2,151.23	2,390.30	4,541.53
	నక్కపల్లి ఫేస్-2	--	289.76	1,646.85	1,936.61
మచిలీపట్నం	--	--	--	12,144.86	12,144.86
దొనకొండ	--	5,690.73	7,640.64	3,785.23	17,116.60
శ్రీకాళహస్తి-ఏర్పేడు	తొట్టంబేడు	7,744.83	2,937.40	322.98	11,005.21
	తొట్టంబేడు -బి.ఎస్.కండ్రిగ	7,168.09	5,436.28	581.75	13,184.12
మొత్తం		20,603.65	18,696.46	22,015.27	61,313.38

కేంద్రంపై బురదచల్లడం దారుణం

- రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలి
- ఎంపీ గోకరాజు గంగరాజు డిమాండ్

తిరుపతి అన్నమయ్య సర్కిల్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏమీ చేయలేదనడం దారుణమని బీజేపీ ఎంపీ గోకరాజు గంగరాజు పేర్కొన్నారు. గురువారం తిరుపతిలోని ఓ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏ రాష్ట్రానికీ అందని విధంగా మన రాష్ట్రానికి కేంద్రం నుంచి సహాయసహకారాలు అందాయని, రాష్ట్ర ప్రభుత్వం బీజేపీని తప్పుపట్టడం సమంజసం కాదన్నారు. రాయలసీమ ప్రాంతంలో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పోలీస్ కస్టడీకి బొమ్మరిల్లు ఎండీ

చిలకలపూడి: బొమ్మరిల్లు ఫామ్స్ అండ్ విల్లాస్ మేనేజింగ్ డైరెక్టర్ రాయల రాజారావును నాలుగు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.లక్ష్మణరావు గురువారం ఆదేశాలు జారీ చేశారు. బొమ్మరిల్లు ఫామ్స్ అండ్ విల్లాస్ ద్వారా ఖాతాదారుల నుంచి సేకరించిన రూ.45 కోట్ల నిధులు దుర్వినియోగం చేశారనే ఫిర్యాదు మేరకు 17న రాజారామ్‌ను అరెస్టు చేశారు. అనంతరం పోలీస్ కస్టడీకి అప్పగించాలని కోరుతూ మంగళగిరి సీఐడీ కార్యాలయ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోర్టుకు దరఖాస్తు చేశారు.

రవాణా రంగ డ్రైవర్లకు శిక్షణ తరగతులు

- హాజరైతేనే లైసెన్సు రెన్యువల్
- ఆర్టీసీ సహకారంతో ప్రతి జిల్లాలో నిర్వహణ
- మోటారు వాహన చట్టానికి సవరణ చేయనున్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రవాణా రంగంలో వాహనాలను నడిపే డ్రైవర్లు తమ డ్రైవింగ్ లైసెన్సులు రెన్యువల్ చేయించుకోవాలంటే ఇకపై రెండ్రోజుల పాటు శిక్షణ తరగతులకు తప్పనిసరిగా హాజరు కావాల్సిందే. రెండ్రోజుల పాటు డ్రైవర్లు ఈ శిక్షణ తరగతులకు హాజరైతేనే డ్రైవింగ్ లైసెన్సు మంజూరు చేయనున్నారు. ఈ మేరకు రవాణా శాఖ డ్రాఫ్ట్ బిల్లు త్వరలో రూపొందించనుంది. డ్రాఫ్ట్ బిల్లును ప్రభుత్వానికి పంపి మోటారు వాహన చట్టానికి త్వరలో సవరణలు చేయనున్నారు. రవాణేతర డ్రైవింగ్ లైసెన్సును 45 ఏళ్ల వరకు రవాణా శాఖ మంజూరు చేస్తుంది. 50 ఏళ్ల తర్వాత ప్రతి ఐదేళ్లకు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో రెన్యువల్ చేస్తారు. అదే రవాణా వాహనాల డ్రైవింగ్ లైసెన్సు ప్రతి మూడేళ్లకోసారి రెన్యువల్ చేయించుకోవాలి. గడువు ముగిసిన వెంటనే రవాణా రంగ సంబంధిత డ్రైవర్లు రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లి లైసెన్సును పునరుద్ధరించుకుంటున్నారు. ఇకపై డ్రైవింగ్ లైసెన్సు రెన్యువల్ చేయాలంటే శిక్షణ తరగతులకు హాజరైనట్లు రవాణా శాఖకు ధ్రువపత్రం (సర్టిఫికెట్) సమర్పిస్తేనే లైసెన్సు రెన్యువల్ అయ్యేలా చట్ట సవరణ చేయనున్నారు.

ఆర్టీసీ సహకారంతో ప్రతి జిల్లా కేంద్రంలో శిక్షణ తరగతులు

ఆర్టీసీ అన్ని జిల్లా కేంద్రాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ తరగతులను కృష్ణా రీజియన్‌లో గన్నవరం, నెక్ (విజయనగరం) జోన్‌లో విజయనగరం, నెల్లూరు, కడపలలో నిర్వహిస్తున్నారు. ఇవి కాకుండా అన్ని జిల్లాల్లో శిక్షణ కోసం రూ.6.50 కోట్లను కేటాయించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిలోనే రవాణా రంగ డ్రైవర్లకు రెండ్రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు రవాణా శాఖకు ఆర్టీసీ సహకారం అందించనుంది. శిక్షణ కేంద్రాల్లో రెండ్రోజుల పాటు వసతి కల్పిస్తే రూ.1,500, రెగ్యులర్‌గా హాజరైతే రూ.వెయ్యి వంతున లైసెన్సు రెన్యువల్ చేయించుకునే డ్రైవర్లు ఆర్టీసీకి చెల్లించాలి. ఈ మేరకు రవాణా శాఖ ముసాయిదా బిల్లు రూపొందించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ శిక్షణ కేంద్రాల్లో రవాణా రంగ డ్రైవర్లకు తరగతులు నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు చెక్కులు పంపిణీ

వంద మందికి నష్టపరిహారం అందజేసిన సీఎం

సాక్షి, అమరావతి: వందమంది అగ్రిగోల్డ్ బాధితులకు నష్టపరిహారం కింద రూ. 5 కోట్ల విలువైన చెక్కులను సీఎం చంద్రబాబు గురువారం సచివాలయంలో అందజేశారు. ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు చొప్పున మొత్తం ఐదు కోట్లు విడుదల చేసినట్లు సీఎం తెలిపారు. ప్రైవేట్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని, ఎక్కువ వడ్డీలిస్తామని, రెండేళ్లలో రెట్టింపు చేస్తామనే ప్రచారాలను నమ్మవద్దన్నారు. ప్రభుత్వ బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ బాధిత కుటుంబాలకు డబ్బులిప్పిస్తామని సీఎం స్పష్టం చేశారు.

- తిరుమల శ్రీవారికి భక్తులు సమర్పించే తలనీలాలను గురువారం ఈ-వేలంలో విక్రయించారు.దీని ద్వారా రూ.2.38 కోట్ల ఆదాయం వచ్చింది.

ఈ-నామ్‌కు నిరసనగా రోడ్డెక్కిన మిర్చి రైతులు

- డబ్బులు వెంటనే చెల్లించాల్సి ఉండడంతో నామమాత్రంగా కొన్న వ్యాపారులు
- దీంతో పడిపోయిన మిర్చి ధరలు
- పాత పద్ధతిలోనే కొనుగోళ్లు జరపాలని రైతుల బైఠాయింపు
- రెండురోజుల పాటు పాత పద్ధతిలోనే జరిగేలా చర్యలు



గుంటూరు మిర్చి యార్డు వద్ద ధర్నా చేస్తున్న మిర్చి రైతులు

సాక్షి, అమరావతి బ్యూరో: మిర్చి పంట కొనుగోళ్లల్లో కొత్తగా ప్రవేశపెట్టిన ఈ-నామ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ రైతులు రోడ్డెక్కారు. గుంటూరు మిర్చి యార్డులో గురువారం నుంచి ఈ పద్ధతిలో మిర్చి కొనుగోళ్లు జరిపేలా మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది. కొన్న సరుకుకు వెంటనే డబ్బు చెల్లించాల్సి రావడంతో, వ్యాపారులు రైతుల నుంచి నామమాత్రంగా మిర్చి కొనుగోలు చేశారు. దీంతో కొనుగోళ్లు మందగించి, మిర్చి ధరలు పడిపోయాయి. ఈ నేపథ్యంలో రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ, పాత పద్ధతిలోనే క్రయ, విక్రయాలు జరపాలంటూ గుంటూరు-చిలకలూరిపేట రహదారిపై బైఠాయించారు. దీంతో వెనక్కి తగ్గిన మార్కెటింగ్ అధికారులు.. రెండు రోజులపాటు పాత పద్ధతిలోనే క్రయవిక్రయాలు జరిపేందుకు అంగీకరించడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండానే..

ఇదిలా ఉంటే.. ఈ-నామ్ సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండానే బలవంతంగా ఈ విధానాన్ని రుద్దడంవల్లే ఈ సమస్య తలెత్తిందని వ్యాపార వర్గాలు ఆరోపిస్తున్నాయి. గుంటూరు మిర్చి యార్డుకు రోజూ లక్షకు పైగా మిర్చి బస్తాలు వస్తాయని.. ఇంత పెద్ద మార్కెట్‌లో కొత్త విధానం అమలుచేయడం సాధ్యమా అని ప్రశ్నిస్తున్నాయి. డబ్బులు చెల్లించి సరుకు కొనాలంటే, కోట్ల రూపాయల డబ్బులు అవసరమవుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యాపారులు తమ వద్ద ఉన్న డబ్బు మేరకే క్రయ విక్రయాలు చేయడంవల్ల మిర్చి కొనుగోళ్లు తగ్గినట్లు తెలుస్తోంది. కాగా, మిర్చి బస్తాలు యార్డులో పేరుకుపోతే ధరలు పతనమవుతాయనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

ఆ మండలాల్లో 50 రోజులు అదనంగా 'ఉపాధి'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కరువు ప్రాంతాలుగా ప్రకటించిన 80 మండలాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు అదనంగా 50 రోజులు పని కల్పించేందుకు అనుమతి తెలుపుతూ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రామాంజనేయులు ఉత్తర్వులు జారీచేశారు. గురువారం నుంచి పని దినాల పెంపు అమల్లో ఉంటుంది. మంత్రి లోకేష్ అధికారులతో సమీక్షించారు.

పోలవరంపై డాక్యుమెంటరీకి రూ.75 లక్షలు

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు చరిత్ర, నిర్మాణం జరుగుతున్న తీరు.. అది పూర్తయ్యాక ఒనగూరే ప్రయోజనాలపై 22 నిముషాల డాక్యుమెంటరీని రూపొందించేందుకు నేషనల్ జియోగ్రఫీ ఛానల్‌కు ప్రభుత్వం రూ.75 లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

ఆరు నెలల గర్భిణిపై కిరాతకం

- భర్తను కొట్టి ఆమెను ఎత్తుకెళ్లే యత్నం
- అడ్డుకున్న స్థానికులు



రక్షణ కల్పించాలని కోరుతున్న రాణి

గుంటూరుఈస్ట్: భార్యాభర్తలను కొట్టి, ఆరు నెలల గర్భంతో ఉన్న మహిళను లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు ఓ కిరాతకుడు. చుట్టు పక్కల వారు అడ్డుకుని, బాధితులను ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం గురువారం బాధితులు పాత గుంటూరు పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలు ములుగూరి రాణి తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు రూరల్ మండలం బుడంపాడు ఎస్సీ కాలనీకి చెందిన ములుగూరి రాణికి చిన్నతనంలోనే తల్లి, తండ్రి చనిపోవడంతో షాపుల్లో పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. 2017 ఆగస్టులో పాతగుంటూరుకు చెందిన ఎం.శ్రీనివాస్‌ను ప్రేమించి, కులాంతర వివాహం చేసుకుంది. ఈనెల 25న పాత స్నేహితుడైన తురకా సునీల్ ఆమె ఇంటికి వచ్చి భర్తను వదిలేసి తన వెంట రావాలంటూ ఒత్తిడి చేశాడు. రాణి తిరస్కరించడంతో తీవ్రంగా కొట్టి ఆమె సెల్‌ఫోన్ పగులకొట్టాడు. ఇంటికి చేరుకున్న భర్త శ్రీనివాస్‌ను కూడా కొట్టి ఆమెను వదిలిపెట్టి వెళ్లాలని బెదిరించాడు. చుట్టుపక్కల వారు కలుగజేసుకుని సునీల్‌ను వారించి పంపించి వేశారు. అదే రోజు రాత్రి సునీల్ తన మిత్రుడు రామారావుతో కలిసి మళ్లీ రాణి ఇంటికి వచ్చి భార్యా భర్తలిద్దరిని తీవ్రంగా కొట్టారు. గొడవను గమనించిన చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చి పిలిపించడంతో విషయాన్ని తెలుసుకుని సునీల్, రామారావు అక్కడి నుంచి పరారయ్యారు.

గర్భంపై తన్నిన నిందితుడు

ఆరు నెలల గర్భిణి అయిన రాణి పొట్ట మీద, నడుము మీద సునీల్ తన్ని, కొట్టి గాయపరిచాడు. గురువారం దంపతులు ఇద్దరు పాత గుంటూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమకు ప్రాణ రక్షణ కల్పించాలని వేడుకున్నారు. సునీల్ నేర స్వభావం కలవాడని, అతనికి ఉన్న పలుకుబడితో ప్రాణాలు తీయడానికైనా వెనుకాడడని రాణి కన్నీరుమున్నీరయింది. తనకు తన భర్తకు ఎటువంటి అండ లేని కారణంగా పోలీసులే రక్షణ కల్పించాలని వేడుకుంది.

జయేంద్ర సరస్వతి.. మహాసమాధి



జయేంద్ర సరస్వతి బృందావన ప్రవేశఘట్టం

మఠంలోని బృందావనంలో ముగిసిన అంత్యక్రియలు

- అభిషేకం, అలంకరణతో మొదలై.. హారతితో పూర్తి
- వేదమంత్రోచ్చారణలు, సనాతన పద్ధతిలో కార్యక్రమం
- భక్తకోటి అశ్రునయనాలు.. రాజకీయ ప్రముఖుల హాజరు

కాంచీపురం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

శివైక్యం చెందిన కంచి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి (82) బృందావన ప్రవేశం (అంత్యక్రియలు) గురువారం ముగిసింది. మఠంలోని బృందావనంలో వేదమంత్రోచ్చారణల మధ్య సంప్రదాయపద్ధతిలో ఆయన భౌతికకాయాన్ని మహాసమాధి చేశారు. శిష్యులు, వేదపండితులు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో అశ్రునయనాల మధ్య స్వామి 'బృందావన ప్రవేశ' (అధిష్ఠానం అని కూడా అంటారు) కార్యక్రమం ముగిసింది. గురువారం ఉదయం 7.45 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం మూడున్నర గంటలసేపు కొనసాగింది. ఉదయం అభిషేకంతో ప్రారంభమైన అంతిమసంస్కారం హారతితో ముగిసింది. దీంతో దాదాపు నాలుగు దశాబ్దాల పాటు మఠ పీఠాధిపతిగా దేశ, విదేశాల్లో కీర్తించబడిన శ్రీ జయేంద్ర సరస్వతి శంకరాచార్య భౌతిక శరీరం పంచభూతాల్లో కలిసి పోయింది. ఈ కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ భన్వరీలాల్, కేంద్ర మంత్రులు రాధాకృష్ణన్, సదానంద గౌడ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అంతిమసంస్కారం జరుగుతున్నంతసేపు కైలయ వాద్యం (శివారాధన సందర్భంగా గుళ్లలో వాయించే తమిళ సంప్రదాయ వాయిద్యం) మోగుతూనే ఉంది.

రాత్రంతా మఠంలో ప్రార్థనలు

సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, శిష్యులు, వైరాగ్య పండితులు బుధవారం రాత్రంతా మండపాల్లో స్వామీజీ పార్థివ దేహం ముందు ప్రార్థనలు చేశారు. ఉదయం 7 గంటలకు బృందావన ప్రవేశ కార్యక్రమం ప్రారంభమైంది. స్వామీజీ భౌతికకాయాన్ని సమాధి చేసే తంతును మఠం నిర్వాహకులు బృందావన ప్రవేశ కార్యక్రమంగా పేర్కొన్నారు. గురువారం నుంచి మఠం పీఠాధిపతి బాధ్యతలు చేపట్టిన శ్రీ విజయేంద్రసరస్వతి పర్యవేక్షణలో అధిష్టాన పూజాధికాలు ప్రారంభమయ్యాయి.

ఉద్విగ్నం.. ఉద్రిక్తం

జయేంద్ర సరస్వతిని కడసారి చూసేందుకు మందిర ప్రాంగణంలోకి వచ్చిన వారిని అంతిమసంస్కారం సమయంలో కాసేపు పోలీసులు ఆపివేశారు. అప్పటివరకు ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా మొత్తం కార్యక్రమాన్ని భక్తులకోసం మఠం నిర్వాహకులు అందుబాటులో ఉంచారు. అయితే అలంకరణ సమయంలో కాసేపు ప్రత్యక్షప్రసారాన్ని నిలిపేశారు. దీంతో పోలీసుల వలయాన్ని దాటుకుని లోపలకు వెళ్లేందుకు భక్తులు ప్రయత్నించారు. ఈ సమయంలో అక్కడున్న వాలంటీర్లు కొందరు కిందపడిపోవటంతో పరిస్థితి కాస్త ఉద్రిక్తంగా మారింది. వెంటనే పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అయితే కాసేపటికే అభిషేకం, అలంకరణ తర్వాత స్వామీజీ భౌతికకాయాన్ని మండపంలోకి తీసుకురావటంతో మళ్లీ భక్తులందరూ చూసేందుకు అవకాశం లభించింది. కడసారి స్వామీజీని చూసిన భక్తుల ఆవేదనతో మండపం, మఠం ప్రాంగణం ఒక్కసారిగా ఉద్వేగంగా మారిపోయింది. జయేంద్ర సరస్వతి శివైక్యంపై నటుడు రజనీకాంత్ ట్వీటర్‌లో సంతాపం వ్యక్తం చేయగా.. కమల్ హాసన్ పార్టీ మక్కల్ నీతి మయ్యం కూడా ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేసింది.

శంకరాచార్యుని బోధనలతో..

గురువు శంకరాచార్య జయేంద్ర సరస్వతి బోధనలను భక్తులు అలవర్చుకుని.. ఆధ్యాత్మిక జీవితాన్ని గడపాలని కంచిమఠం కొత్త పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఉపదేశించారు. శివైక్యం పొందిన జయేంద్ర సరస్వతి స్వామీజీకి ప్రజలు, దేశం నాడీ బాగా తెలుసన్నారు. ప్రజల మధ్య వివక్ష చూపకుండా అందరం ఒకటేననే భావనను ఆయన ప్రచారం చేశారన్నారు.

బృందావన ప్రవేశం ఇలా

స్వామీజీ భౌతిక కాయానికి శాస్త్రబద్ధంగా చందన, పుష్ప, క్షీరాభిషేకాలు జరిపారు. ఆపైన వేదపండితులందరూ కలిసి చంద్రమౌళేశ్వర పూజ నిర్వహించారు. అనంతరం పుష్పాలు, సుగంధ ద్రవ్యాలు, పరిమళాలు వెదజల్లే పూలమాలలతో స్వామీజీని అలంకరించారు. పట్టువస్త్రాలు చుట్టి, అమ్మవారి కుంకుమను దిద్దారు. భక్తులందరూ చూసేందుకు వీలుగా ఎత్తైన బల్లపై భౌతిక కాయాన్ని కూర్చోబెట్టారు. చుట్టూ విజయేంద్ర స్వామీజీ, పండితులు, ముఖ్యమైన శిష్యులు నిలబడి అధిష్టాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మఠం ఆచారాల ప్రకారం, సనాతన సంప్రదాయాల ప్రకారం 13 అడుగుల లోతు, 15 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పుతో గొయ్యి తీశారు. ధ్యానముద్రలో ఉన్న స్వామి పార్థివదేహాన్ని సింహాసనం లాంటి కుర్చీలో కూర్చోబెట్టి గొయ్యిలోకి మెల్లిగా దించారు. ఈ సమాధిలో పూలు, వాసంబు (ఔషధ మొక్క), చందనం చెక్కలతోపాటు పలు సుగంధ ద్రవ్యాలు, ఉప్పు, ఇసుక వంటి వాటితో నింపేశారు. ఆపైన రాహుకాలం ప్రవేశించే 10.30 గంటలకు ముందే అశేష భక్త జనావళి సమక్షంలో స్వామీజీ భౌతిక కాయాన్ని బృందావన ప్రవేశం చేశారు. ఈ ప్రక్రియకు ముందు స్వామీజీకి ప్రియ శిష్యుడిని ఎంపిక చేసి ఆయన చేతుల మీదుగా నారికేళంతో కపాలమోక్షం చేయించారు.



కార్యక్రమానికి హాజరైన వందలాది మంది ప్రజలు



చిత్రంలో కనిపిస్తున్నది రష్యా రహస్యంగా పరీక్షించిన అత్యంత శక్తిమంతమైన ఖండాంతర క్షిపణి. శత్రు దేశాలు గుర్తించలేనంత సామర్థ్యంతో కూడిన కొత్త తరం అణ్వాయుధాలను అభివృద్ధి చేశామని ఆ దేశ అధ్యక్షుడు పుతిన్ గురువారం అధికారికంగా ప్రకటించారు. ఇందులో హైపర్‌సోనిక్ క్షిపణులు, అధునాతన జలాంతర్గాములు ఉన్నట్లు తెలిసింది. దీంతో అమెరికా, రష్యాల మధ్య ఆయుధాల తయారీకి సంబంధించి రసవత్తర పోరు మొదలయ్యే అవకాశాలున్నాయని నిపుణులు భావిస్తున్నారు.

కరుణ బౌలింగ్.. మునిమనవడి బ్యాటింగ్!



సాక్షి, చెన్నై: అనారోగ్యంతో ఇంటికే పరిమితమైన డీఎంకే అధినేత కరుణానిధి కోలుకుంటున్నారు. మునిమనవడితో క్రికెట్ ఆడుతున్న వీడియో గురువారం వెలుగులోకి వచ్చింది. ఇందులో కరుణానిధి బౌలర్ అవతారం ఎత్తారు. రెండు రోజుల క్రితం కరుణానిధి కొడుకులో ఒకరైన ముక్కా తమిళరసు తన మనవడు ముగిలన్(2)తో గోపాలపురం వచ్చారు. దీంతో టుంబసభ్యులంతా కలసి కరుణానిధితో ఆనందాన్ని పంచుకుంటూ క్రికెట్ ఆడారు.

మహిళా సురక్షిత నగరాలకు 2,900 కోట్లు

న్యూఢిల్లీ: నగరాలను మహిళలకు సురక్షితంగా మార్చేందుకు కేంద్రం రూ.2,900 కోట్లు కేటాయించింది. ఇందుకోసం ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, అహ్మదాబాద్, లక్నోలను ఎంపిక చేసింది. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. నిర్భయ నిధుల్లో నుంచి ఖర్చు చేయనున్న మొత్తం రూ.2,919.55 కోట్లలో ఢిల్లీకి రూ.663.67 కోట్లు, ముంబైకి రూ.252 కోట్లు, బెంగళూరుకు రూ.667 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో వీడియో పర్యవేక్షణ,ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు, వీడియో ఫీడ్ షేరింగ్ ఉన్న పెట్రోలింగ్ వ్యాన్‌లను, మహిళా పోలీస్ స్టేషన్లను ఏర్పాటుచేస్తారు.

మద్య నిషేధంతో మాఫియాకు బాటలు

చెన్నై: మద్య నిషేధం అమలైతే అది మాఫియా ఏర్పాటుకు దారితీస్తుందని సినీ నటుడు, మక్కల్ నీతి మయ్యమ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కమల్ హాసన్ అభిప్రాయపడ్డారు. అందుకే తాను మద్య నిషేధాన్ని వ్యతిరేకిస్తున్నానన్నారు. ఈ మేరకు ఆయన రాసిన వ్యాసం 'ఆనంద వికటన్' తమిళ పత్రికలో వచ్చింది. నిషేధం అమలైతే కల్తీ మద్యం మాఫియా పుట్టుకొస్తుందని తెలిపారు. మద్యం తాగడం తగ్గించే వీలుంది కానీ, ప్రజలను ఆ అలవాటు నుంచి దూరంగా ఉంచటం కష్టమన్నారు.

'లోక్‌పాల్'ను బాయ్‌కాట్ చేసిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: లోక్‌పాల్ ఎంపిక కమిటీ సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ బాయ్‌కాట్ చేసింది. 'ప్రత్యేక ఆహ్వానితులు'గా హాజరు కావాలని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత ఖర్గేకు కేంద్రం ఇచ్చిన ప్రతిపాదనను తిరస్కరించింది. ఈ మేరకు ప్రధానికి ఖర్గే లేఖ రాశారు. లోక్‌పాల్ ఎంపికలో ప్రతిపక్ష గొంతు లేకుండా చేసేందుకే ప్రత్యేక ఆహ్వానితులుగా పిలిచారని ఆరోపించారు. లోక్‌పాల్, లోకాయుక్త చట్టం ప్రకారం ఎంపిక కమిటీలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత సభ్యుడిగా ఉంటారు. అయితే ఖర్గేకు ఆ హోదా లేకపోవడంతో ఆయన కమిటీలో సభ్యుడు కాదు. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఆయనను కేంద్రం పిలిచింది. లోక్‌పాల్ నియామకానికి సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశించడంతో ఎంపిక కమిటీ సమావేశం నిర్వహించారు.

ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

వైట్‌హౌస్ కమ్యూనికేషన్ డైరెక్టర్ హోప్ రాజీనామా



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ట్రంప్ విశ్వాసపాత్రుల్లో ఒకరైన హోప్ హిక్స్.. వైట్ హౌస్ కమ్యూనికేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారు. 2016 అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యంపై హౌస్ ఇంటెలిజెన్స్ కమిటీ బుధవారం హిక్స్‌ను సుమారు 8 గంటల పాటు ప్రశ్నించింది. ఈ పరిణామాలతో కలత చెందిన హిక్స్ తన పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ట్రంప్ స్టైల్‌కు అనుగుణంగా, ఆయన విధానాలను జనంలోకి తీసుకెళ్లడంలో గత కొన్నేళ్లుగా ఆమె కీలక పాత్ర పోషించారు. హౌస్ కమిటీకి ఆమె ఇచ్చిన వాంగ్మూలం సందర్భంగా తన వృత్తిలో సందర్భానుసారం కొన్నిసార్లు అబద్ధాలు చెప్పాల్సి వచ్చిందని, అయితే రష్యా ప్రమేయం గురించిన విచారణ సందర్భంగా మాత్రం తాను ఎటువంటి అబద్ధాలు చెప్పలేదని ఆమె చెప్పారు.

కార్తీకి ఐదు రోజుల కస్టడీ

కార్తీ విదేశాలకెళ్లి అక్కడి అకౌంట్లను క్లోజ్ చేశారు

- దీనిపై ఆశ్చర్యపోయే సాక్ష్యాలున్నాయి: సీబీఐ తరఫు న్యాయవాది
- కుట్రను బయటపెట్టే ఆధారాలను సంపాదించండి: న్యాయమూర్తి



కోర్టు బయట కార్తీ. కోర్టుకు వస్తున్న కార్తీ తల్లిదండ్రులు నళిని, చిదంబరం

న్యూఢిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అరెస్టయిన కార్తీ చిదంబరంను ఐదురోజుల సీబీఐ కస్టడీకి ఢిల్లీ కోర్టు అనుమతించింది. కార్తీకి సంబంధించి ఈ కేసుల్లో ఆశ్చర్యకర సాక్ష్యాలున్నాయని వీటిని రాబట్టేందుకు కస్టడీకి ఇవ్వాలన్న సీబీఐ విజ్ఞప్తి మేరకు మార్చి 6 వరకు కార్తీ కస్టడీని పొడిగిస్తున్నట్లు ప్రత్యేక కోర్టు జడ్జి సునీల్ స్పష్టం చేశారు. కార్తీ విదేశాలకు వెళ్లి అక్రమ నిధులు దాచుకున్న వివాదాస్పద బ్యాంకు అకౌంట్లను క్లోజ్ చేశారని, దీనికి సంబంధించి సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే ఆధారాలున్నాయని సీబీఐ తన పిటిషన్‌లో పేర్కొంది. ఒకరోజు కస్టడీ ముగియటంతో సీబీఐ గురువారం ప్రత్యేక కోర్టుముందు కార్తీని ప్రవేశపెట్టింది. ఈ సమయంలో చిదంబరం, ఆయన భార్య నళిని (ఇద్దరూ సీనియర్ లాయర్లే) కోర్టు హాల్లో ఉన్నారు. వీరిద్దరూ కార్తీతో కాసేపు మాట్లాడారు.

కుట్రను బయటపెట్టండి: జడ్జి

కార్తీ కస్టోడియల్ విచారణ ద్వారా ఐఎన్ఎక్స్ మీడియా కేసుకు సంబంధించిన భారీ కుట్ర బయటపెట్టాలని జడ్జి సీబీఐకి సూచించారు. సీబీఐ చూపించే దస్తావేజులు, సహ నిందితుల నుంచి సేకరించిన సాక్ష్యాలతో కార్తీ అసలు విషయాన్ని అంగీకరించేందుకు ఈ కస్టడీ అవసరమన్నారు. కేసు డైరీ, రోజువారీ నివేదికల ఆధారంగా ఈ కేసు ఇప్పుడు కీలకదశలో ఉందని.. విచారణ ద్వారా మరిన్ని విషయాలు బయటపడే అవకాశం ఉన్నందునే కస్టడీ పొడిగించినట్లు జడ్జి తెలిపారు. సీబీఐ కస్టడీ సందర్భంగా న్యాయవాది సహకారం (రోజూ ఉదయం, సాయంత్రం ఒక్కో గంట చొప్పున) తీసుకునేందుకు కార్తీకి స్వేచ్ఛ కల్పించాలని ఆదేశించారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసుపై ఎఫ్ఐపీబీ (విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి) అనుమతులను విచారించిన ఆర్బీఐ మాజీ గవర్నర్ సుబ్బారావు కమిటీ ముందు కార్తీ పలువురు సహనిందితులు పేర్కొన్న విషయాలను అంగీకరించారని సీబీఐ కోర్టుకు తెలిపింది.

రాజకీయ దురుద్దేశం లేదు

సీబీఐ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ వాదిస్తూ.. 'ఇది రాజకీయ దురుద్దేశంతో చేసిన అరెస్టు కాదు. ఆర్టికల్ 21 ప్రకారమే విచారణ జరుగుతోంది. విదేశాలకు వెళ్లి కార్తీ చిదంబరం ఏం చేశాడో తెలిపే ఆశ్చర్యకర సాక్ష్యాలున్నాయి' అని జడ్జికి తెలిపారు. కార్తీ సాధారణ మెడికల్ చెకప్ సందర్భంగా ఆరోగ్యానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు చేయనప్పటికీ బుధవారం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలోని కార్డియాక్ కేర్ యూనిట్‌లో చికిత్స చేశారు. తర్వాతే గురువారం సీబీఐ కార్యాలయానికి తీసుకొచ్చారు. హాస్పిటల్‌లో చేర్చినందున కార్తీ ఒకరోజు కస్టడీ వృధా అయ్యిందికనుకే కస్టడీని పొడిగించాలని జడ్జిని కోరారు. కార్తీ తరపున వాదిస్తున్న అభిషేక్ సింఘ్వీ.. 'గతేడాది మేలో దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం ఆయన్ను 22 గంటలపాటు విచారించిన సీబీఐ ఎలాంటి ఆధారాలు సంపాదించలేకపోయింది. సహకరించటం లేదనే కారణంతోనే అరెస్టు చేస్తారా? ఇది దారుణం' అని అన్నారు.

మెహుల్ చోక్సీకి మేలుచేసేలా..

చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో తీసుకొచ్చిన 80:20 బంగారు దిగుమతి పథకం ద్వారా చాలా మంది బంగారు, వజ్రాభరణాల వ్యాపారులు అక్రమాలకు పాల్పడ్డారని పార్లమెంటు ప్రజా పద్దుల కమిటీలోని బీజేపీ సభ్యులు ఆరోపించారు. పీఎన్‌బీ కుంభకోణంలో విచారణ ఎదుర్కొంటున్న మెహుల్ చోక్సీ మనీలాండరింగ్ కేసూ ఇందులో భాగమేనన్నారు. గురువారం రెవెన్యూ కార్యదర్శి, ఈడీ ఉన్నతాధికారులు, ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ), ఎక్సైజ్, కస్టమ్స్ కేంద్ర మండలి (సీబీఈసీ)ల అధికారులు పీఏసీ సబ్ కమిటీ ముందు హాజరయ్యారు. యూపీఏ ప్రభుత్వం 2013లో తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా దేశ ఖజానాకు రూ.లక్ష కోట్ల నష్టం వాటిల్లిందంటూ.. 2016లో కాగ్ ఇచ్చిన నివేదికపై వీరు చర్చించారు. ఈ పథకంలో భాగంగా వజ్రాల వ్యాపారులు ఒక డాలర్ సంపాదించేందుకు ప్రభుత్వం సుంకం రూపంలో రూ.221.75 చెల్లించారు. దీని ద్వారా దేశం నుంచి నల్లధనం బయటకెళ్లి వైట్ మనీగా తిరిగొచ్చిందని వారన్నారు.

విచారణ లిస్టులో చిదంబరం

కార్తీతోపాటు చిదంబరం సీబీఐ, ఈడీ విచారణ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఎయిర్‌సెల్–మ్యాక్సిస్ ఒప్పందంలో విదేశీ పెట్టుబడుల ఒప్పందానికి అనుమతివ్వటంలో చిదంబరం పాత్ర ఉందని సీబీఐ వాదిస్తోంది. కాగా, ఐఎన్ఎక్స్ మీడియాకు సంబంధించి మే 2007లో ఎఫ్ఐపీబీ ఇచ్చిన అనుమతులు తర్వాతి పరిణామాలపై కార్తీ ఏవిధంగా ఒత్తిడితెచ్చారనే అంశాన్ని విచారిస్తున్నామని సీబీఐ తెలిపింది. 'మా దగ్గర కార్తీ చిదంబరానికి చెందిన అడ్వాంటేజ్ స్ట్రాటజిక్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్‌కి నిధులు బదిలీ అయినట్లు పేర్కొనే ఈ–మెయిల్స్, బిల్లులు ఉన్నాయి. కార్తీని దోషిగా నిలబెట్టేందుకు అవసరమైన సాక్ష్యాలున్నాయి. ఈయన నుంచి స్వాధీనం చేసుకున్న మూడు మొబైల్ ఫోన్లను పరిశీలిస్తున్నాం. వీటన్నింటికోసం కనీసం 14రోజుల కస్టడీ అవసరం అవసరం' అని మెహతా కోర్టును కోరారు.

1,217 కోట్ల చోక్సీ ఆస్తుల అటాచ్



గురువారం ఈడీ అటాచ్ చేసిన చోక్సీ ఆస్తులు

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) కుంభకోణం కేసులో గీతాంజలి జెమ్స్, దాని ప్రమోటర్ మెహుల్ చోక్సీలకు చెందిన రూ. 1,217.2 కోట్ల విలువైన 41 ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అటాచ్ చేసింది. మనీ ల్యాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద ఈ ఆస్తుల్ని అటాచ్ చేశారు. ఈ ఆస్తుల్లో ముంబైలోని 15 ఫ్లాట్లు, 17 కార్యాలయ ప్రాంగణాలు, కోల్‌కతాలోని ఒక మాల్, అలీబాగ్‌లోని 4 ఎకరాల ఫాంహౌస్, నాసిక్, నాగ్‌పూర్, తమిళనాడులోని విల్లుపురంలోని 231 ఎకరాల భూమి ఉన్నాయి. పీఎన్‌బీ ఎండీ, సీఈవో సునీల్ మెహతాను ముంబైలో ఈడీ విచారించింది. సీబీఐ గురువారం తనిఖీల్లో కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది. సెంట్రల్ ముంబై శివారులో ఒక భవనంలో ని గది నుంచి లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్‌కు సంబంధించిన పత్రాల్ని సీజ్ చేశామని సీబీఐ అధికారులు చెప్పారు. డాక్యుమెంట్లు దాచిన ఆ ప్రాంతం నీరవ్ మోదీకి చెందినదని భావిస్తున్నారు. కాగా ఆయన ఏ దేశంలో ఉన్నారో అక్కడి భారతీయ రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని నీరవ్‌కు సీబీఐ లేఖలో సూచించింది.

అంబులెన్సు లేక ఆగిన ప్రాణం



రత్లామ్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ చిన్నారిని ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్సు లేకపోవడంతో తల్లిదండ్రులు బైక్‌పై తీసుకెళ్లగా మార్గమధ్యంలోనే ఆ చిన్నారి ప్రాణాలుకోల్పోయింది. ఈ హృదయవిదారక ఘటన మధ్యప్రదేశ్‌లోని రత్లామ్ జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. నంద్‌లేటా గ్రామానికి చెందిన ఘన్‌శ్యామ్ నాథ్, దీనాబాయి దంపతుల కుమార్తె జీజా(4)న్యూమోనియాతో తీవ్రమైన జ్వరం రావడంతో ఆమెను సైలానాలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం రత్లామ్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించాలని అక్కడి వైద్యులు సూచించారు. దినసరి కూలీ అయిన ఘనశ్యామ్ తన కుమార్తెను రత్లామ్‌కు తీసుకెళ్లేందుకు అంబులెన్సును ఇవ్వాల్సిందిగా కోరగా ఆరోగ్యకేంద్రం సిబ్బంది అందుకు నిరాకరించారు. దీంతో స్నేహితుడి బైక్‌ను తెచ్చారు. ఆ స్నేహితుడు బైక్ నడుపుతుంటే జీజాను ఘనశ్యామ్, చిన్నారి చేతికి అమర్చిన సెలైన్‌ను భార్య పట్టుకున్నారు. ఇలా బైక్‌పై 30 కి.మీ దూరంలో ఉన్న రత్లామ్ ప్రభుత్వాసుపత్రికి చిన్నారిని తీసుకెళ్లారు. అక్కడ జీజాను పరీక్షించిన వైద్యులు ఆమె మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయిందని నిర్ధారించారు.

ఖురాన్, కంప్యూటర్ పట్టుకోండి

ముస్లిం యువతకు ప్రధాని మోదీ పిలుపు

- అప్పుడే సంపూర్ణ సంక్షేమం, సమగ్రాభివృద్ధి
- ఉగ్రవాదంపై యుద్ధం మతాల మధ్య పోరు కాదు: జోర్డాన్ రాజు



జోర్డాన్ రాజుకు ఉర్దూ పుస్తకాన్ని కానుకగా ఇస్తున్న మోదీ

న్యూఢిల్లీ: ఉగ్రవాదం, తీవ్రవాదంపై చర్యలు ఏ మతానికో వ్యతిరేకంగా చేస్తున్నవి కాదని, అమాయకులపై అకృత్యాలకు పాల్పడేలా యువతను రెచ్చగొడుతున్న ఆలోచనా విధానాన్ని తిప్పికొట్టేందుకేనని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ముస్లిం యువత ఒక చేతిలో ఖురాన్, మరో చేతిలో కంప్యూటర్ పట్టుకున్నప్పుడే పూర్తిస్థాయి సంక్షేమం, సమగ్రాభివృద్ధి సాధ్యమని చెప్పారు. 'ఇస్లామిక్ సంస్కృతి: అవగాహన పెంపొందించుట, సంయమనం' అంశంపై నిర్వహించిన సదస్సులో జోర్డాన్ రాజు అబ్దుల్లా 2 బిన్ అల్ హుస్సేన్‌తో కలిసి మోదీ ప్రసంగించారు. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడేవారు.. ఏ మతం కోసమైతే పనిచేస్తున్నారో దానికి నష్టం కలిగిస్తున్నారన్న విషయం గ్రహించడం లేదని ప్రధాని చెప్పారు. తీవ్రవాదానికి చెక్ పెట్టేందుకు జోర్డాన్‌లో రాజు అబ్దుల్లా చేపట్టిన చర్యల్ని మోదీ ప్రశంసిస్తూ.. తీవ్రవాదుల అరాచకాల్ని అరికట్టేందుకు ఆ విధానాలు ప్రయోజనకరంగా నిలుస్తాయన్నారు. ప్రపంచంలోని అన్ని ప్రధాన మతాలను సంరక్షిస్తున్న దేశం భారత్ అని, దేశంలోని ప్రాచీన బహుళత్వపు విలువలకు అనుసరణీయ మార్గమే ప్రస్తుత ప్రజాస్వామ్య వ్యవస్థని ఆయన పేర్కొన్నారు. అన్ని మతాలు మానవతా విలువల్నే చాటిచెపుతున్నాయని, ఇస్లాంలోని మానవతా విలువలతో యువత అనుసంధానం కావాలని ఆకాంక్షించారు.

మత విశ్వాసం, మానవత్వం కలిసికట్టుగా సాగాలి: అబ్దుల్లా

జోర్డాన్ రాజు అబ్దుల్లా ప్రసంగిస్తూ.. అంతర్జాతీయంగా ఉగ్రవాదంపై కొనసాగుతున్న యుద్ధం రెండు మతాల మధ్య పోరుగా భావించకూడదన్నారు. అన్ని మత విశ్వాసాలు, సమాజాలకు చెందిన మితవాదులకు.. విద్వేషం, హింసను ప్రేరేపిస్తున్న అతివాదులకు మధ్య పోరుగా ఆయన అభివర్ణించారు. మతం పట్ల తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ.. మత విశ్వాసం, మానవత్వం కలిసికట్టుగా ముందుకు సాగాలని అభిలషించారు. 'ఇస్లాం, లేదా ఏ మత ప్రచారంలోనైనా తప్పుడు ప్రచారం చేసే గ్రూపుల్ని గుర్తించి వాటిని తిప్పికొట్టాల్సిన అవసరముంది. విద్వేషాన్ని ప్రచారం చేసేవారికి సమాచార వ్యవస్థ, ఇంటర్నెట్ అందుబాటులో లేకుండా చేయాలి' అని అన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్లా సోదరుడు ప్రిన్స్ ఘాజీ బిన్ ముహమ్మద్ తలాల్ రచించిన 'ఏ థింకింగ్ పర్సన్స్ గైడ్ టు ఇస్లాం' అనే పుస్తకం ఉర్దూ కాపీని జోర్డాన్ రాజుకు ప్రధాని నరేంద్ర మోదీ బహూకరించారు.

జోర్డాన్ రాజుతో మోదీ చర్చలు

పలు ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై జోర్డాన్ రాజుతో మోదీ విస్తృత స్థాయి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రక్షణ, ఉగ్రవాద వ్యతిరేక పోరు సహా 12 ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. భారత్ విదేశాంగ శాఖ ప్రతినిధి రవీశ్ కుమార్ చర్చల వివరాలు వెల్లడిస్తూ.. 'ఎప్పటినుంచో కొనసాగుతున్న సన్నిహిత, స్నేహపూర్వక సంబంధాలకు ఈ చర్చలు కొత్త ఊపునిచ్చాయి' అని చెప్పారు. వైద్యం, మెడిసిన్, రాక్ ఫాస్ఫేట్, ఎరువుల దీర్ఘకాలిక సరఫరా, కస్టమ్స్ అంశంలో పరస్పర సహకారం తదితర ఒప్పందాలపై ఇరు దేశాల మధ్య అవగాహన కుదిరింది.

బ్యాంక్ మేనేజర్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష

2015లో లంచం తీసుకుంటుండగా పట్టుకున్న సీబీఐ

విశాఖ లీగల్: లంచం డిమాండ్ చేసిన బ్యాంక్ మేనేజర్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ విశాఖపట్నంలోని సీబీఐ 2వ అదనపు ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కె.శివరామకృష్ణ గురువారం తీర్పు చెప్పారు. జరిమానా కట్టలేని పక్షంలో అదనంగా 3 నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. సీబీఐ సూపరింటెండెంట్ తెలిపిన వివరాల మేరకు.. ముద్దాయి కె.వంశీరవికుమార్ 2015లో తూర్పుగోదావరి జిల్లా పి.గన్నవరం మండలం నాగులంక ఆంధ్రా బ్యాంకు శాఖ మేనేజర్‌గా పనిచేసేవాడు. పెదకందాలపాలెం గ్రామానికి చెందిన ఓ రైతు బ్యాంకులో రుణంతో పాటు రూ.లక్ష రాయితీ కోసం దరఖాస్తు చేశాడు. రుణం మంజూరు చేయడానికి మేనేజర్ రూ. 20 వేలు లంచం డిమాండ్ చేయడంతో రైతు సీబీఐ అధికారులను ఆశ్రయించాడు. దీంతో అతడు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

మరో నలుగురిలో నా తండ్రిని చూసుకుంటా

బ్రెయిన్‌డెడ్ అయిన తండ్రి అవయువాలను దానం చేసిన కుమార్తె




రఘునాథరెడ్డి, కుమార్తె పల్లవి

పలమనేరు రూరల్: తన తండ్రి ఎలాగూ బతకడని వైద్యులు చెప్పడంతో తండ్రి అవయవాలను దానం చేసి నలుగురికి ప్రాణాలు కాపాడి వారిలో తన తండ్రిని చూడాలనుకుంది ఆ బాలిక. ఎంతో దృఢ చిత్తంతో తన మదిలోని ఆలోచనను వైద్యులకు చెప్పింది. కుటుంబీకులనూ ఒప్పించింది. ఈ సంఘటన పలమనేరు రూరల్ మండలం మొరం పంచాయితీ నక్కపల్లిలో గురువారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన రైతు రఘునాథరెడ్డి (65) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతనికి భార్య పార్వతమ్మతో పాటు ఒకే కుమార్తె పల్లవి ఉంది. ఆమె ఇక్కడి ఓ ప్రైవేటు కళాశాలలో బీఎస్సీ చదువుతోంది. నాలుగు రోజుల క్రితం రోడ్డు దాటుతుండగా జరిగిన ప్రమాదంలో రఘునాథరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. తలకుబలమైన గాయం కావడంతో కుటుంబీకులు బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తరళించారు. అప్పటికే నిశ్చల స్థితిలో ఉన్న తండ్రిని బతికించాలని వైద్యులను వేడుకున్నారు. మెదడు పనిచేయడం లేదని, సర్జరీ చేసినా బతకడం కష్టమేనని వారు తెలిపారు. బుధవారం ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో అక్కడి వైద్యులతో తన తండ్రి అవయవాలను దానం చేస్తానని పల్లవి తెలిపింది. వెంటనే వైద్యులు ఆయన కళ్లు, కిడ్నీ, గుండె, లివర్‌లను తీసుకుని భద్రపరిచారు. ఆపై మృతదేహాన్ని అప్పగించారు.

కర్ణాటకలో పరువు హత్య

దళిత యువకుడిని ప్రేమించిందని కూతురిని చంపిన తండ్రి



సుష్మ (ఫైల్)

మైసూరు: దళిత యువకుణ్ని ప్రేమించిందనే ఆగ్రహంతో కూతురికి పురుగుల మందు తాగించి, అనంతరం ఉరివేసి హత్య చేశాడు ఓ తండ్రి. కర్ణాటకలోని మైసూరు జిల్లా హెచ్.డి.కోటె తాలుకాలోని గొల్లనబీడులో ఫిబ్రవరి 21న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గొల్లనబీడుకి చెందిన సుష్మ(20).. పొరుగూరుకి చెందిన దళిత యువకుడు ఉమేశ్ ప్రేమించుకున్నారు. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలనుకోగా, ఇరు కుటుంబాలు ఒప్పుకోలేదు. దీంతో ఏడాది కిందట ఇంట్లో నుంచి పారిపోయారు. కుటుంబ సభ్యులు పెళ్లి జరిపిస్తామని నచ్చచెప్పి పిలిపించి ఎవరి ఇళ్లలో వారిని ఉంచారు. పెళ్లి చేస్తామని నమ్మిస్తూ జాప్యం చేయసాగారు. వారిద్దరూ ఫోన్లు చేసుకోవడం, చాటుమాటుగా కలవడం జరిగేది. అమ్మాయి తండ్రికి ఈ విషయం తెలిసి గ్రామంలో తమ పరువు తీస్తోందని ఆగ్రహించాడు. ఫిబ్రవరి 21న ఆమెకు ఆహారంలో పురుగుల మందు కలిపి తినిపించి, తరువాత ఉరివేసి హత్య చేశాడు. తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఆత్మహత్య కాదు, హత్య అని గుర్తుతెలియని వ్యక్తి ఎస్పీ ఆఫీసుకు ఫోన్ చేశాడు. దీంతో మళ్లీ దర్యాప్తు చేపట్టగా అసలు విషయం బయటపడింది.

వంశధారలో కమీషన్ల పరవళ్లు!

- కమీషన్‌లు అందక పాత కాంట్రాక్టర్ల తొలగింపు
- మిగిలిన పనుల అంచనా వ్యయం రూ.310.72 కోట్ల నుంచి రూ.1055.6 కోట్లకు పెంపు
- రూ.134 కోట్ల విలువైన 3 ప్యాకేజీల పనులకు రూ.594.66 కోట్లతో టెండర్ నోటిఫికేషన్
- అంతకుముందే ముగ్గురు కాంట్రాక్టర్లతో ముఖ్యనేత, మరో కీలక మంత్రి ఒప్పందం
- అదనపు ధరలకు దక్కించుకున్న కాంట్రాక్టర్లు

సాక్షి, అమరావతి: శ్రీకాకుళం జిల్లాలో కేవలం రూ.134 కోట్లతో పూర్తయ్యే వంశధార నది కరకట్టల పనుల అంచనా వ్యయాన్ని రూ.594.66 కోట్లకు పెంచేశారు. టెండర్ నోటిఫికేషన్ జారీ చేయకముందే కోటరీలోని సాయిలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్, ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఆర్ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపిన ముఖ్యనేత, ఓ కీలక మంత్రి ఒక్కో కాంట్రాక్టర్‌కు ఒక్కో ప్యాకేజీ పనులను పంచేశారు. మూడు సంస్థలకే పనులు దక్కేలా నిబంధనలు రూపొందించారు. జనవరి 13న టెండర్ నోటిఫికేషన్ జారీ కాగా బుధవారం ఆర్థిక(ఫైనాన్స్) బిడ్ తెరిచారు. ముందే అనుకున్నట్లు ఒక్కో కాంట్రాక్టర్ ఒక్కో ప్యాకేజీ పనులను అధిక ధరలకు దక్కించుకున్నారు. జలవనరుల శాఖలో ఎన్నడూ లేని రీతిలో జనవరి 27న ప్రీబిడ్ సమావేశాన్ని నిర్వహించి మిగతా కాంట్రాక్టర్లు పాల్గొనకుండా అధికార వర్గాల ద్వారా కీలక మంత్రి హెచ్చరికలు జారీ చేయించారు. అంచనా విలువ కన్నా ఐదు శాతం



కంటే ఎక్కువ ధర కోట్ చేస్తూ షెడ్యూల్ దాఖలు చేయకూడదన్నది నిబంధన. దీంతో ఐదు శాతం కన్నా కాస్త తక్కువకే కోట్ చేసి బిడ్ దాఖలు చేసి పనులను చేజిక్కించుకున్నాయి. ఈ వ్యవహారంలో భారీగా కమీషన్‌లు చేతులు మారాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

బహిర్గతమైన రింగాట..

➠ రూ.238.65 కోట్ల అంచనా వ్యయంతో పిలిచిన ఒకటో ప్యాకేజీకి సాయిలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ 4.47 శాతం అదనపు ధర (రూ.249.32 కోట్లు) కోట్ చేసి ఎల్–1గా నిలిచి పనులు దక్కించుకుంది. ఈ ప్యాకేజీకి ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ 4.72 శాతం అదనపు ధర కోట్ చేసి ఎల్–2గా నిలవడం గమనార్హం.

➠ రెండో ప్యాకేజీ కింద రూ.143.02 కోట్ల విలువైన పనులకు పిలిచిన టెండర్లలో ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ మినహా మిగిలిన సంస్థలపై టెక్నికల్ బిడ్‌లో అనర్హత వేటు వేశారు. ఆర్థిక బిడ్‌లో ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ 4.2 శాతం అదనపు ధర (రూ.149.02 కోట్లు) కోట్ చేసింది. సింగిల్ బిడ్‌ను ఆమోదించకూడదు. అయినా సరే ఆ సంస్థకే పనులు కట్టబెట్టారు.

➠ మూడో ప్యాకేజీ కింద రూ.212.99 కోట్లతో పిలిచిన టెండర్‌లో ఆర్ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ 2.7 శాతం అదనపు ధర (రూ.218.74 కోట్లు) దాఖలు చేసి ఎల్–1గా నిలిచి పనులు దక్కించుకుంది. ఇదే ప్యాకేజీలో 3.1 శాతం అదనపు ధర కోట్ చేసిన ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఎల్–2గానూ 4.32 శాతం అదనపు ధర కోట్ చేసిన సాయిలక్ష్మి కన్‌స్ట్రక్స్ ఎల్–3గానూ నిలవడం గమనార్హం.

➠ వీటిని పరిశీలిస్తే ముఖ్యనేత కుదిర్చిన ఒప్పందం మేరకు కాంట్రాక్టర్లు రింగైనట్లు స్పష్టమవుతోంది. ఫలితంగా ఖజానాపై రూ.22.42 కోట్ల భారం పడనుంది.

రూ.200 కోట్లకుపైగా కమీషన్‌లు

వంశధార, నాగావళి కరకట్టల పనులు చేస్తున్న కాంట్రాక్టర్లతో కమీషన్‌ల కోసం బేరసారాలు జరిపిన ఓ కీలక మంత్రి అది కుదరకపోవడంతో 60 సీ నిబంధన అస్త్రాన్ని ప్రయోగించి వారిపై వేటు వేశారు. ఆ వెంటనే పనుల అంచనా వ్యయాన్ని రూ.310.72 కోట్ల నుంచి రూ.1,055.60 కోట్లకు పెంచుతూ గతేడాది జూలై 14న ఉత్తర్వులు ఇచ్చారు. అంటే మిగిలిపోయిన రూ.164.72 కోట్లతో పూర్తయ్యే పనుల అంచనా వ్యయాన్ని రూ.744.88 కోట్లకు పెంచేసినట్లు స్పష్టమవుతోంది. ఇందులో కేవలం రూ.134 కోట్లతో పూర్తయ్యే మూడు ప్యాకేజీల పనులకు రూ.594.66 కోట్ల అంచనాతో టెండర్లు పిలిచి ముగ్గురు కాంట్రాక్టర్లకు పంచేశారు. పెంచిన అంచనా వ్యయం, అదనపు ధరలకు పనులు కట్టబెట్టడం ద్వారా ముఖ్యనేత, మరో కీలక మంత్రికి రూ.200 కోట్లకుపైగా కమీషన్‌లు దక్కినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

జగన్నాథంకు 'సర్వే' బాధ్యతలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనరేట్‌లో (సీసీఎల్ఏ)లో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న పి.జగన్నాథంకు ప్రభుత్వం మరో అదనపు బాధ్యతలు అప్పగించింది. సర్వే అండ్ సెటిల్‌మెంట్ ప్రత్యేక కమిషనర్‌గా ఆయనకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

న్యాయవాదుల సమ్మె విజయవంతం

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ • విధుల బహిష్కరణ



విశాఖలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

విశాఖ లీగల్: విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని విశాఖ న్యాయవాదుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం న్యాయవాదులంతా విధులు బహిష్కరించారు. దీంతో న్యాయస్థానాలన్నీ మూతబడ్డాయి. దాదాపు 3 వేల మంది న్యాయవాదులు కోర్టు బయట ధర్నా చేపట్టారు. అయితే కక్షిదారులకు ఇబ్బంది కలగకుండా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కొంతవరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. హైకోర్టు బెంచ్ ఆవశ్యకతను కోరుతూ అనేక దశాబ్దాలుగా విశాఖ న్యాయవాదులు పలుమార్లు నిరసనలు తెలియజేసినట్లు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పూసర్ల బాలకృష్ణ తెలిపారు. 1993లో ఆరు నెలల పాటు న్యాయవాదులంతా విధులు బహిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. సీనియర్ న్యాయవాది గోలి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ న్యాయవాదులు అన్నింటా అన్యాయానికి గురవుతున్నారన్నారు. ముఖ్యంగా 41ఏని కేంద్ర ప్రభుత్వం రద్దుచేసినా పోలీసులకు తగిన ఆదేశాలు లేకపోవడంతో జూనియర్ న్యాయవాదులు రోడ్డున పడుతున్నారన్నారు. చిన్న కేసుల్లో సైతం బెయిల్ పిటిషన్ దాఖలు చేసే అవకాశం లేకుండా కేసులన్నీ పోలీసుస్టేషన్‌లో కుమ్మక్కవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సెక్షన్‌ను తక్షణం రద్దుచేసి మళ్లీ న్యాయస్థానాలకు అప్పగించాలన్నారు. న్యాయవాదుల సంఘం కార్యదర్శి జె.సత్యసాయి బాబా మాట్లాడుతూ.. న్యాయవాదుల సంక్షేమ నిధిని రూ.15 లక్షలకు పెంచాలని కోరారు.

మద్దతు ధరకే కందుల కొనుగోలు

- కొనుగోలు కేంద్రాల ద్వారా కొంటే రైతులకు రూ.1,000 ప్రయోజనం
- కందుల కొనుగోళ్లపై సీఎస్ సమీక్ష

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కందులను కొనుగోలు చేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. కందులు క్వింటాల్‌కు కేంద్రం రూ.5,450 మద్దతు ధర ప్రకటించినందున ఆ ధర రైతులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కందులు కొనుగోలుపై గురువారం సచివాలయంలో అధికారులతో సీఎస్ సమీక్షించారు. ప్రస్తుతం మార్కెట్‌లో కందులు క్వింటాల్ ధర రూ.4,200 ఉండగా కేంద్రం క్వింటాల్‌కు రూ.5,450 మద్దతు ధర నిర్ణయించినందున మార్కెట్ ధరకంటే రూ.1,000 పైగా అధికంగా మద్దతు ధర ఉన్నందున రైతులు పండించిన కంది పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకునేందుకు కృషి చేయాలని సీఎస్ సూచించారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర వల్ల సుమారు లక్ష మంది రైతులకు రూ.140 కోట్లు అదనంగా ఆదాయం సమకూరుతుందని సీఎస్ తెలిపారు. 2017–18 ఖరీఫ్‌లో 2.64 లక్షల హెక్టార్లలో కంది సాగు చేయగా రెండు లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి వస్తుందని అంచనా వేసినట్లు మార్క్‌ఫెడ్ ఎండీ మధుసూదన్‌రెడ్డి సీఎస్‌కు వివరించారు. కాగా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పనులపై సీఎస్ అధికారుతో సమీక్షించారు.

రేపు ప్రజల ముందుకు జేఎఫ్‌సీ నివేదిక

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ గురువారం హైదరాబాద్‌లో సమావేశమై ఒక నివేదికను సిద్ధం చేసిందని జనసేన పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య, లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ముఖ్య కార్యదర్శి ఐ.వై.ఆర్.కృష్ణారావు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, మాజీ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. 3వ తేదీన ఈ నివేదికను ప్రజల ముందు ఉంచాలని సమావేశంలో నిర్ణయించారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

షిఫ్ట్

ఈ శతాబ్దిలో మొత్తం మహిళలే!

ఇటీవలే ముంబైలోని మాతుంగ రైల్వేస్టేషన్ మొత్తం మహిళా ఉద్యోగులతో వార్తల్లోకొచ్చింది. అలాగే జైపూర్‌లోని గాంధీనగర్ రైల్వేస్టేషన్. అక్కడ కూడా అంతా మహిళా సిబ్బందే. ఇప్పుడు మరో మెట్టు. అహ్మదాబాద్ – ముంబయి మధ్య తిరిగే శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లో ఇకనుంచీ టీటీఈ (ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్)లందరూ మహిళలే ఉండబోతున్నారు. రానున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నుంచి ఈ నిర్ణయాన్ని అధికారికంగా అమలులోకి తేబోతోంది ఇండియన్ రైల్వే.

పెనాల్టీలు పెరగాలంటే మహిళలు ఉండాల్సిందే

ఒక రూట్‌లో టీటీఈలందరూ మహిళలే ఉండాలనే నిర్ణయానికి కారణం వారిలోని నిజాయితీనే అంటున్నారు పశ్చిమ రైల్వే సీనియర్ డివిజినల్ కమిషనర్ ఆర్తి సింగ్. అహ్మదాబాద్– ముంబై రూట్‌లో టికెట్ లేకుండా ప్రయాణించేవాళ్లు, జనరల్ టికెట్‌తో రిజర్వేషన్‌లో ప్రయాణించే వాళ్లు ఎక్కువగా కనిపిస్తుంటారు. టికెట్ చూపించమని అడిగితే మొండికేసే ప్రయాణికులు కూడా ఎక్కువే. అయితే ఈ రూట్‌లో మగ టీటీఈ



> మగ టీటీఈ డ్యూటీ చేసినప్పటికంటే మహిళలు డ్యూటీ చేసిన రోజు పెనాల్టీలు 66 శాతం పెరగడాన్ని అధికారులు గుర్తించారు! మహిళలు నిజాయితీగా ఉద్యోగం చేస్తారనడానికి ఇదొక నిదర్శనం.

డ్యూటీ చేసినప్పటికంటే మహిళలు డ్యూటీ చేసిన రోజు పెనాల్టీలు 66 శాతం పెరగడాన్ని అధికారులు గుర్తించారు! ''మహిళలు నిజాయితీగా ఉద్యోగం చేస్తారనడానికి ఇదొక నిదర్శనం'' అని ఆర్తి సింగ్ అంటున్నారు. ట్రయల్ రన్‌లో ఇది నిరూపణ అయింది కూడా. అలాగే, టికెట్ లేని ప్రయాణికుడికి వంద రూపాయలు చలాన్ రాయాల్సిన చోట యాభై రూపాయలు జేబులో వేసుకుని చూసీ చూడనట్లు వెళ్లే మగ టీటీఈల అవినీతిని అరికట్టడానికి కూడా ఈ నిర్ణయం తోడ్పడుతుందనే అభిప్రాయం కూడా ఉంది.

షిఫ్టుకి ఇద్దరే ఇప్పుడు ఇక నుంచి ఆరుగురు!

ఇంతవరకు 'శతాబ్ది'లో ఆరుగురిలో షిఫ్ట్‌కి ఇద్దరే మహిళా టీటీఈలు ఉండేవారు. ఇక నుంచి మొత్తం మహిళలే ఉంటారు. ప్రస్తుతానికి ఒక షిఫ్ట్.. అంటే ఆరున్నర గంటల టైమ్ మాత్రమే మొత్తం మహిళా టీటీఈలు డ్యూటీలో ఉండగలుగుతారు. ఈ సంఖ్యను ఇంకా పెంచాలనే ఉద్దేశంలో ఉన్నారు అధికారులు. టికెట్ లేకుండా ప్రయాణించడానికి అలవాటు పడిన కరడుగట్టిన ప్రయాణికులతో మగ టీటీఈలకు తరచూ గొడవలు కూడా వస్తుంటాయి. అదే ఆడవాళ్లయితే వాదన పెంచకుండా చలాన్ రాసి డబ్బు కట్టమంటారు. కట్టకపోతే రైల్వే పోలీస్‌కి సమాచారం ఇస్తారు. దాంతో సమస్య తేలిగ్గా పరిష్కారం అవుతుంది.

- మంజీర

గోరంత విషం



ప్రతీకాత్మక చిత్రం

డిగ్రీ పూర్తి చేయాలి. గ్రూప్స్ రాయాలి. మంచి ఉద్యోగం సంపాదించాలి. స్వతంత్రంగా జీవించాలి. మూడేళ్లుగా ఈ కలల సాగుకి నారు పోసి నీరు పెట్టాను. కానీ వేధింపుల చీడ సోకడంతో అవి మాడి మసైపోయాయి. దీని వెనుక ఉన్న మగ ప్రపంచపు కుట్రల్ని తలచుకుంటే గుండెల్లో భగ్గుమంటుంది.

బస్టాప్‌లో ఉండగా, వాడు స్కూటర్ మీద రివ్వున దూసుకొచ్చి నా పక్కన నిలబడ్డాడు. కాలేజీ దగ్గర దించుతానన్నాడు. బదులివ్వకుండా కాస్త దూరంగా వెళ్లి నిలబడ్డాను. పావు గంట తర్వాత బస్సెక్కి కాలేజీకి పోయాను. కాలేజీలో మళ్లీ ఎదురయ్యాడు! దాదాపు నెల రోజులు ఇలా వెంటబడ్డాడు. ఓ రోజు మా ఇంటివరకూ వచ్చి.. 'నువ్వంటే ఇష్టం. పెళ్లి చేసుకుందాం' అన్నాడు. భయమేసింది. నిద్ర కూడా పట్టలేదు. మర్నాడు ఇంట్లో విషయం చెప్పేశాను. మా అమ్మ ఆ రోజు కాలేజీ మాన్పించింది.

ఆ రాత్రి ఇంట్లో పంచాయితీ. నాన్న కాలేజీ మానేయమన్నాడు. కనీసం డిగ్రీ అయినా పూర్తి చేస్తానని మొత్తుకున్నాను. కుదరదని ఖరాఖండిగా చెప్పేశాడు. ఏడ్చి గొడవ చేసినా ఎవ్వరూ వినలేదు.

నా కన్నీళ్లు మా అన్నయ్యను కాస్త కరిగించినట్టున్నాయి. నా వెంటపడుతున్న వాడిని హెచ్చరించి వచ్చాడు. ఇంట్లోవాళ్లని ఒప్పించి నన్ను కాలేజీకి తీసుకుపోయాడు. రెండు నెలలు ప్రశాంతంగా గడిచాయి.

ఆ తర్వాత మా అన్నయ్య నుంచి కొత్త రకం వేధింపులు! అవును మా అన్నయ్య నుంచే!!

''ఆయన భార్య ఆరోగ్యం బాగా లేదట. నువ్వు నచ్చావట. నిన్ను పెళ్లి చేసుకుంటానంటున్నాడు. పెళ్లి తర్వాత నిన్ను చదివిస్తాడట. నన్ను ఉద్యోగంలో పెట్టిస్తాడట'' అంటూ నస పెట్టడం మొదలెట్టాడు. మా అన్నయ్య చెబుతున్నది నా వెంటపడినవాడి గురించే!

''మనిషి కూడా బాగున్నాడు. ఇంతకంటే అందగాడు దొరుకుతాడా నీకు'' అంటూ ఒత్తిడి తెచ్చాడు. మా అమ్మానాన్నలు కూడా అన్నయ్యకే వంత పాడారు. పేరెంట్స్ సపోర్ట్ కూడా దొరకడంతో మా అన్నయ్య నా మీద మరింత ఒత్తిడి తెచ్చాడు.

తట్టుకోవడం కష్టమైంది. చచ్చిపోదామనిపించి నెయిల్ పాలిష్ తాగాను. కానీ బతికి బయట పడ్డాను. దీంతో ఇంటా బయటా అందరూ నన్ను మాటలతో చంపేశారు. పీక్కుతిన్నారు.

నా ఫ్రెండ్స్ ధైర్యం చెప్పి పోలీస్ స్టేషన్‌కి తీసుకుపోయి కేసు పెట్టించారు. ఈ విషయం తెలిశాక ఇంట్లో అందరూ నన్ను తిట్టిపోశారు. నేను వాళ్ల పరువును గంగలో కలిపానట!

ఆ తర్వాత నా కష్టాలకు అంతూ దరీ లేకుండా పోయింది. పోలీసులు నన్ను వేధించిన వాడి పక్షాన నిలబడ్డారు.

''ఏం రోగం నీకు? ఏమైనా ఉంచుకుంటానన్నాడా? పెళ్లే కదా చేసుకుంటానంటున్నాడు. చదివిస్తానని కూడా అంటున్నాడు కదా? ఎందుకు చేసుకోవు? పెళ్లి చేసుకో'' అని వాళ్లు కూడా అన్నారు! స్టేషన్ చుట్టూ తిప్పించుకున్నారు.

వాళ్లు వాడిన భాష మానసికంగా నన్ను ఎంత హింసించిందంటే.. దాని గురించి నోటితో చెప్పలేను. కేసు వాపసు తీసుకునేందుకు వాళ్లు పన్నిన వ్యూహంలో ఆ భాష ఒక భాగమనుకుంటాను.

ఇటువైపు ఇంట్లో కూడా ఒత్తిడి పెరిగింది. ఇంటి గుట్టును రచ్చకెక్కించావంటూ నన్ను మాటలతో చిత్రవధ చేశారు. ఇక కేసును వెనక్కి తీసుకోక తప్పలేదు.

నాకు అతణ్ణి పెళ్లి చేసుకోవాలని లేదు. అసలు పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశమే అతగాడికి లేదు. కేవలం నన్ను లొంగదీసుకునేందుకు అతడు 'పెళ్లి' పదాన్ని వాడాడు. మా అన్నకు ఉద్యోగం వేయిస్తానన్నాడు. ఇంకా చెప్పాలంటే నా శరీరం కోసం మా అన్నను ఓ పావుగా వాడుకోవాలనుకున్నాడు. కానీ మా అన్నకి వాడి కుట్ర ఎందుకు అర్థం కాలేదో తెలియడం లేదు.

ఇప్పుడు నన్ను కాలేజీ మాన్పించేశారు. నా కలల ప్రపంచాన్ని కూల్చేశారు. నాలుగు గోడల మధ్య నన్ను బందీని చేశారు. గట్టిగా మాట్లాడలేను. ఎవ్వరితోనూ మాట్లాడటానికి వీల్లేదు. ఎవ్వరితోనూ నా బాధ పంచుకోవడానికి లేదు. ఎప్పుడూ మనసంతా అల్లకల్లోలంగా ఉంటుంది. ఒత్తిడిగా ఉంటుంది. నిద్ర పట్టదు.

నాది కాని నేరానికి నన్ను శిక్షించిన ఈ మగ సమాజంపై నాకు విపరీతమైన కోపం.

బహుశా జీవితంలో ఏ మగాణ్ణీ నమ్మలేనేమో.

(ఉమ కేస్ స్టడీ)

- తాండ్ర కృష్ణ గోవింద్, సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్, వరంగల్

సమాజ దృష్టికోణం మారాలి



లైంగిక హింస / వేధింపుల కేసుల్లో బాధితురాలిని మరింత బాధల్లోకి నెట్టే శత్రుపూరిత వాతావరణం మన చుట్టూ అలముకుని ఉంది. ఉమ కేసు ఇందుకు ఒక ఉదాహరణ. చాలా సందర్భాల్లో బాధితుల పట్ల పోలీసులు స్పందించే తీరు సరిగా ఉండట్లేదు. పోలీసులు, మధ్యవర్తులు, పెద్ద మనుషులు రాజీ కుదుర్చుకునేలా వాళ్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇలాగయితే ఇక బాధితురాలికి చట్టం ఏం సాయం చేసినట్టు? ఏం న్యాయం జరుగుతున్నట్టు? ఫ్రెండ్లీ పోలీసింగ్, ఫ్రెండ్లీ చట్టాలు అంటే ఇదేనా? చట్ట ప్రకారం తల్లిదండ్రుల దగ్గర వుండటాన్ని సేఫ్ కస్టడీ అంటాం. ఉమ కేసును బట్టి పరిశీలిస్తే కుటుంబమూ ఆమెకు సేఫ్‌గా లేదని అర్థమవుతోంది. మహిళా హక్కులూ చట్టాల గురించి ఎంతగా చెప్పుకుంటున్నా, మహిళా దినోత్సవాలు వందేళ్లుగా జరుపుకుంటున్నా ఇలాంటి గాథలు అనేకంగా వినవస్తూనే ఉన్నాయి. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే చట్టాల అమలు విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. బాధితులకు భరోసా ఇవ్వగలగాలి. స్త్రీల పట్ల సమాజం ఏర్పరచుకున్న దృష్టికోణంలో మార్పు రావాలి.

- డాక్టర్ కె.అనితారెడ్డి, సంఘ సేవకురాలు, వరంగల్

స్ట్రాంగ్ డోస్

పోలిక తేవద్దు

డాక్టర్ వి.శాంత క్యాన్సర్ స్పెషలిస్ట్. చెన్నైలోని 'అడయార్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్' చైర్‌పర్సన్. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, మెగసెసె అవార్డుల గ్రహీత. ఇవన్నీ కాదు కానీ.. వృత్తిని ఆమె ఎంత నిబద్ధతతో స్వీకరించారో వెల్లడించే ఒక చిన్న సంఘటన ఈ మధ్యే బయటికి వచ్చింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ని నీరవ్ మోదీ అనే ఆభరణాల వ్యాపారి వేల కోట్ల రూపాయలకు మోసం చేసి, విదేశాలకు పారిపోయిన సంగతి మీకు తెలిసే ఉంటుంది. ఆ బ్యాంకు ఎండీ సునీల్ మెహతా ఫిబ్రవరి 15న ఢిల్లీలో ప్రెస్‌మీట్ పెట్టారు. ''ఇలాంటి మోసాలను ఇక జరగనివ్వం. సర్జరీ చేసి ఈ అవినీతి క్యాన్సర్‌ని నిర్మూలిస్తాం'' అని అన్నారు. దీనిపై డాక్టర్ శాంతి మండిపడుతూ ఆయనకో ఉత్తరం రాశారు. ''అవినీతి అనేది ఒక నేరం. సిగ్గు పడాల్సిన తప్పుడు పని. హీనమైన ఆ నేరాన్ని క్యాన్సర్‌తో ఎలా పోలుస్తారు?'' అని ఆ ఉత్తరంలో డాక్టర్ శాంత ప్రశ్నించారు! మనసా వాచా కర్మణా వృత్తి ధర్మాన్ని నెరవేర్చేవారు తప్ప ఇంకొకరు ఈ మాట అనలేరు. డాక్టర్ శాంత వయసిప్పుడు 90 ఏళ్లు. నేటికీ ఎంతో ఉత్సాహంగా రోగులకు సేవలు అందిస్తూ ఉన్నారు.



> **"అవినీతి అనేది ఒక నేరం. హీనమైన ఆ నేరాన్ని క్యాన్సర్‌తో ఎలా పోలుస్తారు?"**
> **- డాక్టర్ వి.శాంత**

ఒబామా అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయన కూడా ఓ సందర్భంలో క్యాన్సర్‌కు లేనిపోని పోలికలు తెచ్చారు అప్పుడు కూడా డాక్టర్ శాంత చెన్నైలోని యు.ఎస్.కాన్సులేట్‌కు ఘాటుగా లేఖ రాశారు. నిరాశను, నిస్పృహను, అవినీతిని, ఇంకా.. సమాజంలోని నానా రుగ్మతల్ని క్యాన్సర్‌తో పోల్చడం మామూలైపోయింది. ఇది సరి కాదు'' అని అందులో ఆగ్రహం వ్యక్తం చేశారు. బహుశా వృత్తిని ఇంతగా ప్రేమించడంవల్లనే అంతగా కోపం వస్తుందేమో!

శాంత 1927 మార్చి 11న చెన్నైలోని మైలాపూర్‌లో జన్మించారు. అయ్యర్ల కుటుంబం. నోబెల్ గ్రహీతలు సీవీ రామన్, ఎస్.చంద్రశేఖర్‌లు వీళ్ల వంశవృక్షంలోని వారే. సీవీరామన్ శాంతకు నాన్నవైపు వారు. చంద్రశేఖర్.. అమ్మవైపు వారు.

బ్యూటిప్

'గుడ్డు' రిజల్ట్



ముప్పై సంవత్సరాలు దాటిన మహిళలకు, చర్మంలో ముడుతలు మొదలవుతాయి. ముడతలు తగ్గాలంటే ...

- కోడిగుడ్డు తెల్ల సొనను బాగా నురగ వచ్చేవరకు కలిపి ముఖానికి పట్టించాలి. పదినిమిషాల తరువాత చల్లని నీటితో ముఖం కడుక్కోవాలి.
- గుడ్డు తెల్లసొన, రెండు టేబుల్‌స్పూన్ల శనగపిండి, రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం కలిపి ముఖానికి ప్యాక్ వేసుకుని ఆరిన తరువాత (15 నిమిషాలు వుంచుకోవాలి) కడుక్కోవాలి.
- గుడ్డు పచ్చసొన, ఒక టేబుల్ స్పూన్ ఆలివ్ ఆయిల్, బాగా పండిన టొమాటోలను మెత్తగా గ్రైండ్ చేసి ముఖానికి ప్యాక్ వేసుకుని 20 నిముషాలు ఉంచి కడుక్కోవాలి. ఇలా వారానికి రెండుసార్లైనా చేసుకుంటే పొడిబారిన చర్మం మృదువుగా మారుతుంది.
  ఇలా తరచుగా చేసుకుంటే చర్మం కాంతివంతమవడమే కాకుండా, స్కిన్ టైట్ అవుతుంది.
- గుడ్డులోని తెల్లసొనకు శనగపిండిని చేర్చి దానిని తలకి పట్టించి అరగంట తర్వాత తలస్నానం చేస్తే చుండ్రు సమస్యని కొంత వరకూ తొలగించవచ్చు. వెంట్రుకలు కూడా మృదుత్వం పొందుతాయి.

చెట్టు నీడ

ఒక్కోసారి రాత కూడా మారొచ్చు

పదహారవ శతాబ్దంలో జపాన్‌లో ఒక యుద్ధవీరుడు ఉండేవాడు. ఆయన పేరు నొబునాగ. ఒకసారి అనుకోని విధంగా యుద్ధంలో పాల్గొనవలసి వచ్చింది. తీరాచూస్తే శత్రువు దగ్గర వున్న సైన్యంలో తన దగ్గరున్నది పదో వంతు మాత్రమే అని గ్రహించాడు. అయినప్పటికీ ఆ పోరులో గెలుస్తాననే ఆయన విశ్వసించాడు. కానీ సైనికులకు నమ్మకం లేదు. వాళ్లు అధైర్యపడ్డారు.

రణరంగానికి తరలి వెళ్తుండగా, మార్గ మధ్యంలో వాళ్లకో ఆలయం కనబడింది. 'అయితే ఒక పనిచేస్తాను' అన్నాడు నొబునాగ. 'నేను ముందు వెళ్లి ప్రార్థన చేసివస్తాను. వచ్చాక ఒక నాణేన్ని ఎగరవేస్తాను. బొమ్మ పడిందంటే మనం ఈ పోరాటంలో గెలిచినట్టే. బొరుసు పడిందా ఓడినట్టు. మన రాతను విధే నిర్ణయిస్తుంది'.

> **సైనికులు అంగీకారంగా తలూపారు. నొబునాగ ఆలయంలోకి వెళ్లి ప్రార్థన చేసి వచ్చాడు. సైనికులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.**

సైనికులు అంగీకారంగా తలూపారు. నొబునాగ ఆలయంలోకి వెళ్లి ప్రార్థన చేసి వచ్చాడు. సైనికులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. నొబునాగ నాణేన్ని ఎగరవేశాడు. బొమ్మ పడింది. సైనికుల ముఖాలు వెలిగిపోయాయి. ఉత్సాహంతో ముందుకు సాగారు. అలవోకగా శత్రువును మట్టి కరిపించి, విజయోత్సాహంతో తిరిగొచ్చారు.

వస్తుండగా దారిలో, నొబునాగ వ్యక్తిగత సేవకుడు 'విధిరాతను మార్చడం ఎవరికి మాత్రం తరమవుతుంది?' అన్నాడు, తమ గెలుపునకు విధే కారణమన్నట్టుగా.

'అవున్నిజమే' అన్నాడు నొబునాగ, రెండువైపులా బొమ్మ ఉండేలా చేయించిన ఆ ప్రత్యేక నాణేన్ని నవ్వుతూ చూపిస్తూ.

సాక్షి ఫ్యామిలీ

సినిమా
విజయవాడ
శుక్రవారం
2-3-2018

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్

హాయ్ సార్..! నన్ను ఒక అమ్మాయి లవ్ చేస్తోంది. కానీ బయటపడటంలేదు. తన మనసులోని ఆ మాటలను, ఆ భావాలను ఎలా బయట పెట్టించాలి సార్? నేను ఎక్కడుంటే అక్కడికి వచ్చేస్తోంది. తను నా సీనియర్ బట్ సేమ్ సెక్షన్. నా మీద తన ఇంటెన్షన్ ఏంటనేది తెలుసుకోవడం ఎలానో కాస్త క్లియర్‌గా చెప్పండి సార్ ప్లీజ్.

– యశ్వంత్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

నీ సీనియర్ కదా?
'అయితే ఏంటి సార్?'
సీనియర్ సేమ్ సెక్షన్ అంటే ఎలా??
'సెక్షన్ ఒకటే. కానీ క్లాస్ వేరు సార్...!!'
అంటే పెద్ద క్లాస్‌లో ఉన్న అమ్మాయా?
మరి చిన్న క్లాస్‌లో ఉన్న అబ్బాయి వెంటబడి తిరుగుతుంది అంటే ఏంటి??
'తనకు అర్థం కాక మీకు రాస్తే... మీరేంటి సార్ నాకు వేస్తున్నారు??'
మరి నేను చెప్పనా???
'నస పెట్టకుండా చెప్పండి సార్ ప్లీజ్!'
చిన్న పిల్లోడు కదా. ముక్కు కారుతుందేమో తుడుద్దామని వెంట తిరుగుతుంది నీలూ..!!
'అంటే మదర్లీ ఫీలింగా సార్??'
ఎల్డర్ సిస్టర్ ఫీలింగ్ నీలూ!!

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

8		7	3	5	1		6	
6			7		4	8	3	
	1			6	2			
	6	8		4				3
5								8
2				8		7	4	
			9	2			1	
	7	3	4		6			5
	2		5	3	8	9		4

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

సన్మతి జాజు

5	2	3	1	9	4	6	7	8
8	7	6	3	5	2	1	9	4
1	9	4	8	6	7	2	5	3
4	6	8	7	3	1	5	2	9
2	3	7	5	4	9	8	1	6
9	5	1	2	8	6	4	3	7
3	1	5	4	7	8	9	6	2
7	4	9	6	2	5	3	8	1
6	8	2	9	1	3	7	4	5

సెల్ఫ్ చెక్

మీ రాతలో మీరు



చేతిరాత కూడా వ్యక్తిత్వాన్ని ప్రతిఫలిస్తుంది. కావాలంటే మీరు సెల్ఫ్‌చెక్ చేసుకోండి. మీ చేతిరాత బట్టి మీరేమిటో స్వయంగా తెలుసుకోండి. ఇది సరదాగానే కానీ నిజాయితీగా సమాధానాలు ఇవ్వడం కూడా ముఖ్యమే. ముందుగా మీ స్వదస్తూరీతో రాసిన దానిని ఎదురుగా ఉంచు కోవడం మరువకండి.

1. మీ చేతిరాత ఇలా ఉంటుంది
   ఎ) వాలుగా.. బి) నిటారుగా.. సి) ఎడమవైపు వొంపుగా..
2. మీ రాతలో అక్షరాలు..
   ఎ) గొలుసుకట్టు బి) పదాలు విడిగా.. సి) పొడి అక్షరాలు
3. వాక్యాలు ఎంత దగ్గరగా ఉంటాయి
   ఎ) దూరంగా.. బి) పొందికగా.. సి) మరీ దగ్గరగా..
4. మీరు రాసినప్పుడు వాక్యాలు పేజీలో ఏ దిశగా ఉంటాయి?
   ఎ) కింద నుంచి పై భాగానికి..
   బి) తిన్నగా గీత గీసినట్టు.. సి) ఏటవాలుగా..
5. మొత్తంగా మీ దస్తూరీని చూస్తే ఎలా కనిపిస్తుంది?
   ఎ) అందంగా.. పొందికగా.. బి) స్పష్టంగా.. పొడిపొడిగా
   సి) భారంగా.. సంక్లిష్టంగా..

మీరిచ్చే సమాధానాలు బట్టి మీ చేతిరాతను ఇలా విశ్లేషించుకోవచ్చు.

1. అక్షరాలు ఎడమవైపు వాలుగా ఉంటే మీరు బిడియస్తులు. తిన్నగా ఉంటే ఎదుటివారిని ఆకట్టుకునే తత్వం ఉన్నవారు. అక్షరాలు కుడి వైపు వాలుగా ఉంటే గట్టి స్వభావం, సొంత నిర్ణయాల మీద ఆధారపడేవారు.
2. గొలుసుకట్టు రాత అయితే మీరు మంచి మాటకారి. విడి పదాలుగా రాస్తే మీరు బిడియస్తులు. పొడి అక్షరాలయితే మీరు తెలివిగా, స్పష్టంగా వ్యవహరించే స్వభాగం గలవారు.
3. వాక్యాల మధ్య దూరం ఎక్కువయితే మీరు ఏకాంతాన్ని ఇష్టపడతారు. పొందికగా రాసేవారయితే డబ్బు దుబారా చేసేవారు, ఎక్కువ మాట్లాడేవారు. బాగా దగ్గరగా రాస్తే మీరు చాలా ఆర్గనైజ్‌గా వ్యవహరిస్తారు.
4. వాక్యాలు కింది నుంచి పైకి వెళ్తుంటే మీరు చాలా ఎనర్జిటిక్‌గా, ఆశావాదిగా, స్పష్టమైన అవగాహన ఉన్నవారిగా భావించవచ్చు. వాక్యాలు తిన్నగా రాస్తే మీరు ఒత్తిడికి లోనవుతుండవచ్చు. కింది వైపు వాలుగా ఉంటే మీరు దృఢచిత్తం గలవారిగా, ఒంటరితనాన్ని ఇష్టపడే వారిగా పరిగణించవచ్చు.
5. మీ దస్తూరీ పొందికగా ఉంటే మీరు సున్నిత స్వభావులని, మొహమాటస్తులని, ఆధ్యాత్మిక భావనలు గలవారిగా భావించవచ్చు. స్పష్టంగా రాసేవారయితే పట్టుదల, దృఢచిత్తం గలవారవుతారు. రాత భారీగా కనిపిస్తుంటే, మీరు ఎనర్జిటిక్‌గా, చలాకీగా, ఏ పరిస్థితులకయినా ఇమిడిపోయే తత్త్వం గలవారిగా పరిగణించవచ్చు.



అల్లు అర్జున్

గాటు కథేంటి గురూ!

నోట్లో సిగార్... చేతిలో స్టీరింగ్.. డిఫరెంట్ హెయిర్‌స్టైల్‌తోపాటు కండలు తిరిగిన దేహంతో ఫ్యాన్స్‌కి 'హోలీ' ఫీస్ట్ ఇచ్చాడు సూర్య. 'పోస్టర్ ఇంపాక్ట్' అంటూ ఈ పోస్టర్‌ని చిత్రబృందం రిలీజ్ చేసింది. అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'నా పేరు సూర్య–నా ఇల్లు ఇండియా'. గురువారం రిలీజైన పోస్టర్‌లో సూర్య ఎడమ కంటిపై గాటు ఉంది గమనించారా? ఇప్పుడు చర్చంతా ఆ గాటు గురించే. గాటు కథేంటి గురూ అని ఎవరికి తోచిన కథలు వాళ్లు అల్లుతున్నారు. అసలు కథ ఏంటో మే 4న తెలిసిపోతుంది. ప్రస్తుతం ఈ సినిమాలోని కీలక సన్నివేశాలను హైదరాబాద్‌లో షూట్ చేస్తున్నారు. ఈ నెల 14 వరకు ఈ షెడ్యూల్ జరుగుతుంది. కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీక్రియేషన్స్ పతాకంపై శిరీషా శ్రీధర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'బన్నీ' వాసు సహనిర్మాత.

నేనేనా? ఇది నిజమేనా?




ప్రియా ప్రకాశ్

కన్ను కొట్టి, కవ్వించిన పిల్ల రివ్వున ఎగిరింది. మబ్బులను దగ్గరగా చూసి సంబరపడిపోయింది. 'మనం ఏంటి? ఎగరడం ఏంటి? ఇది కలా? నిజమా?' అని ఒక్కసారి గిల్లి చూసుకుంది. 'మనమే.. ఎగురుతున్నది మనమే' అని ఆనందపడింది. మరి.. ఫస్ట్ టైమ్ విమానం ఎక్కితే ఎవరైనా ఇలానే ఆనందపడతారు కదా. జస్ట్ చిరునవ్వు నవ్వి, కన్ను కొట్టినందుకు బోలెడంత పాపులార్టీ తెచ్చుకున్న ప్రియా ప్రకాశ్ వారియర్ తొలిసారి ఫ్లైట్ ఎక్కింది. కొచ్చి టు తిరువనంతపురం ట్రావెల్ చేసిందీ బ్యూటీ. తొలి విమాన ప్రయాణం టికెట్‌ను దాచుకుందట. 'లైఫ్‌లో తొలిసారి ఫ్లైట్ ఎక్కాను' అని పేర్కొంది. ఆమె నటించిన ఒక్క సినిమా కూడా విడుదల కాలేదు. ఈలోపు టీజర్ ద్వారా అందర్నీ ఆకట్టుకుంది. ఇప్పుడు అందరూ ఆమె నటిస్తున్న తొలి చిత్రం 'ఒరు అడార్ లవ్' రిలీజ్ కోసం ఎదురు చూస్తున్నారు. ఒమర్ లులు దర్శకత్వంలో మలయాళంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని తెలుగులోనూ రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. జూన్‌లో విడుదల చేస్తారు.

భరత్ విజన్ ఏంటో?

విజన్ ఉన్న వ్యక్తి సీయం అయితే ప్రజలంతా బహుత్ ఖుషీగా ఉంటారు. అతని విజన్ భవిష్యత్ తరాలకు భరోసా ఇస్తుంది. ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచుతుంది. భరత్ అనే సీయం విజన్ ఎలా ఉంటుందో సిల్వర్ స్క్రీన్‌పై చూడాల్సిందేనని అంటున్నారు 'భరత్ అనే నేను' చిత్రబృందం. మహేశ్‌బాబు హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో డి.పార్వతి సమర్పణలో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న సినిమా 'భరత్ అనే నేను'. ఇందులో కియారా అద్వానీ కథానాయిక. సీయం భరత్ పాత్రలో మహేశ్‌బాబు కనిపించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన 'ది విజన్ ఆఫ్ భరత్'ను మార్చి 6న రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ప్రకాశ్‌రాజ్, శరత్‌కుమార్ ముఖ్య తారలుగా నటిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీప్రసాద్ స్వరకర్త. ఈ సినిమాను ఏప్రిల్ 20న విడుదల చేయాలనుకుంటున్నారు.



మహేశ్‌బాబు

కొంచెం దృష్టి పెడదాం

... అంటున్నారు అమలా పాల్. ఏ విషయంపై దృష్టి పెడదామంటున్నారంటే 'చూపు'పై. అర్థం కావడంలేదా? చూపు లేనివాళ్లకు



అమలాపాల్

చూపునిద్దాం అంటున్నారు. ఈ విషయం గురించి అమలా పాల్ మాట్లాడుతూ – ''ఓ సంస్థకు చెందిన ఐ క్యాంపైన్ స్పీచ్‌కు రెడీ అవుతున్నప్పుడు కొన్ని విషయాలు తెలుసుకున్నాను. ప్రపంచవ్యాప్తంగా 30 మిలియన్ల మంది చూపులేక బాధపడుతున్నారని, అందులో ఎక్కువ మంది ఇండియాలోనే ఉన్నారని తెలుసుకుని షాక్ అయ్యాను. నేత్రదానంపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడమే ఇందుకు ఒక కారణమై ఉంటుందనిపించింది. అంతా సవ్యంగా ఉంటే ఏటా 40 వేలకుపైగా సర్జరీలు జరుగుతాయి. వారందరూ ఎంతో సంతోషంగా ప్రపంచాన్ని చూడగలరు.. చూపులేని వాళ్లు ఈ రంగుల ప్రపంచాన్ని చూసేందుకు మన వంతు సాయం చేద్దాం'' అని అమలాపాల్ పేర్కొన్నారు. అంతే కాదు కళ్లను దానం చేసేందుకు 'అమలహోమ్' అనే ఫౌండేషన్‌ను కూడా స్టార్ట్ చేశారు. నేత్రదానం చేయాలనుకునేవాళ్లు ఈ ఫౌండేషన్ని సంప్రదించవచ్చు. కంటి ఆపరేషన్స్‌కి ఆర్థిక సహాయం అందజేయడానికి ఈ ఫౌండేషన్ కృషి చేయాలనుకుంటోంది.

హోలీ అంటే చిరాకు



కరణ్ జోహార్

కరణ్ జోహార్ బాలీవుడ్ అగ్ర దర్శక– నిర్మాత. తన దర్శకత్వంలో వచ్చిన సినిమాలన్నీ తెరనిండా నటీనటులతో కలర్‌ఫుల్‌గా ఉంటాయి. కానీ కరణ్‌కు మాత్రం కలర్‌ఫుల్ ఫెస్టివల్ 'హోలీ' అంటే చిరాకట. ఇంకో విశేషం ఏంటంటే దానికి కారణం అభిషేక్ బచ్చన్ అట. ఎందుకలా? అని అడిగితే ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లారు కరణ్. ''నా 7ఏళ్ల వయసప్పుడు అనుకుంటా.. ఓసారి హోలీకి మా వీధిలోని పిల్లలందరూ కలిసి నాకు రంగులు పూయటానికి వచ్చారు. ఆ రంగులు అంటకుండా ఉండటం కోసం వాళ్లకు దొరక్కుండా పరిగెత్తే ప్రయత్నంలో కిందపడిపోయాను. దెబ్బలు తగిలాయి. దాంతో వాళ్లతో గొడవ పడ్డాను. ఆ తర్వాత కొన్నేళ్లకు ఓ హోలీ రోజు అమితాబ్ బచ్చన్‌వాళ్ల ఇంటికి వెళ్లాను. నాకు హోలీ అంటే ఎందుకు భయమో అమిత్‌జీతో చెబుతున్నప్పుడు మా సంభాషణంతా వెనుక నుంచి అభిషేక్ బచ్చన్ విన్నాడు. మొత్తం విన్న తర్వాత పరిగెత్తుకుంటూ వచ్చి నన్ను అమాంతం ఎత్తుకొని రంగులున్న వాటర్ పూల్‌లో పడేశాడు. అంతే... అక్కడితో నాకు హోలీ అంటే చిరాకు వచ్చేసింది. అప్పటి నుంచి ఎప్పుడు హోలీ ఆడలేదు'' అని పేర్కొన్నారు కరణ్.

నిధి కోసం అన్వేషణ

ప్రభుదేవా, హన్సిక జంటగా కల్యాణ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గులేబకావళి'. నటి రేవతి పవర్‌ఫుల్ పాత్రలో నటించిన ఈ చిత్రం తమిళంలో ఘనవిజయం సాధించింది. ఈ చిత్రాన్ని అదే పేరుతో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై మల్కాపురం శివకుమార్ తెలుగులోకి



హన్సిక, ప్రభుదేవా

అనువదిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''గులేబకావళి అనే గ్రామంలో నిక్షిప్తమైన నిధి కోసం జరిగే అన్వేషణ నేపథ్యంలో ఈ కథ కొనసాగుతుంది. పూర్తి వినోదాత్మకంగా రూపొందిన ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా ఉంటుంది. ఇండియన్ మైఖేల్ జాక్సన్ ప్రభుదేవా నృత్యాలు, నటన సినిమాకి ప్రధాన హైలైట్. ఈ నెల 16న సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. తమిళంలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. మన్సూర్ అలీఖాన్, మధు, ఆనంద్‌రాజ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: వివేక్ మెర్విన్, కెమెరా: ఆర్‌ఎస్ ఆనంద్‌కుమార్, పాటలు: సామ్రాట్.



కె.టి.నాయక్, శ్రీకాంత్, వెంకట్, బాబ్జీ

ఆ సీక్వెల్స్ కుదరలేదు

– శ్రీకాంత్

''నేను నటించిన పెళ్లి సందడి, మహాత్మ సినిమాలకు సీక్వెల్స్ చేయాలని చాలామంది అనుకున్నారు. కానీ కుదరలేదు. 'దండుపాళ్యం' సినిమాకి ఉన్న క్రేజ్, గత చిత్రాలు ఎంత హిట్ అయ్యాయో తెలిసిందే. ఈ సినిమాలోని విషయం ఆధారంగా ఎన్ని పార్టులైనా చేయవచ్చు. 'దండుపాళ్యం 4' హిట్ అవ్వాలి'' అని హీరో శ్రీకాంత్ అన్నారు. కె.టి.నాయక్ దర్శకత్వంలో వెంకట్ మూవీస్ బ్యానర్‌పై వెంకట్ నిర్మిస్తున్న చిత్రం 'దండుపాళ్యం 4'. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని శ్రీకాంత్ విడుదల చేశారు. నిర్మాత వెంకట్ మాట్లాడుతూ– ''దండుపాళ్యం 1, 2 సినిమాలను తెలుగు ప్రజలు బాగా ఆదరించారు. వారిచ్చిన స్ఫూర్తితో 'దండుపాళ్యం 4' చిత్రం ప్రారంభించాం. కొందరి వ్యక్తిగత అహం వల్ల 'దండుపాళ్యం 2' నేను అనుకున్నట్లుగా రాలేదు. ప్రేక్షకులు ఆశించిన అంశాలు అందులో లేవు. అందుకే.. ఓ కసితో 'దండుపాళ్యం 4' స్టార్ట్ చేశా. ఈ నెల 8న సినిమా షూటింగ్ ప్రారంభం అవుతుంది. ఈ చిత్రంలో రెండు గ్యాంగ్‌లుంటాయి. మొదటి మూడు పార్ట్స్‌లో నటించిన నటీనటులతో పాటు వేరే గ్యాంగ్ కూడా ఇందులో ఉంటుంది'' అన్నారు. దర్శకుడు కె.టి.నాయక్, వోల్గా బాబ్జీ పాల్గొన్నారు.

పరి పరిశోధన

ఆ నూనెతో మూర్ఛ లక్షణాలు తగ్గుముఖం!

గంజాయి అంటే చాలామందికి పోలీస్ కేసులు.. ఒళ్లు తెలియని మత్తు గుర్తుకొస్తాయేమోగానీ.. వాస్తవానికి ఈ మొక్కలో చాలా ఔషధ గుణాలు ఉన్నాయి అని అంటున్నారు శాస్త్రవేత్తలు. వాంటర్‌బిల్ట్ బయో వీయూ రిసోర్స్ నుంచి సేకరించిన వైద్య రికార్డుల ఆధారంగా రాబర్ట్ కార్సన్ అనే ఓ శాస్త్రవేత్త మూర్ఛవ్యాధి చికిత్సలో



గంజాయి పాత్ర ఏమిటన్నదానిపై పరిశోధన నిర్వహించారు. దాదాపు 108 మంది మూర్ఛ వ్యాధిగ్రస్తులకు గంజాయి నుంచి తీసిన నూనెను మందుగా ఇచ్చినప్పుడు దాదాపు 40 శాతం మందిలో వ్యాధిలక్షణాలు సగానికి తగ్గిపోగా.. పదిశాతం మందిలో పూర్తిగా లేకుండా పోయాయి. మిగిలినవారిలోనూ కొంత మెరుగుదల కనిపించింది. వీరిలో 22 శాతం మంది తాము తీసుకుంటున్న సాధారణ మందుల మోతాదును గణనీయంగా తగ్గించుకోగలిగారు. శుద్ధి చేసిన గంజాయి నూనెపై తాము పరిశోధనలు చేసినప్పటికీ... చాలా మంది వ్యక్తిగత స్థాయిలో దీన్ని వాడుతూనే ఉన్నారని ఈ విషయంలో అందరూ జాగ్రత్త వహించాలని రాబర్ట్ కార్సన్ సూచిస్తున్నారు.

శని ఉపగ్రహంలో గ్రహాంతర జీవులు?


గ్రహాంతర జీవుల కోసం బోలెడన్నిచోట్ల వెతికే పని లేదని.. మన సౌర కుటుంబంలోని శనిగ్రహపు ఉపగ్రహమైన ఎన్‌సెలడూస్‌లోనే ఇవి ఉండే అవకాశముందని అంటున్నారు వియన్నా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు. భూమ్మీద అతిక్లిష్టమైన పరిస్థితుల్లో నివసించే మీథెనోథెర్మో కాకస్ అనే బ్యాక్టీరియాతో పరిశోధనలు చేయడం ద్వారా తామీ అంచనాకు వచ్చామని సైమన్ రిట్‌మాన్



అనే శాస్త్రవేత్త చెప్పారు. సముద్రపు అడుగున ఉండే అగ్నిపర్వత బిలాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు ఉండే చోట్ల ఈ బ్యాక్టీరియా కార్బన్ డైయాక్సైడ్ ను మీథేన్ వాయువుగా మారుస్తూంటుంది. శాస్త్రవేత్తలు ఎన్‌సెలడూస్‌పై ఉండే పరిస్థితులను కృత్రిమంగా సృష్టించి ఈ బ్యాక్టీరియాను వదిలినప్పుడు అవి బాగా ఎదిగాయి. ఆ గ్రహపు ఉపరితలంపై కూడా మీథేన్ పొగలు వెదజల్లే బిలాలు కొన్ని ఉన్నాయని ఇప్పటికే వెల్లడైన నేపథ్యంలో ఈ బ్యాక్టీరియా అక్కడ కూడా ఉండే అవకాశమున్నట్లు తాము భావిస్తున్నామని సైమన్ తెలిపారు. తమ పరిశోధన కేవలం బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవుల ఉనికికి సంబంధించింది మాత్రమేనని.. మనలాంటి బుద్ధిజీవులపై ఏమాత్రం కాదన్నది గుర్తుంచుకోవాలని సైమన్ వివరించారు. ఎన్‌సెలడూస్‌పై సముద్రాలు ఉన్నాయని గత పరిశోధనలు స్పష్టం చేసిన నేపథ్యంలో తాజా పరిశోధన అక్కడ ఏదో ఒకరకమైన జీవం ఉండేందుకూ అవకాశాలు ఉన్నాయని చెబుతున్నాయి.

జన్యుమార్పిడితో సగం తగ్గిన కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్...

ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్న కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్‌ను జన్యుమార్పిడి పద్ధతులతో తగ్గించవచ్చునని పెన్సిల్వేనియా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధన స్పష్టం చేసింది. మన అవసరాలకు తగ్గట్టుగా కచ్చితమైన జన్యుమార్పులు చేయగలిగే క్రిస్పర్ క్యాస్ –9 టెక్నాలజీని వాడటం ద్వారా తాము కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్‌ను సగానికి తగ్గించగలిగామని వీరు తెలిపారు. ఏఎన్‌జీ పీటీఎల్–3 ప్రొటీన్‌ను ఉత్పత్తి చేసే జన్యువులో సహజమైన మార్పు ఉన్న వారిలో, ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు తక్కువగా ఉంటాయని, ఈ జన్యుమార్పును ప్రవేశపెట్టడం ద్వారా ఇతరుల్లోనూ ఇదే ఫలితాలు సాధించవచ్చునని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త ముసునూరు కిరణ్ అంటున్నారు. ఈ నేపథ్యంలో తాము ఎలుకలపై కొన్ని ప్రయోగాలు చేశామని, ముందుగా వీటికి ఏఎన్‌జీపీటీఎల్–3 జన్యువులో మార్పులు చేయగల క్రిస్పర్ ఆధారిత చికిత్స ఇచ్చామని.. వారం తరువాత పరిశీలించినప్పుడు మార్పులు 35 శాతం వరకూ పూర్తయినట్లు గుర్తించామని కిరణ్ వివరించారు. దీంతోపాటే ఆ ఎలుకల్లో హానికారక కొవ్వులు సగం వరకూ తగ్గినట్లు స్పష్టమైంది. అన్నీ సవ్యంగా సాగితే ఇంకో ఐదేళ్లలో ఈ చికిత్స అందుబాటులోకి వస్తుందని.. తద్వారా గుండెజబ్బుల బారిన పడిన వారు జీవితాంతం మందులు తీసుకునే అవసరం లేకుండా పోతుందని.. జన్యుమార్పులు చేసే వ్యాక్సీన్‌ను ఒకసారి తీసుకుంటే సరిపోతుందని కిరణ్ వివరించారు.



ఫ్యాషన్


కట్ చేస్తే!












**పెళ్ళిళ్లకి చీరలు కట్టుకోవడం
ఒకప్పటి సీను.
కట్ చేస్తే..
ఇప్పుడు ఓణీయే
అదిరిపోయే సీను.
పెళ్ళిళ్ల సీజన్‌లో
పట్టు చీరలతో
హాఫ్‌శారీస్,
లాంగ్ గౌన్లు..
డిజైన్ చేయవచ్చు.
కట్ చేయండి..
కట్టేయండి...
వెలిగిపోండి.**

చీరను లంగా బ్లౌజ్‌గానే కాదు అనార్కలీ డ్రెస్ లేదంటే లాంగ్ గౌన్‌గానూ రూపుదిద్దుకోవచ్చు. ఇవి సంప్రదాయ వేడుకులకు స్టైలిష్‌గానూ, ఆధునికంగానూ కొత్తగా కనువిందు చేస్తున్నాయి. పట్టు చీరలే కాకుండా మనవైన చేనేత చీరలను కూడా ఇందుకు ఉపయోగించవచ్చు. ఈ తరహా డ్రెస్సింగ్ ఫ్యాషన్ వేదికల మీద హల్ చేస్తున్నాయి.



పెద్ద పెద్ద అంచులు,, చిన్న చిన్న బుటీలు, అందమైన జరీ పువ్వులు పట్టు చీరకు అందాన్ని తీసుకువస్తాయి. చీరను అమ్మాయికి లంగాఓణీగా సింగారించాలంటే ఇలా అందంగా రూపుకట్టేయవచ్చు. కొంగు భాగాన్ని బ్లౌజ్‌గా, చీర భాగాన్ని లెహంగా ను డిజైన్ చేసుకోవచ్చు. వేరే కాంబినేషన్ ఓణీని తీసుకోవచ్చు. పట్టు ఓణీలు కూడా ఇప్పుడు లభిస్తున్నాయి.

ప్లెయిన్ పట్టు లేదా రాసిల్క్ మెటీరియల్ తీసుకొని దానికి చీర అంచులు జత చేయాలి. అలాగే బ్లౌజ్ పార్ట్‌ని కూడా తీర్చిదిద్దాలి. బ్లౌజ్ పార్ట్‌ని క్రాప్‌టాప్‌గా డిజైన్ చేసి, మిగతా చీర భాగాన్ని ఓణీగా తీసుకోవచ్చు. ఈ డిజైన్ స్టైల్స్‌ని నేటి తరం అమ్మాయిలే కాదు అమ్మలూ ధరించవచ్చు.






లెహంగా పార్ట్‌కి కావల్సిన పట్టు మెటీరియల్ కూడా మార్కెట్‌లో లభిస్తుంది. అయితే, బ్లౌజ్ పార్ట్‌కి సరైన కాంబినేషన్ దొరక్క ఎంబ్రాయిడరీ చేసిన బ్లౌజ్‌లు వేస్తుం టారు. దీంతో లుక్ ప్రత్యేకత కనిపించదు. ఇందుకు లెహంగా, బ్లౌజ్ పార్ట్‌ని పట్టు, ఉప్పాడ, జరీ చీరలను వాడకం మొదలైంది. ఇవి సంప్రదాయ వేడకులకు తీరైన అందాన్ని తీసుకువస్తున్నాయి.

నిర్వహణ: ఎన్.ఆర్.

కౌన్సెలింగ్

కేసు వెనక్కి తీసుకొని తప్పు చేశానంటారా?


ప్రతీకాత్మక చిత్రం

నేను ఉద్యోగం కోసం ఉత్తర భారతదేశం నుంచి హైదరాబాద్ వచ్చాను. ఒక ఐటీ కంపెనీలో పని చేస్తున్నాను. మూడుమాసాల పాటు ఒకడు నన్ను వెంటాడాడు. రోజూ ఫాలో అయ్యేవాడు. ఓ రోజు ఏకంగా ఇంటికే వచ్చేశాడు. ఇలా చేయడం బాగా లేదని వార్నింగ్ ఇచ్చినా ఆగలేదు. జనవరి ఒకటో తేదీన నా ఫ్లాట్‌కి వచ్చి కిటికీలో గుండా చాక్లెట్, ఫోన్ నెంబర్ రాసిన కాగితం పెట్టి పోయాడు. ఫోన్ చేయమని ఆ కాగితం మీద రాసి పెట్టాడు. నా స్నేహితులు అతనికి కాల్ చేసి – ఇలా చేయడం బాగా లేదని నచ్చచెప్ప బోయారు. అతగాడు చాలా నీచంగా మాట్లాడాడు. స్టాకింగ్ కారణంగా చాలా భయపడ్డాను. రోజంతా ఆఫీసులోనే ఉండి పోయాను. స్నేహితుల సాయంతో షీ టీమ్స్‌కి ఫిర్యాదు చేశాను. పోలీసులు కేస్ బుక్ చేశారు. స్టేషన్‌లో అతడు నాకు సారీ చెప్పాడు. దీంతో కేసును వెనక్కి తీసుకున్నాను. ఒకవేళ అతనికి శిక్ష పడితే, బయటకొచ్చాక ప్రతీకారం తీర్చు కుంటాడేమోననే భయం కూడా కొంతమేరకు నన్ను ఇన్‌ఫ్లుయన్స్ చేసింది. రెండు నెలల దాటినా ఆ చేదు జ్ఞాపకం నుంచి బయటపడలేక పోతున్నాను. అసలు నేను కేసు వెనక్కి తీసుకో వడం కరెక్టేనంటారా?

- సంజన

జవాబు: మీరు భయపడాల్సిన అవసరం లేదు. భయం ఉంటే 100కి డయిల్ చేయొచ్చు. షీటీమ్స్ దగ్గర అతని మొత్తం వివ రాలూ ఉంటాయి. ఒకవేళ అతడు ఇంకోసారి వేధించినా, స్టాక్ చేసినా మీరు షీ టీమ్స్‌కు మళ్లీ ఫిర్యాదు చేయొచ్చు. ఈసారి మరింత తీవ్రమైన చర్యలుంటాయి. అసలు మొదటే మీరు కేసును వెనక్కి తీసుకుని ఉండాల్సింది కాదు. వేధించిన వాళ్లకి శిక్ష పడాలి. లేదంటే ఇంకొంత మంది అమ్మాయిల్ని స్టాక్ చేసి హింసిస్తారు.

మీలాంటి బాధితులకు చెప్పేది ఒక్కటే. మిమ్మల్ని ఎవరైనా వేధిస్తే రిపోర్టు చేయండి. కేసు పెట్టాక దానికి కట్టుబడి ఉండండి. మీకు ఎవరిమీదైనా సందేహం ఉన్నప్పుడు కూడా షీ టీమ్స్‌కి తెలియచేయ వచ్చు. మేం వెరిఫై చేస్తాం. ఎంక్వైరీ చేసే ప్రొసీడ్ అవుతాం. బాధితులు వాట్సాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చు. షీ టీమ్స్ కార్యాలయానికి వచ్చి డైరెక్టుగానూ కంప్లయింట్ చేయొచ్చు.



- స్వాతి లక్రా,
షీ టీమ్స్ ఇన్‌చార్జ్, హైదరాబాద్

మాకు పంపండి: ఒక మహిళగా మీరు గృహహింస వంటి వేధింపులకు గానీ, సామాజికంగా వివక్షకుగానీ లేదా సంబంధిత ఇతర సమస్యలతో బాధపడుతున్నారా? మీ సమస్యను రాసి మాకు మెయిల్ ద్వారా పంపించండి.ఆయా రంగాలకు చెందిన నిపుణులతో మీకు తగిన సూచనలు / సలహాలు ఇప్పించే ఏర్పాటు చేస్తాం. మీరు మీ ప్రశ్నలను పంపాల్సిన మెయిల్ ఐడీ : nenusakthiquestions@gmail.com

మళ్లీ చెప్పుకుందాం! రీటోల్డ్ కథలు - 20

వెన్నెలలో




● సామాన్య

‘వెన్నెల బాగుంది కదండీ... ఇంత బాగుంటుందా వెన్నెల... మా అపార్ట్‌మెంట్స్‌లో ఏమీ కనపడి చావదే’ అంది.

‘మీ అపార్ట్‌మెంట్స్‌లో’ మళ్లీ అడిగింది.

బయటకు చూస్తూ ఉంది.

బయట చెట్లు మెరుస్తున్నాయి. పొదలు వెలుతురును తాగుతున్నాయి. వందల ఎకరాల సెంట్రల్ యూనివర్సిటీలో గెస్ట్‌హౌస్ వనకుటీరంలా ఉంది.

‘ఇక్కడ నెమళ్లు వస్తాయని విన్నానండీ. వస్తాయా?’

‘పొద్దున చూస్తారుగా’

ఇద్దరూ ఆ వేళే రూమ్ ఆక్యుపై చేశారు. పరీక్షలు ఉన్నాయి వారంలో. డిస్టెన్స్ కట్టిన పరీక్షలు.

‘మీరు గతంలో ఈ యూనివర్సిటీలో చదివారు కాబట్టి మీకంతా తెలుసు ఇక్కడి గురించి. నాకిదే కొత్త. మొదట డార్మిటరీ ఇచ్చారు. అక్కడ చదవడం వీలుగాదని రిక్వెస్ట్ చేస్తే మీ రూమ్‌కు పంపారు. పర్లేదుగా... మిమ్మల్నేం డిస్టర్బ్ చేయడం లేదుగా’

బయటకే చూస్తూ ఉంది. ఫోన్ డయల్ చేయబోయింది. మళ్లీ కట్ చేసింది.

‘ఏదో అలజడిగా ఉందండీ... ఇంటి అలజడి’

వచ్చినప్పటి నుంచి ఇంటికి ఫోన్లు, భర్తతో మాటలు నడుస్తున్నాయి.

‘ఏడేళ్లండీ బాబుకి. ఆయనకు వదిలిపెట్టి వచ్చాను. ఆయన అంత సరిగ్గా చూసుకోడు. అదీ ప్రాబ్లమ్. బాబు ఆయనకు రెండేళ్లు దూరం ఉన్నాడు నా వల్ల. ఆ గ్యాప్ ఉంది ఇద్దరికీ’...

ఎందుకు గ్యాప్ అని అడగాలనిపించింది. అడగొచ్చో కూడదో.

‘డిన్నర్‌కు వెళదామా. మళ్లీ మెస్ కట్టేస్తారు’

ఇద్దరూ నల్లటి తార్రోడ్డు ఎక్కారు. గాలి మెల్లగా చల్లగా వీస్తూ ఉంది.

ప్లేట్‌లో రెండు పుల్కాలు, కర్రీ పెట్టుకుని కూర్చుంది.

ఒక తుంట నోట్లో పెట్టుకుని అంది–

‘ఈ వంట చేసే అట్రాసిటీ అంతా ఇంతా కాదండీ. ఆడపిల్లలు అబ్బాయిలతో సమానంగా చదువుకోవాలి అంటారు. అబ్బాయిలు చదువుకుంటే చదువే. అమ్మాయిలు చదువుకుంటే చదువుతో పాటు వంట కూడా నేర్చుకోవాలి. ప్రొఫెషనల్ కోర్సులు వంట నేర్చుకుంటూ చదువుకునే కోర్సులా అండీ. హాస్టల్‌లో ఉండి ఇంజనీరింగ్ చేశాను. టాపర్‌ని. మంచి ఉద్యోగం వచ్చింది. ఆ ఘనత చూడొద్దా. కాని పెళ్లయ్యాక అత్తగారు వంటగదిలో పంపి తోడు రాదే. కొత్తపెళ్లి కూతుర్ని. ఏం చేయాలో తెలియదు. అయినా తిప్పలు పడి సాంబారు చేశాను. చింతపండు విషయంలో ఏదో గందగోళం అయినట్టుంది. దానికే పెద్ద రాద్ధాంతం. వినడానికి చిన్న విషయం. కాని ఇల్లుకాని ఇంట్లో, కొత్త మనుషుల మధ్య, అప్పుడే అడుగుపెట్టిన అమ్మాయికి అదెంత పెద్ద హింసో ఎవరికి తెలుస్తుంది?’

ఇంకో తుంట పెట్టుకుంది.

‘ఫ్రిజ్‌లో వాటర్‌బాటిల్ అనే టైటిల్‌తో ఎవరైనా కథ రాయాలండీ. దానిని నింపే బాధ్యత ఎవరిదో తెలుసా? కోడలిదే. ఫ్రిజ్ తెరిచిన మా ఆడపడుచు నేను ఎక్కడ ఉన్నా వినపడేలా వాటర్ బాటిల్స్‌లో నీళ్లు లేవు అని అరిచేది. పరిగెత్తుకెళ్లేదాన్ని. ఆలోచిస్తుంటే నవ్వు వస్తుంది’...

టొమాటో కర్రీని కెలుకుతూ ఉంది.

‘ఇక శాలరీ చెక్ తెచ్చి మా మావగారికి ఇవ్వాలి. ఇవ్వడం సంతోషమే. కాని ఆయన చేత్తో కూడా ముట్టేవాడు కాదు. అక్కడ పెట్టు అనేవాడు. పిల్లలు తెచ్చిన జీతాన్ని పెద్దలు చూసి మెచ్చుకుంటే ఒక ఆనందం. ఖర్చుపెట్టేటప్పుడు లేని అహం పుచ్చుకునేటప్పుడు వచ్చిందా? ఇలాగే చిన్న చిన్న విషయాలే పెద్ద రాద్ధాంతాలుగా ముగిసేవి. హింస. విచిత్రం ఏమిటంటే రాత్రయితే పరుపు మీద మోకాళ్లతో పాకి దగ్గరకు చేరే ఆయనగారు ఇలాంటి రాద్ధాంతాల్లో ఎమోషనల్ సపోర్ట్‌గా కూడా నిలబడేవాడు కాదు. దాంతో బెంగుళూరుకు ట్రాన్స్‌ఫర్ పెట్టుకుని వెళ్లిపోయాను. మొదట ఒప్పుకోలేదు. పోలీస్ గీలీస్ అనేసరికి వదిలేశారు’...

డిన్నర్ ముగిసింది.

తిరిగి దారిలో పడ్డారు.

మాటలకు ఏ అడ్డంకీ లేనట్టుగా ఖాళీ రోడ్లు.

‘రెండేళ్లు బెంగుళూరులో ఉన్నాక సడన్‌గా జ్ఞానోదయం అయ్యింది. మనం సమాజం అనే యూనిట్‌ని హ్యాండిల్ చేస్తున్నాం. ఆఫీస్ అనే యూనిట్‌ని హ్యాండిల్ చేస్తున్నాం. కాని ఇల్లు అనే యూనిట్‌ని ఎందుకు హ్యాండిల్ చేయలేకపోతున్నాం? ఆఫీసులో చికాకులొస్తే ఉద్యోగం వదిలేసి పోతున్నామా? లేదే. ఇంట్లో చికాకులు వస్తే ఎందుకు వదిలేసిపోవాలి? కాపురం అనేది గేమ్. గేమ్‌లాగే చూద్దాం. గెలవడానికి ఆడదాం అనుకున్నాక ఫ్రీ అయిపోయాను. బాబుకు తండ్రి లేకుండా ఎందుకు చేయాలి అని నేనే ఫోన్ చేసి ప్రపోజల్ పెట్టాను. విడి కాపురం. కానీ’... చిన్నగా నవ్వింది.

‘ఎందుకు నవ్వుతున్నారు?’

‘అతనేమిట్రా అంటే విడి కాపురంలో భర్త పాత్రతో పాటు అత్తామామల పాత్ర కూడా పోషించడం మొదలుపెట్టాడు. పాత్రల తాకిడి తగ్గలేదన్నమాట’

మళ్లీ అంది–

‘ఉద్యోగం స్ట్రెస్ ఒక తాకిడి. ఇంటి స్ట్రెస్ ఒక తాకిడీ. అన్నీ నేనే పడాలి. ఆఫీసయ్యాక మగాడు రిలాక్స్ కావడానికి ఫ్రెండ్స్‌ని వెతుక్కుంటాడు. ఆడది అయ్యో బాబు ఎలా ఉన్నాడో అని పరిగెత్తుకుని వస్తుంది. మదర్ ఇన్‌స్టింక్ట్... ఈ కడుపులో నుంచి వస్తారు కదండీ పిల్లలు’... ఉదరం మీద చేయి వేసి నిమురుకుంది.

‘ఎంతమందిని చూళ్లేదు... బాగా చదువుకున్న ఆడాళ్లు... ఎంతో ప్రతిభ ఉన్న ఆడాళ్లు... ఫలానా రంగంలో రాణించి తీరాలి అని నిశ్చయించుకుని అందుకు అవసరమైన చదువు చదివిన ఆడాళ్లు... పెళ్లయ్యాక చట్రంలో పడతారు. పిల్లాడు పుట్టాక కెరీర్‌లోకి వెళదామని... వాడికి ఐదేళ్లు వచ్చాక కెరీర్‌లోకి వెళదామని... సెకండ్ చైల్డ్ కూడా ముగించి కెరీర్‌లోకి వెళదామని... అప్పటికి వయసు మీద పడి అవకాశాలు జారిపోయి చతికిలపడతారు. గమనించారా... పిల్లల కోసం ఉద్యోగం ఎవరు మానేయాలి అనే ప్రశ్న ఏ ఇంటా రాదు. భార్య మానేయాలా వద్దా అనే ప్రశ్న మాత్రమే వస్తుంది. నాకూ వచ్చింది. అందుకే వదిలేశాను’

గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. కిటికీ బయట మరింత శక్తి పుంజుకున్నట్టుగా వెన్నెల.

పుస్తకం తెరిచింది. మళ్లీ మూసింది.

‘ఎందుకు చదువుతున్నట్టు ఈ చదువు. ఉద్యోగం ఉంటే సంవత్సరానికి పదీ పదిహేను లక్షలు నా జీతం. ఇవాళ ఐదు వేలు కూడా సంపాదించలేకపోతున్నాను. ఇంత చదువు, ఉద్యోగం చేసే యోగ్యత ఉండి కూడా అప్లికేషన్ ఫామ్స్ మీద, ఫేస్‌బుక్‌లో హౌస్‌వైఫ్ అని రాసుకోవాల్సి వస్తోంది. ఆ వెలితి భరించలేకే కదా ఇలా డిస్టెన్స్ కోర్సులు చదవడం, ఇకబెన లాంటివి నేర్చుకోవడం, తీరిక వేళల్లో భరత నాట్యం... భర్తలకు కూడా ఏ అభ్యంతరం ఉండదు ఇలా చేస్తే’ అని ఆగి నాలుక కరుచుకున్నట్టుగా చూసింది.

‘సారీ... అస్తమాను నా కథతో బోర్ కొట్టిస్తున్నట్టున్నాను... మీ కథ?’

‘అదేమిటీ... మీరు ఇంతవరకూ చెప్పింది నా కథ కాదా’

ఇద్దరూ చాలాసేపు నవ్వుకున్నారు. చాలాసేపు ఆలోచనలో పడ్డారు. ఇద్దరూ ఆ రాత్రి నిద్రపోలేకపోయారు.

తెల్లవారుతుండగా దూరంగా క్రీంకారం.

‘నెమలి’

గబగబా కిటికీ దగ్గరకు చేరారు.

కాసేపటికి ఒక నెమలి బిడ్డను వెంట బెట్టుకుని మెల్లగా అడుగులు వేస్తూ పచార్లకు వచ్చింది. చూస్తూ నిలబడ్డారు.

కథ ముగిసింది.

సామాన్య రాసిన ‘కల్పన’ కథ ఇది.

వ్యాఖ్యానం అవసరం అంటారా? కథంతా వెన్నెల ఉంది. స్త్రీ జీవితంలో సంపూర్ణమైన వెన్నెల ఉందా?

పునః కథనం: **ఖదీర్**

శ్రీదేవి స్పెషల్ క్విజ్

బ్రెయిన్ టెస్ట్



14 తెలుగు 'పదహారేళ్ల వయసు' తమిళ మాతృక 'పదినారు వయదినిలే'కి శ్రీదేవి అందుకున్న పారితోషికం ఎంతో తెలుసా? (ఇందులో నటించిన రజనీకాంత్ పారితోషికం కంటే ఆమెకు 6 వేల రూపాయలు ఎక్కువ)
ఎ) 25,000 బి) 15,000 సి) 12,000 డి) 9,000



18 శ్రీదేవి హిందీ పరిశ్రమకి వెళ్లిన కొత్తలో ఆమె చేసిన పాత్రకు ఫేమస్ హీరోయిన్ డబ్బింగ్ చెప్పారు. ఎవరా హీరోయిన్?
ఎ) హేమ మాలినీ బి) రేఖ సి) జయాబచ్చన్ డి) మీనాక్షి శేషాద్రి

13 బాలీవుడ్‌లో శ్రీదేవి ఎన్ని చిత్రాల్లో ద్విపాత్రాభినయం చేశారో తెలుసా?
ఎ) 5 బి) 4 సి) 11 డి) 7



1 'సిరిమల్లె పువ్వా...' అంటూ శ్రీదేవి సందడి చేసిన 'పదహారేళ్ల వయసు' సినిమా దర్శకుడెవరు?
ఎ) బాలచందర్ బి) కె. రాఘవేంద్రరావు సి) కె.విశ్వనాథ్ డి) భారతీరాజా




20 శ్రీదేవి నటించిన సూపర్‌హిట్ సినిమాలోని స్టిల్ ఇది. ఈ సినిమా పేరేంటి?
ఎ) ఆఖరి పోరాటం బి) క్షణ క్షణం సి) గోవిందా గోవిందా డి) జగదేక వీరుడు – అతిలోక సుందరి





8 శ్రీదేవి నటించిన 'మిస్టర్ ఇండియా'కు నిర్మాత ఎవరు?
ఎ) యశ్ రాజ్ బి) బోనీ కపూర్ సి) యశ్ జోహార్ డి) సాజిద్ నడియాడ్‌వాలా

6 'మామ్' శ్రీదేవికి 300వ చిత్రం. ఆ చిత్రానికి సంగీత దర్శకుడెవరు?
ఎ) విశాల్ శేఖర్ బి) ఏ.ఆర్. రెహమాన్ సి) ఇళయరాజా డి) దేవిశ్రీ ప్రసాద్



2 మా 'బంగారక్క' సినిమాలో శ్రీదేవి సరసన నటించిన హీరో ఎవరు?
ఎ) చంద్రమోహన్ బి) మురళీమోహన్ సి) మోహన్‌బాబు డి) శోభన్‌బాబు

17 శ్రీదేవి నటిగానే మనకు తెలుసు కానీ మనకు తెలియని ఒక అద్భుతమైన టాలెంట్ ఆమెలో దాగి ఉంది. అదేంటో మీకు తెలుసా?
ఎ) సింగింగ్ బి) రైటింగ్ సి) పెయింటింగ్ డి) టెన్నిస్ ప్లేయర్

12 తెలుగులో శ్రీదేవితో 31 సినిమాల్లో కలిసి నటించిన హీరో ఎవరో తెలుసా?
ఎ) కృష్ణ బి) కృష్ణంరాజు సి) యన్టీఆర్ డి) అక్కినేని నాగేశ్వరరావు

9 శ్రీదేవితో 24 సినిమాలు చేశాను. తను ఒప్పుకుంటే 25వ సినిమా కూడా తీస్తానని ఇటీవల ప్రకటించిన టాలీవుడ్ దర్శకుడెవరు?
ఎ) కె.బాపయ్య బి) కె.రాఘవేంద్రరావు సి) కె.యస్.ఆర్. దాస్ డి) కె.చంద్రశేఖర్ రెడ్డి

7 శ్రీదేవి ముద్దు పేరేంటో తెలుసా?
ఎ) మున్నీ బి) చిన్ని సి) బుజ్జి డి) పప్పీ



5 శ్రీదేవి ఒకప్పటి స్టార్ కమెడియన్ సరసన హీరోయిన్‌గా నటించారు. ఎవరా హాస్యనటుడు?
ఎ) రేలంగి బి) రాజబాబు సి) రమణారెడ్డి డి) పద్మనాభం



మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం
10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్
15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!

నిర్వహణ: శివ మల్లాల

సమాధానాలు (తలకిందులుగా ముద్రించబడింది)
1) బి 2) బి 3) డి 4) ఎ
5) బి 6) బి 7) డి 8) బి 9) బి
10) ఎ 11) డి 12) ఎ 13) డి
14) డి 15) డి 16) సి 17) సి
18) బి 19) బి
20) (డి)



15 శ్రీదేవి బాల నటిగా తెరంగేట్రం చేసినప్పుడు ఆమె వయసెంత?
ఎ) 3 బి) 2 సి) 6 డి) 4

10 '2002 వరకు చూడలేదే ఇంత సరుకు..' అంటూ చిన్న యన్టీఆర్, ఆర్తీ అగర్వాల్ స్టెప్పులేసిన సాంగ్ పెద్ద యన్టీఆర్, శ్రీదేవి నటించిన ఓ సూపర్‌హిట్ సాంగ్‌కు రీమిక్స్. అది ఏ పాటో కనుక్కోండి?
ఎ) ఆకుచాటు పిందె తడిచే బి) ఇది ఒకటో నంబర్ బస్సు సి) జాబిలితో చెప్పనా డి) తెల్లా తెల్లని చీరలోని చందమామ

11 'బాబు' అనే తమిళ సినిమాలో ఈ నలుగురి నటుల్లో ఒక నటుడికి శ్రీదేవి కూతురిగా నటించింది. ఆ నటుడెవరు?
ఎ) రజనీకాంత్ బి) చారుహాసన్ సి) కమల్‌హాసన్ డి) శివాజీగణేశన్

4 బాలీవుడ్‌లో ఏ హీరోతో శ్రీదేవి ఎక్కువ సినిమాల్లో నటించారో తెలుసా?
ఎ) మిథున్ చక్రవర్తి బి) జితేంద్ర సి) రిషీ కపూర్ డి) అమితాబ్ బచ్చన్

19 ఎన్టీఆర్ మనవరాలిగా శ్రీదేవి నటించిన ఈ స్టిల్ ఏ చిత్రంలోనిది?
ఎ) తునైవన్ బి) బడిపంతులు సి) నా తమ్ముడు డి) బాబు



3 శ్రీదేవి కనిపించబోతున్న చివరి సినిమా?
ఎ) దబాంగ్ 3 బి) థగ్స్ ఆఫ్ హిందోస్తాన్ సి) గోల్డ్ డి) జీరో



16 సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసే లోపు ఫస్ట్ ఇన్నింగ్స్‌కి ఫుల్‌స్టాప్ పెట్టిన మధ్యలో శ్రీదేవి కనిపించిన టీవీ షో పేరేంటి?
ఎ) బిగ్ బాస్ బి) కౌన్ బనేగా కరోడ్‌పతి సి) మాలినీ అయ్యర్ డి) దస్ కా దమ్

నో కాంప్రమైజ్



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా శ్రీవాస్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సాక్ష్యం'. ఇందులో పూజా హెగ్డే కథా నాయిక. అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం శాటిలైట్ హక్కులను ఓ ప్రముఖ టీవీ చానెల్ సొంతం చేసుకుంది. తెలుగు హక్కులను 5.5 కోట్లకు, హిందీ హక్కులను 8 కోట్లకు దక్కించుకుందని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రాన్ని మే 11న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ''మా చిత్రానికి మార్కెట్‌లో మంచి క్రేజ్ క్రియేట్ అయ్యింది. ఓ యువ హీరో చిత్రానికి ఈ స్థాయిలో శాటిలైట్ బిజినెస్ జరగడం ఇదే మొదటిసారి. నిర్మాణ విలువలపరంగా నో కాంప్రమైజ్. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతోంది. ఆఖరి షెడ్యూల్‌ను అమెరికాలో ప్లాన్ చేశాం. 'సాక్ష్యం' హిట్ సాధిస్తుందన్న నమ్మకం ఉంది'' అని చిత్రబృందం పేర్కొంది.

ఫోర్త్ గ్యాంగ్‌తో సంబంధం లేదు!

భయానికి కేరాఫ్ అడ్రస్ అనేలా సిల్వర్‌స్క్రీన్‌పై నటించి ప్రేక్షకుల మెప్పుపొందారు దండుపాళ్యం గ్యాంగ్. శ్రీనివాస్ రాజు దర్శకత్వంలో దండుపాళ్యం గ్యాంగ్‌గా పూజా గాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవి కాలే, రవి శంకర్ ముఖ్య పాత్రలుగా రూపొందిన చిత్రం 'దండుపాళ్యం'. ఈ సినిమా హిట్ కావడంతో దండుపాళ్యం 2, దండుపాళ్యం 3 చిత్రాలను తెరకెక్కించారు శ్రీనివాస్ రాజు. 'దండుపాళ్యం 3' రిలీజ్‌కు రెడీ అయింది. దండుపాళ్యం సిరీస్‌లో ఇదే చివరిదని ఆయన ఇటీవల తెలిపారు. కానీ సడన్‌గా వెంకట్ అనే నిర్మాత సారథ్యంలో 'దండుపాళ్యం 4' తెరపైకి వచ్చింది. ''ఈ దండుపాళ్యం 4తో నాకు ఎలాంటి సంబంధం లేదు. పోస్టర్‌పై నా ఫోటో ఉంది. అయితే నేను ఇందులో నటించడంలేదు. నటించమని నన్నెవరూ సంప్రదించలేదు. 'దండుపాళ్యం 4' పోస్టర్‌పై నా అనుమతి లేకుండా నా ఫోటోలను ఎలా వాడతారు'' అని పూజాగాంధీ పేర్కొన్నారు. మకరంద్ దేశ్‌పాండే అండ్ రవికాలే కూడా 'దండుపాళ్యం 4'లో నటించడం లేదని స్పష్టం చేశారు.


మకరంద్
రవి కాలే
పూజా గాంధీ